UG101AEC-E

# జండర్ సెన్సిటైజేషన్

## మొదటి సంవత్సరం

## సెమిస్టర్ - 1

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

2017

# కోర్సు టీం

**పాఠ్యాంశ బృందం**

ప్రొ॥ రమా మెల్కోటి (సంపాదకులు)

డా॥ జి. సరోజ (సహ సంపాదకులు)

**రచయితలు**

1. ప్రొ॥ కె. సునీతారాణి
2. ప్రొ॥ యు. వింధ్య
3. ప్రొ॥ ఇ. సుధారాణి
4. ప్రొ॥ రేఖా పాండే
5. ప్రొ॥ వాసంతి నిముషకవి
6. శ్రీమతి జె. అనురాధ

**అనువాదకులు**

ప్రొ॥ చుండూరి మృణాళిని

డా॥ నెల్లుట్ల రజని

శ్రీమతి వి. రమాంజనీ కుమారి

శ్రీమతి జె. అనురాధ

కవర్ డిజైను

శ్రీ. జి. వెంకటస్వామి

ప్రథమ ప్రచురణ: 2017, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగమయినా ఉపయోగించదలుచుకుంటే విశ్వవిద్యాలయ అనుమతి పొందాలి. ఈ పాఠాలు డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు డైరెక్టర్ (అకాడమిక్), డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ప్రొ॥ జి. రాంరెడ్డి మార్గ్, రోడ్ నెం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాదు - 500 033.

Web: www.braou.ac.in

E-mail: info@braou.ac.in

Printed on behalf of Dr. B. R. Ambedkar Open University, Hyderabad by the Registrar.

Lr. No.

Printed at :

# పాఠ్యాంశ పరిచయం

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదివే బి.ఎ. / బి.కాం./ బి.యస్.సి. విద్యార్థుల కోసం జండర్ సెన్సిటైజేషన్ శీర్షికన తయారుచేసిన పుస్తకం ఇది. ఈ పాఠ్యాంశాన్ని సి.బి.సి.యస్. లో భాగంగా ఎబిలిటి ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సుగా మొదటి సెమిస్టర్‌లో విద్యార్థులకు కొత్త కోర్సుగా పరిచయం చేస్తున్నాము. విద్యార్థులు సులువుగా చదివి అవగాహన చేసుకోవడానికి వీలుగా ఈ పాఠ్యాంశాన్ని రెండు ఖండాలుగా విభజించాము. ప్రతి ఖండం నాలుగు పాఠ్య భాగాలను కలిగి ఉంది.

ప్రతి పాఠ్య భాగం ఒక నిర్దిష్ట విషయాంశాన్ని ప్రస్తావిస్తుంది. ప్రతి భాగంలో విషయ క్రమం, లక్ష్యాలు, పరిచయం, విషయం, అవగాహన పరీక్షించుకునే ప్రశ్నలు, వాటికి సంబంధించిన మాదిరి జవాబులు కూడా పొందుపరిచాము. ప్రతి పాఠ్యభాగం చివర విషయాలు సంక్షిప్త పరచడంతో పాటు అభ్యాసాలను, చదవదగిన గ్రంథాలను కూడా సూచించాము.

సమాజంలో నెలకొన్న జండర్ వ్యత్యాసాలను ఈ పాఠ్యాంశం ప్రస్తావిస్తుంది. లింగము (sex) మరియు జండర్ (gender) అనేవి వేర్వేరు పదాలు. లింగం శారీరకమైనదిగాను, జండర్ సామాజీకరించబడిన పదంగాను మనం చెప్పుకుంటున్నాం. ఈ నేపథ్యంలో జండర్ అనే ఆంగ్ల పదానికి తగిన ప్రత్యామ్నాయం తెలుగులో ఇతిమిద్ధంగా లేకపోవడం వలన ఆ పదాన్ని లిప్యంతరీకరణ చేశాము. జండర్ విషయాల పట్ల అవగాహన కలిగించడం ద్వారా జండర్ వివక్ష వలన ఉత్పన్నమయ్యే అనేక సమస్యలను విశాల దృక్పథంతో ఆలోచింపజేయడానికి, విశ్లేషణ చేయగలిగిన నైపుణ్యాలను విద్యార్థులలో కలిగించే ఉద్ధేశ్యంతో U.G.C., UNESCO వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఈ ఉద్ధేశ్యంతోనే అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జండర్ సమానత్వం కోసం తమ వంతు కృషిగా ఈ పాఠ్యాంశాన్ని ప్రవేశపెడుతున్నారు.

## విషయక్రమం


| ఖండం / భాగం సంఖ్య | వివరాలు | పుటసంఖ్య |
|---|---|---|
| **ఖండం : I** | **జండర్ అవగాహన** | |
| భాగం - 1 | జండర్ - చారిత్రక నేపథ్యం | 1 - 12 |
| భాగం - 2 | జండర్ - సామాజీకరణ | 13 - 27 |
| భాగం - 3 | జండర్ - పని | 28 - 39 |
| భాగం - 4 | జండర్ - అధికారం | 40 - 49 |
| **ఖండం : II** | **జండర్ సమానత్వం** | |
| భాగం - 5 | జండర్ ఆధారిత హింస | 50 - 62 |
| భాగం - 6 | సమానత్వం - భిన్నత్వం | 63 - 76 |
| భాగం - 7 | మానవ హక్కులు | 77 - 89 |
| భాగం - 8 | సమకాలీన సమస్యలు | 90 - 100 |

## ఖండం - I : 'జండర్' అవగాహన

స్త్రీ, పురుషులు శరీర నిర్మాణం భిన్నంగా ఉన్నందువల్ల వారి అవసరాలు, సామర్థ్యాలు కూడా భిన్నంగానే ఉంటాయనే భావంతో వారు సమాజంలో నిర్వర్తించే పాత్రలని, విధులను నిర్ణయించడం జరిగింది. అనాదిగా స్త్రీలని బలహీనులుగా చిత్రీకరించారు. కుటుంబంలో ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి అబ్బాయిల కంటే తక్కువ స్థాయిలో పెంచడం మనం చూస్తూనే ఉన్నాం. ఆడపిల్ల నాజూకుగా, అణుకువతో ఉండేలా, అదే అబ్బాయి అయితే ధైర్యంగా, ఆధిపత్యం వహించే విధంగా పెంచడం సాధారణంగా జరిగే విషయం. ఈ విధమైన సామాజిక వ్యవహారాలే స్త్రీ, పురుష వివక్ష, హింస మొదలైన సాంఘిక దురాచారాలకు దారి తీస్తాయి. అందుకే 'జండర్' యొక్క అవగాహన సమాజంలోని వ్యక్తులందరికీ అవసరం. ఈ అవసరాన్ని గుర్తించి డా॥బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 'జండర్ సెన్సిటైజేషన్' కోర్సుని డిగ్రీ విద్యార్థులందరూ తప్పనిసరిగా చదివేలా రూపొందించారు.

ఈ కోర్సులో మొదటి ఖండం జండర్ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక కోణాలని ఆవిష్కరిస్తుంది. మొదటి బ్లాకులో నాలుగు భాగాలున్నాయి.

భాగం - 1: 'జండర్ - చారిత్రక పరిశీలన' చారిత్రకంగా సమాజంలో మారుతున్న స్త్రీల పాత్రను ప్రస్తావిస్తూ, సంప్రదాయం, సంస్కృతి స్త్రీలు నిర్వహించే పాత్రలని ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఈ పాఠం తెలియజేస్తుంది.

భాగం - 2 : 'జండర్ మరియు సామాజీకరణ' - సామాజిక, సాంస్కృతిక విలువల ఆధారంగా ఆడ, మగ పిల్లలని పెంచే విధానాన్ని సామాజీకరణగా వ్యవహరిస్తున్నాం. ఈ భాగం జండర్ సామాజీకరణ, జండర్ పాత్రలను వివరిస్తుంది. జండర్ సామాజీకరణ ప్రక్రియలో వివిధ సంస్థలు. ఉదా॥ కుటుంబం, విద్యావ్యవస్థ పని మొదలైన వాటి ప్రభావం కూడా ఈ భాగంలో చర్చించారు.

భాగం - 3 : 'జండర్ పని' - సంఘటిత మరియు అసంఘటిత రంగాలలో జండర్ ఆధారంగా జరిగే పని విభజనని ఈ భాగంలో వివరించారు. పనిలో స్త్రీ పురుష వివక్ష, స్త్రీలు చేసే ఇంటి పనిని గుర్తించకపోవడం లాంటి అనేక విషయాలని చర్చించారు.

భాగం - 4 : జండర్, అధికారం - అధికారం విషయంలో స్త్రీ, పురుషులకి సమానత్వం లేదు. పురుషులు సామాజిక రంగాలలో ఎక్కువగా నియమించబడగా, స్త్రీలు వ్యక్తిగత రంగాలకి పరిమితమవుతున్నారు. విద్య, ఆర్థిక రంగాలలో కూడా అసమానతలు కనిపిస్తున్నాయి. స్త్రీలు ముఖ్యంగా స్కూలు టీచరు, ప్రైవేటు సెక్రెటరీ వంటి తక్కువ స్థాయి అధికారం కలిగిన పనులలో నియమించబడుతున్నారు. పితృస్వామ్యం, సంస్థాగత అధికార సంబంధాలు ఓటు హక్కుకై స్త్రీలు జరిపిన పోరాటాలు, రాజకీయాలలో స్త్రీల భాగస్వామ్యం వంటి అనేక అంశాలు ఈ భాగంలో వివరించారు.

# ఖండం - II : 'జండర్ సమానత్వం'

ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణకు 'సమానత్వం' ఒక ముఖ్య ప్రాతిపదిక. సమానత్వం సాధించాలంటే విద్య, పని, వేతనాలు, ఆస్తి, ఉత్పత్తి, ఆర్థిక విషయాలలో నిర్ణయ హక్కు మొదలైన వాటిలో స్త్రీ పురుషులిరువురూ పాల్గొనే అవకాశం కలిగి ఉండాలి. వీటిలో అసమానతలు వివక్షకు దారితీస్తాయి. యూనివర్సల్ మానవ హక్కుల డిక్లరేషన్ ప్రకారం మనుషులందరూ గౌరవం, హక్కుల విషయంలో స్వేచ్ఛ, సమానత్వం కలిగి ఉండాలి. భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, దిరేక్టివే సూత్రాలు కూడా జండర్ సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చాయి. ఎన్ని చట్టపరమైన వెసులుబాట్లు కలిగించినప్పటికీ, సమాజంలో పాతుకుపోయిన సంప్రదాయాలు, ఆచారాలు, నమ్మకాల పేరిట స్త్రీలు వివక్షకు గురి అవుతూనే ఉన్నారు.

ఖండం-2: జండర్ సమానత్వానికి సంబంధించిన అనేక అంశాలు ప్రస్తావిస్తుంది. ఈ ఖండంలో నాలుగు భాగాలు ఉన్నాయి.

భాగం - 5: 'జండర్ ఆధారిత హింస' - సమానత్వం, అభివృద్ధి, శాంతిని సాధించడానికి స్త్రీలపై జరిగే హింస ఒక అవరోధం. ఈ భాగంలో స్త్రీలపై జరుగుతున్న - ఇంటిలో (domestic) హింస, ఆడ శిశువులని చంపివేయడం, డౌరీ, పని చేసే కార్యాలయాలలో స్త్రీలపై లైంగిక వేధింపులు, రేప్, ట్రాఫికింగ్ వంటి అనేక రకాలైన హింసలను చర్చించారు. స్త్రీల పరిరక్షణకు రూపొందించిన వివిధ చట్టపరమైన నిబంధనలను కూడా వివరిస్తుంది.

భాగం-6: 'సమానత్వం, భిన్న అస్తిత్వాలు' - 'సమానత్వం' అంటే సమాజంలో, కుటుంబంలో స్త్రీ, పురుషులిరువురూ సమానంగా గౌరవించబడటం. సామాజిక, సాంస్కృతిక విలువలు, కుటుంబ వ్యవహారాలు, పని విభజన మొదలైనవన్నీ సమానత్వం పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ భాగం విద్య, ఉద్యోగం, ఆస్తి, ఆరోగ్యం మొదలైన విషయాలలో సమానత్వం గూర్చి చర్చిస్తుంది. వివిధ కులాల, మతాల, వర్గాల, జాతుల, ప్రాంతాల స్త్రీల అస్తిత్వాల్లో తేడాలు ఉంటాయి. కాబట్టి వారు ఎదుర్కొనే వివక్షలు, అణిచివేతల్లో కూడా తేడాలుంటాయి. దళిత, ఆదివాసి, ముస్లిం మహిళలు ఎదుర్కొనే ప్రత్యేక సమస్యలని ఈ భాగంలో చర్చించారు.

భాగం-7: 'మానవ హక్కులు' - యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ మనుషులందరూ స్వేచ్ఛా, సమానత్వం కలిగి ఉండాలని చెప్తుంది. కాని స్త్రీవాదులు మానవ హక్కులు తటస్థతని తీవ్రంగా విమర్శించారు. ఈ భాగంలో మనవ హక్కులకై జరిగిన వివిధ సమావేశాలు, CEDAW మరియు CERD లలో నిబంధనలు, భారత రాజ్యాంగంలో మరియు సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఆధారంగా పరిష్కరించిన కేసుల వివరాలను విశదీకరిస్తుంది.

భాగం-8: 'సమకాలీన సవాళ్ళు' - సమాజం స్త్రీ, పురుష లింగాలని మాత్రమే గుర్తిస్తుంది. ఇతర సంబంధాలను అసాధారణ సంబంధాలుగా పరిగణిస్తారు. ఈ భాగంలో సమకాలీన సమాజంలో చోటు చేసుకుంటున్న ట్రాన్స్‌జండర్, LGBT ఉద్యమాలని, స్త్రీలను వినియోగ వస్తువులుగా చిత్రీకరించడం, లింగ నిర్ధారణ పరీక్షలు, ఎగ్ ఫ్రీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అనేక విషయాలను వివరిస్తుంది.

# భాగం - 1 : జండర్ - చారిత్రక నేపథ్యం

విషయ క్రమం


1.0 లక్ష్యాలు

1.1 పరిచయం

1.2 జండర్ - భావనలు

1.2.1 సెక్స్ మరియు జండర్

1.2.2 జండర్ మూసపాత్రలు

1.2.3 జండర్ సమానత్వం

1.2.4 జండర్ సమత్వం

1.2.5 జండర్‌ను ప్రధాన స్రవంతిలోకి తేవడం

1.3 జండర్ పాత్రలు

1.3.1 కుటుంబంలో జండర్ పాత్రలు

1.3.2 కమ్యూనిటీలో జండర్ పాత్రలు

1.4 సంస్కృతి, సంప్రదాయాల ప్రభావం

1.5 భారతదేశంలో యుగాల వారీగా మారుతున్న స్త్రీల పాత్ర

1.5.1 ప్రాచీన కాలం

1.5.2 మధ్యయుగం

1.5.3 బ్రిటీషు వారి కాలం

1.5.4 సమకాలీనం

1.6 సారాంశం

1.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.9 ముఖ్యపదాల అర్థవివరణ

1.10 చదవదగిన గ్రంథాలు


## 1.0 లక్ష్యాలు

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ కింది విషయాలు అర్థం చేసుకోగలరు.

- జండర్ భావన స్పష్టమవుతుంది
- జండర్ స్వభావం, జండర్ పాత్రలు అవగతమవుతాయి.
- జండర్ పాత్రలపై సంస్కృతి, సంప్రదాయాల పాత్రను విశ్లేషించగలుగుతారు
- యుగాల తరబడి మారుతున్న స్త్రీల పాత్రలను గ్రహిస్తారు.

## 1.1 పరిచయం

జీవశాస్త్రపరంగా స్త్రీ, పురుషులు భిన్నంగా ఉంటారు కాని సమాజంలో వీరు సమానమైన పాత్ర నిర్వహిస్తారు. మన కుటుంబం, సమాజం, సంస్కృతిలో పురుషులు, స్త్రీలు నిర్వహించే పాత్రలు, బాధ్యతలను జండర్ ప్రస్తావిస్తుంది. ఒక నిర్ధిష్ట పరిస్థితిలో స్త్రీలు, పురుషులు ఏమి చెయ్యాలని భావిస్తామో, ఏమి చెయ్యడానికి అంగీకరిస్తామో, ఏమి చేస్తే వారికి విలువనిస్తామో అనే దానిని బట్టి సమాజం జండర్ లక్షణాలను ఆపాదించింది. 'సెక్స్' అనే పదం 'సహజంగా' పుట్టుకతో నిర్ధారించే విషయం. సెక్స్ జీవశాస్త్రపరంగా వ్యక్తిని గుర్తించి, ఆడ, మగ భేదాన్ని, బాల, బాలికలను శరీర లక్షణాల ఆధారంగా గుర్తిస్తుంది. ఈ లక్షణాలు స్థిరమైనవి.

"జండర్" అనే పదం సామాజికంగా నిర్ధేశించినది. ఆడ, మగ లక్షణాలను అనుసరించి వారి మధ్య సంబంధాలను, వారికి లభించే అవకాశాలను ఇది చెబుతుంది. ఈ జండర్ సంబంధాలు నిర్ధిష్ట సందర్భం, నిర్ధిష్ట కాలాలకు చెంది ఉండి మార్పులకు లోనవుతూ ఉంటాయి. చాలా సమాజాలలో బాధ్యతలు, పని, వనరుల అందుబాటు, వనరుల నియంత్రణ, నిర్ణయాలు తీసుకునే అవకాశాలు విషయంలో స్త్రీ పురుషుల మధ్య తేడాలు, అసమానతలు ఉన్నాయి.

భారతీయ సమాజం భిన్నత్వానికి ప్రతీక. కులం, వర్గం, హోదా, ఆదాయ సమూహాలు మొ॥ వాటి ఆధారంగా సామాజిక విభజన కనిపిస్తుంది. సమాజంలో స్త్రీల పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే ముందుగా భిన్న వర్గాలు, వ్యవస్థల మధ్య గల పరస్పర సంబంధాలను, అన్యోన్య ప్రభావాలను అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు అగ్రకులాల స్త్రీలకు బజారుకి వెళ్ళి సరుకులు అమ్మడానికి, పొలాల్లో పురుషులతో పాటు పనిచేయడానికి వెళ్ళడానికి స్వేచ్ఛ ఉండదు. అదే సమయంలో తక్కువ కులం స్త్రీలు అణచివేతకు, అగ్రకులాల వారి చేతిలో అత్యాచారాలకు లోనవుతారు. విద్య నేర్వడానికి, ఇతరమైన మౌలిక హక్కులు అనుభవించడానికి వారికి అవకాశం ఉండదు. అందువల్ల జండర్ సమస్యలను కులం, వర్గం, కమ్యూనిటీలకు సంబంధించిన వివిధ సమస్యల నేపధ్యాల నుంచి అర్థం చేసుకొనడం ముఖ్యం.

## 1.2 జండర్ - పదజాలం

జండర్ అనేది క్రియాశీలక పదం. జండర్ విషయాలు సమాజం స్త్రీ, పురుషులకు ఆపాదించిన పాత్రలు, అస్థిత్వాలు, వీటిని అనుసరించి రూపొందిన సమాజ నిర్మాణం మొదలైన అంశాలను సూచిస్తాయి. జండర్‌ను పూర్తిగా అర్థం చేసుకొనడానికి కింద వివరించిన పదాలను కూడా క్షుణ్ణంగా అర్థం చేసుకొనడం అవసరం.

### 1.2.1 సెక్స్ మరియు జండర్

'సెక్స్' అనేది జీవశాస్త్రపరంగా స్త్రీ, పురుషుల స్వభావాలను సూచించే పదం. పుట్టినపుడే సెక్స్ నిర్ణయమవుతుంది. జండర్ స్త్రీ పురుషులకు సమాజం, సంస్కృతి నిర్ధేశించిన లక్షణాలను సూచించే పదం. ఆడ, మగలకు ఉండాల్సిన నైపుణ్యాలు, సామర్థ్యాలను గురించిన ఊహలను జండర్ చెబుతుంది. స్త్రీ పురుషుల జీవన విధానాలను, పనిచేసే పరిస్థితులు, వారి మధ్య సంబంధాలను జండర్ వేరు చేసి చూపుతుంది.

"ద సెకండ్ సెక్స్" (1949) గ్రంధ రచయిత్రి సైమన్ డి బోవర్ ఇలా అంటారు. 'ఎవరూ స్త్రీగా పుట్టరు, స్త్రీగా మలచబడతారు.' అంటే పుడుతూనే స్త్రీగా రూపొందరు అని, కుటుంబం, సమాజం వారిని పెంచిన విధానాన్ని బట్టి ఆమె స్త్రీగా అవుతుంది అంటారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం (WHO, 2011) "జండర్ అనే పదాన్ని స్త్రీ పురుషులకు, బాలబాలికలకు సామాజికంగా నిర్మితమైన పాత్రలు, బాధ్యతలు, లక్షణాలను వివరించడానికి ఉపయోగిస్తారు. మన శారీరకమైన తేడాలతో సంబంధం లేకుండా, సమాజ నిర్మాణాన్ని బట్టి స్త్రీ పురుషులు ఎలా ఆలోచించాలో, ఎలా చేయాలో వివరించేది జండర్."

'సెక్స్' అనేది శారీరకంగా స్త్రీ, పురుషుల మధ్య తేడాలను గుర్తిస్తే, 'జండర్' అనేది స్త్రీ పురుషుల మధ్య గల సామాజిక సంబంధాలను గుర్తిస్తుంది. బాల్యం నుంచే బాలికలు మృదువుగా, అణుకువగా, సున్నితంగా, ఉద్వేగాలతో ఉండాలని చెప్పడం జరుగుతుంది. పురుషులను ఆధిపత్యం చెలాయించే వారుగా, దూకుడుగా, స్వతంత్రంగా వ్యవహరించేవారుగా పెంచుతారు. పసితనం నుంచే బాల, బాలికలకు జండర్ ప్రత్యేక ప్రవర్తన అలవరచుకొనేలా శిక్షణనివ్వడం జరుగుతుంది. ఉదాహరణకు, గులాబీని ఆడపిల్లలకు, నీలం రంగును మగపిల్లలకు సంబంధించినదిగా చెబుతారు. పుట్టినరోజుకు బాలికలకు బొమ్మలు, వంట సామాను, అలంకరణ సామాగ్రి కానుకలుగా ఇస్తారు. అబ్బాయిలకు కార్లు, తుపాకుల బొమ్మలు ఇస్తారు. కుటుంబం, కమ్యూనిటీ, పాఠశాల వంటివి అబ్బాయిలను, అమ్మాయిలను భిన్నంగా సామాజీకరిస్తాయి. పిల్లల ప్రవర్తన సామాజికంగా నియంత్రితమవుతూ, సెక్స్‌ని బట్టి జెండర్ పాత్రలు నిర్వహించేలా పిల్లలు క్రమంగా నేర్చుకొనడం మొదలుపెడతారు. సమాజం ఊహించిన విధంగా, పర్యావరణకు, ఆచారాలకు తగినట్లుగా ప్రవర్తించే విధంగా తీర్చిదిద్దడాన్ని సామాజీకరణ అంటారు.

ఈ సామాజిక పద్ధతి బాగా వేళ్ళూనుకుని, ఎన్నో యుగాలుగా అది ఒకరి నుంచి ఒకరికి సంక్రమిస్తూ ఉంది. జనం ఈ సమస్యలను గురించి సమగ్రంగా అధ్యయనం చేసి, అవగాహన పెంచుకోవాలి. అప్పుడే ఆడ, మగకు ఒకరితో ఒకరికి ఉన్న పరస్పర వ్యవహారంలో మార్పు వస్తుంది.

### 1.2.2 జండర్ మూసపాత్రలు (Gender Stereotyping)

జండర్‌ని బట్టి ఒక సమూహం లక్షణాలను, తేడాలను, గుణాలను సాధారణీకరించడాన్ని జండర్ స్టీరియో టైపింగ్ అంటారు. 'సెక్స్' ఆధారంగా స్త్రీ, పురుషులు ఏమి పాత్రలు నిర్వహించగలుగుతారో, ఏ లక్షణాలు కలిగి ఉంటారో ముందుగా అంచనాలు ఏర్పరుచుకోవడం వల్లనే జండర్ మూసపాత్రలు తయారవుతాయి. సెక్స్‌ని బట్టి వ్యక్తి లక్షణాలు ఉండాలని భావించే మానసిక దృక్పథం ఫలితంగా జండర్ స్టీరియో టైప్స్ పుడతాయి. జండర్ స్టీరియో టైప్స్ వల్ల సమానత్వం లేని, అసంబద్ధమైన వ్యవహారం ఉంటుంది. బాల బాలికలు, స్త్రీ పురుషుల ప్రతిభా సామర్థ్యాలను విద్యాత్మక, వృత్తి అనుభవాలను అభివృద్ధి చెందకుండా జండర్ స్టీరియో టైప్స్ అడ్డుకుంటాయి. మహిళలకు వ్యతిరేకంగా గాఢంగా పెంచుకున్న మనో వైఖరులకు, విలువలకు, నియమాలకు కారణం స్టీరియో టైపింగే. మహిళలపై పురుషులు ఆధిపత్యం చెలాయించడానికి తరచుగా జండర్ స్టీరియో టైపింగ్ దోహదం చేస్తుంది. ఇది స్త్రీల ప్రగతికి అవరోధంగా నిలుస్తుంది. ఉదాహరణకు 'ఏడ్వడం' అనే ఉద్వేగాన్ని స్త్రీలకు ఆపాదించి చెప్పే భావన బాగా వ్యాప్తిలో ఉన్న మూసపాత్ర. ఒక పిల్లవాడు ఏడుస్తుంటే, పెద్దవాళ్ళు "ఆడపిల్లలాగా ఏడవొద్దు" అని హెచ్చరించటం జరుగుతుంది. ఏడవడం అనేది ఆడవాళ్ళ ట్రేడ్ మార్క్ అయింది. ఇలా బాలికలు, బాలురు సామాజీకరణకు లోబడి తమ ప్రవర్తనను అలవరుచుకుంటారు.

### 1.2.3 జండర్ సమానత్వం

ఆడవారిగా పుట్టారా, మగవారిగా పుట్టారా అనే దానితో సంబంధం లేకుండా స్త్రీ పురుషులకు హక్కులు, బాధ్యతలు, అవకాశాలు అన్నీ సమానంగా ఉండటాన్ని జండర్ సమానత్వం అంటారు. స్త్రీ పురుషుల ఆసక్తులు, అవసరాలు, ప్రాధాన్యతలు అన్నీ సమానంగా పరిగణించవలసినవేనని జండర్ సమానత్వం భావిస్తుంది. భాగస్వామిక అభివృద్ధికి జండర్ సమానత్వం ఒక ముఖ్యమైన సూచిక.

### 1.2.4 జండర్ సమత్వం

జండర్ సమత్వం స్త్రీ పురుషులిద్దరినీ, వారి అవసరాలను బట్టి సమానంగా చూడాలని చెబుతుంది. స్త్రీ పురుషులిద్దరికీ భిన్నమైన అవసరాలు, ప్రాధాన్యతలు, ఆసక్తులు ఉంటాయని వారి అవసరాలను గుర్తించినపుడే సమానత్వం సాధ్యమవుతుందని జండర్ సమత్వం చెబుతుంది. ఉదాహరణకు స్త్రీల ప్రత్యేక అవసరాలను గుర్తించి ఉపాధికి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

### 1.2.5 జండర్‌ను ప్రధాన స్రవంతిలోకి తేవడం

స్త్రీలు, పురుషులు సమానంగా లబ్ధి పొందేలా అన్ని రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో చేపట్టే కార్యక్రమాలు, విధానాలలో రూపకల్పన, పర్యవేక్షణ, మూల్యాంకనలలో స్త్రీ, పురుషులిద్దరి అవసరాలను ప్రయోజనాలను సమగ్రంగా ఆలోచించే వ్యూహం జండర్‌ను ప్రధాన స్రవంతిలోకి తేవడం. దీని పరమ లక్ష్యం జండర్ సమానత్వం.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

1. జండర్, సెక్స్ అనే భావనల మధ్య గల తేడాలను వివరించండి.

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

2. జండర్ స్టీరియోటైపింగ్ అంటే ఏమిటి? మీ దైనందిన కార్యకలాపాల నుంచి జండర్ స్టీరియో టైపింగ్‌కు రెండు ఉదాహరణలు ఇవ్వండి.

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

## 1.3 జండర్ పాత్రలు

ఒక నిర్దిష్ట సంస్కృతిలో సమాజం ఆమోదించిన వ్యక్తుల ప్రవర్తనను జండర్ పాత్రలుగా వ్యవహరిస్తారు. సంస్కృతి, సంప్రదాయాలకు లోబడి, జండర్ పాత్రలు స్త్రీ, పురుషులు నిర్వహించే పనులను, బాధ్యతలను తెలియచేస్తాయి.

వ్యక్తుల సెక్స్‌ని బట్టి, సామాజిక విలువలను బట్టి జండర్ పట్ల ఉన్న నమ్మకాలను బట్టి ఏర్పడినవి జండర్ పాత్రలు. వ్యక్తుల పరస్పర వ్యవహారం, వారి పర్యావరణాలని బట్టి జండర్ పాత్రలు ఉత్పత్తి అవుతాయి. జండర్ పాత్రలు ఎన్నడూ సార్వత్రికంగా ఒకేలా ఉండవు. భిన్న సంస్కృతులతో చివరికి ఒకే దేశంలో కూడా ప్రాంతాలను బట్టి ఇవి మారుతూ ఉంటాయి.

వ్యక్తులు లేదా సమూహాల ప్రవర్తన తమ చుట్టూ ఉన్న సమాజ పరిస్థితులు, నమ్మకాలు, విలువలు, సామాజీకరణ ద్వారా ప్రభావితమవుతూ ఉంటాయి. ఇలా ప్రభావితమయిన వ్యక్తుల ప్రవర్తన ఒక తరం నుండి మరో తరానికి వ్యాప్తి చెందుతాయి. ఎక్కువ భాగం సమాజంలో స్త్రీలు రెండవ స్థానం కలిగి మగవారి కంటే తక్కువ అనే భావంతో చూడబడుతున్నారు. స్త్రీలు గృహ బాధ్యతలు తీసుకోవాలని భర్తకు విధేయంగా ఉండాలని నేర్పుతారు. చరిత్రలోని అన్ని కాలాల్లో జండర్ పాత్రలు సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

### 1.3.1 కుటుంబంలో జండర్ పాత్రలు

తల్లిదండ్రుల నుంచి పిల్లలు సామాజిక జీవితంలో మొదటి పాఠాలు నేర్చుకుంటారు. బాలికలు పెరిగి పెద్దవారై వివాహం చేసుకుని, పిల్లల్ని కని, ఇంటి పనులు చేసుకుంటూ, కుటుంబాన్ని సంరక్షించాలి అని సంప్రదాయం చెప్తుంది. సాధారణంగా ఆడపిల్లల్ని వంట చేయడం, బట్టలు కుట్టడం నేర్చుకోమని ప్రోత్సహిస్తారు. అబ్బాయిలను బాగా చదువుకోమని, ఆటలు బాగా ఆడి దృఢంగా అవమని, తెలివైన వారుగా, స్వతంత్రంగా ఉండమని, పెద్దవారై కుటుంబాన్ని పోషించాలని చెబుతారు.

జండర్ పాత్రను కుటుంబంలోను, సమాజంలోను ఉన్న క్లిష్టమైన సంబంధాల దృష్ట్యా గ్రహించడం, నేర్పడం, పాటించడం జరుగుతుంది. ఈ విధంగా జండర్ ఉనికి, జండర్ పాత్రలు కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య సంబంధాలతో సామాజీకరింపబడుతున్నాయి.

### 1.3.2 కమ్యూనిటీలో జండర్ పాత్రలు

భాష, సంస్కృతి, మతం లేదా పని ఒకే విధంగా ఉన్న సమూహంలోని సభ్యులను ఒక కమ్యూనిటీకి చెందినవారుగా గుర్తిస్తారు. ప్రతి కమ్యూనిటీకి స్త్రీ, పురుషుల పట్ల భిన్నమైన దృక్పథం ఉంటుంది.

సమాజం 'స్త్రీత్వ' లక్షణాల కన్నా 'పురుషత్వ' లక్షణాలకు ఎక్కువగా విలువనిస్తుంది. ఉదాహరణకు ఒక పురుషుడు ధైర్యాన్ని ప్రదర్శించకపోతే, "చేతులకు గాజులు వేసుకున్నావా?" అని సమాజం ప్రశ్నిస్తుంది. ధైర్యం పురుష లక్షణమనే అర్థాన్ని పై వాక్యం ఇస్తుంది. అయితే ధైర్య సాహసాలను ప్రదర్శించిన స్త్రీల ఉదాహరణలు అసంఖ్యాకంగా ఉన్నాయి. భారతీయ ప్రథమ మహిళా వ్యోమగామి కల్పన చావ్లా, అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన కిరణ్‌బేడి - ఈ అద్దాలగోడలను పగులగొట్టిన మహిళలు.

సాంప్రదాయికంగా, కుటుంబాలను పోషించవలసిన బాధ్యత పురుషుల మీద ఉంటుంది. వారు దూకుడుగా ఉండాలి, ఆర్థిక విషయాలను, కుటుంబం నిర్ణయాలను వారు తీసుకోవాలి. అయితే మహిళలు ఎప్పుడూ పని చూస్తూనే ఉండేవారు - అది కూలిపని కాని లేదా ఇంటిపని కానివ్వండి. ఇంటిలో స్త్రీలు చేసే పనికి గుర్తింపు ఉండదు. సమకాలీన సమాజంలో కుటుంబ పోషణ కోసం ఆర్థిక భారాన్ని పంచుకొనడానికి స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నారు. స్త్రీలు పనిచేసినా వారి సంపాదనను పురుషులు తీసుకోవడంతో, వీరికి ఆర్థిక స్వాతంత్రం ఉండదు. పురుషులు మృతి చెందడం గాని, వలస వెళ్ళడం గాని జరిగితే, స్త్రీలే కుటుంబ పెద్దలుగా వ్యవహరిస్తారు.

## 1.4 సంస్కృతి, సంప్రదాయాల ప్రభావం

ఇంతకు ముందు 'సెక్స్' శారీరక స్వభావానికి సంబంధించినదని, 'జండర్' సమాజం నియంత్రించినదనీ తెలుసుకున్నాం. సామాజీకరణ ప్రక్రియ, సమాజం, సంస్కృతి 'జండర్' విషయాలను నేర్పిస్తాయి. చాలా సంస్కృతులలో ఆడ, మగ ఆయా లక్షణాలను ప్రదర్శించే పనులు మాత్రమే చేయాలని నేర్పిస్తారు. ఆటబొమ్మల దగ్గర్నించి క్రమశిక్షణ విషయంలోను, వారు కోరుకునే ఉద్యోగాల విషయంలోనూ తేడా చూపించడం, పత్రికలు ప్రసార మాధ్యమాలలో కూడా ఇరువురిని భిన్నంగా చూపించడం జరుగుతుంది. పుట్టిన నాటి నుంచి పిల్లలకు తమ జండర్ గురించి నేర్చుకుంటూ పెరుగుతారు. మగవారిగా, ఆడవారిగా ఎలా ప్రవర్తించాలో తమకు తాము గ్రహించుకొని, ఇతరులు అనుకునే విధంగా ప్రవర్తిస్తుంటారు. జీవితమంతా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, వారి సంస్కృతి, సమాజం దీనికి దోహదం చేస్తూ ఉంటారు.

పిల్లల్ని కనడం, పెంచడం వంటి పాత్రలను అనుసరించి స్త్రీ, పురుషులకు పనిని కేటాయించడం జరుగుతుంది. దైనందిన ఇంటి పనులను స్త్రీలకు, ఆదాయం సంపాదించే పని పురుషులకు కేటాయించడం జరిగింది. సాధారణంగా స్త్రీలను ఇంటి పనులకు బాధ్యులుగా చూస్తారు; పిల్లల సంరక్షణ, ఆరోగ్యం, వంట, ఆహారం వండి పెట్టడం, ఇతరమైన గృహసేవలు స్త్రీలు చెయ్యాలి. ఈ పని విభజన సమాజం నిర్ణయించిన నియమాల ప్రకారం జరిగినదే కాని, స్త్రీల శారీరక స్వభావానికి, దీనికి ఏ మాత్రం సంబంధం లేదు.

సమాజంలో స్త్రీల హోదాను రూపుదిద్దడంలో సంస్కృతి ప్రధానపాత్ర వహిస్తుంది. భారతదేశంలో మగ పిల్లలకు ప్రాధాన్యతనివ్వడం జండర్ అసమానతలు తలెత్తడానికి కారణం. అబ్బాయిలు కావాలనుకోవడం వలన వివక్ష తలెత్తుతుంది. పోషకాహారం, ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలు బాలికలకు లభించవు. తల్లిదండ్రులు వీరిపట్ల చూపే సంరక్షణలో కూడా వివక్ష ఉంటుంది. సంప్రదాయం ప్రకారం బాలికలు పెరిగి పెద్దవారై వివాహం చేసుకొని, పిల్లల్ని కని, ఇంటి పని చేసుకుంటూ, కుటుంబ సంరక్షణ చెయ్యాలి. వంట చెయ్యడం, బట్టలు కుట్టడం వంటి నైపుణ్యాలు పెంచుకునేలా వారికి ప్రోత్సాహమిస్తారు. అబ్బాయిలకు ఎక్కువ స్వాతంత్రం ఇస్తారు. చీకటి పడినా వారు బయటికి వెళ్ళి పని చెయ్యవచ్చు. అమ్మాయిలు పనికి వెళ్ళినా చీకటి పడకముందే ఇంటికి వచ్చేయ్యాలి.

భారతదేశంలో ఆడపిల్లల పెళ్ళి వర కట్నంతో ముడిపడి ఉంది. అందువల్ల ఆమెను కుటుంబానికి భారంగా భావిస్తారు. కుటుంబ సభ్యులు కూడా ఆడపిల్లలతో భిన్నంగా ప్రవర్తిస్తారు.

భారతీయ సమాజంలో స్త్రీలను అణచివేసే ధోరణిలో ఆచారాలున్నాయి. సతి, వరకట్నం, ఆడ శిశువుల హత్య, బాల్య వివాహాలు వంటి వాటివల్ల ఆయా స్త్రీలకు బాధ, మరణం సంభవించి వేదనకు గురయ్యే స్థితి నెలకొంది. సతి అంటే హిందూ మతంలో భర్త చనిపోతే, అతనితో పాటు బ్రతికి ఉన్న భార్యను కూడా చితిలో

కాల్చడం. 18 వ శతాబ్దంలో అగ్రకులాల వారిలో ఈ ఆచారం ప్రబలంగా ఉండేది. ఆడ శిశువుల హత్య - పుట్టగానే ఆడపిల్లను చంపడం; గర్భంలోనే భ్రూణ హత్య చేయడం. ఇది భారతదేశం అంతటా ఉంది. పేదరికం, వరకట్నం, కన్యలుగానే బిడ్డలను కనడం, అంగవికలత్వం ఉన్న బిడ్డలు పుట్టడం, సహాయ సేవలలోపం, తల్లులకు అరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం వీటికి కారణాలు. వరకట్నానికి వ్యతిరేకంగాను, గర్భంలో సెక్స్ నిర్ధారణ జరపకూడదని ఎన్నో చట్టాలు వచ్చినా, గృహ హింసకు వ్యతిరేకంగా, లైంగిక వేధింపుకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలు వచ్చినా ఈ నాటికీ ఈ పద్ధతులు కొనసాగుతూనే ఉండడం మనం చూస్తున్నాం.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

3. జండర్ పాత్రలంటే ఏమిటి? సమాజంలో ఆడ, మగ వ్యక్తులకు ఆపాదించిన లక్షణాలు లేదా పాత్రలేమిటి?

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

4. జండర్ పాత్రలపై సంస్కృతి, సంప్రదాయాల ప్రభావం ఉందా? వాస్తవ ఉదాహరణలతో సమాధానమివ్వండి.

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

## 1.5 భారతదేశంలో యుగాలవారీగా మారుతున్న స్త్రీల పాత్ర

పాత రాతియుగం(సి.ఎ. 6 మిలియన్ల నుంచి 10,000 బి.సి.ఇ) లో మానవులు సంచార జీవితం గడిపేవారు. పురుషులు వేటగాళ్ళు. స్త్రీలు తమ తెగలకు కావలసిన వస్తువులు సేకరించేవారు. విత్తనాలు, పళ్ళు, గింజలు, ధాన్యాలు వంటి వాటిని వారు సేకరించేవారు. చిన్న పిల్లలను సంరక్షించే వారు. వారు బిడ్డలను కనగలరు కనుక వారిని రక్షించవలసి ఉండేది. జండర్ పాత్రల్లో మొదటి తేడా ఇక్కడ కనిపిస్తుంది. ఆడవారు ఇంటి దగ్గర, పురుషులు పనిచేస్తూ ఉండేవారు. సమాజంలో శ్రేణులు వృద్ధి చెందడంతో ఆడవారిని అణచి వేయడం ఆచారంగా మారింది.

### 1.5.1 ప్రాచీన కాలం

చరిత్రలో చాలా కాలం పాటు పితృస్వామిక సమాజాలే ఉన్నాయి. స్త్రీల హోదా సంస్కృతి, కులం, కుటుంబ నిర్మాణం, ఆస్తిహక్కులు మొదలైన వాటిని బట్టి మారుతూ ఉంది. వివాహం, వారసత్వం, నివాసం వంటి సాంస్కృతిక, సాంప్రదాయక పద్ధతులన్నీ పురుషులను కేంద్రంగా చేసుకున్నవే, స్త్రీలను కాదు. ఉదాహరణకు వివాహానికి ముందు స్త్రీకి తండ్రి ఇంటి పేరు ఉంటే, వివాహం తర్వాత భర్త ఇంటి పేరు వస్తుంది.

ప్రాచీన భారతదేశంలో స్త్రీలు చాలా ముఖ్యమైన పాత్రలు వహించారు. ప్రాచీన కాలంలో స్త్రీలపై గౌరవంతోనే దేవతల సృష్టి జరిగింది - గార్గి, మైత్రేయి యజ్ఞాలలో పాల్గొనేవారు స్మృతి సాహిత్య కాలంలో స్త్రీలు భర్తను ప్రభూ అని గాని, స్వామి అని గాని పిలిచేవారు. కాలక్రమంలో జీవితంలోని అన్ని రంగాలలో స్త్రీల పరిస్థితి మార్పులకు లోనవుతూ వచ్చింది.

### 1.5.2 మధ్యయుగం

మధ్యయుగంలో స్త్రీలకు నిమ్నస్థాయి ఉన్నట్లుగా చాలా సూచికలు చెబుతున్నాయి. బాల్య వివాహం, సతి మొదలైనవి ప్రాచీన కాలంలోని ఆచారాలు. ఇవి ఈ కాలంలో కూడా మరింత విపరీత ధోరణిలో అమలు అయ్యాయి. మహమ్మదీయుల కాలంలో 'పర్ధా' వ్యవస్థ ఉండేది. ఉన్నత వర్గాలకు చెందిన హిందూ కుటుంబాలలో కూడా ఈ పద్ధతిని అనుసరించేవారు.

పర్ధా వ్యవస్థ ద్వారా స్త్రీలకు ఆంక్షలు విధించి ఇంటికే పరిమితం చేయడం ఆరంభమైంది. పర్ధా వల్ల వారి విద్యకు ఆటంకం కలిగింది. బయటి పని కోసం స్త్రీలు పురుషులపై ఆధారపడవలసి వచ్చింది. స్త్రీలకు చదువు నిరాకరింపబడింది. హక్కులు లేవు. స్వాతంత్రం లేదు. కష్టాలు ఎక్కువయ్యాయి.

### 1.5.3 బ్రిటిష్ కాలం

భారతదేశంలో బ్రిటిష్ వారి 200 సంవత్సరాల పాలనలో సమాజంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. విద్య, ఉద్యోగం, సామాజిక, ఆస్తి హక్కుల విషయంలో స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలగించడానికి వలస పాలకులు ప్రయత్నించారు. భారతదేశంలోని ఉన్నత వర్గాల ప్రజలు పాశ్చాత్య స్వేచ్ఛావాదం చేత ప్రభావితులై సామాజ సంస్కరణలు మొదలుపెట్టారు. 19వ శతాబ్దం రెండో భాగంలో బ్రిటీషు వారు చట్టపరమైన చర్యల ద్వారా సాంఘిక ఆచారాలను మార్చేందుకు ప్రయత్నాలు చేశారు.

భారతీయ మేధావులు భారతీయ సమాజ స్థితిని సమీక్షించుకుని, సతి, బాల్య వివాహం, బానిసత్వం, నిరక్షరాస్యత వంటి వాటికి వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించారు. వీటన్నిటినీ స్త్రీల ప్రగతికి నిరోధకాలుగా వారు భావించారు. సంఘ సంస్కర్తలందరూ స్త్రీలు వెనకపడితే సమాజం ముందుకు వెళ్ళలేదని భావించారు. చట్టపరమైన సంస్కరణల ద్వారా ప్రయత్నిస్తూనే, విద్య వల్ల స్త్రీల పరిస్థితి మారుతుందని వారు భావించారు. తొలుత స్త్రీలకు విద్యావకాశాలు కల్పించడానికి కారణం పాశ్చాత్య భావప్రేరితులైన పురుషులకు తగిన భార్యలు లభించడానికి మాత్రమే. ఈ రకంగా స్త్రీ విద్య పట్ల ఉన్న వివక్షను సాంఘిక సంస్కరణోద్యమం తగ్గించి స్త్రీలకు బహిరంగ వ్యవహారాల్లో చోటు కల్పించింది. రాజా రామమోహనరాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ చేసిన ప్రయత్నాల వల్ల వితంతు పునర్వివాహం చేసుకొనడానికి అవకాశం కలిగింది. సంఘ సంస్కర్తలు బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, రామకృష్ణ మఠం వంటి సంఘాలు స్థాపించి భారతీయ మహిళలకు చేయూతనిచ్చారు. 1930లో వచ్చిన బాల్య వివాహ నిరోధ చట్టం ద్వారా బాలికలకు వివాహ కనీస వయస్సును 14 ఏళ్ళుగా నిర్ణయించారు.

19 వ శతాబ్ది చివరికి సంఘ సంస్కర్తల కుటుంబాల నుంచి వచ్చిన స్త్రీలు తమ సొంత సంస్థలను స్థాపించారు. సావిత్రీబాయి పూలే, పండిత రమాబాయి, సరస్వతీ దేవి, చందూరాణి మహిళా సంస్థలను స్థాపించారు. 20 వ శతాబ్ది ఆరంభంలో భారతీయ మహిళా అసోసియేషన్ (1917) స్థాపించబడింది. భారత మహిళా సదస్సు 1921లో జరిగింది. ఓటు హక్కు, దేవదాసీ వ్యవస్థ రద్దు గురించి స్త్రీలు చర్చించారు. దేవదాసీ వ్యవస్థ రద్దు చట్టం అమలు విషయంలో ముత్తులక్ష్మీరెడ్డి విశేషంగా కృషి చేశారు.

స్త్రీవాదం, జాతీయవాదం పరస్పర సంబంధం కలిగినవి కావడంతో స్వాతంత్ర్యోద్యమం స్వేచ్ఛ కోసం పోరాడుతున్న స్త్రీలకు సాయం చేసింది. స్త్రీలను కూడ చేర్చుకోవాలనే గాంధీజీ అభిప్రాయం వల్ల స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు పాలుపంచుకున్నారు. సుభాష్ చంద్ర బోసు మహిళా రాష్ట్రీయ సంఘాన్ని స్థాపించారు. ఇది స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలపాత్ర పోషించింది.

కమలాదేవి ఛటోపాధ్యాయ, సరోజిని నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్, అరుణా ఆసిఫ్ అలీ, కెప్టెన్ లక్ష్మీ సైగల్, కల్పనాదత్ ఇంకా ఎందరో స్వాతంత్ర్యోద్యమంలో పలు విధాలుగా పాల్గొన్నారు.

### 1.5.4 సమకాలీనం

స్వాతంత్ర్యానంతర కాలంలో భారత రాజ్యాంగం స్త్రీ పురుషులిద్దరికీ సమాన హక్కులను ప్రసాదించింది. భారత రాజ్యాంగపిత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రకారం, "స్త్రీల ప్రగతిని బట్టి కమ్యూనిటీ ప్రగతిని కొలవవచ్చు". భారత రాజ్యాంగంలోని 14వ నిబంధన ప్రకారం రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో అందరికీ సమాన హక్కులను ప్రసాదించింది. సెక్స్ ఆధారంగా వివక్షను చూపరాదని 15వ నిబంధన నిర్దేశించింది. అదే విధంగా మహిళల పట్ల అవమానకరమైన, సంప్రదాయాలకు వ్యతిరేకంగా పలు అంశాలను చేర్చారు. తర్వాత హిందూ వివాహ చట్టం, వరకట్న నిషేద చట్టం, సమాన వేతన చట్టాలు చేసి స్త్రీ పురుషులకు సమాన హోదా కల్పించే ప్రయత్నం జరిగింది.

చట్టపరమైన అంశాలు ఎన్ని దోహదం చేసినా స్త్రీలను పురుషుల కన్న తక్కువగానే చూడటం జరుగుతోంది. వరకట్నం, స్త్రీలు పనిచేయడం, భూ హక్కులు, స్త్రీలు రాజకీయాలలో పాల్గొనడం, దళితులు, అవకాశాలు లేని మహిళలు, పెరుగుతున్న మత ఛాందసత్వం, మీడియాలో మహిళా ప్రతినిధ్యం వంటి ఎన్నో సమస్యలు ఎప్పటికప్పుడు తలెత్తుతూనే ఉన్నాయి.

పలు ప్రభుత్వేతర సంస్థలు, ఎన్జీవోలు మహిళాభివృద్ధి నిమిత్తం ఏర్పాటైనాయి. మహిళా సమస్యలను ఎలుగెత్తి చెప్పడానికి ఎందరో మహిళలు ముందుకు వస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిప్కో ఉద్యమంలో స్త్రీలు చెట్లను కౌగిలించుకొని వాటిని నరకకుండా ఆపారు; సారా వ్యతిరేక ఉద్యమాలు కూడా స్త్రీలు నడిపిన ఉద్యమాలకు మంచి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

పంచవర్ష ప్రణాళికలు మహిళాభివృద్ధి, సాధికారతలపై దృష్టి కేంద్రీకరించాయి. పేదరికాన్ని, ఆకలిని రూపుమాపే లక్ష్యంతోను, సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించడానికి, జండర్ సమానత్వాన్ని, స్త్రీలకు సాధికారతను కలిగించడానికి భారతదేశం సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను పెట్టుకుంది. అయితే, పురుషులకన్న స్త్రీలు అక్షరాస్యత విషయంలో వెనకబడి ఉన్నారని, రాజకీయాలలో పాల్గొనే స్త్రీల సంఖ్య తక్కువగా ఉందని గణాంకాలు తెలుపుతున్నాయి. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు, ప్రపంచ సంక్షేమానికి ఐరాసలోని 193 సభ్య దేశాలు అంగీకరించిన 17 లక్ష్యాలు స్థిరంగా కొనసాగే అభివృద్ధి లక్ష్యాలు (Sustainable Development Goals). దీనిలో 4వ లక్ష్యం జండర్ అసమానతలను రూపుమాపాలని, 5వ లక్ష్యం - "జండర్ సమానత్వం సాధించడం, మహిళలకు, బాలికలకు సాధికారత కల్పించడం" లక్ష్యం చేసుకున్నాయి. ఈ లక్ష్యం మహిళలు, బాలికలపై జరిగే అన్ని రకాల హింస, హానికరమైన ఆచారాలు, రూపుమాపాలని చెబుతుంది. సార్వత్రికంగా లైంగిక, పునరుత్పాదక ఆరోగ్యం అందరికీ అందుబాటులో ఉండాలని కృషి చేస్తుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

5. ప్రాచీన కాలం, మధ్యయుగం, ఆధునిక భారతదేశంలో మహిళల హోదాను సంగ్రహంగా చర్చించండి.

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

6. వర్తమాన సమాజంలో మహిళల స్థాయిని మెరుగు పరచడానికి మీరు ఏ సూచనలు చేస్తారు?

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

## 1.6 సారాంశం

ఎన్నో యుగాలుగా స్త్రీ, పురుషుల శరీరాలు భిన్నంగా ఉన్న కారణాన, వారి సామర్థ్యాలు, అవసరాలు, కోరికలు భిన్నమనే నమ్మకం ఉంది. దాని ప్రకారం సమాజం జండర్ పాత్రలను ఆపాదించింది. అంటే ఒక ప్రత్యేక సందర్భంలో స్త్రీ, పురుషులు ఎలా ప్రవర్తించాలనేది నిర్ణయించబడింది. ఈ భాగంలో సెక్స్, జండర్ అనే భావనల గురించి స్పష్టంగా చెప్పడం జరిగింది. సెక్స్ శారీరకంగా, స్థిరంగా ఉంటుంది. జండర్ అనేది సమాజం నిర్ణయించినది. సందర్భం, కాలం దీనిలో నిర్దిష్టంగా ఉంటాయి. ఇవి మారటానికి అవకాశం ఉంది. ఇంకా ఈ పాఠంలో జండర్ స్టీరియోటైప్స్, జండర్ సమానత్వం, జండర్ సమత్వం, జండర్‌ను ప్రధాన స్రవంతిలోకి తేవడం అనే వాటి గురించి చెప్పడం జరిగింది. వ్యక్తులకు ఒక నిర్దిష్ట సంస్కృతిలో సామాజికంగా ప్రవర్తనా పరంగా తగిన నియమాలను జండర్ పాత్రలు చెబుతాయి. జండర్ పాత్రలను కుటుంబం, సమాజంలో క్లిష్టమైన సంబంధాల మధ్య గ్రహించడం, నేర్పడం, అనుసరించడం జరుగుతుంది. వివిధ దేశాలు, సంస్కృతులలో స్త్రీలను చూసే విధానం మారుతుంది. వారి పని కూడా భిన్నంగా ఉంటుంది. భారతీయ సమాజం స్త్రీలను పూర్తిగా అణచివేసే ఆచారాలను కలిగి ఉంది. వాటిలో సతి, వరకట్నం, ఆడ పసిపిల్లల హత్య, బాల్య వివాహం ఉన్నాయి; వేదనను, బాధను, మహిళల, బాలికల మరణాన్ని కూడా ఈ ఆచారాలు కలిగిస్తాయి. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి సమకాలీన కాలం వరకు మహిళల స్థాయి పలురకాల మార్పులకు లోనైంది.

## 1.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. సెక్స్ జీవశాస్త్ర సంబందించినది, శారీరక ఆకృతికి సంబంధించినది. సెక్స్‌వల్ల వ్యక్తులను స్థిర వర్గాల్లోకి చేరుస్తారు. జండర్ సామాజికంగా నిర్మితమైంది. జండర్ నిర్థిష్ట సందర్భానికి, నిర్థిష్ట కాలానికి చెంది మార్పుకు వీలుగా ఉంటుంది.

2. సెక్స్‌ని బట్టి ఒక వర్గం వారి లక్షణాలను, తేడాలను, గుణాలను ఇలాగే ఉండాలని, ఉంటాయని సాధారణీకరించడం జండర్ స్టీరియో టైపింగ్. స్త్రీ, పురుషులను వారి సెక్స్ ఆధారంగా వారికి లక్షణాలు ఆపాదించి, వారి పాత్రలను పరిమితం చేయడం ఫలితంగా జండర్ స్టీరియో టైపింగ్ పరిస్థితి ఏర్పడుతుంది. జండర్ స్టీరియో టైపింగ్ వల్ల తరచుగా అనుచితంగా ప్రవర్తించడం, అనుచిత ఆచారాలు పాటించడం జరుగుతుంది.

జండర్ స్టీరియో టైప్‌లను వివరించే వాక్యాలు కొన్ని : 1) ఆడవాళ్ళే ఊసుపోని కబుర్లు చెబుతారు. 2) మగవాళ్ళు ఏడవకూడదు 3) మగవాళ్ళందరూ ఆటలను ఇష్టపడతారు మొ॥నవి.

3. ఒక నిర్థిష్ట సంస్కృతిలో వ్యక్తుకు సామాజికంగా అంగీకరించే తగిన ప్రవర్తనా నియమాలు గురించి జండర్ పాత్రలు చెబుతాయి.

మగవారి లక్షణాలు: స్వతంత్రం; దూకుడు / దురుసు; బలంగా; తిరగబడే మనస్తత్వం; ఉద్వేగ రహితంగా మొ॥న.
పాత్రలు: పని; సంపాదించే వారు; కుటుంబ రక్షకులు; నిర్ణయాలు తీసుకుంటారు; ఆర్థిక విషయాలు నియంత్రిస్తారు.
ఆడవారి లక్షణాలు: అస్వతంత్రులు; ఉద్వేగభరితులు; హుందాగా ఉంటారు; మృదువుగా, అణుకువగా, శాంతంగా, సున్నితంగా ఉంటారు.
పాత్రలు: రోజు 3 సార్లు వంట చేస్తారు; బట్టలు ఉతకడం; ఆరబెట్టడం; మడత పెట్టడం; ఇంటి నిర్వహణ; పిల్లల సంరక్షణ; పనికి వెళ్ళడం (ఉద్యోగం చేసే స్త్రీలు); భర్తకు సాయపడడం మొ॥నవి.

4. మనిషి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేయడంలో సంస్కృతి, సంప్రదాయం ముఖ్యమైన అంశాలు. కుటుంబంలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు పిల్లల ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. మతాచారాలు, నమ్మకాలు, విలువల వ్యవస్థలు ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు పండుగ సమయాల్లో అమ్మాయిలు ముగ్గులు వేస్తారు. క్రమంగా, ముగ్గులు వేయడం, వంట చెయ్యడం ఆడవారే చెయ్యాలనే నియమం ఏర్పడింది.

5. వేద కాలంలో స్త్రీల పరిస్థితి బాగునట్లుగా ఉంది. మైత్రేయి, గార్గి వంటి స్త్రీలు వేదాలు చదివారు. క్రతువులలో పాల్గొన్నారు. సతి గాని బాల్యవివాహాలు గాని లేవు. మనుస్మృతిలో స్త్రీలపై వివిధ ఆంక్షలను విధించారు. వితంతు పునర్వివాహం నిషేదించబడింది. స్త్రీకి భర్తే దైవం, విద్య వారికి అవకాశమే లేదు. సతి ఆచారం బాగా పెరిగింది. పర్థా వ్యవస్థ అమలులోకి వచ్చింది. భక్తి ఉద్యమం వల్ల మధ్యయుగంలో స్త్రీలకు మత స్వాతంత్ర్యం లభించింది. అయితే ఇది సమజ ఆర్థిక నిర్మాణంలో ఎటువంటి మార్పు తేలేదు. బ్రిటీష్ వారి కాలంలో పలువురు సంఘ సంస్కర్తలు సతికి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడారు. స్త్రీలు స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతర కాలంలో స్త్రీల హోదాను మెరుగుపరచడానికి పలు శాసనపరమైన చర్యలు తీసుకొనడం జరిగింది.

6. అ) విద్య, శిక్షణలకు అవకాశాలు విస్తరింపజేయడం.
ఆ) ఉద్యోగం నిర్ణయాలు తీసుకొనడంలో సమాన అవకాశాలు ఏర్పాటు చెయ్యడం.
ఇ) స్త్రీ, పురుషులకు జండర్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యడం.

## 1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. **ఈ కింది వాటికి 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సెక్స్‌కు, జండర్‌కు తేడాలు చెప్పండి. జండర్ సంబంధాలు జండర్ అసమానతలకు ఎలా దారి తీస్తాయి. వివరించండి.
2. భారతదేశ సందర్భంలో వివిధ కాలాల్లో మారుతూ వస్తున్న స్త్రీల పాత్ర స్థితిగతుల్ని వివరించండి.

II. **కింది ప్రస్నలకు 15 లైన్లలో పమాధానం రాయండి.**

1. జండర్ పాత్రలు
2. జండర్ సమానత్వం

## 1.9 ముఖ్యపదాల అర్థవివరణ

జండర్ సమత్వం : వారివారి అవసరాలను బట్టి స్త్రీ పురుషులతో సమానంగా వ్యవహరించడం.

పితృస్వామ్యం : పితృస్వామ్యం అంటే మగవాడు కాని, తండ్రికాని కుటుంబంలో ఆధిపత్యం వహించడం. పితృస్వామ్యాన్ని మగవారి అధికారం, మగవారి నియంత్రణ శక్తి, స్త్రీలను అణచివేయడం, వారిపై ఆధిపత్యం చెలాయించడం, తమకన్న తక్కువ వారిగా చూడడం, అవమానించడంగా అర్థం చేసుకొనడం జరుగుతుంది.

సామాజిక నియంత్రణ : సమాజం అంగీకరించే విధంగాను, సమాజంలో తోటివారు అంగీకరించే విధంగాను వ్యక్తి ప్రతిస్పందించడానికి వీలుగా ఇచ్చే శిక్షణ ప్రక్రియ సాంఘిక నియంత్రణ.

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు : 2000 సంవత్సరంలో ప్రపంచ నాయకులు అత్యంత పేదరికాన్ని తగ్గించడానికి అనుసరించినవి సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు. 2015 నాటికి ఈ లక్ష్యాలు సాధించాల్సి ఉంది.

స్థిరంగా కొనసాగే అభివృద్ధి లక్ష్యాలు (SDG) : ఎస్.డి.జిలు ఐరాస సభ్య దేశాలు పెట్టుకున్న సార్వత్రిక లక్ష్యాల సూచికలు. రాబోయే 15 సంవత్సరాల వరకు విధాన రూపకల్పనలో తోడ్పడేందుకు వీలుగా వీటిని 2015లో రూపొందించారు.

## 1.10 ఆధారిత గ్రంధాలు

అలిసన్ ఓప్లే (1997). ది ఎఫెక్ట్స్ ఆఫ్ కల్చర్ ఆన్ జండర్ ఐడెన్టిటీ

యూరోపియన్ ఇన్స్టిట్యూట్ ఫర్ జండర్ ఈక్వాలిగీ, కాన్సెప్ట్స్ అండె డెఫినిషన్స్

మాన్‌సింగ్, దాస్, విజయకుమార్ గుప్తా, 1995, జండర్ రోల్స్ అండ్ ఫామిలీ అనాలిసిస్

రేఖాపాండే (2015). ఫెమినిసమ్ అండ్ ఉమెన్స్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా: హిస్టారికల్ కాంటెక్స్ట్

రేఖాపాండే (2015). జండర్ లెన్స్: ఉమెన్స్ ఇస్యూస్ అండ్ పర్స్పెక్టివ్స్

W.H.O. (2011) జండర్ మెయిన్ స్ట్రీమింగ్ ఫర్ హెల్త్ మేనేజర్స్: ఎ ప్రాక్టికల్ అప్రోచ్.

# భాగం - 2 : జండర్ - సామాజీకరణ

విషయ క్రమం

2.0 లక్ష్యాలు
2.1 పరిచయం
2.2 స్త్రీ, పురుషులుగా ఎదిగే విధానం
2. 3 సామాజీకరణ ప్రక్రియ
2.3.1 జండర్ మూస పాత్రలు
2.4 సామాజీకరణ ప్రతినిధి వ్యవస్థలు
2.4.1 కుటుంబం
2.4.2 విద్యావ్యవస్థ
2.4.3 సహచర బృందం
2.4.4 ప్రచార సాధనాలు
2.4.5 పనిచేసే కార్యాలయాలు
2.5 భిన్న వర్గాల స్త్రీల అస్తిత్వం
2.5.1 ఆదివాసీ మహిళలు
2.5.2 వికలాంగ మహిళలు
2.6 సారాంశం
2.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు
2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు
2.9 ముఖ్యపదాల అర్థ వివరణ
2.10 ఆధారిత గ్రంధాలు

## 2.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక మీరు ఈ క్రింది విషయాలు గ్రహించగలుగుతారు.

- స్త్రీ పురుషులు పెరిగే విధానంలో అసమానతలు గుర్తించగలుగుతారు
- సామాజీకరణ ప్రక్రియ గూర్చి అవగాహన కలిగి జండర్ మూస పాత్రలని గుర్తిస్తారు
- సామాజీకరణపై కుటుంబం, విద్య, ఇతర సామాజిక వ్యవస్థల ప్రభావం తెలుసుకోగలుగుతారు
- భిన్న వర్గాలు, కులాల విషయంలో జండర్ పరంగా జరిగే అసమానతలు, అంతరాలు గ్రహించగలుగుతారు.

## 2.1 పరిచయం

ప్రతి ఒక్కరు ఆడగానో, మగగానో పుడతారు. పుట్టినప్పటినుంచి పెరిగే క్రమంలో కుటుంబం, సమాజం, సంస్కృతి, కట్టుబాట్లకు లోబడి వారు స్త్రీలు, పురుషులుగా తీర్చి దిద్దబడతారు. ఇలా స్త్రీ పురుషులుగా పెరిగే

క్రమాన్ని సామాజీకరణ అంటారు. ప్రతి సంస్కృతికి ఆడపిల్లలను, మగపిల్లలను విలువ కట్టే తనదైన విధానం ఉంటుంది. అది వారికి భిన్నమైన లక్షణాలు, ప్రవర్తన పద్ధతులు, పాత్రలు, బాధ్యతలు ఆపాదిస్తుంది. ఆడపిల్లలకు, మగపిల్లలకు కొన్ని భిన్నమైన విలువలను నేర్పించి ఇవే సరైనవి అని ఆ విలువల మధ్య బ్రతకడానికి శిక్షణ ఇస్తారు. పితృస్వామ్య వ్యవస్థలో ఈ విలువలు స్త్రీల జీవితాలకు కొన్ని పరిధులను, నిర్బంధాలను, నిషేదాలను విధిస్తాయి. ఆడపిల్లలకు, మగపిల్లలకు శరీర నిర్మాణంలోని తేడా ఆధారంగా జండర్ ఆధారిత పాత్రలు కేటాయిస్తారు. ఈ పాత్రల ద్వారా వాళ్ళు ఆడతనం, మగతనం లక్షణాలను అర్థం చేసుకొనే బదులు, చుట్టుపక్కల సమాజం, స్నేహితుల ద్వారా ఈ లక్షణాలను మనసులో జీర్ణింపచేసుకుంటూ పెరుగుతారు. ప్రసిద్ధ ఫ్రెంచి ఫిలాసఫర్ (సిమూన్ డి బూర్) చెప్పారు "ఎవరూ పుట్టుకతో స్త్రీగా పుట్టరు, స్త్రీగా మలచబడతారు" అని. మరో విధంగా చెప్పాలంటే, జండర్ సహజంగా వచ్చిన గుణం కాదు, ఇది సమాజం ఆపాదించిన గుణం మాత్రమే. స్త్రీత్వం, పురుషత్వం అన్నవి సమాజం తయారుచేసినవే.

అలాగే కుటుంబం, సమాజం - మగపిల్లాడు అధికుడు, గొప్పవాడు. ఆడపిల్ల తక్కువ, లొంగిపోవాలి అనే భావజాలాన్ని కలిగి వుండి వాటిని గట్టిగా అమలుపరుస్తారు. జండర్ విధానంలో ఆడపిల్లలను సాధారణంగా కుటుంబానికి పరిమితం చేసి పెంచుతారు. దానిని ప్రైవేటు ప్రాంతం అనవచ్చు. సమాజం, దానిలోని ఇతర వ్యవస్థలు, ప్రభుత్వ యంత్రాంగంని పబ్లిక్ ప్రాంతమని అర్థం చేసుకోవాలి. తమదైన ప్రాంతమైన కుటుంబంలో ఆడపిల్లని తక్కువ స్థాయి గౌరవంతో పెంచుతారు. ఆ ప్రైవేటు ప్రాంతం నుంచి పబ్లిక్ ప్రాంతానికి వచ్చినప్పుడు కూడా అదే భావజాలం ఆమెను వెంటాడుతుంది. స్కూళ్ళు, కాలేజీలు, పనిచేసే చోట్ల - ఆడపిల్ల లొంగి వుండాలి, ఆధిక్యత, గొప్పతనం ప్రదర్శించకూడదు అని నేర్పిస్తారు. కుటుంబం విద్యావ్యవస్థతో పాటు - మతం, రాజకీయ వ్యవస్థ, మీడియా తదితర వ్యవస్థలు జండర్ పాత్రలను శక్తివంతంగా అమలు చేస్తాయి. ఆ పాత్రలకు అనుగుణంగా ప్రవర్తించడమే మంచి పద్ధతి అని చెప్తాయి. ఈ చిన్న చూపు వివక్ష పూరిత విధానం ఆడపిల్లల్ని అసమానత్వంలోకి, చివరికి హింసలోకి నెడ్తుంది. ఈ జండర్ విధానం - కులం, వర్గం, తెగ, ప్రాంతం, మతం, వైకల్యం వంటి తారతమ్యాలలో కలిసి ఆయా కులాల, వర్గాల, మతాల, ప్రాంతాల మరియు అంగ వైకల్యం కల ఆడపిల్లలు మరింత దోపిడీకి, అణిచివేతకు గురయేట్లు చేస్తుంది.

## 2.2 స్త్రీ, పురుషులుగా ఎదిగే విధానం

స్త్రీ పురుషులుగా పెరగడం కుటుంబ వ్యవస్థలోనే మొదలవుతుంది. ఆడపిల్ల అంటే అణుకువగా వుండాలి. శాంతంగా, సహనంగా, సున్నితంగా, నాజూకుగా ఉండాలి. సిగ్గు, బిడియం, మర్యాద ఉండాలి. వంట, ఇంటిపనిని చక్కగా నేర్చుకోవాలి. తల్లిదండ్రుల పట్ల, కుటుంబం పట్ల భాద్యతగా వుండాలి. ఇంటి సంరక్షణ, వృద్ధుల ఆలనాపాలనా చూసుకోవాలి. సున్నితమైన మనసుతో చిన్న విషయానికి కూడా కన్నీరు పెట్టుకోవాలి. దయ, క్షమ, సహనం, మాతృత్వం వంటి లక్షణాలతో త్యాగ బుద్ధి కలిగి ఉండాలి. పిరికిగా ప్రతి దాని గురించి భయంతో ఆలోచించాలి. అదే మగపిల్లవాడు అయితే, బలంగా, ధృఢంగా, ఆరోగ్యంగా ఉండాలి. బయటకు వెళ్ళాలి. స్వేచ్ఛగా ధైర్యంగా వుండాలి. ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్ళవచ్చు - తిరిగి రావచ్చు. బాగా చదువుకోవాలి. పోటీతత్వం, స్వార్థం కలిగి వుండాలి. కుటుంబాన్ని పోషించాలి కాబట్టి, మంచి తిండి, బట్టలు, మంచి కాలేజీల్లో పెద్ద పెద్ద చదువులు వుండాలి. ఆడవాళ్ళ మీద, బలహీనుల మీద పెత్తనం చెలాయించటం, అధికారాన్ని ప్రదర్శించటం పురుష లక్షణం అని చెప్తారు.

ఈ విధంగా ఆడపిల్లలు, మగపిల్లలు పెరిగే క్రమంలో విభిన్న లక్షణాలు, గుణాలు, స్వభావాలు నేర్చుకుంటూ వాటిని మనసులో జీర్ణింప చేసుకుంటూ పెరుగుతారు. కుటుంబంతో పాటు చుట్టు పక్కల సమాజం, విద్యాలయాలు, స్నేహితుల ద్వారా ఆడపిల్లలు, మగపిల్లలు ఈ లక్షణాలను నేర్చుకుంటారు.

ఈ లక్షణాలను జాగ్రత్తగా పరిశీలిస్తే - సేవలు, బాధ్యతలు, లొంగి వుండడం వంటి లక్షణాలు ఆడపిల్లలకు, స్వేచ్ఛ, అధికారం, జ్ఞానం వంటి లక్షణాలు మగపిల్లలకు నేర్పుతున్నారు.

ఈ అంశంపై ప్రసిద్ధ ఫెమినిస్ట్ రచయిత వోల్గా రచించిన "కుటుంబ వ్యవస్థ - మార్క్సిజం, ఫెమినిజం" అనే పుస్తకంలో ఇలా చెప్పారు:

"స్త్రీ, పురుషుల శారీరక నిర్మాణంలోను, కొన్ని శారీరక ధర్మాలలోను వున్న తేడాలు ప్రకృతిలో సహజమైనవి అయితే సమాజం ఆ శారీరక లక్షణాల ఆధారంగా స్త్రీ, పురుషులకు వేర్వేరు స్వభావాలు ఆపాదిస్తుంది. స్త్రీత్వమూ, పురుషత్వము ఈ సమాజం తయారుచేసినవే. స్త్రీ, పురుషులు మానవులే అని ఒప్పుకుంటే, వారిద్దరూ జంతు దశ నుండి క్రమంగా మానవులుగా పరిణామం చెందారని అంగీకరిస్తే - వారిలో మానవ లక్షణాలు వుండాలి. మానవత్వం వుండాలి కాని సమాజం స్త్రీ పురుషులను ఎంతగా విడదీసిందంటే మానవ స్వభావంలోని కొన్ని గుణాలను ప్రత్యేకంగా స్త్రీలకు, మరికొన్ని గుణాలను ప్రత్యేకంగా పురుషులకు అంటగట్టింది. బానిసలుగా ఉండటానికి కావలసిన గుణాలన్ని స్త్రీలకు, బానిస యజమానులకు కావల్సిన గుణాలన్ని పురుషులకు సమాజం ఆపాదించింది"

ఈ సామాజీకరణ క్రమంలో ఇంటి పనులు చేయటం ఆడపిల్లల ప్రధాన బాధ్యతగా, లక్షణంగా కుటుంబాలు, సమాజాలు భావిస్తాయి. పెళ్ళయి అత్తవారింటికి వెళ్తే అక్కడ పనులు చేయాల్సి ఉంటుందనే కారణంతో చిన్నప్పటి నుంచే వారికి ఇంటి పనులు నేర్పుతారు. మగపిల్లాడు కుటుంబాన్ని పోషించాలని, రక్షించాలని, కాబట్టి ఈ ఇంటి పనులు మగపిల్లలు చేయాల్సిన అవసరం లేదని, వారు వృత్తి ఉద్యోగాలను నిర్వహించాలని చెప్తారు. ఆడపిల్లలు ఇంటి పనులు - తమ అన్నాతమ్ముల పనులు చేస్తూ అణకువగా వుండటం, తాము తక్కువ అనే భావాన్ని మనసులో జీర్ణింప చేసుకుంటూ పెరుగుతారు. మగపిల్లలు ఇంట్లో తమకు గల ప్రాధాన్యతను అర్థంమవకుండా ఆడపిల్లలపై ఆధిపత్యం, పెత్తనం చెలాయించడం నేర్చుకుంటారు.

సమాజం - స్త్రీలు, పురుషులు ఏమి చెయ్యాలి? ఏమి చెయ్యగలరు? అనే సామాజిక భావజాలం ఆధారంగా స్త్రీ, పురుషులకు భిన్న పాత్రలు, పనులు, బాధ్యతలు కేటాయిస్తుంది. దీనినే జండర్ శ్రమ విభజన అంటారు. ఇందులో ఆడపిల్లలకు, మగపిల్లలకు, స్త్రీలు, పురుషులకు వాళ్ళ వ్యక్తిగత సామర్థ్యాలు లేదా ప్రాదాన్యతల ఆధారంగా కాకుండా వారి జండర్ పాత్రలకు అనుగుణంగా వేర్వేరు పనులు, బాధ్యతలు కేటాయింపబడతాయి. ఈ జండర్ శ్రమ విభజనకు పునాది అయిన భావజాలం, ఇంటి పనులు, పిల్లల పెంపకానికి సంబంధించిన స్త్రీల శ్రమను - శ్రమగా కాకుండా ఆమె మనుగడలో సహజమైన భాగంగా చూడాలని చెపుతుంది. ఇంటి పనిని శ్రమగా గుర్తించకపోవడం, దానికి తక్కువ విలువ ఇవ్వడం స్త్రీలను తక్కువగా చూడడానికి దారి తీస్తుంది. అంటే స్త్రీలు చేసే ఇంటి పని వేతనం లేని పని, విలువ లేని పని, గుర్తింపు లేని పనిగా మారుతుంది. అలాగే ఇంటి లోపల స్త్రీల పనికి ఇవ్వబడిన తక్కువ విలువ - ఇంటికి వెలుపల ప్రతి సమాజంలోకి విస్తరించి అక్కడ కూడా స్త్రీలు చేసే శ్రమకే కాకుండా స్త్రీలకు కూడా తక్కువ విలువ ఇవ్వడానికి దారితీస్తుంది.

అలాగే అణిగి వుండటం, ఎదురు చెప్పకుండా వుండడం, లొంగి వుండడం, ఇవన్ని ఆడపిల్లల లక్షణాలుగా ఇంతకు ముందు తెలుసుకున్నాం. వీటివల్ల నష్టాలు ఏమిటంటే, బాలికలు పాఠశాలలో ఎవరికీ ఎదురు చెప్పనివాళ్ళు, దేనికైనా అంగీకరించే వాళ్ళుగా తయారవుతారు. పనులు పూర్తి చేయటంలో ముందుంటారు. రాసే సామర్ధ్యం కూడా బాగానే వుంటుంది. కాని మాట్లాడటంలో, స్పందనల్లో, ప్రత్యేక నైపుణ్యాలలో, లోక జ్ఞానంలో బాలికలు వెనుకబడి ఉంటారు. పనులను, సామర్థ్యాలను విడదీయటం చిన్నతనంలోనే మొదలవటంతో ఇతరులకు లొంగి ఉండటానికి అంగీకరించేటట్లు బాలికలను తయారుచేస్తుంది.

ఇంటి పని పేద పిల్లల చదువులను ఎలా దెబ్బతీస్తుందో చూద్దాం. పేద కుటుంబంలోని ఆడపిల్లలు తల్లిదండ్రులు కూలికి వెళ్ళటంతో ఇంటిపనులు చేయడం, తన కంటే చిన్న వారైన తమ్ముళ్ళు, చెల్లెళ్ళ ఆలనా పాలనా చేపట్టవలసి రావటంతో పాఠశాలకు ఆలస్యంగా వెళ్ళటం, ఎక్కువగా సెలవులు పెట్టడం, పాఠాలు సరిగ్గా అర్థం కాకపోవడం, ఈ పరిస్థితులన్ని వారు మధ్యలోనే చదువు మానేయటానికి దారి తీస్తుంది. పేదరికం, జండర్ వివక్షతో పాటు ఇంటి పని భారం ఆడపిల్లల అభివృద్ధికి, చదువుకు ఆటంకం అవుతుందని అధ్యయనాలు తెలియచేస్తున్నాయి.

"గ్రామీణ ప్రాంతంలోని బీద వ్యవసాయ కుటుంబంలోని బాలిక వంట చేస్తుంది. ఇల్లు శుభ్రం చేస్తుంది. పశువుల మేత తెస్తుంది. వంట చెరుకు, నీళ్ళు తెస్తుంది. పశువులను మేపి, తిండి పెట్టి, కోళ్ళు, మేకలు వంటి వాటిని సంరక్షిస్తుంది. విత్తటం, నాట్లు, కలుపు కోతలు, వీటన్నిటిలో సహాయం చేస్తుంది. కుటీర పరిశ్రమలో ఆధారపడిన కుటుంబానికి ఆ పనిలో తోడ్పడుతుంది. తన చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు పెంపుడు తల్లవుతుంది. గ్రామీణ భారతదేశంలో ఒక బాలిక తనకు 18 సం॥ల వయస్సు వచ్చేసరికి తన కుటుంబానికి సుమారు 39,600 రూపాయిలు (1300 అమెరికన్ డాలర్ల) విలువ చేసే సేవలను అందిస్తుంది. అయినప్పటికి ఆ బాలిక ఆర్థికంగా భారంగానే పరిగణించబడుతుంది."

- మానవ హక్కులు - మహిళల హక్కులు
(ఆచారాలు - అపచారాలు)
వసంత కన్నాభిరన్

అలాగే సామాజీకరణ క్రమంలో మగపిల్లాడి విషయంలో - మగపిల్లాడు అంటే చదువుకోవాలి లేదంటే పనికి పోవాలి అంతేకాని ఇంట్లో ఖాళీగా కూర్చోకూడదంటారు. కుటుంబ పోషకుడు, యజమాని కాబట్టి భార్య సంపాదన మీద ఆధారపడకూడదంటారు. పెంపకంలోని ఈ ఆంక్షలు మగ పిల్లలకు భారంగా పరిగణిస్తాయి. అలాగే ఇంజనీరు, డాక్టర్, లాయర్ లాంటి సమాజంలో స్టేటస్‌ను పెంచే చదువులు చదివి ఆ ఉద్యోగాల్లో స్థిరపడాలి అంటారు. ఎక్కువ కుటుంబాల్లో మగపిల్లలు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు, డాన్స్, చిత్రలేఖనం వంటి కళలను వృత్తులుగా స్వీకరిస్తామంటే సమ్మతించరు. గట్టిగా అడ్డు చెప్తారు. ఫలితంగా వారికి ఇష్టం ఉన్నా లేకపోయినా సమాజం పురుష ఉద్యోగాలని వేటిని చెబుతుందో వాటిని మాత్రమే చేపట్టాల్సి వుంటుంది. అలాగే మగపిల్లలను బాగా చదివించి, వారి ద్వారా విదేశీ డాలర్లు కూడబెట్టుకోవాలన్న తల్లిదండ్రుల తపన కూడా మగపిల్లలపై ఎక్కువగా ఒత్తిడిని పెంచుతుంది. మగపిల్లలు సంపాదించలేకపోయినా, శారీరకంగా బలహీనులైనా, వికలాంగులైనా మగతనం లేనివరనే చిన్న చూపు వారిపై వుంటుంది. మగతనం నిరూపించుకోవాలనే ఒత్తిడి వల్ల వాళ్ళు మానసికంగా బలహీనులుగా తయారవుతారు.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

1. సామాజీకరణ ప్రక్రియలో ఆడవారికి, మగవారికి ఆపాదించిన లక్షణాలు ఏవి?

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

## 2.3 సామాజీకరణ ప్రక్రియ

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి సామాజిక ఉద్యమకారిణి కమలా భసీన్ ప్రకారం - ఈ సామాజీకరణ అన్నది నాలుగు ప్రక్రియల ద్వారా జరుగుతుంది. అవి -

(a) మానిప్యులేషన్ (b) కానలైజేషన్ (c) వెర్బల్ అప్పెలేషన్ (d) ఆక్టివిటీ ఎక్స్‌పోజర్.

మానిప్యులేషన్ ఆడ, మగ పిల్లలు ఏ లక్షణాలతో పెరుగుతున్నారు అనే విషయానికి సంబంధించిన ప్రక్రియ. అబ్బాయిలు ధైర్యంగా, బలంగాను, అమ్మాయిలు అందంగా, నాజూకుగాను ఉండే భావన కలిగి ఉంటున్నారు. వారి భౌతిక స్వరూపాలని అనుసరించి వారి స్వభావాలను అలవరుచుకుంటున్నారు.

అమ్మాయిలు, అబ్బాయిలు కొన్ని వస్తువుల రంగులు, ఆకారాలను తమకు సంబంధించినవిగా భావించే ప్రక్రియను కానలైజేషన్ అంటారు. వాటిని ఆధారంగా చేసుకుని వారు తమ ఆశయాలను, అభిరుచులను పెంచుకుంటారు. ఉదాహరణకు అమ్మాయిలకు కానుకగా బొమ్మలు, వంట పాత్రల సెట్ ఇస్తే అబ్బాయిలకు కార్లు, ఏరోప్లేన్‌లు ఇవ్వడం మనం చూస్తుంటాం. ఇలా చిన్నతనంలో చేసిన అలవాట్లు, జ్ఞాపకాలు జీవితాంతం గుర్తు చేసుకుంటూ అవే భావితరాలకు అందించడం జరుగుతుంది.

వెర్బల్ అప్పెలేషన్ అనే ప్రక్రియ మనం ఆడ, మగ వారితో మాట్లాడే విధానానికి సంబంధించినది. సాధారణంగా ఆడపిల్లని మంచి పిల్ల, అందమైన పిల్ల అని, అబ్బాయిలను చిలిపి, బలమైనవాడు అని సంబోదిస్తూ ఉంటాం. వీటి ఆధారంగా పిల్లలు వారి స్వభావాలని కూడా మార్చుకుంటూ ఉంటారు.

సామాజీకరణలో నాలుగవ ప్రక్రియ ఆక్టివిటీ ఎక్స్‌పోజర్ లేదా కార్యకలాపాలకు స్పందన. స్త్రీ, పురుషులు నిర్వహించే కార్యకలాపాను తెలిపే ప్రక్రియ ఇది. ఉదాహరణకు అమ్మాయిలు తల్లికి సాయం చేయాలి, అబ్బాయిలు తండ్రితో కలిసి ఇంటి బయటి పనులకు వెళ్ళాలి అనే భావం చాలా బలంగా నాటుకుపోయింది.

ఈ ప్రక్రియల ద్వారా పిల్లలు స్త్రీత్వం, పురుషత్వాలను అర్థం చేసుకుంటారు. తమకి తెలియకుండానే వాటిని అంతర్గతం చేసుకుంటారు.

ఈ విధంగా ఆడపిల్లలు, మగపిల్లలు పెరిగే క్రమంలో వేర్వేరు లక్షణాలు, ప్రవర్తనా పద్ధతులు, బాధ్యతలు నేర్చుకుంటారు. ఆడపిల్లలు తమపై మగపిల్లల, మగవాళ్ళ పెత్తనం, సరైనవే అని నమ్ముతూ, వారి ఆధిపత్యం ఆమోదిస్తూ, అసమానత్వంతో వుండటం నేర్చుకుంటారు. అయితే ఈ జండర్ విధానం వలన ఆడపిల్లలతో పాటు మగపిల్లలు, వివక్షకు, ఒత్తిళ్ళకు గురవుతున్నారు. వివక్షాపూరితమైన సామాజీకరణ విధానం - ఆడపిల్లలు, మగపిల్లల మధ్య అంతరాలను పెంచుతుంది. ఈ విధానం ఆడపిల్లలు, మగపిల్లల మధ్య స్నేహభావాన్ని పెరగకుండా నిరోధిస్తూ - ఇద్దరి మధ్య ఒక అడ్డుగోడని నిర్మిస్తుంది. తమ జండర్ పాత్రలు మారితే, ఆడపిల్ల మగరాయుడిగా, మగపిల్లాడు ఆడంగిగా చిత్రీకరిస్తారనే భయాలు వారు ఆ గోడను దాటకుండా చేస్తుంది. ఈ విధంగా ఆడపిల్లలు / మగపిల్లలు మానసిక వేదనకు గురి అవుతూ, ఆడపిల్లలు పెద్దఎత్తున హింసలోకి నెట్టబడుతున్నారు.

ఉదా: మగపిల్లలు ఏడ్వకూడదు వారు ఎమోషనల్‌గా వుండకూడదు. ఫీలింగ్స్ బయట పెట్టకూడదు అని చెబుతూ ఇందుకు భిన్నంగా కన్నీళ్ళు పెట్టుకున్న వారిని చూసి నవ్వుతారు, ఎగతాళి చేస్తారు. అలాగే ఆడపిల్లలు సున్నిత మనస్కులై వుండాలి. కన్నీళ్ళు పెట్టుకోవాలి అని నేర్పుతూ ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే రాతి గుండె అని నిందిస్తారు. ఆడపిల్లలు, స్వేచ్ఛగా గట్టిగా నిర్భయంగా మాట్లాడితే మగరాయుడంటారు. అదే మగపిల్లాడు మెతకగా ఉంటూ సున్నితంగా మాట్లాడితే ఆడంగి వెధవ అంటారు. ఆడపిల్లలకు ఇంట్లో ఆర్థిక సమస్యల వలన చదువుకు ప్రోత్సాహం ఉండదు. ఆడపిల్లలు చదువు మానేసి ఇంట్లో వున్నా పెద్దగా పట్టించుకోరు. అదే మగపిల్లలు చదువుకోవాలి లేదంటే పనికి వెళ్ళాలి. అలా కాకుండా ఇంట్లో వుంటే ఏంటి! ఆడపిల్లలాగా ! ఇంట్లో కూర్చున్నావు అంటారు.

ఆడపిల్లలు అంటే పెళ్ళి చేసుకోవాలి, పిల్లలు కనాలి అని గట్టిగా నమ్ముతారు. అదే మగపిల్లలు తాము ఇంటి పనులు చూసుకుంటూ పిల్లల సంరక్షణ చేపడతామని ఉద్యోగానికి వెళ్ళమని చెబితే కుటుంబసభ్యులు నిర్ఘాంతపోతారు. అతను చెప్పకూడని మాటలు చెప్పినట్లు చేయకూడని పనులు చేస్తున్నట్లు భావిస్తారు. గట్టిగా వాదిస్తారు.

### 2.3.1 జండర్ మూస పాత్రలు

వ్యక్తి పై సమాజంలోని సంస్కృతి, సాంప్రదాయాలు, మతము మొదలైన వాటి ప్రభావం చాలా ఉంటుంది. వ్యక్తి తన విచక్షణను ఉపయోగించక గుడ్డిగా సాంప్రదాయం ప్రకారం వ్యవహరిస్తుంటాడు. ఒక సంస్కృతిలోని వ్యక్తులందరూ ఒకే భావన కలిగి ఉండడం వలన మూసపాత్రలు ఏర్పడడం జరుగుతుంది. ఇలా ఏర్పడిన జండర్ మూసపాత్రలు సామాజీకరణ ప్రక్రియ ద్వారా తరతరాలకు వ్యాపిస్తాయి. వెబ్‌స్టర్ నిఘంటువు (1998) మూసపాత్రలని ఇలా నిర్వచిస్తుంది - ''ఒక వ్యక్తిగాని, సమూహం కాని, నిర్దిష్టమైన భావన కలిగి ఉండి, విచక్షణకి, నిశితమైన ఆలోచనకి తావు ఇవ్వనివే మూస పాత్రలు''.

ఈ మూసపాత్రలు మనకి నిత్యం సమాజంలో కన్పిస్తూ ఉంటాయి. మూసపాత్రలు జండర్‌కి మాత్రమే పరిమితం కావు. ఉదాహరణకు వయసుమీరిన వారు ఈ తరం కుర్రకారు బాధ్యతారహితంగా ఉంటారని, పెద్దల పట్ల మర్యాద చూపరని భావిస్తారు. అలాగే నేటి యువతరం ముసలి వారికి చాదస్తం ఎక్కువని, వారు మారుతున్నా కాలంతో పాటు వస్తున్న మార్పుని అర్థం చేసుకోలేరని భావిస్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జాతి, వేష భాషలు, అలవాట్లు, ఉద్యోగం మొదలైన అంశాలు మూస పాత్రలు ఏర్పడడానికి దోహదం చేస్తాయి.

ఈ మూసపాత్రలు పైకి అపాయం లేని విధంగా హాస్యాస్పదంగా కన్పించినప్పటికీ, దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. టార్గెట్ గ్రూప్‌ను - మూసపాత్రలలోకి నెట్టడం వలన - సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పర్యవసానాలు వుంటాయనేవి మనకు అవగాహన కలిగితే - ఈ మూసపాత్రలు ఏ విధంగా సృష్టించబడి కొనసాగుతున్నాయో - మనం చూడటం మొదలు పెడతాం. అలాగే ఆ సమూహం యొక్క మానవ హక్కులను నిరోధిస్తూ ఆయా మూసపాత్రలను కొనసాగేలా, ఎప్పటికీ నిలిచి ఉండేలా చేయడం వలన ఆ సమూహం యొక్క ఆంకాక్షలు, ఆశయాలు మరియు నిజమైన అవసరాలను నెరవేరడంలో అడ్డంకులు ఏర్పరుస్తాయి. అంతే కాకుండా అవి తొందరలోనే ఆ సమూహం యొక్క మానవ హక్కులను నిరోధిస్తూ ఆయా మూసపాత్రలను ప్రశ్నించడం లేదా బద్దలుకొట్టడం అనేది చాలా కష్టసాధ్యమైన పనిగా తయారవుతాయి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

2. సామాజీకరణ ప్రక్రియను వివరించండి.

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

## 2.4 సామాజీకరణ ప్రతినిధి వ్యవస్థలు

సామాజీకరణ పరస్పర సంబంధాలు కల ప్రక్రియ. ఈ ప్రక్రియ ద్వారా సమాజంలోని అలవాట్లు, కట్టుబాట్లు, విలువల ఆధారంగా పిల్లలు ఎలా పెరుగుతున్నారో తెలుసుకున్నాం. సామాజీకరణ ప్రక్రియలో సమాజం ముఖ్యమైన ప్రతినిధి వ్యవస్థగా పనిచేస్తుంది. సమాజంలోని ప్రతి వ్యక్తి తాము తెలుసుకున్న విలువలని, సంప్రదాయాలని ఇతరులకు పంచడంలో, వ్యాప్తి చేయడంలో ముఖ్య పాత్ర వహిస్తారు. దీన్నే సామాజీకరణ అంటాము.

ఈ జండర్ విధానాన్ని బలంగా అమలు చేసే వ్యవస్థనే పితృస్వామ్య వ్యవస్థ అంటారు. ఇది స్త్రీలపై ఆధిపత్యం చలాయిస్తూ వారిని అణిచివేస్తున్నాయి. కుటుంబం, మతం లాంటి ఇతర వ్యవస్థలు ఈ పితృస్వామ్య వ్యవస్థను బలంగా నిలబెడుతున్నాయి.

### 2.4.1 కుటుంబం

సమాజంలో భాగం అయిన కుటుంబం బహుశా అన్నింటికంటే ఎక్కువగా పితృస్వామిక స్వభావాన్ని కలిగి ఉంటుంది. జండర్ విధానాన్ని బలంగా అమలు చేస్తుంది. దీనిలో పురుషుడే కుటుంబ పెద్దగా వుంటాడు. ఆడవాళ్ళను, ఆడపిల్లలను వారి ప్రతి కదలికలను కంట్రోల్ చేస్తూ వుంటాడు. ఇంతకు ముందు మనం చెప్పుకున్న పురుషుడు గొప్పవాడిగా, ఆధిపత్యం చలాయించే వాడుగా, స్త్రీ తక్కువదిగా, లొంగి ఉండేదిగా జీవించే ఒక అధికార విధానం ఇక్కడే ఈ కుటుంబంలోనే ఏర్పడి ఉంటుంది. రాబోయే తరాలకు పితృస్వామిక విలువలలో శిక్షణ ఇచ్చేదిగా కూడా కుటుంబం ముఖ్య పాత్రను వహిస్తుంది.

కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రులిద్దరూ పిల్లలకు జండర్ పాత్రలని నిర్వహించడంలో ఇచ్చే శిక్షణ చాలా ముఖ్య పాత్ర వహిస్తుంది. తమకు తెలియకుండానే, ఈ శిక్షణ ద్వారా పిల్లలు జండర్ పాత్రలని జీవితాంతం పోషిస్తారు.

### 2.4.2 విద్యావ్యవస్థ

విద్యా వ్యవస్థ కూడా పితృస్వామిక భావజాలాన్ని జండర్ వివక్షను బలంగా కొనసాగిస్తుంది. పాఠశాల బోధనాంశాలలో మూస వైఖరులు మనస్తత్వాలను బ్రేక్ చేసేందుకు అవసరమైన మార్పులు ఇంతవరకు రాలేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలల్లో బాలబాలికలను మూసపాత్రలలోకి నెట్టడం మరియు బాలికలపై వివక్ష, ఆంక్షలు పెట్టడం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. బాలికలకు క్రీడారంగంలో ప్రవేశించి ఆత్మ విశ్వాసాన్ని అభివృద్ధి చేసుకొని వారి సామర్థ్యాలను నిరూపించుకునేందుకు తక్కువ అవకాశాలున్నాయి.

స్కూలు పాఠ్యపుస్తకాలలో జండర్ పక్షపాత ధోరణి అనేది ఇంకా కొనసాగుతుంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచురించిన పాఠ్యపుస్తకాలలో స్త్రీ పురుషుల ప్రవర్తన, పనులను గురించి మూస ధోరణిలో చిత్రీకరించబడ్డాయి. పురుషులు చాలా చురుకుగా కట్టెలు మోయడం, ఆటలాడటం, గుంతలు త్రవ్వడం, భార్య తన వెనుక వస్తుండగా ఆయన కుటుంబానికి పెద్దరికం వహిస్తూ ముందు నడవటం వంటి చిత్రాలు వుండగా స్త్రీలు బాలికలకు సంబంధించి ఇంటి పనులు చేయడం, బొమ్మలతో ఆడుకోవడం, ప్రతి విషయాన్ని అంగీకరించడం, పిరికిగా భయంగా వుండడం వంటి చిత్రాలు ఉన్నాయి. కథలైతే ప్రధానంగా పురుష పాత్రలే వుంటాయి. ప్రత్యేకించి నాయకులు, కథానాయకులు మరియు యోధులకు సంబంధించినవై వుంటాయి. పాఠ్యాంశాలలోని ఈ పక్షపాత వైఖరి పిల్లల మీద బలమైన వ్యతిరేఖ ప్రభావాన్ని చూపుతుంది. అలాగే పురుషుల ఆధిక్యత స్త్రీలను చులకన చేయడం గురించిన సామాజిక సందేశాలకు బలాన్ని చేకూరుస్తుంది.

### 2.4.3 సహచరుల బృందం

కుటుంబం, బడి మాత్రమే కాకుండా స్నేహితుల బృందం సామాజీకరణ ప్రక్రియలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఒకే వయసుకి చెందినవారు, కలిసి ఆడుకునే వారు, ఒకే సామాజిక వర్గానికి చెందిన పిల్లలు పరస్పరం సంబంధం కలిగి ఉంటారు. వీరు ఎక్కువ సమయం కలిసి ఉండడం వలన, ఒకరిపై ఒకరి ప్రభావం అధికంగా ఉంటుంది. వీరు తమదైన సంస్కృతిని ఏర్పరుచుకుంటారు. కాలేజి క్యాంపస్‌లో అల్లరి చేయడం, మత్తు పదార్థాలకు బానిస కావడం, మోటార్ సైకిళ్ళపై తిరగడం, క్రీడలు, విందు వినోదాల్లో పాల్గొనడం ఇవన్నీ స్నేహితుల బృందంతో కలిసి చేస్తారు.

### 2.4.4 ప్రచార సాధనాలు

ప్రచార సాధనాలు - రేడియో, టీవి మొదలగునవి వ్యక్తిత్వం రూపొందించడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. గత కొన్ని సంవత్సరాలలో సామాజీకరణలో ప్రచారసాధనాల పాత్ర అధికంగా కనిపిస్తుంది. ప్రచార సాధనాలు అన్నీ కూడా స్త్రీలను తక్కువ హోదా కలిగిన వారిగా చిత్రీకరిస్తూ సాంస్కృతిక మూస పాత్రలను కొనసాగిస్తున్నారు. మాస్ మీడియా, స్త్రీలను / బాలికలను వినియోగ వస్తువులుగా, పురుషులను నిర్ణయాలు తీసుకునే వారిగా వారి ఇమేజ్‌ను బలంగా నిలబెడుతుంది. ఉదా: స్త్రీలు టెలివిజన్‌కు సంబంధించిన వివిధ విభాగాల్లో కనిపిస్తుంటారు. న్యూస్ రిపోర్టర్, ప్రెజెంటర్స్, యాంకర్లు, యాక్టర్స్, డాన్సర్స్ మరియు సింగర్స్‌గా కనిపిస్తుంటారు. అయితే స్త్రీలకు సంబంధించిన అంశాలు కాకపోతే, వర్తమాన రాజకీయాలు లేదా ఆర్థిక పాలసీల వంటి సీరియస్ అంశాలపై అభిప్రాయం వెల్లడించేందుకు

మహిళలను చాలా అరుదుగా ఆహ్వానిస్తారు. ఆయా అంశాలపై అభిప్రాయాలు చెప్పేటంతగా నైపుణ్యాలు, ఆలోచనలు, భావాలు స్త్రీలకు ఉండవనే మూసధోరణిలో ఉంటుంది మీడియా. అలాగే టివి సీరియల్స్‌లో స్త్రీలకు 'పెళ్ళే' పరమావధి అనుకునే లక్ష్యాన్ని బలంగా చూపిస్తారు. అలాగే స్త్రీలను విలన్స్‌గా చూపించే ధోరణి రోజురోజుకు పెరుగుతుంది.

ఇంటర్నెట్ వచ్చాక పిల్లలు ఫేస్ బుక్, యూట్యూబ్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ పేజీలను ఎక్కువగా వాడుతున్నారు. పిల్లలు ఇంటర్నెట్‌లో ఏ రకమైన విషయాలను చూస్తున్నారో కనిపెట్టడం చాలా కష్టం. కంప్యూటర్‌కి ఎక్కువ సమయం కేటాయిస్తూ తల్లిదండ్రులతో, కుటుంబసభ్యులతో కలిసి సమయం గడపడం తగ్గిపోతుంది.

### 2.4.5 పనిచేసే కార్యాలయాలు

ప్రవర్తనను ప్రభావితం చేసే ఇంకొక అంశం వృత్తి, ఉద్యోగం. బాల్యంలో, యుక్త వయస్సులో నేర్చుకునే ప్రవర్తన, వృత్తి, ఉద్యోగంలో కూడా కొనసాగుతుంది. మన తల్లిదండ్రుల ప్రవర్తన, సహఉద్యోగుల ప్రవర్తనను బట్టి పనిచేసే కార్యలయాలలో మనం ప్రవర్తిస్తూ ఉంటాం. ఇక్కడ కూడా మనం స్త్రీల పట్ల వివక్ష చూపడం అలవాటు చేసుకుంటున్నాం.

పైన పేర్కొన్న వ్యవస్థలే కాక మతం, న్యాయ స్థానాలు, రాజకీయ వ్యవస్థ, రాష్ట్రం మొదలైనవి కూడా మనిషి ప్రవర్తనపై ప్రభావం చూపిస్తాయి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

3. సామాజీకరణ ప్రతినిధి వ్యవస్థలు అనగా ఏమి? సామాజీకరణ ప్రక్రియలో కుటుంబ వ్యవస్థ ప్రభావాన్ని క్లుప్తంగా వివరించండి.

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

4. సామాజీకరణ ప్రక్రియలో ప్రచార సాధనాల పాత్రని చర్చించండి.

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

## 2.5 భిన్న వర్గాల స్త్రీల అస్తిత్వం

మొదట సామాజిక శాస్త్రవేత్తల సిద్ధాంతకారులు, స్త్రీలకు ఉన్న, కేటాయింపబడిన జండర్ రోల్స్ కారణంగా స్త్రీలందరికి ఒకే విధమైన సమస్యలు, వివక్షలు ఉంటాయని భావించారు. కాలక్రమేణా స్త్రీల సమస్యల కోసం పనిచేసే వారికి, స్త్రీల సమస్యలను సామాజిక సమస్యల్లో భాగంగా అధ్యయనం చేసేవారు వివిధ కులాల, మతాల, వర్గాల, జాతుల, ప్రాంతాల స్త్రీల అస్తిత్వాల్లో తేడాలు ఉంటాయి. కాబట్టి వారు ఎదుర్కొనే వివక్షలు, అణిచివేతల్లో తేడాలుంటాయని అర్థం చేసుకున్నారు. అంటే జండర్, కులం, వర్గం, మతం, జాతి, ప్రాంతం, వైకల్యం, లైంగిక అస్తిత్వాలతో కలిసి స్త్రీల జీవితాలను పెద్ద ఎత్తున సంక్షోభానికి హక్కుల ఉల్లంఘనలోకి నెడుతుంది. కాబట్టి వీటన్నిటి మధ్య వీళ్ళ అస్తిత్వం ఎలా సామాజీకరణ చెందిందో ఆ నేపథ్యంలో వీళ్ళ సమస్యలను అర్థం చేసుకోవాలి.

### 2.5.1 ఆదివాసి మహిళలు

స్త్రీలపై జరిగే వివక్ష ఏదైనప్పటికీ అది తప్పకుండా సంస్కృతికి సంబంధించినదై వుంటుంది. ఈ నేపథ్యంలో ఆదివాసి మహిళలపై జరిగే హింసకు గిరిజన సాంప్రదాయాల ప్రకారం అర్థం చేసుకోవాల్సి వుంటుంది. ఆదివాసి మహిళలు స్త్రీలు గాను ఆదివాసీలు గాను రెండు రకాలైన వివక్షలను ఎదుర్కొంటారు.

ఆదివాసి మహిళలు రాజ్యయంత్రాంగం అలాగే ఆదివాసి సాంప్రదాయ పద్ధతులు రెండింటి వలన కష్టాలు, బాధలు అనుభవిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలలో వందల తెగలకు సంబంధించిన భిన్న సాంస్కృతిక ఆచరణలు కొనసాగుతున్నాయి. వీటన్నిటి మధ్య అంటే ఆదివాసి మహిళల లైంగికత్వం, పునరుత్పత్తి సామర్థ్యం కదలికలను కంట్రోల్ చేయడమే లక్ష్యంగా అమలవుతున్న అనేక వివక్షపూరిత ఆచారాల మధ్య వారికి జీవితాన్ని కొనసాగించవలసి వస్తుంది.

గ్లోబలైజేషన్ వలన బహుళ జాతి కంపెనీలకు ఆదివాసీ ప్రాంతాలలో గనుల త్రవ్వకం మరియు ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు నెలకొల్పడం సులభమైంది. దీంతో ఆదివాసీ ప్రజలు తమ స్వంత భూమి నుండి ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వలస వెళ్ళాల్సి వచ్చింది. వారికి కొంత నష్టపరిహారం దొరికింది కాని జీవనోపాధులు కోల్పోయారు. దీని ఫలితంగా బతుకు తెరువు కోసం పనులు వెతుక్కుంటూ కొత్త ప్రాంతాలకు కుటుంబాలతో సహా వెళ్ళాల్సి వచ్చింది. అక్షరాస్యత, నైపుణ్యాలు లేకపోవడం వలన వలస వెళ్ళిన వేల మంది ఆదివాసీ యువతులు శ్రమ దోపిడీకి ట్రాఫికింగ్‌కు గురి అయినారు. పురుషులు మధ్యపానం వ్యసనానికి బానిసలవ్వడం వలన వారి సంపాదనలో 60% డబ్బు త్రాగుడుపై వృధా అవుతుంది. ఇది తిరిగి మహిళలపై కుటుంబ హింసకు, మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుంది. ఆదివాసీ ప్రాంతాలలో వాణిజ్య పంటల వలన వారికి ఆహార భద్రత లేదు. మహిళలలో, పిల్లలలో పోషకాహారంలేమి ఎక్కువగా ఉంది. ఆరోగ్య రంగంలో మౌళిక సదుపాయాలు తక్కువగా ఉండడం, ఆసుపత్రులు దూరంగా వుండడం, తగిన రవాణా సదుపాయాలు లేకపోవడం వలన ప్రసవ సమయంలో ఆదివాసీ మహిళలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నారు.

ఒక అధ్యయనంలో భారతదేశంలో ఆదివాసీ మహిళలు ఐదు రకాలైన జండర్ ఆదారిత హింసను ఎదుర్కొంటున్నారని వెల్లడైంది. భౌతిక దాడులు, లైంగిక దోపిడి, లైంగిక వేధింపులు, బలవంతంగా గర్భనిరోధక ఆపరేషన్లను చేయించడం (Forced sterilization) మరియు బాలికలపై వేధింపులు.

పై అంశాల ద్వారా వివక్షపూరిత ఆధారాలు మరియు అనేక రకాల జండర్ ఆధారిత హింసల మధ్య ఆదివాసీ మహిళలు మనుగడను, అస్తిత్వాన్ని కొనసాగిస్తారని అర్థం చేసుకోవాల్సి వస్తుంది.

### 2.5.2 వికలాంగ మహిళలు

మన సమాజంలో సాధారణ మహిళలు స్త్రీలుగాను, పేదలుగాను రెండు రకాల వివక్షలను ఎదుర్కొంటుండగా వికలాంగ మహిళలపై రెండింటితో పాటు వైకల్యం తోడై మూడు రకాల వివక్షలను అనుభవిస్తున్నారు. కుటుంబాల్లో వికలాంగులైన ఆడపిల్లలు ఉంటే వారి ఉనికిని తల్లిదండ్రులు బయటపెట్టరు. అలాగే మన దేశంలో వివిధ రకాల వైకల్యంతో ఉన్న బాలికలు, మహిళలు ఎంత మంది ఉన్నారనే గణాంకాలు లేవు. వికలాంగ బాలికలకు విద్య అందుబాటులోను, దాన్ని కొనసాగించడంలోను చాలా అవరోధాలు ఉన్నాయి. మొదటి అవరోధం కుటుంబం నుండే ఉంటుంది. వికలాంగ బాలికలకు చదువుపై పెట్టుబడి పెట్టాలా? వద్దా? అనే ప్రశ్న వస్తుంది. ఉన్న వనరులతో మిగిలిన సంతానాన్ని చదివించుకోవచ్చు అనే అభిప్రాయంతో ఉంటారు. రెండవ అవరోధం అందుబాటులో లేని రవాణా సౌకర్యం, స్కూలుకు చేరడానికి భద్రతతో కూడిన ప్రయాణం అందుబాటులో లేకపోవడం, స్కూలులో అవరోధాలు, వికలాంగులకు స్పెషల్ టీచర్లు లేకపోవడం, మౌలిక సదుపాయాలు లేకపోవడం, అనుకూలమైన మరుగుదొడ్లు లేకపోవడం వంటివి చదువుకు ఆటంకాలుగా నిలుస్తున్నాయి.

మేధోపరమైన వైకల్యం, మాటవినికిడి లోపం ఉన్న మహిళలపై ఎక్కువగా లైంగిక దాడులు జరుగుతున్నాయి. వీరికి న్యాయం అందడం లేదు. వికలాంగ మహిళలకు 'చట్టం ముందు సమానత్వం' అనే హక్కును అందుకోవడానికి న్యాయవ్యవస్థ ముఖ్య అడ్డంకిగా నిలుస్తుంది. వీరికి న్యాయస్థానాలు చేరుకోవడానికి భౌతిక వాతావరణంలో అనేక అడ్డంకులు ఉన్నాయి. చిన్న ఫ్యామిలీ కోర్టులు దేశంలో ఇంకా చాలా చోట్ల న్యాయస్థానాలు ప్రవేశానికి అనుకూలంగా లేవని వికలాంగ మహిళలు ఫిర్యాదు చేశారు. మాట వినికిడి లోపం కల్గిన మహిళలకు సైగల భాషలో నిపుణులు లేకపోవడం, అంధులైన మహిళలకు ప్రత్యామ్నాయ రూపంలో సమాచారం కొరవడటం వలన వీరికి న్యాయం అందుబాటులో ఉండటం లేదు.

వికలాంగ మహిళలకు న్యాయవ్యవస్థ అందుబాటులో లేకపోతే వారు హక్కుల నుండి మినహాయింపబడతారు. వారి సాక్ష్యాలు నమోదు చేయబడవు. సామాజిక మానసిక (సైకోసోషల్) వికలాంగులయితే వారి మాటలను నమ్మశక్యం కానివిగా చూస్తారు. అలాగే మేధోపరమైన వైకల్యం కల్గిన మహిళలను శ్రద్ధా సంరక్షణ పేరుతో వారిని మానసిక చికిత్సాలయాలలో చేర్చి బలవంతంగా షాక్ ట్రీట్మెంట్ ఇప్పించడం జరుగుతుంది. వాళ్ళ అనుమతులు లేకుండా 'గర్భాలను' తీయించడం ద్వారా వారి పునరుత్పత్తి హక్కులకు భంగం వాటిల్లుతుంది.

వికలాంగులైన మహిళలు అనేక రకాల వైకల్యాలు, లోపాలతో జీవిస్తున్నారు. అలాగే ఆ లోపాల వల్ల సమాజంలోని మిగిలిన వ్యక్తులతో సమానంగా సంపూర్ణమైన ఫలవంతమైన భాగస్వామ్యాన్ని పొందకుండా అనేక విధాలైన ఆటంకాలతో ఆపబడుతున్నారు. అంటే 'వైకల్యం' అనేది అడ్డంకి కాదు. భౌతిక వాతావరణం, ప్రయాణ సాధనాలు అనుకూలంగా లేకపోవడం, సమాచార కమ్యూనికేషన్లు, కమ్యూనికేషన్ టెక్నాలజీ పద్ధతులు, ఇతర సదుపాయాలు, సేవలు అందుబాటులో లేకపోవడం వలన సమాజంలోని అన్ని రంగాలలో సమానంగా భాగస్వామ్యం వహించలేకపోతున్నారు. రెండోది ఈ అవరోధాలతో పాటు సామాజికంగా, సాంస్కృతికంగా వివక్ష అణచివేత, వల్ల హింసను ఎదుర్కొంటున్నారు.

పై రెండు కారణాలతో పాటు వైకల్యాన్ని భిన్నత్వంగా గుర్తించక పోవడం, వారికి తగిన సదుపాయాలు కల్పించి గౌరవించకపోవటం వలన ఈ రోజు వారి అస్తిత్వం ప్రమాదంలో పడింది అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

5. భిన్న అస్తిత్వం అనగా ఏమి? ఆదివాసి మహిళలు ఎదుర్కొనే వివక్షను చర్చించండి.

----------------------------------------------------------------------------------------------------------------

----------------------------------------------------------------------------------------------------------------

----------------------------------------------------------------------------------------------------------------

6. వికలాంగ మహిళలు ఎదుర్కొనే కష్టాలు, వివక్షను తెలపండి.

----------------------------------------------------------------------------------------------------------------

----------------------------------------------------------------------------------------------------------------

----------------------------------------------------------------------------------------------------------------

## 2.6 సారాంశం

ఈ భాగంలో స్త్రీ, పురుషులుగా పెరిగే క్రమంలో సమాజం వారికి ఆపాదించే విలువలను గూర్చి తెలుసుకున్నాం. సామాజీకరణలో కుటుంబం, విద్యా వ్యవస్థలు, సహచర బృందం మొదలైన వ్యవస్థల ప్రభావం పరిశీలించాం. కుల, మత, వర్గ, భిన్న అస్తిత్వాలు ఎలా ఏర్పడతాయో, వాటివలన మహిళలు ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటారో కూడా ఈ భాగంలో వివరించాము.

## 2.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. స్త్రీ పురుషులుగా పెరగడం కుటుంబ వ్యవస్థలోనే మొదలవుతుంది. ఆడపిల్ల అంటే అణుకువగా ఉండాలి. శాంతంగా, సహనంగా, సున్నితంగా, నాజూకుగా ఉండాలి. సిగ్గు, బిడియం, మర్యాద ఉండాలి. వంట, ఇంటి పనిని చక్కగా నేర్చుకోవాలి. తల్లిదండ్రుల పట్ల, కుటుంబం పట్ల భాద్యతగా వుండాలి. ఇంటి సంరక్షణ, వృద్ధుల ఆలనా పాలనా చూసుకోవాలి. సున్నితమైన మనసుతో చిన్న విషయానికి కూడా కన్నీరు పెట్టుకోవాలి. దయ, క్షమా, సహనం, మాతృత్వం వంటి లక్షణాలతో త్యాగ బుద్ధి కలిగి వుండాలి. పిరికిగా ప్రతి దాని గురించి భయంతో ఆలోచించాలి. అదే మగపిల్లవాడు అయితే - బలంగా, ధృడంగా, ఆరోగ్యంగా ఉండాలి. బయటకు వెళ్ళాలి. స్వేచ్ఛగా, ధైర్యంగా వుండాలి. ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్ళవచ్చు - తిరిగి రావచ్చు. బాగా చదువుకోవాలి. పోటీతత్వం, స్వార్థం కలిగి

వుండాలి. కుటుంబాన్ని పోషించాలి కాబట్టి, మంచి తిండి, బట్టలు, మంచి కాలేజీల్లో పెద్ద పెద్ద చదువులు వుండాలి. ఆడవాళ్ళ మీద బలహీనుల మీద పెత్తనం చెలాయించడం, అధికారాన్ని ప్రదర్శించడం పురుష లక్షణం అని చెప్తారు.

2. సామాజీకరణ అన్నది నాలుగు ప్రక్రియల ద్వారా జరుగుతుంది. అవి (a) మానిప్యులేషన్ (b) కానలైజేషన్ (c) వేర్బల్ అప్పెలేషన్ (d) ఆక్టివిటీ ఎక్స్‌పోజర్. మానిప్యులేషన్ ఆడ, మగ పిల్లలు ఏ లక్షణాలతో పెరుగుతున్నారు అనే విషయానికి సంబంధించిన ప్రక్రియ. అమ్మాయిలు, అబ్బాయిలు కొన్ని వస్తువులు, రంగులు, ఆకారాలను తమకు సంబంధించినవిగా భావించే ప్రక్రియను కానలైజేషన్ అంటారు. వెర్బల్ అప్పెలేషన్ అనే ప్రక్రియ మనం ఆడ, మగ వారితో మాట్లాడే విధానానికి సంబంధించినది. సామాజీకరణలో నాలుగవ ప్రక్రియ ఆక్టివిటీ ఎక్స్‌పోజర్ లేదా కార్యకలాపాలకు స్పందన. స్త్రీ, పురుషులు నిర్వహించే కార్యకలాపాలను తెలిపే ప్రక్రియ ఇది.

3. సామాజీకరణ ప్రక్రియలో సమాజం ముఖ్యమైన ప్రతినిధి వ్యవస్థగా పనిచేస్తుంది. సమాజంలో ప్రతి వ్యక్తి, విభిన్న సంస్థలు, విలువలని, సంప్రదాయాలని పంచడంలో, వ్యాప్తి చేయడంలో ముఖ్య పాత్ర వహిస్తాయి. వీటినే సామాజీకరణ ప్రతినిధి వ్యవస్థలు అంటాం. కుటుంబం, విద్యావ్యవస్థ, సహచరుల బృందం, ప్రచార సాధనాలు మొదలైనది ముఖ్యమైన ప్రతినిధి వ్యవస్థలు. కుటుంబ వ్యవస్థ జండర్ విధానాన్ని బలంగా అమలు చేస్తుంది. దీనిలో పురుషుడే కుటుంబ పెద్దగా వుంటారు. ఆడవాళ్ళను, ఆడపిల్లలను వారి ప్రతి కదలికలను కంట్రోల్ చేస్తూ వుంటాడు. పురుషుడు గొప్పవాడిగా, ఆధిపత్యం చేయించేవాడుగా, స్త్రీ తక్కువదిగా, లొంగి ఉండేదిగా జీవించే ఒక అధికార విధానం ఇక్కడే ఈ కుటుంబంలోనే ఏర్పడి వుంటుంది. రాబోయే తరాలకు పితృస్వామిక విలువలలో సాంఘిక శిక్షణ ఇచ్చేదిగా కూడా కుటుంబం ముఖ్య పాత్రను వహిస్తుంది.

4. ప్రచార సాధనాలు - రేడియో, టివి మొదలగునవి వ్యక్తిత్వం రూపొందించడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. గత కొన్ని సంవత్సరాలలో సామాజీకరణలో ప్రచార సాధనాల పాత్ర అధికంగా కనిపిస్తుంది. ప్రచారసాధనాలు అన్నీ కూడా స్త్రీలను తక్కువ హోదా కల్గిన వారిగా చిత్రీకరిస్తూ సాంస్కృతిక మూస పాత్రలను కొనసాగిస్తున్నారు. మాస్ మీడియా, స్త్రీలను / బాలికలను వినియోగ వస్తువులుగా, పురుషులను నిర్ణయాలు తీసుకునేవారిగా వారి ఇమేజ్ ను బలంగా నిలబెడుతుంది. ఉదా: స్త్రీలు టెలివిజన్‌కు సంబంధించిన వివిధ విభాగాల్లో కనిపిస్తుంటారు. న్యూస్ రిపోర్టర్, ప్రెజెంటర్స్, యాంకర్లు, యాక్టర్స్, డాన్సర్స్ మరియు సింగర్స్‌గా కన్పిస్తుంటారు. అయితే స్త్రీలకు సంబంధించిన విషయాలు కానట్లయితే వర్తమాన రాజకీయాలు లేదా ఆర్థిక పాలసీల వంటి సీరియస్ విషయాలపై అభిప్రాయం వెల్లడించేందుకు మహిళలను చాలా అరుదుగా మాత్రమే ఆహ్వానిస్తారు. ఆయా అంశాలపై అభిప్రాయాలు చెప్పేటంతగా నైపుణ్యాలు, ఆలోచనలు, భావాలు స్త్రీలకూ ఉండవనే మూసధోరణిలో ఉంటుంది మీడియా.

5. వివిధ కులాల, మతాల, వర్గాల, జాతుల, ప్రాంతాల స్త్రీల అస్తిత్వాల్లో తేడాలు ఉంటాయి. కాబట్టి వారు ఎదుర్కొనే వివక్షలు, అణిచివేతల్లో తేడాలుంటాయని అర్థం చేసుకున్నారు. గ్లోబలైజేషన్ వలన ఆదివాసీ ప్రజలు తమ స్వంత భూమి నుండి ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వలస వెళ్ళాల్సి వచ్చింది. అక్షరాస్యత, నైపుణ్యాలు లేకపోవడం వలన వలస వెళ్ళిన వేలమంది ఆదివాసీ యువతులు శ్రమ దోపిడీకి, ట్రాఫికింగ్‌కు గురైనారు. పురుషులు మధ్యపానం వ్యసనానికి బానిసలవ్వడం వలన మహిళలు కుటుంబ హింసకు, మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీసింది. మహిళలలో, పిల్లలలో పోషకాహారలేమి, ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు తక్కువగా వుండటం, ఆసుపత్రులు దూరంగా వుండటం, తగిన రవాణా సదుపాయాలు లేకపోవడం వలన ప్రసవ సమయంలో ఆదివాసీ మహిళలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నారు. భౌతిక దాడులు, లైంగిక దోపిడీ, లైంగిక వేదింపులు, బలవంతంగా గర్భ నిరోధక ఆపరేషన్లు చేయించడం (Forced sterilization) మరియు బాలికలు వేధింపులకు గురి అవుతున్నారు.

6. మన సమాజంలో సాధారణ మహిళలు స్త్రీలుగాను, పేదలుగాను రెండు రకాల వివక్షలను ఎదుర్కొంటుండగా వికలాంగ మహిళలపై రెండింటితో పాటు వైకల్యం తోడై మూడు రకాల వివక్షలను అనుభవిస్తున్నారు. తల్లిదండ్రులు వికలాంగ పిల్లల్ని చదివించడం వృథా ఖర్చుగా భావిస్తారు. అందువలన వారికి విద్యావకాశాలు తక్కువ. రెండవ అవరోధం అందుబాటులో లేని రవాణా సౌకర్యం స్కూలుకు చేరడానికి భద్రతతో కూడిన ప్రయాణం అందుబాటులో లేకపోవటం, స్కూల్లో అవరోధాలు వికలాంగులకు స్పెషల్ టీచర్లు లేకపోవటం, మౌలిక సదుపాయాలు లేకపోవడం, అనుకూలమైన మరుగుదొడ్లు లేకపోవడం వంటివి చదువుకు ఆటంకాలుగా నిలుస్తున్నాయి.

మేథపరమైన వైకల్యం, మాటవినికిడి లోపం వున్న మహిళలపై ఎక్కువగా లైంగిక దాడులు జరుగుతున్నాయి. వీరికి న్యాయం అందడం లేదు. వికలాంగ మహిళలకు 'చట్టం ముందు సమానత్వం' అనే హక్కును అందుకోవడానికి న్యాయవ్యవస్థ ముఖ్య అడ్డంకిగా నిలుస్తోంది.

## 2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

(I) **ఈ కింది వాటికి ఒక్కొక్కదానికి 30 పంక్తులలో సమాధానం ఇవ్వండి.**

1. స్త్రీ పురుషులుగా పెరిగే క్రమంలో జరిగే వివక్షని గూర్చి ఒక వ్యాసం రాయండి.
2. సామాజీకరణ అనగా ఏమి? సామాజీకరణ ప్రక్రియని వివరిస్తూ జండర్‌పై దాని ప్రభావాన్ని చర్చించండి.

(II) **కింది ప్రశ్నలకు 15 లైన్లలో సమాధానం ఇవ్వండి.**

1. జండర్ మూస పాత్రలు
2. వికలాంగ మహిళలు ఎదుర్కొనే వివక్ష
3. సామాజీకరణలో కుటుంబ వ్యవస్థ పాత్ర
4. భిన్న అస్తిత్వం

## 2.9 ముఖ్య పదాల అర్థ వివరణ

| | | |
|---|---|---|
| పితృస్వామ్యం | : | మగవారి ఆధిపత్యాన్ని అమలుచేసే వ్యవస్థ |
| సామాజీకరణ | : | సమాజానికి అనుకూలంగా ప్రవర్తించడం - సమాజంలో భాగమై మార్పులను గమనిస్తూ ప్రవర్తించడం. |
| భిన్న అస్తిత్వం | : | రకరకాల అస్తిత్వాలు |

## 2.10 ఆధారిత గ్రంధాలు

ఐక్యరాజ్యసమితి వివక్ష నిర్మూలనకు ఒప్పందం, యు. ఎం; సీ.యి.డి. ఏ. డబ్లు. బుక్లెట్, హైదరాబాద్; అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్, 2003.

భారతదేశంలో వికలాంగ మహిళలు (4,3 వ సీ.యి.డి. ఏ. డబ్లు. ఆల్టర్ నేటివ్ రిపోర్ట్ - ఇండియా) హైదరాబాద్; యూరోపియన్ యూనియన్ ఆర్థిక సహాయం. అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్, లియోనార్డ్ చైల్డ్ వికలాంగత్వం, 2015.

భాసిన్. కే. జండర్ అవగాహన, న్యూఢిల్లీ ; విమెన్ అం. లిమిటెడ్, 2003.

కాన్నాబిరాన్, వసంత, మానవహక్కులు - మహిళల హక్కులు, ఆచారాలు, అపచారాలు, జన్డర్, మానవ హక్కులపై వ్యాసం, హైదరాబాద్: అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్, 2004.

నేషనల్ అలయన్స్ ఆఫ్ విమెన్, ఇండియా. 2వ మరియు 3వ NGO ఆల్టర్ నేటివ్ రిపోర్ట్, సీ.యి.డి. ఏ. డబ్లు. సహకారం: UNIFEM సౌత్ ఆసియా ఆఫీసు, ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్: IWRAW - ఆసియా పసిఫిక్, 2006.

వోల్గా కుటుంబ వ్యవస్థ, మార్క్సిసం, ఫెమినిజం, ఫెమినిజం సిద్ధాంతంపై వ్యాసాలు, హైదరాబాద్: స్వేచ్ఛ పబ్లికేషన్స్, 2004.

# భాగం - 3 : జండర్ - పని

విషయ క్రమం


3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 పని, న్యాయం

3.3 సంఘటిత, అసంఘటిత రంగాలు

3.4 జండర్ ఆధారంగా పని విభజన

3.5 స్త్రీలు, పని

3.5.1 ఇంటి సంరక్షణ

3.5.2 ఇంటి ఆధారిత పని

3.5.3 అస్తిత్వాల వైరుధ్యం

3.6 సారాంశం

3.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

3.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

3.9 ముఖ్య పదాల అర్థ వివరణ

3.10 ఆధారిత గ్రంథాలు


## 3.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ కింది విషయాలను గ్రహించగలుగుతారు.

- జండర్, పనికి మధ్య గల సంబంధం
- జండర్ ఆధారంగా పనిని విభజించడం, వెలకట్టడం
- జండర్ ఆధారంగా పని స్వభావం, హోదా

## 3.1 పరిచయం

ఒక ఫలితాన్ని సాధించడానికి మనం చేసే మానసిక, శారీరక ప్రయత్నాన్నే పని అంటారు. ఈ ఫలితం ఒక పని నుంచి వచ్చిన ఉత్పత్తి రూపంలో కాని, కార్మికులు లేదా పనివారు సంపాదించిన కూలీ కాని అయి ఉండవచ్చు. అదే విధంగా కూలీ అంటే శారీరక శ్రమతో కూడుకున్నది. శారీరక శ్రమ భౌతికమైనది. వృత్తి, పని, కూలీ ఏదైనా జీవనం కోసమే చేస్తారు.

పని ప్రతి వ్యక్తి జీవితంలో ఒక భాగం. మనకోసమా, ఇతరుల కోసమా అని కాకుండా ప్రతి ఒక్కరూ వారి మనుగడ కోసం, జీవిక కోసం పని చేస్తూ వుంటారు. ఇంట్లోకాని, బయటకాని మనం చేసే పని శారీరక శ్రమే. ఒక ఆలోచనతో, అంకిత భావంతో మన శక్తిని, యుక్తిని ఉపయోగించి చేసేదే పని.

కొంతమంది ఒకే కాలంలో అనేక పనులు చేయగలుగుతారు. మరికొంత మంది వివిధ రకాల పనులు ఏక కాలంలో చేయాలనుకుంటారు. అయితే, ఇవన్నీ వారు వారికోసం, అదనపు సంపాదన కోసమైనా అయుండవచ్చు. ఇతరులు వారిపై ఉంచిన అంచనాలు అందుకోవడం కోసమైనా కావచ్చు.

పని చేసే అవకాశం, పని దొరికే అవకాశం ఈ పని వీరికే కేటాయించడం అనే వాటికి వివిధ కారణాలుంటాయి. వ్యక్తుల వ్యక్తిగత నైపుణ్యం, సామర్థ్యం, అవసరాలకు అనుగుణంగా పని లభ్యత, పనుల కేటాయింపు ఆధారపడి వుంటాయి. అయితే దాదాపు అన్ని సందర్భాలలో వ్యక్తుల ఆసక్తిని బట్టి మాత్రమే ఏ పని ఎవరు చేయాలనేది నిర్ణయించబడుతుంది. ఉదాహరణకు భారతదేశం లాంటి దేశంలో వ్యక్తుల సామాజిక స్థాయిని బట్టి వారి వృత్తి నిర్ణయమవుతుంది. వృత్తి అనేది పనికి మరొక రూపం మాత్రమే.

వ్యక్తులు చేసే పని వారి జండర్‌పై ఆధారపడి ఉంటుందా? ఈ పని మగవారికా, ఆడవారికా అని నిర్ణయించవచ్చా? జండర్ వ్యక్తుల పనిని ఎలా నిర్ధారిస్తుంది? సంఘటిత, అసంఘటిత రంగాలు సాంప్రదాయ, అధునాతన ఉద్యోగాలు ఏ విధంగా ఒకదానిపై ఒకటి పోటీ పడతాయి? కలిసిపోతాయి.

## 3.2 పని, న్యాయం

1947లో భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించాక పని గురించి, పనివాళ్ళ గురించి ఎన్నో చట్టాలను రూపొందించింది. 1948 (1948 లోని 11 వ చట్టం) మార్చ్ 15 న పనికి కనీస వేతన చట్టాన్ని రూపొందించింది. కొన్ని ఉద్యోగాల్లో కార్మికుల కనీస వేతనాన్ని నిర్దేశించడం ఈ చట్టం లక్ష్యం. దాని తరువాత 1976 లో మరో ముఖ్యమైన చట్టం. 'సమాన వేతన చట్టం' అమల్లోకి వచ్చింది. లింగ వివక్ష లేకుండా ఒక పనికి ఒకే రకమైన వేతనాన్ని అందించడం ఈ చట్టం లక్ష్యం. పదిహేను లేదా అంతకన్నా తక్కువ వయస్సున్న పిల్లలను కొన్ని రకాల పనుల్లో నియమించుకోవడాన్ని నిషేదిస్తూ 1986 లో బాలకార్మికుల (నియంత్రణ నిర్మూలన) చట్టం అమలులోకి వచ్చింది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఈ చట్టాలను కార్మికుల హక్కులను కాపాడే విధంగా, కార్మికులు ఎలాంటి శ్రమ దోపిడీకి గురికాకుండా ఉండేందుకు వీలుగా ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ మరింత పదునుగా ఈ చట్టాలను రూపొందించారు.

అలాగే ఇంకా కొన్ని చట్టాలు వచ్చాయి. పని, పరిస్థితులు, అవసరమైన సదుపాయాలు, ఆరోగ్యం, భద్రత మొదలైన వాటి గురించి ఆలోచిస్తూ చట్టాలు రూపొందించారు.

పని చేసే చోట మనం మన పని గంటల కన్నా ఎక్కువ సమయం పని చేస్తే ఎక్కువ వేతనాన్ని చెల్లించేటట్లు నిర్ణయం జరిగింది.

పనిని గుర్తించాలి, వేతనం ఇవ్వాలి. పని చేసేవారికి ఒక హోదాను కల్పించాలి. ఇంతే కాదు కార్మికులకు అదనంగా ఇవ్వవలసిన ప్రయోజనాలు కూడా కొన్ని ఉన్నాయి. అవి భవిష్యనిధి (ప్రావిడెంట్ ఫండ్), జీవిత భీమా, వారాంతపు సెలవులు.

శ్రమను గౌరవించడం వల్లే ఈ చట్టాలన్నీ వచ్చాయి. శ్రమకు తగిన వేతనంతో పాటుగా శ్రమ దోపిడీ జరగకుండా శ్రమికులకు రక్షణ కల్పించడం కూడా ఇందులో భాగమే.

తరతరాల నుండి వస్తున్న వెట్టి చాకిరీ పద్ధతిని ఖండిస్తూ వచ్చినవి చట్టాలేనన్న విషయం మరిచిపోకూడదు. ఈ చర్యలు లేదా ఈ సదుపాయాలన్నీ శ్రామికులకు ఏదో సహాయం చేయడం కోసం వచ్చినవి కాదు. ఇవన్నీ శ్రామికుడి ప్రాథమిక హక్కులు : ఇవన్నీ చెప్పుకున్న తరువాత ఒకసారి ఇంట్లో స్త్రీలు చేసే పనిని గురించి ఆలోచించండి.

పని చేసేవారికి వారి ఉద్యోగం లోనో, కార్మికులకు వారి పరిశ్రమలోనో ఉన్నన్ని హక్కులు ఇంట్లో పని చేసే స్త్రీలు పొందుతున్నారా?

కనీస వేతనం, సెలవులు, సెలవు పెట్టుకునే అవకాశం, ఆరోగ్యవంతమైన, భాద్యతాయుతమైన పరిస్థితులు స్త్రీలకు ఉన్నాయా? వాళ్ళ పనిని ఏ విధంగా చూస్తున్నాము? వారి పనిని మనమే అంచనా వేస్తున్నామా? వారి పనికి గుర్తింపు ఇస్తున్నామా?

మొట్టమొదటిసారిగా 2012 లో తీర్మానించబడిన ఒక చట్టం ఈ అంశాలను లేవనెత్తింది. స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఇంట్లో ఉండే స్త్రీల సాంఘిక, ఆర్థిక స్వావలంభన కోసం ఈ చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం ఇంటి పని కూడా ఆర్థిక కార్యకలాపాలలో ఒకటి అనే విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పింది.

ఇంటి పని అనగానే అది స్త్రీల పనిగానే మనం ఎందుకు గుర్తిస్తున్నామనేది ఇప్పుడు చర్చించాల్సిన అవసరముంది. పురుషులు ఇంట్లో పని చేయరా? అతడు చేసే పని కాదా అది. ఇంటా, బయటా పని చేస్తున్న స్త్రీల పరిస్థితి ఏంటి? వారు చేసే పనికి కొలమానం ఏమిటి? దేనితో కొలుస్తున్నాము. ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే.

మళ్ళీ పని గంటల వద్దకు వస్తే కార్మికులు, ఉద్యోగస్తులు బయట చేసే పనికి పని గంటలు నిర్థేశించినట్లుగా గృహిణులు, స్త్రీలు ఇంట్లో ఎన్ని గంటలు పని చేయాలి. అలాగే ఇంటా, బయట పని చేసే స్త్రీలకు ఎన్ని గంటలు వుండాలి?

ఇప్పటిదాకా మనం చెప్పుకున్నట్లు బాల కార్మిక చట్టం అతి చిన్న వయస్సు నుంచే ఇంటి బాధ్యత చేపట్టిన ఆడపిల్లలకు వర్తించదా? కార్మికుల కోసం, ఉద్యోగస్తుల కోసం మొత్తంగా పని చేసే వారి కోసం రూపొందించబడిన చట్టాలు, పథకాలు, ఇంట్లో పనిచేసే స్త్రీలకూ వర్తిస్తాయా? వర్తించవా? అనే ప్రశ్నలు ఉదయించాయి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

1. స్త్రీలు చేసే ఇంటి పనిని క్రమబద్ధీకరించడానికి ఏవైనా ప్రయత్నాలు జరుగుతున్నాయా? వాటి ఉద్ధేశ్యమేమి?

---

---

---

## 3.3 సంఘటిత, అసంఘటిత రంగాలు

పనిచేసే చోటుని సాంప్రదాయ, సాంప్రదాయేతర రంగాలు లేదా సంఘటిత, అసంఘటిత రంగాలు అని రెండు రకాలుగా విభజించారు.

అసంఘటిత రంగంలో ఉద్యోగుల నియమాలు, నిబంధనలు, స్థిరంగా, క్రమబద్ధంగా ఉంటాయి. అలాగే పని చేసేవారికి ఖచ్చితమైన పని దొరుకుతుంది.

అసంఘటిత రంగంలో ఈ వెసులుబాటు ఉండదు. అసంఘటిత రంగంలోని సంస్థలకు ప్రభుత్వ గుర్తింపు ఉండదు. అలాగే వస్తువులను, సేవలను అందించే లక్ష్యంతో ఉద్యోగుల కల్పనతో అలాగే కొంత మందికి ఆదాయ వనరులు కల్పించే లక్ష్యంతో ఏర్పడే సంస్థలను సాంప్రదాయేతర సంస్థలుగా అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచించింది. ఇలాంటి సంస్థల్లో పని ఒప్పందాలు, కనీస ఉద్యోగ రక్షణ లాంటి నిబందనలేవి ఉండవు.

తాత్కాలిక ఉద్యోగులు లేదా కుటుంబ సభ్యులు, లేదా పరిచయస్తులు ఇలాంటి సంస్థల్లో ఎక్కువగా పని చేస్తారు. (NCEUS) నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్ ఇన్ ది అన్ అర్గనైజెడ్ సెక్టర్స్, సంఘటిత, అసంఘటిత రంగాల మధ్య ప్రధానమైన తేడాను ఈ విధంగా నిర్ధేశించింది.

అసంఘటిత సంస్థల్లో పనిచేసే వాళ్ళు, ఇళ్ళలో, పనిచేసే వాళ్ళు, సామాజిక సెక్షన్ పరిధిలో రానివారు, యాజమాన్యాలు కల్పించే ఎలాంటి ఉద్యోగ రక్షణ లేనివారు అసంఘటిత కార్మికులుగా (NCEUS) గుర్తించింది. ఎన్.సి.యు.ఎస్. ఈ సంస్థలను లైసెన్స్‌రహిత, స్వయం ఉపాధి, నమోదు చేయడానికి సంస్థలుగా పరిగణిస్తారు. చేనేత, కంసాలి, కుమ్మరి తదితర కుల వృత్తులు ఈ విభాగంలోకి వస్తాయి. వ్యవసాయ రంగాన్ని మినహాయిస్తే, నిర్మాణ రంగంలో 76 శాతం వ్యాపార రంగంలో 72 శాతం అసంఘటిత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. పట్టణాలలో పనిచేసే అసంఘటిత కార్మికుల్లో 25 శాతం మంది ఇళ్ళలో పనిచేసే వారు, వీధి వ్యాపారులు, చెత్త ఏరుకునేవారు, ఇళ్ళలో వివిధ పనుల మీద ఆధారపడేవారు.

భారతదేశంలో కనీసం 90 శాతం మంది పనివారు సాంప్రదాయేతర ఆర్థిక రంగానికి చెందిన వారు తద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. మహిళా కార్మికులలో 90 శాతానికి పైగా అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. పని వేళలు అనుకూలంగా ఉండటం వల్ల ఎక్కువమంది మహిళలు ఈ పనిని ఎన్నుకున్నారని అనుకోవచ్చు. దీనికి తోడు మహిళలకు కూలీ తక్కువ ఇవ్వవచ్చు అనే అభిప్రాయం వల్ల అసంఘటిత రంగ యాజమాన్యాలు మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి.

అసంఘటిత రంగంలో ఆర్థిక భద్రత, చట్టపరమైన రక్షణ, న్యాయబద్ధమైన కూలీ, కార్మికులకు హక్కులు వంటి వాటికి అవకాశాలు చాలా తక్కువ. కార్మిక చట్టాలు ఈ రంగ కార్మికులకు అందుబాటులో ఉండకపోవడం వల్ల వీరు ఇబ్బందికర పరిస్థితులలోనే ఉంటారు. మరీ ఎక్కువగా మహిళా కార్మికులు ఒకవైపు ఇంటిపనులు చక్కపెట్టుకుంటూ మరోవైపు ఉద్యోగం చేయాల్సి వస్తుంది. వీటికి తోడు పురుషుల, స్త్రీలను తేడాగా చూసే ధోరణి, పురుషుల కన్నా తక్కువ జీతం ఇచ్చే ఆనవాయితీల వల్ల అసంఘటిత రంగంలో మహిళా కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

2. అసంఘటిత రంగంలో మహిళలు ఎక్కువగా పనిచేయడానికి కారణాలేంటి?

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

## 3.4 జండర్ ఆధారంగా పని విభజన

పనికి జండర్ ఉంటుందా? ఆడవారి పని, మగవారి పని అని విభజించవచ్చా? పనిని ఏ ప్రాతిపదికన విభజిస్తారు? ఎవరు విభజిస్తారు? జండర్ ఆధారంగా పనిని విభజించడమే కాకుండా ఎవరికి ఏ పని కేటాయించాలనేది ఎవరు నిర్ణయిస్తారు?

పని విధానం, పని వల్ల వచ్చే ఫలితాన్ని అర్థం చేసుకోవాలంటే ఇంటి పని, బయట పని అనే రెండు విషయాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది.

వయో తారతమ్యాలు కలిగిన, సంపాదన సామర్థ్యాలు కలిగిన పురుషులు, స్త్రీలు, పిల్లలు, ఇంటి పనుల్లో భాగస్వాములుగా ఉంటారు. ఈ రకంగా ఇంటిపనులు కుటుంబ వ్యవస్థకు అద్దం పడతాయి. కుటుంబంతో పాటుగా కుటుంబంలోని చిన్నా, పెద్ద తారతమ్యాలే ఇంటిలో ఎవరు ఏ పని చేయాలి? ఏ పని చేయకూడదో నిర్ధేశిస్తాయి. ఇందులోంచి పుట్టిందే ఇల్లాలు, గృహిణి, హోమ్మేకర్, ఇంటి పనిని చక్కపెట్టే స్త్రీ మొదలైనవి.

మన ముందు తరాల్లో బయటికి పనులకు వెళ్ళని పెళ్ళైన స్త్రీలను గృహిణిగా మాత్రమే గుర్తించేవారు. ఇప్పుడు పెళ్ళైన స్త్రీ తన ఇంటికోసం పడే శ్రమను గుర్తించేందుకు వీలుగా హోమ్ మేకర్ అని అంటున్నారు. హోమ్ మేకర్ అనే పదంలోనే తాము నివసించే స్థలాన్ని ఒక ఇల్లుగా మార్చగల సామర్థ్యమున్న స్త్రీగా అర్థమవుతుంది. నివసించే చోటు సర్వహక్కులు పురుషునికి మాత్రమే ఉన్నాయి. ఆ నివసించే చోటును ఇంటిగా మార్చే బాధ్యతను మాత్రం స్త్రీలే నిర్వహిస్తారు. ఇక్కడ మీరు ఒక తేడాను గమనించారా?

పురుషుడు ఆ ఇంటికి యజమాని సర్వహక్కులు అతనివే. అన్ని బాధ్యతలు తనపై వేసుకొని స్త్రీలు దాన్ని ఇల్లుగా మార్చగలరు. హక్కులకు, బాధ్యతలకు మధ్య తేడాను మీరు గమనించారా? ఇప్పటివరకు మనం తెలుసుకున్న దాని ప్రకారం చూస్తే ఎవరు హక్కులు కలిగి ఉన్నారు? ఎవరు బాధ్యత వహిస్తున్నారు?

ఇంకో ఆసక్తికరమైన అంశమేమిటంటే, పనిచేసే చోట లేదా ఉద్యోగంలో పనిచేసే వాళ్ళకు హక్కులున్నాయి. వాటిని అమలుచేయించే సంఘాలు (unions) ఉన్నాయి. కానీ తన ఇంటిని తీర్చిదిద్దే స్త్రీలకు మాత్రం ఏ హక్కులు లేవు.

స్త్రీలకు భాద్యతలు, భావావేశాలతో కూడిన బంధాలు, తనకోసం ఎదురుచూసే పనులు తప్ప వేరే హక్కులు లేవు. 'ఒక రాజకీయ కథ' లో ప్రముఖ రచయిత్రి ఓల్గా ఈ ప్రశ్నలనే లేవనెత్తారు. "భార్య" పదవి అనేది ఒక ఉద్యోగం ఎందుకు కాదు? భార్య భర్తల సంబంధం యజమాని, సేవకుడు సంబంధం అయినప్పుడు భార్య పదవి కూడా ఒక ఉద్యోగమే! అంటారు. రచయిత్రి ఓల్గా ఆ కథలో ప్రశ్నే కాదు సమాధానం కూడా చెప్పారు.

ఆ కథలో రచయిత్రి ఒక స్త్రీని, కార్మికుడైన ఆమె భర్త పరిస్థితిని పోలుస్తుంది. భర్తకు పనిచేసే చోట హక్కులు ఉండటం ఆమెకు ఏ హక్కులు లేకపోవడం ఏమిటని ప్రశ్నిస్తుంది. ఉద్యోగస్తురాలైన స్త్రీలకూ ఉద్యోగాల్లో హక్కులు వుంటాయి. కాని ఇంట్లో మాత్రం ఏ హక్కులూ ఉండవు.

మీరు చాలావరకు గమనించే ఉంటారు. ఇంట్లోని స్త్రీ పురుషులిద్దరూ బయట పని చేసి ఎంతో కొంత సంపాదిస్తారు. ఆ సందర్భంలో కూడా పురుషుడ్నే ఇంటి పెద్దగా గుర్తిస్తారు. ఆమె సంపాదనలో చాలా భాగం తీసుకుని ఆమెకు ఖర్చుల కోసం కొంచెం విదిలిస్తుంటారు (ఇస్తుంటారు). అంటే స్త్రీకి తన సంపాదన మీద కూడా హక్కులు లేవన్నమాట. కుటుంబం, కుటుంబ బాధ్యతలు పేరుతో తన సంపాదనను కూడా కోల్పోతుంది.

ఈ రకంగానే స్త్రీ, పురుషులిద్దరూ ఉద్యోగం చేసి ఇంటికి వచ్చాక పురుషులు విశ్రాంతి తీసుకుంటారు. స్త్రీలు మళ్ళీ ఆఫీసుకు, పని చేసే చోటుకు వచ్చినట్లుగా ఉంటుంది.

స్త్రీ ఉదయాన్నే నిద్రలేచి ఇంటిపనంతా చేసి ఒక్కోసారి నేరుగా వంటింటి నుంచి ఉద్యోగానికి వెళ్ళి మళ్ళీ తిరిగి హడావిడిగా నేరుగా వంటింట్లోనే అడుగుపెడుతుంది. కుటుంబానికి సేవలు చేస్తుంది. కార్మికులకు వర్తించే చట్టాలు, నియమాలు ఇంటిపని చేసే స్త్రీలకూ వర్తిస్తాయా? లేదా గమనించండి. ఒకవేళ పురుషులు ఇంటిపనిలో భాగం తీసుకున్నా, స్త్రీలకు సహాయం చేస్తున్నాడంటారు. అంటే దీని అర్థం ఏమిటంటే ఇంటి ప్రధాన బాధ్యత స్త్రీలది అన్న మాట. అంతకన్నా ఎక్కువగా అయితే, ఒకవేళ ఆర్థికంగా వెసులుబాటు ఉంటే ఇంటి పని చేయటం కోసం ఒక పనిమనిషిని నియమించుకోగలుగుతుంది. ఇక్కడ కూడా ఇంటి పని ఒక స్త్రీ నుంచి మరొక స్త్రీకి బదలాయింపు జరుగుతుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

3. జండర్ ఆధారంగా పని విభజన ఎట్లా జరిగింది? విశ్లేషించండి.

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

4. జండర్ ఆధారంగా జరిగే పని విభజనలో జెండర్ పాత్ర ఎలా ప్రభావితం చేస్తుంది?

--------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------

## 3.5 స్త్రీలు, పని

పై భాగంలో మీరు సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగుల గురించి చదివారు. అంతేకాదు ఈ రంగాలలో పనిచేస్తున్న వారి కొన్ని ఉదాహరణలు కూడా చదివారు. ఉద్యోగము అనే రూపంలో స్త్రీల ఇంటి పనిని మీరు ఏ రంగంలో చర్చిస్తారు? ఏ రకమైన పనిగా చూస్తారు? ఇంట్లో పని చేస్తున్న స్త్రీలు సంఘటిత రంగంలోకి వస్తారా? అసంఘటిత రంగంలోకి వస్తారా? వాళ్ళ పని క్రమబద్ధమైన దాడి కాదా.

సంఘటిత రంగంలో కూడా అసంఘటిత పనులు చేసే ఉద్యోగులు ఉంటారు. ఉదాహరణకు ఒక ప్రభుత్వ రంగ సంస్థ తన పనులను (out sourcing) బయట వారికి కేటాయించినట్లయితే వారి హక్కులు కూడా కాపాడడం జరుగుతుంది.

అదే విధంగా సంఘటిత రంగాలలోనే ఆ రంగానికి సంబంధించని పనులు కూడా ఉంటాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో కాంట్రాక్టు పద్ధతిలో నడుపుతున్న అల్పాహారశాల (క్యాంటీన్లు) వీటికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

ఇట్లాంటి విభాగాలలో స్త్రీలు, పిల్లలని పనులకి వినియోగించుకున్నా, వారి పేర్లు, రిజిస్టర్‌లో నమోదు చేయరు. అందువల్ల వారికి ఎలాంటి హక్కులు ఉండవు. కార్మికులకు ఉండవలసిన ప్రయోజనాలు కూడా వీరికి దక్కవు. ఈ కార్మికులు ఎంతో కొంత పని చేస్తూ కొంత జీతాన్ని సంపాదించుకుంటారు. వీరు నైపుణ్యంతో పనిచేసినా, చేయకున్నా వారిని ఉద్యోగులుగానే గుర్తించరు.

వ్యాపార కారణాలతో కాకపోయినా, కుటుంబ సంబంధాల కారణంగా ఒక కుటుంబాన్ని లేదా ఇంటిని సంఘటిత రంగంగా గుర్తించవచ్చు. అయితే, ఇందులో ముఖ్యంగా మహిళలకు సంబంధించిన పనిని అసంఘటిత శ్రమగానే పరిగణిస్తారు. ఒక కుటుంబంలోని స్త్రీల పనిని లెక్కపెట్టరు. పనికి ఏ మాత్రం గుర్తింపు కూడా ఇవ్వరు.

స్త్రీలు రకరకాల పనులు చేస్తారు. ప్రతిరోజు విధిగా చేసే పనైనా కావచ్చు. ఇంటికి సంబంధించినదైనా కావచ్చు. ఇక్కడ స్త్రీల పని ఒక కుటుంబాన్ని సవ్యంగా నడపడానికి ఉపయోగపడుతుంది. కాని వారి పని మాత్రం కనిపించనిదిగానే ఉండిపోతుంది.

### 3.5.1 ఇంటిని చక్కదిద్దటం (గృహ సంరక్షణ)

స్త్రీలు ఎక్కువగా ఉబుసుపోక మాటలతో, కబుర్లతో, కాలక్షేపం చేస్తుంటారు, ఏ పనినైనా సమర్ధవంతంగా నిర్వహించడం వారికి చేతకాదు అనే అభిప్రాయం సాధారణంగా వినపడుతుంది. ఈ భావన స్త్రీలను కించపరిచే భావన, పైగా స్త్రీల పట్ల చులకన భావాన్ని కలిగి ఉండడంగా కూడా భావించవచ్చు.

ఇంట్లో చేసే పని  ఒక వస్తువును, ఉత్పత్తి చేసినట్లుగానో ఒక విషయాన్ని తెల్పినట్లుగానో అనిపించదు. ఎందుకంటే అది రోజువారీ పనిలో భాగమే కనుక.   ఉదాహరణకు  ఒక ఇల్లును శుభ్రం చేయడం అనేదాన్ని  ఒక ఉత్పత్తిగా గుర్తించరు.  అదే విధంగా, వంట చేయడం అనేది ఎంతో  ప్రణాళికబద్దంగా, అన్నింటిని సమన్వయపరుచుకుంటూ చేయవలసిన పని.

కొన్ని వ్యాపార ప్రకటనల్లో "మోడల్స్" రకరకాల వంటలు చేస్తూ అందంగా కనిపిస్తూ ప్రతి ఒక్కరిని ఆహ్లాదపరుస్తూ ఉంటారు.  నిజ జీవితంలో వంట పని అంత సులభమైనదేమి కాదు.  బట్టలుతికే పౌడర్ల ప్రకటనల్లో మనం స్త్రీలను చూస్తాం.  వారి ఉద్దేశమంతా బట్టలు తెల్లగా ఉతకడమే.  ఒక ఆయింట్మెంట్ ప్రకటనలో భర్త ప్రేమగా భార్య వీపుకు మందు రుద్దుతూ కనిపిస్తాడు.  ఆమె మళ్ళీ పనికి సిద్ధమవుతుంది.  అంతేకాని ఆమె పనిని పంచుకున్నట్లుగానీ, సహాయపడుతున్నట్లుగాని ఎక్కడా కనిపించదు.

ఇప్పటికే తల్లిగా, భార్యగా బోలెడన్ని భాద్యతలు మోస్తున్నా కూడా స్త్రీల పట్ల ఇంకా ఎక్కువ అంచనాలు ఉంటాయి.  ఇంకా ఎక్కువ పనిని వారినుంచి ఆశిస్తారు.  ఒక స్త్రీ అన్ని బాధ్యతలు మోస్తూ, ఎట్లా  పోరాడుతుందో, తన శరీరాన్ని నొప్పి మాత్రలతో నింపుతూ తన పాత్రను విజయవంతంగా నిర్వహిస్తుందో "సూపర్ మామ్ సిండ్రోం" అనే కథలో పి. సత్యవతి అద్భుతంగా అవిష్కరిస్తారు.

పని విభజన అనేది అంత సమస్య కాదు.  కాని ఎవరి శ్రమ విలువ ఎంత అని నిర్ధారించే పద్ధతిలోనే లొసుగులున్నాయి.  చాలా రంగాలలో మహిళలకు ప్రవేశం లేదు.  ఒక స్త్రీ బయటి ప్రపంచంలో అడుగు పెట్టాలంటే చాలా మర్యాదతో జాగ్రత్తగా మెలగాలి.  ప్రతి క్షణం సాంప్రదాయాన్ని, పురుషులను గౌరవిస్తూ తన పట్ల తాను జాగరూకతతో ఉండాలి.

పురుషుడు ఇంటి యజమాని.  కాని ఇంట్లోనే కొన్ని ప్రాంతాల్లో అడుగుపెట్టడమే నిషేదంగా భావిస్తాడు. ఉదాహరణకు వంటిల్లు తీసుకుందాం.  వంటింటి పని స్త్రీలకు మాత్రమే పరిమితం.  మగవాళ్ళు చేయకూడదు. ఒకవేళ ఇంట్లో మగవాళ్ళు పని చేస్తే అది వారి మగతనాన్నే ప్రశ్నించేట్లుగా ఉంటుంది.  కాని మగవాడు అదే పనిని వృత్తిగా ఎంచుకోవచ్చు.  ఉదాహరణకు మగవాళ్ళు వంటవాళ్ళుగా, సహాయకులుగా, మాస్టర్ చెఫ్లుగా ఉన్నారు. వీళ్ళలో ఎంత మంది వాళ్ళ వాళ్ళ ఇండ్లలో వంటపని చేస్తారో ఆలోచించండి.

### 3.5.2 ఇంటి ఆధారిత పని

సాంప్రదాయ వృత్తులైన కుమ్మరి, చేనేత, చాకలి వంటి పనులు ఒక కుటుంబంలో సమిష్టిగా చేసే పనులు కుటుంబ సభ్యులందరూ ఆ పనిలో భాగమవుతారు.  ఆ పని కేటాయింపులు జండర్, వయసు, హోదా ఆధారంగా నిర్ణయించి క్రమబద్ధంగా జరుగుతాయి.

సామాగ్రి సేకరణ, పనిని సమన్వయ పరచుకోవడం, పనివాళ్ళకు సహాయపడడం, వస్తువులు అమ్మడం వరకు కుటుంబంలోని ప్రతి ఒక్కరు తమ పాత్ర పోషిస్తారు.  ఇదంతా జరిగాక చిట్టచివరకు ఆ ఇంటి యజమాని (పురుషుడు) ఆ వస్తువులు అమ్మిన డబ్బులు తన దగ్గర పెట్టుకుంటాడు.  నిజానికి, ఈ పనులలో పురుషుల కన్నా ఎక్కువగా స్త్రీలే కష్టపడి పనిచేస్తారు.  అయినా పురుషులకు సహాయపడడం అనే కోణంలోనే చూస్తారు.  వాళ్ళ పని విలువ లేనిదిగానే మిగిలిపోతుంది.  ఉత్పత్తి అయ్యే వస్తువు మీద వచ్చిన ఆదాయం మీద పురుషుని అధికారమే ఉంటుంది.

ఈ వృత్తులలో పని చేసే స్త్రీలకు కొంత సులవవుతుంది. ఆఫీసు, ఇల్లు ఒక్కటే అవడం వల్ల కొంత సౌకర్యంగా ఉంటుంది. ఇంటికి, ఆఫీకుకు దూరం లేనందున ఆ సమయాన్ని ఇంటి బాధ్యతలైన వంట, నీళ్ళుపట్టడం, పిల్లల్ని, వృద్ధుల్ని చూసుకోవడం వంటి పనులకు కేటాయిస్తుంటారు. ఇవన్నీ స్త్రీల పని ఒత్తిడిని రెండింతలు చేస్తాయి. అయినా వారి శ్రమకు సరైన గుర్తింపు మాత్రం దొరకదు.

తిండి పదార్థాల అమ్మకం, కుట్టుపని వంటి వృత్తుల్లో స్త్రీలే ప్రధాన పాత్ర వహిస్తారు. ముఖ్యంగా తయారు చేయడంలో, అమ్మడంలో కూడా వారే ముందుంటారు. ప్రధాన బాధ్యతను స్త్రీలే మోసినా, ఆపని ద్వారా వచ్చే ఆదాయంపై పూర్తి హక్కులు పురుషుడికే ఉంటాయి.

అయితే స్త్రీలే పూర్తిగా బాధ్యత వహించే కొన్ని కుటుంబాలుంటాయి. పురుషులు చనిపోయినా, పురుషులు ఎక్కడికైనా వలస వెళ్ళినా స్త్రీలే ఆ కుటుంబాన్ని మోస్తారు. స్త్రీలే ఇంటి పెద్దగా వ్యవహరిస్తారు.

పురుషుల బాధ్యతారాహిత్యం వల్లనో, చేతకానితనం వల్లనో కొన్ని కుటుంబాల్లో స్త్రీలే ఇంటి పెద్దగా వ్యవహరిస్తూ ఇంటికి కావలసిన సంపాదన బాధ్యతను చేపడతారు. ఇంకొన్ని సందర్భాలలో పెళ్ళికాని యువతులు కూడా కుటుంబానికి అండగా నిలుస్తారు.

### 3.5.3 అస్తిత్వాల వైరుధ్యం (Intersecting)

పైన చర్చించుకున్నట్లుగానే సమాజం ఏ పనిని ఎవరు చేయాలో నిర్ణయిస్తుంది. ఇంతకు ముందు చర్చించుకున్నట్లుగా, ఒక ఇంట్లో పురుషుడు యజమాని కాబట్టి అతడు వంటింట్లో పని చేయకూడదు అని అనుకోవడం వలన స్త్రీలే ఆ పనిని స్వీకరిస్తారు.

ఫేమినిస్టులు, స్త్రీవాదులు, స్త్రీల పక్షాన మాట్లాడే వారు వంటింటి పేరుతో ఇంటికే పరిమితమవుతూ స్త్రీలను అణచివేస్తున్న స్వభావానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఇక్కడ కవయిత్రి విమల రాసిన ''వంటిల్లు'' కవితను మనం ఉదహరించవచ్చు. 'వంటింటి సామ్రాజ్యానికి మహారాణి మా అమ్మ, కాని గిన్నెల నిండా నాన్న పేరే' అంటూ వంటింటికి పరిమితం చేసిన, వంటింటి వస్తువుల పైన అధికారం పురుషులదేనని స్పష్టంగా చెప్తుంది విమల.

పితృస్వామ్య వ్యవస్థ వంటింటి సామ్రాజ్యానికి స్త్రీలు మహారాణులని ఒక వైపు చెప్తూనే ఉంటారు. నిజానికి వాస్తవంగా ఆలోచిస్తే స్త్రీలు వంటింటిపై ఆధారపడి లేరు. స్త్రీలు తమంతట తాముగా వంటింటిని కోరుకోలేదు. వంటింటికే పరిమితం అయ్యారు. పరిమితం చేయబడ్డారు.

మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రైమరీ పాఠశాలలో దళిత స్త్రీలు తయారు చేసిన ఆహారం తినకూడదు అంటూ వార్తలు విన్నాము. దళిత స్త్రీలు వండిన ఆహారం తినేందుకు తిరస్కరించిన పిల్లలు, వంట వండి ఆహారాన్ని (మలినం) చేసిన దళిత మహిళలను దండించిన తల్లిదండ్రుల ఉదంతాలు, ఆహారాన్ని చెత్తబుట్టలో వేసిన ఉదంతాలు ఉన్నాయి.

కులము, వర్గము, జండర్, మతం ఆధారంగా ఒక పనిని ఎవరు చేయాలో, చేయకూడదో నిర్ధేశించారు. కొందరికి నీచమైన పనులుగా అనిపించే వాటిని మరికొందరు మాత్రమే చెయ్యాలని కూడా ప్రతిబంధకాలు విధించారు.

పైన చెప్పుకున్నట్లుగా పని అనేది బ్రహ్మపదార్థం. ఎవరు ఏ పని చేయాలి అనేదానికి రకరకాల సామాజిక ఆర్థిక కారణాలు ఉండవచ్చు. సమాజంలోని ఆదిపత్య దోరణులే జండర్‌ను, పనిని నియంత్రిస్తాయి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

5. ఇంటిని తీర్చిదిద్దడానికి, ఇంటి పనికి కల తేడాను వివరించండి.

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

6. భిన్న వైరుధ్యాలు సంఘర్షిస్తాయి అనే దృక్పథంలో పని (డైనమిక్స్)ను మీరు ఏవిధంగా అర్థం చేసుకున్నారు.

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

## 3.6 సారాంశం

ఈ భాగంలో సమాజం, సమాజపు అంతరాంతరాల్లో దాగిన పితృస్వామ్య భావజాల రాజకీయాలు, పని జండర్‌ల గురించి చర్చించాము.

పని అంటే ఏమిటి? పనిని శ్రమగా, వృత్తిగా ఎట్లా నిర్వహించాలో వివరించాము.

మనం చేసే పని ఎప్పుడూ మన ఇష్టాఇష్టాలపైన ఆధారపడి ఉండదు. కొంత మంది మీద ముఖ్యంగా స్త్రీల మీద ఆ పని చేసే వెసులుబాటు లేకపోవడానికి గల కారణాలు చర్చించాము.

సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉండడానికి గల కారణాలు చర్చించాము.

అసంఘటిత రంగాల్లో స్త్రీలే ఎక్కువగా పని చేస్తున్నారనే విషయాన్ని విశ్లేషించాము.

పని, పనిచేసే వారి పట్ల ప్రభుత్వ వైఖరి, విధానాలు కూడా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

పనివారి రక్షణ కోసం, హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన చట్టాలు, భారత ప్రభుత్వం సంఘటిత రంగం పట్ల తీసుకున్న శ్రద్ధ ఈ భాగంలో అర్థం చేసుకుంటాము.

ఈ భాగం ఇంట్లో పని చేసే స్త్రీల పని ఎందుకు విలువ లేనిదిగా, కనపడనిదిగా, వెలకట్టలేనిదిగా ఉంటుంది? అనే ప్రశ్నను లేవనెత్తుతుంది.

స్త్రీలపని, పురుషుల పని మధ్య ఖచ్చితమైన విభజన రేఖ ఎందుకు గీయబడింది? శ్రమను జండర్‌తో ఎట్లా విభజిస్తారు? అనే చర్చను లేవనెత్తుతారు.

ఇంట్లో, బయట పని చేసే స్త్రీలకు పనిభారం రెండింతలైనా, పని గంటలు పెరిగినా వారి పనికి గుర్తింపు, విలువ రెండూ లేవు అనే ఆలోచనను లేవనెత్తుతుంది. స్త్రీలకే పరమితమైన (డొమెన్) ప్రత్యేక ప్రాంతం, పురుషులకే పరిమితమైన ప్రత్యేక ప్రాంతం అంటే ఏమిటి? గృహాధారిత పరిశ్రమలలో స్త్రీల ప్రధాన పనిలో భాగం పంచుకున్నా కూడా వారి శ్రమను గుర్తించకపోవడానికి గల కారణాలను అన్వేషించాల్సిన అవశ్యకత గురించి చర్చించాము.

## 3.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. ఇంటి పనిని కూడా ఇతర ఆర్థిక విలువ కలిగిన పనులతో సమానంగా చూడాలనే ప్రతిపాదన స్త్రీ మరియు బాలల సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉంది. ఈ ఆక్ట్‌ని మొదటి సారిగా 2012 లో ప్రతిపాదించారు. ఇంటి పనికి వేతనాలు, సెలవులు, ఆరోగ్య మొదలైన సౌకర్యాలు కల్పించి క్రమబద్ధీకరించాలని ప్రతిపాదన.

2. అసంఘటిత రంగాలలో స్త్రీలు నియమింపబడటానికి కారణాలు -

   1. ఇంటి దగ్గర పనిచేసే సమయవేళలు అనుకూలంగా ఉండడం
   2. స్త్రీ శ్రమ తక్కువ వేతనాలకు సులభంగా దొరకడం

3. జండర్‌ని ఆధారంగా పనిని కేటాయించడాన్ని జండర్ ఆధారిత పని విభజన అంటాం. కుటుంబంలో మగవారు యాజమాన్యం చలాయిస్తే, స్త్రీలు ఇంట్లో అన్ని బాధ్యతలని తీసుకుంటున్నారు. ఇంటి పనులకి ఇతర బయట చేసే ఉద్యోగాలకు ఉండే సౌకర్యాలేమీ ఉండవు. స్త్రీలు ఈ విధంగా ఇంటి పనులకి, కుటుంబపర భావోద్వేగాలకి బందీలవుతున్నారు. స్త్రీలు కూడా బయటి ఉద్యోగాలు చేస్తున్నప్పటికి నిద్ర లేచిన వెంటనే వంటింటి పనులు చేసుకొని, ఇంటి బాధ్యతలని చూసుకుంటూ బయటి పనులు కూడా చక్కబెట్టుకోవాలి. పురుషులు కొంత వరకు సహాయం చేసినప్పటికీ, ఇంటి ప్రధాన బాధ్యత మాత్రం స్త్రీలదే. ఇలా పనిలో అసమానతలు మనకు నిత్యం కనిపిస్తాయి.

4. సమాజం, స్త్రీ, పురుషులకు ఆపాదించిన పాత్రలు వారు చేయాల్సిన పనిని నిర్ణయిస్తాయి. స్త్రీలు నిర్వహించే తల్లి, భార్య పాత్రలు వారిపై అధికమైన ఒత్తిడిని, భారాన్ని మోపుతున్నాయి. దీనివలన ఎక్కువ మంది స్త్రీలు నొప్పిని తగ్గించే మందులను వాడుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు.

5. ఇంటి పని వేతనాలు లేకుండా చేసే స్త్రీలు చేసే చాకిరి. ఇంటి పనికి జీతం ఉండదు. ఇది కనిపించని, విలువ లేని పనిగా పరిగణించబడుతోంది. అలాగే ఇంటి నుండి చేసే పని అసంఘటిత రంగానికి చెందినది. ఇంటిలోని కుటుంబ సభ్యులు కలిసి చేసే పనిని హోం బేస్డ్ వర్క్ అంటారు. ఉదాహరణకు టైలరింగ్, స్వగృహ తినే పదార్థాలు తయారీ మొదలైన పనులు. ఈ పనులలో ఇంటినుండి పనిచేసే కార్యాలయానికి ప్రయాణం చేసే శ్రమ తప్పుతుంది. సమయం కలిసి వస్తుంది. ఇంటి పని, ఇంటి నుండి చేసే పనులలో అధికంగా స్త్రీలు పని చేస్తున్నారు. వారి సంపాదన మాత్రం మగవారు తీసుకుని ఇంటి పెత్తనం చేస్తున్నారు.

6. కొన్ని పనులు కుల, వర్గ, జండర్, మత ప్రాతిపదికను అనుసరించి కొంత మంది మాత్రమే చేయాలని నిర్ధారించారు. అలానే, కొన్ని వర్గాల వారు తమకు ఇష్టం ఉన్నా, లేకున్నా, నీచమైన పనులకి బలవంతంగా వినియోగించబడుతున్నారు. జండర్ - కుల, వర్గ, మత అస్తిత్వాలతో పాటు కలిసి స్త్రీలను మరింత వివక్షకు గురిచేస్తుంది. ఉదాహరణకు - అన్ని వర్గాలలోను స్త్రీలు వివక్షకు గురవుతున్నారని తెలుసు. దానికి తోడు నిమ్న వర్గాలలో స్త్రీలు వారి కుటుంబంలోని వివక్ష మాత్రమే కాకుండా పై వర్గాల స్త్రీ, పురుషుల వలన కూడా అనేక అవమానాలకి గురి అవుతూ ఉంటారు.

## 3.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1. క్రింది ప్రశ్నలకు 30 లైన్లలో జవాబులు రాయండి.

    1. జెండర్, పనిలోని రాజకీయాలని విశ్లేషిస్తూ వ్యాసం రాయండి.

    2. పనిని కేటాయింపు జండర్ పాత్రలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో వివరించండి

2. క్రింది ప్రశ్నలకు 10 లైన్లలో జవాబులు రాయండి.

    1. హోం మేకింగ్ అనగా ఏమి? స్త్రీలు మాత్రమే హోం మేకర్‌గా ఉండాలని ఎందుకు అనుకుంటారు?

    2. కొన్ని వాణిజ్య ప్రకటనలను పరిశీలించి వాటిలో జండర్ అంతరాలను ఏ విధంగా చిత్రిస్తున్నారో వ్యాఖ్యానించండి.

    3. ఇంటి పనులలో మగవారికి నిషేదించబడినవి ఏవి? ఎందుకు?

## 3.9 ముఖ్య పదాల అర్థ వివరణ

స్ఫియర్ : ఆవరణ, క్షేత్రము

హైయరార్కి : సోపాన క్రమము

ఇంటర్ సెక్టింగ్ : కలవడం, ఒకదానిపై ఒకటి కలవడం, సంధించడం

## 3.10 ఆధారిత గ్రంథాలు

సత్యవతి, పి. సూపర్ మాం సిండ్రోం, అనువాదం సుజాత గోపాల్, మూస్ ఇండియా, సంచిక 23, 2009
http://www.museindia.com/viewarticle.asp?myr=2009&issid=23&id=1406
స్వామినాథన్, పద్మిని ఉమెన్ అండ్ వర్క్, హైదరాబాద్, ఓరియంట్ లాంగ్మన్, 2012.

ఓలా, ఎ పొలిటికల్ స్టోరీ, ది వుమన్ అన్బౌండ్: సెలెక్టెడ్ షార్ట్ స్టోరీస్. అనువాదం అల్లాడి ఉమ మరియు ఎం. శ్రీధర్, హైదరాబాద్: ఆథార్ అండ్ రైటర్స్ ఇండియా లిమిటెడ్, 1997.

# భాగం - 4 : జండర్ - అధికారం

విషయ క్రమం

4.0 లక్ష్యాలు
4.1 పరిచయం
4.2 జండర్, అధికారాల మధ్య సంబంధం
4.2.1 పితృస్వామ్య అధికారం
4.2.2 వ్యక్తిగత / ప్రైవేటు, సామాజిక / పబ్లిక్ రంగాల్లో అధికారం
4.3 కుటుంబం, తదితర వ్యవస్థల్లో పితృస్వామ్య అధికారం
4.3.1 కుటుంబంలో పితృస్వామ్యం
4.3.2 వ్యవస్థాగత అధికార సంబంధాలు
4.4 అధికారంపై స్త్రీవాదుల విశ్లేషణ
4.4.1 సాధికారత: వ్యక్తిగత అధికారం, సామూహిక అధికారం
4.5 రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాటాలు
4.5.1 ఓటు హక్కు కోసం ఉద్యమాలు
4.5.2 సామాజికార్థిక అసమానతలు, రాజకీయ భాగస్వామ్యం
4.6 సారాంశం
4.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు
4.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు
4.9 ముఖ్య పదాల అర్థ వివరణ
4.10 ఆధారిత గ్రంథాలు

## 4.0 లక్ష్యాలు

ఈ యూనిట్ చదివాక, మీరు ఈ కింది విషయాలను గ్రహించగలుగుతారు

- జండర్‌కు, అధికారానికి మధ్య ఉన్న సంబంధాలు అర్థం చేసుకోగలుగుతారు.
- కుటుంబంలోను, ఇతర సామాజిక వ్యవస్థల్లోను మహిళలపై అధికారం, నియంత్రణ ఎలా అమలవుతాయో అర్థమవుతుంది.
- రాజకీయ అధికార యంత్రాంగంలో మహిళల సమాన ప్రాతినిధ్యానికి జరిగిన పోరాటాల పట్ల అవగాహన కలుగుతుంది.

## 4.1 పరిచయం

జండర్ అధ్యయనంలో అధికారం అన్నది ఒక కీలకమైన అంశం. జండర్ అధ్యయనానికి పునాది వేసిన సూత్రాల్లో స్త్రీ పురుషుల మధ్య అసమాన అధికార సంబంధాలున్నాయన్నది ముఖ్యమైనది.

భారతదేశం వంటి సంక్లిష్టమైన సమాజం ఉన్న చోట జండర్ అసమానత్వం కులం, వర్గం, మతం, జాతుల అసమానతలతో సమసిస్తుంది. ఆధిపత్య కులాలు, ఆధిపత్య సామాజిక సమూహాలకు చెందిన స్త్రీల కంటే తక్కువ స్థాయి, తక్కువ అవకాశాలు కలిగిన స్త్రీలలో అధికార అసమానతలు ఎక్కువగా కనిపిస్తాయి.

జండర్ అధ్యయనంలో స్త్రీలను అణచివేసి, ఎప్పటికీ ద్వితీయ స్థానంలోనే ఉంచడం వెనుక ఉన్న కారణాలు, యంత్రాంగాలు మొదలైనవి అర్థం చేసుకోవాలని అనుకునేవారికి 'అధికారం' అన్న భావనను అర్థం చేసుకోవడం ప్రయోజనకారిగా ఉంటుంది. అంతే కాక, ఈ భావనను సరిగ్గా అర్థం చేసుకుంటే అసమాన అధికార సంబంధాలను సవాలు చేసి, ఉద్యమాల ద్వారా, చట్టాల ద్వారా సమాజ దృక్పథంలో మార్పు తీసుకురావడానికి వీలుంటుంది.

ఫార్చ్యూన్ పేర్కొన్న 500 కంపెనీల్లో 98.8 శాతం కంపెనీల్లో అగ్రస్థాయి పదవుల్లో పురుషులే ఉన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా పార్లమెంట్లలో మహిళల సంఖ్య 22.4% కాగా, భారతదేశంలో లోకసభ, రాజ్యసభలను కలిపి 12% మంది మహిళలున్నారు. ఈ విషయంలో మొత్తం 140 దేశాలలో భారతదేశం 103 వ స్థానంలో ఉంది. (ఐక్యరాజ్యసమితి - 2017). కొన్ని అధ్యయనాలను బట్టి చూసినప్పుడు, అభివృద్ధి చెందుతున్న భారతదేశం వంటి దేశాల్లో మహిళలు వారానికి పురుషుల కంటే 35 గంటలు ఎక్కువగా పని చేస్తారు. కాని ప్రపంచ భూమిలో మహిళలకు ఉన్నది కేవలం 1% భూమి మాత్రమే. ఈ లెక్కలను బట్టి మహిళలకు రాజకీయ, ఆర్థిక ఆధిపత్య స్థానాలలో ఎంత తక్కువ స్థానం ఉన్నదీ; అదే పేదరికం, సామాజికార్థిక అసమానతల్లో ఎంత ఎక్కువ ప్రాతినిధ్యం ఉన్నదీ అర్థమవుతుంది. ఇప్పుడున్న సామాజిక నిర్మాణంలో అధికారం, జండర్ అన్నవి పరస్పర భిన్నంగా లేవు. ఆ రెండింటికి అనివార్య సంబంధం ఉంది. కనుక, ఈ పాఠంలో జండర్‌కూ, అధికారానికి ఉన్న సంబంధాన్ని మనం తెలుసుకుంటాం. పాఠంలోని రెండవ భాగంలో ప్రపంచ మహిళలు, సమాన పౌరసత్వానికి, రాజకీయ ఆధిపత్యానికి పునాది అయిన ఓటు వేసే హక్కు కోసం ఎంత సుదీర్ఘమైన పోరాటం జరిపారో తెలుసుకుంటాం.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

1. జండర్ అధ్యయనంలో అధికారం అనే భావనను తెలుసుకోవడం ఎందుకు అవసరం?

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

## 4.2 జండర్, అధికారం మధ్య సంబంధం

మీరు చదవబోయే భాగాలు మహిళల అణచివేతను అర్థం చేసుకోవడంలో అధికారం, అధికార సంబంధాల పాత్రను వివరిస్తాయి.

### 4.2.1 పితృస్వామ్య అధికారం

పితృస్వామ్యమంటే వాచ్యార్థం "తండ్రి పాలన". అంటే అది పురుషుడి ఆధిపత్యాన్ని సూచిస్తుంది. ఇది పురుషాధిపత్యాన్ని వ్యవస్థీకృతం చేసే ఒక సామాజిక నిర్మాణం, ఆచరణ. ఉదాహరణకు, ఒక తండ్రి తన కుమార్తెను ఇంటికి దూరంగా ఉండే కళాశాలకు పంపించడానికి నిరాకరించవచ్చు. ఆమెకు ఇష్టమైన చదువు చదువుకోకూడదని నిషేధించవచ్చు. తన తోడబుట్టిన పిల్లలను చూసుకోవడానికి చదువు మధ్యలో ఆపేయమని ఆదేశించవచ్చు. అంటే ఇక్కడ పితృస్వామ్యం ఒక ఆడపిల్లకు అవసరమైన వనరులను నిరాకరిస్తోంది. ఆమెకు ఎంచుకునే స్వేచ్ఛను నిర్ణయించుకునే అధికారాన్ని నిరాకరిస్తోంది. పితృస్వామ్యం పురుషులకు స్త్రీల మీద అధికారం చలాయించడానికి, వారి నుంచి సేవలను పొందడానికి పూర్తి అవకాశం ఇస్తుంది. స్త్రీ పురుషులు ఎలా ప్రవర్తించాలో, కుటుంబంలో వాళ్ళ ప్రవర్తన ఎలా ఉండాలో, వారి దృక్పథాలు ఎలా ఉండాలో కూడా పితృస్వామ్యం నిర్ణయిస్తుంది. పురుషులు సంపాదించి, కుటుంబాన్ని పోషించాలని, స్త్రీలు కుటుంబసభ్యులకు సేవలందిస్తూ పోషణ కలిగించాలని పితృస్వామ్యం నిర్ణయించింది. ఈ విధంగా డబ్బు సంపాదించే వ్యక్తి ఒకరు, సేవలు చేసేది ఒకరు అన్న విధంగా విభజించడం వల్ల పురుషులు స్వేచ్ఛగా అధికారయుతంగా ఉండాలని, స్త్రీలు సహనంతో శాంతంగా మెలగాలని చెప్పినట్లయింది. ఇలా చెప్పడంలో లోపమేమీ లేదు కదా అని కొందరు అనుకోవచ్చు. అయితే ఈ వ్యవస్థతో వచ్చే చిక్కేమిటంటే 1) స్త్రీ పురుషులు తమ శారీరక లక్షణాలకు లోబడి పరిమితమైన పాత్రలనే పోషించాల్సి రావడం; తద్వారా తమ సంపూర్ణ సామర్థ్యాన్ని చేరుకోలేకపోవడం, 2) అవకాశాల పరంగా చూసినా, వనరుల పరంగా చూసినా స్త్రీ పురుషుల మధ్య సమానత్వం లేదని, సమాజంలో వారి విలువ కూడా సమమైంది కాదని సూచన ఇందులో ఉండడం.

దీన్ని బట్టి మగవాళ్ళందరూ దుర్మార్గులని, స్త్రీలందరూ బాధితులని మనం అంటున్నట్లా? కాదు. స్త్రీలు కూడా పితృస్వామ్య స్వభావం కలిగి ఉండవచ్చు. ఉదాహరణకు ఒక అత్త గారు కోడల్ని వేధిస్తున్నదంటే అది పితృస్వామ్యం ఆమెకు మగపిల్లవాడి తల్లిగా ఇస్తున్న అధికారమే కాని, ఆమె మహిళ అయినందుకు లభించిన అధికారం కాదు. అదే అత్తగారు మళ్ళీ తన కుమార్తె అత్తింటివారితో మాట్లాడేటప్పుడు ఎంతో అణుకువగా వుంటుంది. కనుక, పితృస్వామ్యమనేది ఒక సిద్ధాంతం, ఒక ఆచరణ విధానం, ఒక దృక్పథం. అంతే కాని ఇందులో పురుషుడికే అధికారం ఉంటుందని, స్త్రీలకు ఉండదని అర్థం కాదు. అదీకాక, పితృస్వామ్య స్వరూపం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు; మారుతూ ఉంటుంది. ఉదాహరణకు, స్త్రీలు విద్యావంతులై, ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలు చేరుకుంటున్నప్పటికీ, బయటి ప్రపంచంలో వారిపై హింస, అత్యాచారం వంటివి పెరుగుతూనే ఉన్నాయి.

### 4.2.2 వ్యక్తిగత / ప్రైవేటు, సామాజిక / పబ్లిక్ రంగాల్లో అధికారం

పురుషులు ఒక సమూహంగా స్త్రీలపై అధికారం చెలాయించడమన్నది వ్యక్తిగత, సామాజిక రంగాల్లో జరుగుతుంది. సామాజికమంటే బాహ్య సమాజం, ప్రపంచం - ప్రభుత్వ రంగం, యుద్ధం, సైనిక వ్యవహారాలు, ఆర్థిక రంగం, ఉద్యోగ రంగం మొదలైనవి. వ్యక్తిగత రంగమంటే కుటుంబం, ఇంటి పని, పునరుత్పత్తి, అంతరంగిక సంబంధాలు. సాధారణంగా ఈ రెండింటిలో సామాజిక రంగమన్నది పురుషులకు సంబంధించిందనీ, వ్యక్తిగత రంగమన్నది స్త్రీలకు సంబంధించినదని భావించడం ద్వారా స్త్రీ పురుషుల మధ్య తేడా చూపడం కనిపిస్తుంది.

పురుషులు సామాజిక రంగానికి, స్త్రీలు వ్యక్తిగత రంగానికి చెందడంలో అభ్యంతరం పెట్టాల్సింది ఏముందని అడగవచ్చు. ఎందుకంటే ఇంటిని చూసుకోవడం, పిల్లల్ని పెంచడం మొదలైనవి బయట సమాజంలో పురుషులు చేసే పని కంటే తక్కువ విలువైనవని అందరూ భావిస్తారు. దీనివల్ల మహిళలకు, ఆడపిల్లలకు వనరుల విషయంలో,

నిర్ణయాత్మక రంగాల్లో మగవాళ్ళ కంటే తక్కువ అధికారం ఉంటుంది. పురుషులకు సామాజిక రంగంలో పాత్ర ఎక్కువుండడం వల్ల వారికి విద్య, ఆస్తి, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటాయి. ఇవేవి స్త్రీలకు అందుబాటులో ఉండవు.

ఇలా స్త్రీ పురుషులు తమకు నిర్ధారించిన పాత్రలను సక్రమంగా పోషించడం కోసం చిన్నప్పటి నుండి వాళ్ళను దానికి అనుగుణంగానే పెంచుతారు. ఉదాహరణకు మగపిల్లలకు చిన్నప్పటి నుంచి బలంగా, ధైర్యంగా ఉండాలని చెబుతూ, ఎక్కడైనా బలహీనత చూపితే తిడతారు. 'మగపిల్లలు ఏడవరు' అన్నది తరచుగా వినే మాట. అదే సమయంలో ఆడపిల్లను అణుకువగా, నెమ్మదిగా ఉండాలని గొంతు పెంచి మాట్లాడకూడదని, సరిగ్గా కూర్చోవాలని ఆజ్ఞాపిస్తూ ఉంటారు. చివరకి పిల్లలకు ఇచ్చే బొమ్మలలోనూ వివక్షే - మగపిల్లలకు కార్లు, ట్రక్కులు, ఆడపిల్లలకు బొమ్మలు, వంట పాత్రలు ఇస్తాం. చిన్నప్పటి నుండి వారి పాత్రలకు వారిని సిద్ధం చేస్తూ ఉంటాం.

మహిళలు ప్రధానంగా పిల్లల్ని కని పెంచడానికి, ఇంటి పనికి పరిమితమవుతారు. కనుక వారికి విద్య, ఆస్తి వంటి వనరుల అవసరం అంతగా ఉండదని ఎక్కువమంది భావించేవారు. నిజానికి 20 వ శతాబ్ధి ప్రారంభం వరకు భార్యగా, గృహిణిగా ఉండాల్సిన స్త్రీకి చదువుతో ఏం పని అంటూ వారికి విద్యను నిరాకరించేవారు. స్త్రీలకు విద్యావకాశాలు ప్రారంభమైన తర్వాత కూడా గృహ విజ్ఞానం (హోం సైన్స్) వంటివి మాత్రమే వారికి అందుబాటులో ఉండేవి. ఎందుకంటే ఆ చదువు మాత్రమే వారు నిర్వహించవలసిన పాత్రలకు అనుగుణమైనదని భావించేవారు.

వైద్యవిద్య, న్యాయవిద్య వంటి చదువులు స్త్రీలకు అవసరం లేదని లేదా అవి శారీరక, మానసిక దృఢత్వాన్ని కోరుతాయి కనుక అవి మహిళలకు సాధ్యం కాదని అనుకునేవారు. మహిళలు వృత్తివిద్యారంగంలోకి ప్రవేశించిన తర్వాత కూడా ఆధిపత్య వర్గాలు వారిని స్త్రీలకు ఉచితమైన ఉద్యోగాలు చేపట్టాలనే దృష్టితోనే చూశాయి. ఉదాహరణకు స్త్రీలు వైద్య విద్యను అభ్యసించినప్పుడు కూడా, వారికి ప్రసూతి వైద్యం (గైనకాలజీ), పిల్లల వైద్యమే సరితూగుతాయని భావించారు. ఇతర కోర్సులు, సర్జరీలు పురుషులకే కేటాయింపబడేవి. అదే విధంగా ఎక్కువ సహనం, సున్నితత్వం, సేవించే గుణం అవసరమైన ఉపాధ్యాయ వృత్తి, ఆంతరంగిక కార్యదర్శి ఉద్యోగం, రిసెప్షనిస్టు ఉద్యోగం స్త్రీలకే పరిమితమయ్యాయి. ఎందుకంటే వీటికి అవసరమైన గుణాలన్ని స్త్రీలకు సహజంగా ఉంటాయి కనుక.

గత యాభై ఏళ్ళలో ఈ పరిస్థితి మారిన మాట నిజమే, స్త్రీలు కూడా అనేక రకాల వృత్తుల్లో, ఉద్యోగాల్లో ప్రవేశిస్తున్నారు. కాని ఇప్పటికీ రాజకీయ, ఆర్థిక అధికారాలున్న పదవులు మాత్రం పురుషులకే దక్కుతున్నాయి. ఉదాహరణకు ఎందరో స్త్రీలు విద్యారంగంలో ప్రవేశిస్తున్నప్పటికీ, అధ్యాపకులుగా రాణిస్తున్నప్పటికీ, నిర్ణయాత్మకమైన వైస్ చాన్సలర్ వంటి పదవుల్లో మాత్రం స్త్రీల సంఖ్య నామమాత్రంగా ఉంది.

మహిళలకు వనరులు అందకుండా చేయడమంటే, వారికి సామాజిక రంగంలో అవకాశాలు, ప్రాతినిధ్యం, పౌర, సమాజ విషయాల్లో నిర్ణయాత్మక స్థానం పరిమితం చెయ్యడమే. కనుక ఇలా సామాజిక, వ్యక్తిగత అనే తేడాలు తీసుకురావడం వల్ల కొందరికి లాభం చేకూరిందేమో గాని, స్త్రీలకు మాత్రం అన్యాయమే జరిగింది. అయితే ఇది అన్ని కులాలు, వర్గాలు, మతాల స్త్రీలకు వర్తిస్తుందని చెప్పలేం. మహిళల్లో కూడ విద్యకు, ఉపాధికి మంచి అవకాశాలున్న వారి పరిస్థితి, అవి అందుబాటులో లేని వర్గాలకు చెందిన మహిళల పరిస్థితి కంటే నయంగానే ఉంటుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

2. పితృస్వామ్యం అంటే ఏమిటి?

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

## 4.3 కుటుంబం, తదితర సామాజిక వ్యవస్థల్లో పితృస్వామ్య అధికారం

పితృస్వామ్య అధికారమన్నది కుటుంబంతో ప్రారంభమై, విద్య, ఉద్యోగం చేసే చోటు, మీడియా, చట్టం, మతం మొదలైన అన్ని సామాజిక వ్యవస్థల్లోను కనిపిస్తుంది. ముందుగా కుటుంబంలో దాని స్వరూపాన్ని పరిశీలిద్దాం.

### 4.3.1 కుటుంబంలో పితృస్వామ్యం

పురుషులు కుటుంబానికి అధిపతులు; వారికి కుటుంబ సభ్యులపై ఉన్న అధికారం, ఆధిపత్యం పూర్తిగా న్యాయబద్ధమైనవి. పుత్ర సంతానానికి ప్రాధాన్యం ఇవ్వడం, వివాహానంతరం భార్య, భర్త ఇంటిలోనే ఉండాలని, భర్త ఇంటి పేరు పెట్టుకోవాలని ఆదేశించడం; ఆహారంలో ఆడపిల్లలకు, మగపిల్లలకు మధ్య వ్యత్యాసం చూపడం (పోషకాహారాలైన పాలు, గుడ్లు, మాంసం వంటివి మగపిల్లలకు పెట్టడం), ఇంటిపనుల్లో ఎక్కువ భాగం మహిళలు, ఆడపిల్లలే చేయడం; ఆస్తిలో కొడుకుకే హక్కు ఉండడం, స్త్రీలకు ఆస్తిపై ఎటువంటి అధికారం లేకపోవడం వంటివన్నీ పితృస్వామ్యంలో పురుషుల అధికారానికి నిదర్శనాలు.

అన్నింటికంటె స్పష్టంగా పితృస్వామ్య అధికారం స్త్రీలను నియంత్రించడానికి ప్రయోగించే గృహహింసలో కనిపిస్తుంది. గృహహింస అంటే కేవలం శారీరక హింసే కాదు; మాటల ద్వారా చేసే హింస కూడా (విమర్శ, బెదిరింపు, అవమానాలు, చులకన చేసే మాటలు, స్త్రీల ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు), మానసిక హింస (స్త్రీలకు బయటకి వెళ్ళి ఉద్యోడం చేయడాన్ని నిషేదించడం; వారికి డబ్బు అందుబాటులో లేకుండా చూడడం; వారిని కుటుంబానికి, స్నేహితులకూ దూరం చేయడం; వారికిష్టమైన వ్యక్తులను బాధపెడతామని బెదిరించడం, వారిపై నిఘా ఉంచడం, వాళ్ళ ఇష్టానికి వ్యతిరేఖంగా వారితో లైంగిక చర్యలో పాల్గొనడం) మొదలైనవి.

### 4.3.2 సంస్థాగత అధికార సంబంధాలు

సంస్థాగతంగా చూసినపుడు కూడా అసమాన అధికార సంబంధాలు అనేక రూపాల్లో కనిపిస్తాయి. వేతనాల్లో అసమానత, పిల్లల సంరక్షణకు సదుపాయాల లేమి, పని చేసే చోట లైంగిక వేధింపులు, శారీరక బలహీనత, తక్కువ సామర్థ్యం సాకుతో స్త్రీలకు కొన్ని ఉద్యోగాలు నిరాకరించడం, సంస్థల్లో స్త్రీల పట్ల వివక్ష చూపడం, అధికారం ఇవ్వకపోవడం వంటివి. సంస్థల్లో ఒకవేళ అధికారాన్ని పంచినా, అది కూడా జండర్ దృక్పథంతోనే జరుగుతుంది. ఉదాహరణకు,

ఒక యువతి ఉద్యోగంలో ముఖాముఖికి వచ్చినప్పుడు, ఆమెను బోర్డు వివాహమయిందా అని ప్రశ్నించడం జరుగుతుంది. ఇక్కడ ఆమెకు పెళ్లయితే ప్రసూతి సెలవులడుగుతుందని, దానివల్ల సంస్థ ఉత్పాదకత దెబ్బ తింటుందని, కనుక మహిళలు బయటి ప్రపంచంలోకి వచ్చి ఉద్యోగాలు చెయ్యడం కంటే ఇంట్లో ఉండి, కుటుంబానికి సేవలు చెయ్యడమే సరైనదనీ ఆ ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి అభిప్రాయంగా స్పష్టమవుతుంది. అదే విధంగా పని చేసే చోట లైంగిక వేధింపులు మహిళలు రాజ్యాంగపరమైన జండర్ సమానత్వానికి, గౌరవంతో పని చేసే అవకాశానికి విఘాతం కలిగించడమే అవుతుంది. ఇది పూర్తిగా అధికార సూత్రం వర్తించే సన్నివేశమే. ఎందుకంటే ఇక్కడ వేధించే వ్యక్తి తరచు పై అధికారై ఉంటాడు. అందుకే ఎక్కువ సార్లు మహిళలు వేధింపులకు గురైనా, ఉద్యోగం పోతుందనో, ఉద్యోగంలో వివక్ష చూపుతారనో, పదోన్నతిని అడ్డుకుంటారనో వేధించే వ్యక్తి మీద ఫిర్యాదులు కూడా చెయ్యరు.

ఈ విధంగా అటు కుటుంబ వ్యవస్థ నుంచి, ఇటు అత్యున్నతమైన రాజకీయ నిర్ణయాత్మక స్థాయి వరకు స్త్రీ పురుషుల మధ్య అసమ అధికార సంబంధాలే ఉన్నాయి. వీటివల్ల స్త్రీలకు నష్టం జరుగుతోంది; పురుషులు ప్రయోజనాలు పొందుతున్నారు.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.
(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

3. కుటుంబంలో పితృస్వామ్యం గురించి వివరించండి.

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

## 4.4 అధికారంపై స్త్రీవాదుల విశ్లేషణ

గత అధ్యాయంలో చెప్పినట్లు అధికారమంటే ఆధిపత్యం, యాజమాన్యం. అయితే అధికారం గురించి మరో విధంగా కూడా ఆలోచించవచ్చు. స్త్రీవాద దృక్పథం నుంచి చూసినపుడు నియంత్రించే అధికారం అని కాక అధికారాన్ని సాధికారత అంటే మార్పు తీసుకురాగలది అని వీరు వ్యాఖ్యానించారు.

### 4.4.1 సాధికారత : వ్యక్తిగత అధికారం, సామూహిక అధికారం

వ్యక్తిగత అధికారమంటే అంతర్గతంగా ఉండే అధికారం, మరో మాటలో చెప్పాలంటే ఆత్మ విశ్వాసం. అవసరమైన వనరులు అందుబాటులో ఉండి, వివిధ నైపుణ్యాలు నేర్చుకునే అవకాశాలు లభించడం; ఇక్కడ అధికారమంటే తనలోనూ, తన చుట్టూ పరిసరాల్లోను గుణాత్మకమైన మార్పులు తీసుకురావడంలో తను నిర్వహించవలసిన పాత్ర గురించి ఎంపిక చేసుకునే, స్వీయ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ. సామూహిక అధికారం అంటే ఇతరులతో కలిసి ఇటువంటి గుణాత్మక మార్పును తీసుకువచ్చే అధికారం. ఈ సామూహిక అధికారం అన్నది ఏకాభిప్రాయం ఉన్న వారితో కలిసి బృందంగా ఏర్పడి అన్యాయాన్ని ఎదిరించడంలో, డిమాండ్ల సాధనకు ఉద్యమం చేయడంలో ప్రదర్శించే అధికారం.

స్త్రీవాద నిపుణులు సాధికారత అన్న పదాన్ని వ్యక్తిగత అధికారానికి, సామూహిక అధికారానికి ఉపయోగిస్తారు. అంటే తమ జీవితాల మీద అధికారం సాధిస్తూ, పరిసరాల మీద కూడా అధికారం సంపాదించడం ద్వారా, బలహీనమైన స్థితి నుంచి స్త్రీలు క్రమంగా ఎదగడం. ఇక్కడ అధికారమంటే మరొకరిని నియంత్రించే, ఆధిపత్యం చేసే అధికారం కాదు; మహిళా సాధికారత అంటే వ్యక్తిగత మార్పుకు, సామాజిక పరిణామానికి దోహదం చేస్తుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

4. సాధికారతలోని నిర్దిష్టమైన సూత్రమేమిటి?

--------------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------------

## 4.5 రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాటాలు

### 4.5.1 ఓటు హక్కు కోసం ఉద్యమాలు

పశ్చిమ దేశాల్లో మహిళలకు ఓటు హక్కు సులభంగా లభించలేదు. క్రీ.శ. 19-20 శతాబ్దాల్లో ఉత్తర అమెరికా, ఐరోపా దేశాల్లో మహిళల ఓటు హక్కు కోసం చాలా పోరాటాలు జరిగాయి. ఈ ఉద్యమాలకు స్ఫూర్తి 17/18వ శతాబ్దాలలో స్థిరపడిన మానవహక్కుల సిద్ధాంతం. మానవహక్కుల సిద్ధాంతమంటే మహిళలు, పురుషులు అన్నింటా సమానులని, ఇద్దరికి ఒకే రకమైన వనరులు అందుబాటులో ఉండాలని చెబుతుంది. కనుక, ఓటు హక్కు, ఆస్తి హక్కు వంటివి ఇద్దరికి సమానంగా ఉండాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉండాలని వీరు వాదించారు. ఓటు హక్కు నిరాకరించడమంటే సంపూర్ణ పౌరసత్వాన్ని నిరాకరించడమే కనుక, మహిళా ఉద్యమం తొలి దశలో రాజకీయ సమానత్వం కోసం, ఓటు హక్కు కోసం, విద్యాహక్కు కోసం, ఆస్తి హక్కు కోసం, రాజకీయ పదవుల్లో పోటీ కోసం జరిగింది.

తొలిసారి 1848 లో ఉత్తర అమెరికా స్త్రీవాదానికి పుట్టినిల్లుగా పరిగణించే న్యూయార్క్‌లోని సెనెకా ఫాల్స్‌లో ఎలిజెబెత్ స్టాంటన్, లుక్రీషియాల నాయకత్వంలో తొలి మహిళా హక్కుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో మహిళలకు ఓటు హక్కు, వివాహమైతే ఆస్తి హక్కు, భర్తలకు భార్యలపై ఉన్న చట్టపరమైన హక్కులు, అనేక ఉద్యోగాల్లో మహిళలకు ఉపాధి నిరాకరణ, మహిళలకు తక్కువ వేతనాలు, ఉన్నత విద్యావకాశాలు లేకపోవడం అనే అంశాలను చర్చించారు.

చిట్టచివరకు అమెరికా స్వాతంత్ర్య పోరాటం జరిగి పురుషులకు ఓటు హక్కు లభించిన 144 ఏళ్ళ తరువాత 1920 లో మహిళలకు ఓటు హక్కు లభించింది. భారతదేశంలో స్త్రీలకు అటువంటి పోరాటాలు చేయాల్సిన అవసరం రాలేదు. ఎందుకంటే వలస ప్రభుత్వ పాలన అంతమొంది, రాజ్యాంగం ఏర్పడగానే, ఇక్కడ స్త్రీ పురుషులిద్దరికీ సమానంగా ఓటు హక్కు లభించింది.

అయితే, ఓటింగ్ హక్కులు సమానంగానే ఉన్నప్పటికీ, మన దేశంలో మహిళలకు రాజకీయ విధాన నిర్ణయాల్లో తగినంత ప్రాతినిథ్యం లేదని పార్లమెంటులో మహిళల సంఖ్యను చూస్తే అర్థమవుతుంది. వ్యక్తిగత జీవిత రంగంలో అసమానతల వల్ల, ఇంటి బాధ్యతలు, పిల్లల పెంపకం వంటివి స్త్రీలకు ప్రతిబంధకాలుగా ఉంటూ, వారు సామాజిక రంగంలో పని చేసేందుకు అవరోధాలు కల్పిస్తున్నాయి.

### 4.5.2 సామాజిక - ఆర్థిక అసమానతలు, రాజకీయ భాగస్వామ్యం

సామాజిక శాస్త్ర పరిశోధనలను బట్టి, ఒక వ్యక్తి వద్ద ఉన్న సమయం, ధనం, నైపుణ్యాలు అన్నవి అతని రాజకీయ చర్యలను ప్రభావితం చేస్తాయి. కనుక, స్త్రీ పురుషుల మధ్య పెరుగుతున్న ఆర్థిక వ్యత్యాసాలు రాజకీయ రంగంలోను, నిర్ణయాత్మక రంగంలోను వారికి పురుషులతో సమాన ప్రతిపత్తి లేకుండా చేస్తున్నాయి. దీన్ని బట్టి సామాజిక, ఆర్థిక అసమానతలు రాజకీయంలో కూడా అసమానతలకు దారి తీస్తాయని తెలుస్తోంది. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా పురుషులతో సరితూగలేరు కనుక, వారు రాజకీయ రంగంలో, నిర్ణయాత్మక స్థానాల్లో కూడా వెనుకబడివున్నారు.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

5. ఓటింగ్ హక్కు లేకపోవడమంటే ఏమిటి? ఓటింగ్ హక్కు ఎందుకు ముఖ్యమైనది?

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

6. ఆర్థిక అసమానతలు, రాజకీయ భాగస్వామ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

## 4.6 సారాంశం

ఈ యూనిట్ అధికారమనే భావననూ, అధికారం, జండర్‌ల మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తుంది. ఇందులో మూడు ముఖ్యమైన అంశాలున్నాయి. ఒకటి - అధికార పంపిణీకి సంబంధించి స్త్రీ పురుషుల మధ్య నిరంతర అసమానతలు కనిపిస్తాయి. రెండు, జండర్ సంబంధాలన్ని అధికార సంబంధాలే. అంటే చారిత్రకంగా

చూసినపుడు, స్త్రీ పురుషులు నిర్వహించే పాత్రల్లో వారికి అందుబాటులో ఉన్న వనరుల్లో, నిర్ణయాత్మకతలో అసమానతలే కనిపిస్తాయి. స్త్రీ పురుషుల మధ్య ఉన్న ఈ అసమతుల్య సంబంధమే జండర్ సమానతకు అవరోధంగా ఉంది. మూడు, జండర్ అసమానతలు అక్కడితోనే ఆగక కులం, వర్గం, మతాల అసమానతలకు కూడా వ్యాపిస్తాయి. అంటే ఆధిపత్య కులాలు, వర్గాలు, మతాల స్త్రీ పురుషులకు అంతకంటే తక్కువ సామాజిక స్థాయిలో ఉన్న వారి కంటే ఎక్కువ అధికారాలుంటాయి.

## 4.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. అధికారం అన్న భావనను అధ్యయనం చేయడం వల్ల మహిళలపై జరిగే ఆధిపత్యాలకు కారణాలు, ఫలితాలను, యంత్రాంగాన్ని అర్థం చేసుకోవడం వీలవుతుంది.

2. పితృస్వామ్యమంటే స్త్రీ పురుషుల మధ్య అసమానమైన అధికార సంబంధాలతో కూడిన వ్యవస్థ. ఇది మహిళలకు, ఆడపిల్లలకు చదువుకునే హక్కును, సమాన వేతనాన్ని నిరాకరించడం, ఇంటి పనులో అధికభారం, వారసత్వపు, ఆస్తి హక్కు లేకపోవడం, సంతానోత్పత్తి హక్కులు లేకపోవడం, హింసకు గురికావడం వంటి వాటిని వ్యవస్థీకృతం చేస్తుంది.

3. కుటుంబంలో పితృస్వామ్యం ఉండడమంటే మగపిల్లల పట్ల అధిక శ్రద్ధ చూపడం, ఇంటి చాకిరీ ఆడవాళ్లకే ఉండడం, ఆడపిల్లల చదువుపై ఆంక్షలు విధించడం, వివాహానంతరం ఆడపిల్లల ఇంటి పేరు, ఇల్లు మారిపోవడం, పిల్లలకు తండ్రిపేరే రావడం, గృహ హింస మొదలైనవి. ఈ అలవాట్లు, సంప్రదాయాలు స్త్రీలపై పురుషుల ఆధిపత్యాన్ని న్యాయమైనదిగా చూపుతాయి.

4. సాధికారత అంటే అటు వ్యక్తిగత అధికారమూ, ఇటు సామూహిక అధికారం రెండూ ఉండడం. అంటే ఆత్మవిశ్వాసం, తన వనరులపై తనకు అధికారం ఉండడం, విభిన్నమైన నైపుణ్యాలను నేర్చుకుని తద్వారా జీవన ప్రమాణాలను పెంచుకునే అవకాశాలు కలిగివుండడం, తన విషయంలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, నిర్ణయాలు తీసుకునే అధికారాలు ఉండడం.

5. ఓటు హక్కుని నిరాకరించడమంటే సంపూర్ణ పౌరసత్వాన్ని నిరాకరించడమే. ఓటు హక్కు అంటేనే రాజకీయ సమానత్వానికి, నిర్ణయాత్మక స్థాయికి సంబంధించింది కనుక అది చాలా ముఖ్యమైన హక్కు.

6. రాజకీయాల్లో పాల్గొనాలంటే ధనం, సమయం, సమాజంలో మెలగడానికి అవసరమైన నైపుణ్యాలు ఉండాలి. ఇవి స్త్రీలకు అందుబాటులో లేనందువల్లనే నిర్ణయిత్మక స్థానాల్లో స్త్రీలు అసమానతలు ఎదుర్కోవలసి వస్తోంది. కనుక ఆర్థిక, సామాజిక అసమానతలే వారి రాజకీయ భాగస్వామ్యానికి అవరోధాలుగా ఉన్నాయి.

## 4.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**1. క్రింది ప్రశ్నలకు 30 లైన్లలో జవాబులు రాయండి.**

1. జండర్‌కు, అధికారానికి ఉన్న సంబంధాన్ని చర్చించండి. అధికారం స్వరూపాన్ని అర్థం చేసుకోవడంలో జండర్ అధ్యయనం ఏ రకంగా తోడ్పడింది.

2. పితృస్వామ్య అధికారం అంటే ఏమిటి? కుటుంబంలోను, ఇతర సామాజిక వ్యవస్థలోను ఇది ఏ విధంగా రూపుదాల్చుతుంది?

2. **క్రింది ప్రశ్నలకు 10 లైన్లలో జవాబులు రాయండి.**

1. వ్యవస్థీకృత అధికార సంబంధాలు

2. సాధికారతలో ఇమిడి ఉన్న అంశాలు

## 4.9 ముఖ్య పదాల అర్థ వివరణ

పితృస్వామ్యం : పితృస్వామ్యమంటే వాచ్యార్థం ''తండ్రి పాలన''. అంటే పురుషుడికి ఆధిపత్యాన్ని సూచిస్తుంది.

సామాజిక రంగం : బయటి ప్రపంచంలోని సామాజిక అంశాలకు సంబంధించినది. అంటే రాజకీయాలకు, ఆర్థిక విషయాలకు, ప్రధానంగా పురుషులు వ్యవహరించే రంగాలకు సంబంధించినది.

వ్యతిగత రంగం : అంతరంగిక జీవితమైన కుటుంబం, ఇంటి బాధ్యతలు, పిల్లల పోషణ, ఇవన్నీ స్త్రీలకే సంబంధించినవి.

## 4.10 ఆధారిత గ్రంథాలు

భాసిన్. కె. (1993) 'పితృస్వామ్యమంటే ఏమిటి?' న్యూఢిల్లీ, కాళీ ఫర్ విమెన్ ప్రచురణ

గీత. వి (2003) జండర్, కోల్‌కత్తా: స్త్రీ ప్రచురణ

# భాగం - 5 : జండర్ ఆధారిత హింస

విషయ క్రమం


5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 హింసలోని రకాలు

5.3 ప్రయివేటు హింస

- 5.3.1 గృహ హింస
- 5.3.2 ఆడ శిశువులను గర్భంలోనే చంపడం
- 5.3.3 వరకట్న వేధింపు
- 5.3.4 పరువు హత్యలు

5.4 బహిరంగ హింస

- 5.4.1 లైంగిక వేధింపు
- 5.4.2 అత్యాచారం
- 5.4.3 అపహరణ, ఎత్తుకు పోవడం
- 5.4.4 దేవదాసీలు, వ్యభిచారం
- 5.4.5 స్త్రీలను, పిల్లలను అక్రమంగా తరలించడం

5.5 హింసకు వ్యతిరేకం

5.6 సారాంశం

5.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

5.9 ముఖ్య పదాల అర్థ వివరణ

5.10 ఆధారిత గ్రంథాలు


## 5.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ కింది విషయాలను తెలుసుకుంటారు

- జండర్ పరంగా జరిగే వివిధ రకాల హింసలు
- హింస విషయంలో ప్రభుత్వం, చట్టాల పాత్రను అవగాహన చేసుకోవడం
- మహిళా సాధికారత విధానాలు, వ్యూహాలు పరిశీలించడం

## 5.1 పరిచయం

ముందు యూనిట్లలో భారతీయ సమాజం అధికార క్రమం కలిగి ఉంటుందని, అనాది నుంచి స్త్రీలు ఎవరో ఒకరి ఆధిపత్యం కిందే ఉన్నారని తెలుసుకున్నాం. కులం, వర్గం, పేదరికం, పితృస్వామ్యం, జండర్ తేడాలు స్త్రీల పట్ల హింసను, అత్యాచారాలను పెంపొందించాయి.

మహిళల పట్ల హింసా నిర్మూలన ప్రకటన తన పీఠికలో ఇలా చెప్తుంది : జండర్ ఆధారిత హింస "చారిత్రకంగా స్త్రీ పురుషుల మధ్య ఉన్న అసమతుల్య అధికార సంబంధాల వ్యక్తీకరణ. దీనివల్ల స్త్రీలపై పురుషుల ఆధిపత్యం, వివక్ష కలిగాయి. ఇది స్త్రీలు సంపూర్ణ ప్రగతి సాధించకుండా నివారించాయి" అని చెప్పింది.

స్త్రీలను అణచిఉంచడం, హింసించడం వల్ల వారి ఆరోగ్యం, ఉద్యోగం, సామాజిక, రాజకీయ జీవితాలలో వారి భాగస్వామిత్వంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. సమానత్వం, అభివృద్ధి, శాంతి అనే లక్ష్యాల సాధనలో స్త్రీలను హింసించడం అవరోధంగా నిలుస్తుంది. దీనివల్ల స్త్రీల మానవ హక్కులు, ప్రాథమిక స్వాతంత్ర్యాలకు భంగం కలుగుతుంది.

## 5.2 హింసలోని రకాలు

దైనందిన జీవితంలో రకరకాల హింసను చూస్తుంటాం. లైంగికంగా బాధించడం, మానభంగం, భార్యను కొట్టడం, హింసిస్తూ ఆనందించడం, మానసికంగా వేధించడం, వరకట్న హత్యలు, మతహింస, బలవంతంగా వ్యభిచారం చేయించడం, ఆర్థికంగా అణగదొక్కడం, కదలికలను నిరోధించి స్వేచ్ఛ లేకుండా చేయడం మొదలగునవి. హింసకు గురైన స్త్రీలు, పిల్లలు ఒంటరితనం, నిస్సహాయత, నిరాశ, భయం, బాధ, షాక్, విచారం, అపరాధభావం, ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి వాటికి లోనవుతారు. చాలా సార్లు భర్త, అత్తమామలు పెట్టే వేధింపులను కుటుంబాన్ని రక్షించుకోవడం కోసం, శాంతి కోసం భరిస్తూ ఉంటారు.

మహిళల పట్ల హింసా నిర్మూలన ప్రకటనను ఐరాస జనరల్ అసెంబ్లీ 1993లో చేసింది. మహిళలను హింసించే ప్రక్రియ జండర్ ఆధారిత హింస అనీ, దీనివల్ల శారీరక, లైంగిక, మానసిక హాని జరుగుతుందని చెప్పింది. ఆంతరంగిక, బాహ్య జీవితాలలో బలవంతం చేయడం, స్వేచ్ఛను హరించడం హింస కిందకే వస్తాయని నిర్వచించింది.

హింసను సాధారణంగా ఇలా వర్గీకరిస్తారు. ప్రయివేటుగా జరిగేది. సామాజికంగా జరిగేది.

1. ప్రయివేటుగా జరిగే హింస కుటుంబంలో గాని, ఒక సమూహంలో లేదా ఒక నిర్దిష్ట కమ్యూనిటీలో జరిగేది.
2. సామాజిక హింస సాధారణంగా కమ్యూనిటీలో జరిగేది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

1. జండర్ ఆధారిత హింస అంటే ఏమిటి? స్త్రీలపై హింస వల్ల జరిగే పరిణామాలను చర్చించండి.

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

## 5.3 ప్రయివేటు హింస

హింసకు వ్యతిరేకంగా పోరాడుతూ స్త్రీవాదులు ముఖ్యమైన నినాదాన్ని సృష్టించారు - ''ప్రయివేటు అంటే పబ్లిక్. వ్యక్తిగతం అంటే రాజకీయం''. పూర్తిగా ప్రయివేటు అనిగాని, పూర్తిగా పబ్లిక్ అనిగాని ఉండదని స్త్రీవాదులు అంటారు. వ్యక్తిగతంగా స్త్రీ చేసే ప్రతిచర్య సమాజంపై ప్రభావం చూపిస్తుంది. ఉదాహరణకు ఒక స్త్రీ గనుక గృహహింసను మౌనంగా భరిస్తే, భర్తకు, పిల్లలకు, పొరుగువారికి అందరికీ హింస జీవితంలో భాగమేననే సందేశ మిచ్చినట్లుగా భావించాలి. పితృస్వామ్యం స్త్రీ స్థానం, గృహానికే పరిమితం అని చెబుతుంది. స్త్రీవాదులు దీనిని తిరస్కరించి వ్యక్తిగతమే రాజకీయం అని చెప్పారు.

### 5.3.1 గృహ హింస

కుటుంబంలోని వారు స్త్రీలపై జరిపే హింస గృహహింస. గృహహింస విశ్వవ్యాప్త దృగ్విషయం. పితృస్వామిక సమాజంలో స్త్రీలను తక్కువగా చూసేలా చేస్తుంది. గృహహింస, నిరుద్యోగం, ఒత్తిడి, పేదరికం, శారీరక అవయవ లోపం, భౌతిక వనరులు లేకపోవడం వంటి వ్యక్తిగత సమస్యల వల్ల జరగవచ్చు. గృహహింసకు మరో ముఖ్యమైన కారణం పితృస్వామిక సమాజంలో స్త్రీలపై పురుషుల నియంత్రణ ఉంటుంది. జండర్ ఆధికార సంబంధాలు ఆధారంగా ఏర్పడిన పురుషాధిపత్యం, స్త్రీలు పురుషులపై ఆధారపడి ఉంటారని భావించడం, సామాజిక, ఆర్థిక, రాజకీయ వరులపై పురుషుల నియంత్రణ కూడా గృహ హింసకు కారణాలుగా అర్థం చేసుకోవచ్చు. ఇతర కారణాలలో మధ్యపానం, వివాహేతర సంబంధాలు, దృక్పథాల వైరుధ్యం, కొడుకును కనలేకపోవడం,తక్కువ కట్నం లేకపోవడం వంటివి చాలా ఉంటాయి.

హింసకు కారణం ఏదైనా, హింసవల్ల నిరాశ, నిస్పృహ, మానసికంగా క్రుంగిపోవడం వంటి పరిణామాలు కలుగుతాయి. అరుపులు, కేకలు, దెబ్బలు కొడుతున్నపుడు వచ్చే శబ్దాలు, గాయాలు, ఏడవడం, ఆకలి లేకపోవడం, వినికిడి లోపం, సిగరెట్‌తో కాల్చడం వల్ల గాయాలు, ఆత్మవిశ్వాసం లోపించడం వంటివన్నీ హింసను సూచిస్తాయి.

భారతదేశంలో మహిళల హోదాపై నియమించిన కమిటీ 1974లో ''టువార్డ్స్ ఈక్వాలిటీ'' (towards equality) అనే నివేదికను సమర్పించింది. అభివృద్ధిని, ప్రజాస్వామ్యాన్ని జండర్ దృక్పథంతో చూడాలని ఈ నివేదిక ఒక వాస్తవాన్ని కళ్ళ ముందుంచింది. సెక్స్ నిష్పత్తి తగ్గడం, బాలికా విద్య వంటి సమస్యలకు ఇది ప్రాధాన్యమిచ్చింది. భారత స్త్రీలు ఎదుర్కొంటున్న వరకట్న సంబంధిత హింసను ప్రత్యేకంగా చెబుతూ భారతీయ మహిళా ఉద్యమాలకు ఈ నివేదిక మార్గం వేసింది. ఈ చర్చల్లో భాగంగా కొట్టడం, అత్యాచారం, సెక్స్ (ఆడ, మగ) నిర్ధారణ, లైంగికత అనేవి ముందు వరుస నాక్రమించాయి. అత్యాచారం పైన జరిగిన చర్చలో కస్టోడియల్ రేప్ పైనే దృష్టి పెట్టారు. వివాహితపై భర్త చేసే అత్యాచారం, కటుంబంలో స్త్రీలపై జరిగే అత్యాచారం గురించి చర్చలు చేయలేదు.

#### గృహహింస చట్టం, 2005

స్త్రీలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి 2005లో గృహహింస చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించారు. న్యాయ వ్యవస్థకు, మహిళా ఉద్యమానికి వేసిన ముందడుగులో ఇది మైలురాయి. ఈ చట్టం మౌఖిక, మానసిక, ఆర్థిక, లైంగిక వేధింపుల గురైన బాధితులకు న్యాయసహాయం అందిస్తుంది. ఈ చట్టం ద్వారా రక్షణ ఉత్తర్వు కోసం బాధితురాలు ఒక పోలీసు అధికారి, ప్రొటెక్షన్ ఆఫీసర్, సేవాధికారి లేదా మేజిస్ట్రేటును ఆశ్రయించి రక్షణ పొందవచ్చు. భారత శిక్షాస్మృతి సెక్షన్ 498 - ఏ ప్రకారం ఫిర్యాదు చేసే హక్కు కూడా బాధితురాలికి ఉంది. అదనంగా బాధితురాలికి ఆశ్రయం పొందే హక్కు ఉంది. అవసరమైతే ఆశ్రయ గృహంలో కూడా ఉండవచ్చు.

గృహహింస చట్టం 2005 లో మహిళల రక్షణకు సంబంధించిన ముఖ్యాంశాలు:

- అత్యవసర కేసుల విషయంలో బాధితులకు తక్షణ సహాయం ఏర్పాటు చేస్తుంది.
- గృహంలోపల అసమానత్వాన్ని గుర్తిస్తుంది.
- న్యాయం జరిగే సమర్థ చర్యలు అందుబాటులో ఉంచుతుంది.

కుటుంబంలో హింసకు గురవుతున్న స్త్రీ గృహహింస చట్టం 18-23 సెక్షన్ల ప్రకారం సమీపంలోని మేజిస్ట్రేటు కోర్టును ఆశ్రయించి సహాయం కోరవచ్చు. భార్య, పిల్లల పోషణకు చట్టం అవకాశం కల్పిస్తుంది. విడిగా నివసించే స్త్రీలను భర్త అనవసరంగా బాధించకుండా రక్షణ చర్యలు చేపడుతుంది. ఒకవేళ భార్య గనుక భర్త గృహంలోనే నివసిస్తూ ఉంటే, ఆమెను బయటకు వెళ్ళగొట్టకుండా రక్షణ ఏర్పాటు చేస్తుంది. ఉమ్మడి ఆస్తిని భర్త అమ్మకుండా చట్టం నివారిస్తుంది. పిల్లల సంరక్షణను చట్టం భార్యకు ఇవ్వవచ్చు. పై విధంగానే కాకుండా, భార్య స్థానిక పోలీసు స్టేషనులో గృహహింస గురించి ఫిర్యాదు కూడా చేయవచ్చు.

### 5.3.2 ఆడ శిశువులను గర్భంలోనే చంపడం

పితృస్వామ్య వ్యవస్థలో పురుషులను గొప్పగా, ఆడపిల్లలను ఆర్థిక భారంగా చూస్తారు. ఈ నమ్మకం వల్ల సమాజం కొడుకులను కనడాన్ని ప్రోత్సహిస్తుంది. లింగ నిర్ధారణ పరీక్షల వల్ల ఆడ పిల్ల అని తెలిస్తే, గర్భంలో ఉండగానే గర్భవిచ్ఛిత్తి చేసుకోవడం పెరుగుతూ ఉంది. చట్టం లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధించినా, దేశవ్యాప్తంగా ఈ నాటికీ ఇవి జరుగుతూనే ఉన్నాయి. నవజాత ఆడశిశువులను పీకనొక్కో, విషం పెట్టో, నీళ్ళ బకెట్‌లో ముంచో చంపేస్తున్నారు. గర్భంలోని ఆడపిండాలను విచ్ఛిత్తి చేసుకునే వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతూ ఉంది. ఆడ, మగ నిష్పత్తిలో ఆడవారి నిష్పత్తి తగ్గుతూ ఉంది.

ప్రసవ పూర్వ నిర్ధారణ(దుర్వినియోగ నియంత్రణ నివారణ) నివారణ సవరణ చట్టన్ని 1994 లొ రూపొందించారు. దీనికి గర్భధారణ, ప్రసవపూర్వనిర్ధారణ (లింగనిర్ధారణ నిషేధ) చట్టం అని పునర్నామకరణం చేశారు. ఇది 2003 లో అమలులోకి వచ్చింది. గర్భధారణకు ముందుగాని, తరువాత గాని జరిగే లింగ నిర్ధారణను చట్టం నిషేధిస్తుంది. అల్ట్రాసౌండ్ ద్వారా జన్యుపరమైన వైకల్యాల నిర్ధారణను గాని, ఇతర లోపాలను గాని నిర్ధారించే నైపుణ్యాల పరీక్షలను నియంత్రిస్తుంది. నర్సింగ్ హోంకాని, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ గాని, ఆసుపత్రిగాని లింగ నిర్ధారణ కోసం అల్ట్రాసౌండ్ పరీక్ష ఉపయోగించం అని ప్రకటించి ఈ పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఈ చట్టాన్ని అతిక్రమించినట్లు తెలిస్తే, వైద్యుడి రిజిస్ట్రేషనును రాష్ట్ర వైద్యమండలి రద్దు చేయవచ్చు. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ కోరే వ్యక్తికి మూడేళ్ళ జైలు శిక్ష, (మొదటి సారి నిందితుడని తేలినప్పుడు) రూ. 50,000 జరిమానా వేయడం జరుగుతుంది. అయితే భారతదేశంలో కాగితం మీదున్న చట్టానికి, దాని ఆచరణకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది.

### 5.3.3 వరకట్న వేధింపు

వివాహం సమయంలో ఆడపిల్లకు కట్నమివ్వడం భారత దేశంలో సర్వసాధారణ అలవాటు. వధువు తండ్రి వరుడి కుటుంబానికి డబ్బుకాని, వస్తు రూపేణా కాని చేసే చెల్లింపు కట్నం. వివాహ ఖర్చులకు, ఆడపిల్లకు కుటుంబ ఆస్తిలో భాగం రాదు కనుక కొంత ఆస్తి ఇవ్వడం ఉండేది. ఇది కాలక్రమంలో ఆడపిల్ల కుటుంబంపై భారంగా మారింది. అత్తమామలకు కట్నంతో తృప్తి లభించకపోతే, కట్నం కోసం హింసించడం, హత్య చేయడం జరుగుతున్నాయి. భారత నేరాల రికార్డు బ్యూరో వరకట్న సంబంధిత మరణాలు పెరుగుతున్నాయని చెబుతుంది.

భారతదేశంలో వరకట్న హింసకు పలు కారణాలున్నాయి. అవివాహిత అయిన ఆడపిల్ల కుటుంబంపై సామాజిక, ఆర్థిక భారంగా భావింపబడుతుంది. వివాహం విజయవంతం కావడం, దంపతులు సంతోషంగా ఉండడం అనేది వరకట్నం పైనే ఆధారపడి ఉంటుందని హిందూ సంప్రదాయం నమ్ముతుంది. కాలక్రమంలో వరకట్నం సామాజిక హోదాను ప్రదర్శించే పద్ధతిగా మారింది. వరకట్నంతో తృప్తి చెందని పక్షంలో స్త్రీల వేధింపు, కొట్టడం, చంపడం జరుగుతూ ఉంది.

వరకట్న నిషేధ చట్టం 1961 ప్రకారం వివాహ సమయంలోగాని, ముందు గాని, తరువాత గాని ఇస్తామని ఒప్పుకున్న ఆస్తిని, విలువైన భద్రతని ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఒక వర్గం మరో వర్గానికి ఇచ్చే పద్ధతిని వరకట్నంగా నిర్వచించింది. కట్నం ఇస్తున్న వ్యక్తిగాని, తీసుకుంటున్న వ్యక్తి గాని కనీసం అయిదేళ్ళ జైలు శిక్షకు అర్హుడు. రూ. 15000/- జరిమానా విధించడం గాని, కట్నం ఎంతైతే అంత జరిమానా గాని, రెండింటిలో ఏది ఎక్కువైతే అంత జరిమానా చెల్లించాలి. కాల్చడం, గాయం వల్ల స్త్రీ చనిపోయినా, లేకపోతే సాధారణ పరిస్థితులలో వివాహమైన ఏడేళ్ళలోపు స్త్రీ మరణిస్తే, కట్నం వేధింపు వల్ల ఆమెను హింసించినందువల్ల ఆ మృతి సంభవించిందని వెంటనే నిర్ధారణ జరిగినా వరకట్న మరణంగా భావిస్తారు. వరకట్న మరణానికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ళు కాని, జీవితకాలం కాని జైలు శిక్ష పడవచ్చు. భారతీయ కుటుంబాలు చాలా వాటిలో వరకట్న దురాచారం ఇంకా కొనసాగుతూనే ఉంది.

### 5.3.4 పరువు హత్యలు

పరువు హత్య ప్రతీకారం తీసుకునే చర్యగా భావించవచ్చు. దీనిలో కుటుంబంలోని వ్యక్తి లేదా ఒక సామాజిక వర్గంలోని వ్యక్తి వలన అపకీర్తి వస్తుందని భావించి ఆ కుటుంబంలోని ఇతర వ్యక్తులుగాని, సమాజంలోని వారు గాని వారిని బలవంతంగా చంపడం వలన హింస సార్వజనికమైన అభివ్యక్తి కలిగి ఉంటుంది. తాము చేస్తున్న పని సామూహికంగా కులం, కమ్యూనిటీ, మతం లేదా గ్రామానికి సంబంధించిన ప్రయోజనం అనుకుంటే హింస సరైనదే అని, తగినదేనని భావించి హింసకు సిద్ధమవుతారు. ఈ ప్రయోజనాన్ని ఎవరు అతిక్రమించినా, మహిళలను, స్త్రీలను చంపడానికి కూడా వెనుకాడరు. ఇలా పరువు మానవులను వారి మనోభావాలు, సామాజిక విలువల చేతిలో కీలుబొమ్మలుగా మారుస్తుంది.

తమ ఊరికే చెందినా, నిషధిత జాతిలోని అబ్బాయిని పెళ్ళి చేసుకున్న అమ్మాయిని చంపెయ్యమని కుల పంచాయితీలు కుటుంబసభ్యులను ఆదేశించిన కేసులు ఎన్నో ఉత్తరప్రదేశ్, హర్యానాల్లో ఉన్నాయి. తరుచూ బాధితులు మహిళలు, తక్కువ కులాల వారు అయి ఉంటారు. వార్తా పత్రికల నివేదికల ప్రకారం పరువు హత్యల సంఖ్య పెరుగుతూనే ఉంది. గణాంకాల ప్రకారం 2014లో భారతదేశంలో 28 పరువు హత్యలు నమోదైతే, 2015 లో 215 కేసులు నమోదయ్యాయి. మహిళా సంఘాలు, మహిళా కార్యకర్తలు ఈ సమస్యను ప్రాధాన్యత కలిగినదిగా గ్రహించి అవసరమయిన చట్టాన్ని రూపొందించి, ఈ అలవాటుకు స్వస్తి పలకాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

2. గృహ హింస అంటే ఏమిటి? గృహ హింస చట్టంలో మహిళలకు సహాయం చేసే అంశాలు పేర్కొనండి?

-----------------------------------------------------------------------------------------------------------------

-----------------------------------------------------------------------------------------------------------------

-----------------------------------------------------------------------------------------------------------------

## 5.4 బహిరంగ హింస

### 5.4.1 లైంగిక వేధింపు

లైంగిక వేధింపు అంటే ఇష్టం లేకుండా స్పృశించాలని చూడడం, లైంగిక అభ్యర్థన, లైంగికంగా గాని, మాటల ద్వారా లేదా ప్రవర్తన ద్వారా గాని లైంగిక విషయంగా వేధించడం. లైంగిక వేధింపులో శరీరాన్ని స్పృశించడం గాని ఆ అర్థం వచ్చేలా ప్రవర్తించడం గాని, లైంగిక కోర్కె తీర్చమని కోరడం, లైంగిక కోర్కెను తెలిపే వ్యాఖ్యలు, ఇష్టం లేని శారీరక, మౌఖిక, మౌఖికేతర ప్రవర్తనను వ్యక్తం చేయడం ఉంటాయి. పితృస్వామిక సమాజంలో పురుషాధిపత్యం ఉన్న చోట ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు ఇటువంటి వేధింపులకు గురవుతూ ఉంటారు. దైనందినంగా స్త్రీలపై జరుగుతున్న హింసకు మరో రూపం ఈ లైంగిక వేధింపులు. ఇది వివక్షను అధికం చేసి, స్త్రీలు దోపిడీ, భయం, బెదిరింపు, తిరస్కారాలకు గురిచేసే వాతావరణాల్లో మనుగడ సాగించాల్సిన పరిస్థితిని కల్పిస్తుంది.

లైంగిక స్వభావం కలిగిన మాటలు, శారీరక సంబంధం, లైంగిక ఆనందం కోసం చేసేవి, పదవి ఉన్నతి కోసం పరిహారంగా లైంగికానందాన్ని కోరడం, అధికారంలో ఉన్న స్త్రీలను కించపరచడం, స్త్రీలపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం, స్త్రీలను అసౌకర్యానికి గురి చేసే విధంగా ప్రవర్తించడం లైంగిక వేధింపు కిందకు వస్తాయి.

లైంగిక వేధింపులు స్త్రీలపై తీవ్రమైన వ్యతిరేక ప్రభావాన్ని చూపించవచ్చు. దీని పర్యవసానాలు ఇలా వుండవచ్చు.

- ఉద్యోగం పోవడం - స్త్రీ భయం వలన గాని, అనాసక్తత లేదా నిరసనగా ఉద్యోగం వదిలివేయవచ్చు.
- మానసిక అత్యాచారం - భయం, ఆత్మగౌరవం లోపించడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం, అవమానం, తామే దీనికి కారణమనే అపరాధ భావన.
- స్రీల చలనశీలతపై ఆంక్షలు
- బాధితురాలు తప్పులు చేయడం ఆరంభించవచ్చు - నైతికంగా, ప్రవర్తనాపరంగా దిగజారిపోవచ్చు.

**విశాఖ VS రాజస్థాన్ ప్రభుత్వం తీర్పు**

భన్వారిదేవి రాజస్థాన్‌లో బాల్యవివాహాల నివారణకు కృషి చేస్తోంది. అగ్రకుల గూర్జర కమ్యూనిటీ వ్యక్తి తొమ్మిది నెలల కూతురికి చేస్తున్న వివాహాన్ని ఆమె అడ్డుకుంది. ఆమె పైన ఆగ్రహించిన గూర్జర పురుషులు అయిదుగురు ఆమెపై సామూహిక అత్యాచారం జరిపారు. గ్రామంలో అందరూ వ్యతిరేకించినా, ఆమె అత్యాచారం గురించి కోర్టులో కేసు పెట్టింది. న్యాయమూర్తి ఆమె చెప్పిన విషయం నమ్మకుండా, దళిత స్త్రీపై, అగ్రకుల పురుషులు అత్యాచారం చేసి ఉండరని తీర్పు చెప్పారు. కొన్ని మహిళా సంస్థలు కలయికతో ఏర్పడిన, విశాఖ సంస్థ ఈ తీర్పుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. 1997 లో భారత సుప్రీంకోర్టు లైంగిక వేధింపు స్త్రీలపై ఒకరకమైన వివక్ష అని, ఇది రాజ్యాంగంలోని సమానత్వ హక్కును అతిక్రమించడమేనని చెప్పింది. ప్రతి సంస్థ యజమాని మహిళా ఉద్యోగుల విషయంలో ఆచరించవలసిన మార్గదర్శక సూత్రాలను కొన్నింటిని కోర్టు నిర్దేశించింది. 2013లో పని ప్రదేశంలో లైంగిక వేధింపును నియంత్రించే విధంగా ప్రత్యేక చట్టం వచ్చింది. అన్ని సంస్థల్లోను లైంగిక వేధింపుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు స్వీకరించే కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆ చట్టం నిర్దేశించింది.

### 5.4.2 అత్యాచారం

అత్యాచారం వల్ల స్త్రీ శారీరకంగానే కాక, మానసికంగా కూడా బాధింపబడుతుంది. అంతేకాక లైంగిక దుష్ప్రవర్తనకు స్త్రీ కారణమైనా, కాకపోయినా ఆ చర్యకు కుటుంబం స్త్రీనే బాధ్యురాలిగా చూస్తుంది. భారతదేశంలో అత్యాచారం కేసులు పెరుగుతున్నాయి. 2013లో 24,923 అత్యాచార కేసులున్నాయని నేషనల్ క్రైమ్ బ్యూరో తెలుపుతోంది. అత్యాచారం వయసు, కులం, ప్రాంతానికి పరిమితం కాదు. 1972 లో మధుర అనే గిరిజన బాలికపై పోలీసు స్టేషనులో అత్యాచారం జరిపినట్లుగా చదివే ఉంటారు. కోర్టులో విచారణ జరిగిన తర్వాత ఆమెకు గాయమైనట్లుగా ఆధారాలు లేవు కనుక మధురపై అత్యాచారం జరగలేదని కోర్టు నమ్మింది. పోలీసులను నిరపరాధులుగా కోర్టు వదిలేసింది. మధుర అత్యాచారం కేసు భారతదేశంలో మహిళల ఉద్యమానికి ప్రోత్సాహక కారణమైంది. మహిళా సంఘాల నిరసనల వల్ల అత్యాచారచట్టంలో మార్పులు వచ్చాయి. మొదట 1983లో, తర్వాత 2003లో. తర్వాత ఢిల్లీ గ్యాంగ్ రేప్ కేసులో 2013లో మళ్ళీ అత్యాచార చట్టాల్లో కొన్ని మార్పులు వచ్చాయి.

2013లో క్రిమినల్ లా (సవరణ) బిల్లు అంటే అత్యాచార వ్యతిరేక బిల్లు ఇప్పుడు చట్టమైంది. 2012 డిసెంబరు 16న న్యూఢిల్లీలో ఒక అర్ధరాత్రి జరిగిన సామూహిక మానభంగం కేసుతో దేశమంతా ఆగ్రహంతో అట్టుడికి పోవడంతో ఈ చట్టం 2013, ఫిబ్రవరి 3వ తేదీన అమలులోకి వచ్చింది. ఆ రోజున ఒక ఫిజియోథెరపీలో ఇంటర్న్‌గా పని చేస్తున్న యువతి ఢిల్లీలో అత్యాచారానికి గురైంది. పదమూడు రోజుల తర్వాత, భారతదేశంలోను, సింగపూర్‌లోను చికిత్స తీసుకున్న తర్వాత కూడా ఆమె చనిపోయింది. ప్రసిద్ధమైన నిర్భయ ఉదంతానికి అంతర్జాతీయంగా చైతన్యం వచ్చింది. ప్రజా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ఘటన జరిగిన ఆరు రోజుల తర్వాత 2012, డిసెంబరు 22 న కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జె.ఎస్. వర్మ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిటీని వేశారు. లైంగిక అత్యాచారం కేసుల్లో తగిన శిక్షలు విధించే విధంగా సవరణలు సూచించడం ఈ కమిటీ పని. ఈ చట్టం భారత శిక్షాస్మృతిలో అంతకు ముందు లేని విధంగా లైంగిక కార్యకలాపాలు చూసి తృప్తి పడడం, ఆడవారి వెంటపడడం కూడా శిక్షార్హమని చెప్పింది. వ్యక్తుల ఏకాంతజీవితాన్ని రక్షించే అంశాలు పొందుపరిచింది. అంటే లైంగిక దాడి జరగక ముందు బాధితురాలి లైంగిక చరిత్రను పరిశీలించే విధానం ఆపివేసింది. ఈ చట్టం ద్వారా భారత శిక్షాస్మృతిలో చేసిన ప్రధాన సవరణల వల్ల కొన్ని నేరాలను, కొత్తగా చేస్తున్న యాసిడ్ దాడులు వంటి వాటిని చట్టపరిధిలోకి తెచ్చి శిక్షాస్మృతి వీటిని నిర్వచించింది. అత్యాచారం నిర్వచనం కూడా పురుషాంగాన్ని యోనిలోకి బలవంతంగా చొప్పించడం

అనే దానికే పరిమితం చేయలేదు. ఏదైనా వస్తువును గాని, స్త్రీ యోనిలోకి మూత్రాశయం, మలాశయంలో ఏదైనా శరీరావయాన్ని గాని పెట్టడం వంటివి కూడా అత్యాచారమేనని నిర్వచించింది. నోటి ద్వారా లైంగిక చర్య జరపడం కూడా అత్యాచారమేనని నిర్వచించింది.

### 5.4.3 అపహరణ, ఎత్తుకుపోవడం

అమ్మాయిలను అపహరించడం, ఎత్తుకుపోవడం సమాజంలో సర్వసాధారణమైంది. అమ్మాయిలను అపహరించడానికి కారణం డబ్బుకోసమే కాక, లైంగిక అత్యాచారం కోసం కూడా. కుటుంబం మీద కక్ష తీర్చుకోవడానికి బాధిత కుటుంబాల వ్యక్తులు బాలికలను ఎత్తుకుపోయి లైంగికంగా దుర్వ్యవహారం జరుపుతారు. అమ్మాయిలను ఎత్తుకుపోయి బలవంతంగా బిచ్చగత్తెలుగాను, వ్యభిచారులుగా చేయడానికి ఇతర లైంగిక నేరాలకు, బ్లాక్‌మెయిల్ చేయడానికి వాడుకుంటారు. భారతశిక్షాస్మృతిలో 363-369 మరియు 371-373 సెక్షన్లు ఎత్తుకుపోవడం, బలవంతంగా అపహరించడం గురించి ఉన్నాయి. ఏ మహిళకైనా ఇష్టం లేని వివాహం చేయడానికి లేదా లైంగిక అత్యాచారం చేయడానికి ఎత్తుకుపోవడం, బలవంతంగా అపహరించడం చేసే పదేళ్ళ జైలు శిక్ష, జరిమానా పడుతుంది.

### 5.4.4 దేవదాసీలు, వ్యభిచారం

హిందూ సమాజంలో దేవదాసీ విధానం సంస్కృతిపరంగా ఆమోదించిన పద్ధతి. బాలికను ఒక దేవుడికి అంకితం చేస్తారు లేదా దేవాలయానికి లేదా కొలిచే విగ్రహానికి అంకితమిస్తారు. అక్కడ స్త్రీని లైంగికంగా వేధిస్తారు. ఈ విధానంలో ఉన్నవారు కొన్ని ప్రాంతీయ భేదాలతో భారతదేశమంతటా ఉన్నారు. దేవదాసీని నిత్య సుమంగళిగా భావిస్తారు. ఆమెకు దేవుడితో వివాహం జరుగుతుంది కనుక ఆమె ఎన్నటికీ విధవరాలు కాదు. గతంలో దక్షిణాసియాలో ముఖ్యంగా భారత్, శ్రీలంకల్లో ఈ ఆచారం ప్రబలంగా ఉండేది. దేవాలయ వ్యవస్థలో దేవదాసీలు ఒక భాగం. పితృస్వామ్య సమాజంలోని ఇతర స్త్రీల వలె కాకుండా, అంకితమైన బాలికలు విద్య నేర్చేవారు, సొంత ఆస్తిని కలిగి ఉంటారు. సమాజంలో వారికి కొన్ని హక్కులుంటాయి. ఈ స్త్రీలకు దేవాలయాల క్షీణత వల్ల ఆదరణ తగ్గడంతో వారు వేశ్యావృత్తిలోకి దిగారు. సాంఘిక సంస్కరణోద్యమాలు, రాజారామమోహనరాయ్, పెరియార్, ముత్తులక్ష్మీ రెడ్డి, ఎస్. ముత్తయ్య మొదలియార్, సర్.సి.పి. రామస్వామి అయ్యర్, ఎం. కృష్ణన్ నాయర్, సి.ఎన్. అన్నాదురై కరుణానిధి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, గోవిందరానడే, ధోండో కేశవ్ కార్వే ఇతర ప్రముఖ సాంఘిక మేధావులు చేపట్టిన సాంఘిక సంస్కరణోద్యమాలు దేవదాసీ విధానాన్ని ప్రశ్నించి, రద్దుచేయాలని కోరారు. దేవదాసి వ్యవస్థను నిషేదించడానికి 1934లో బొంబాయి దేవదాసి రక్షణ చట్టం మొదటిసారిగా వచ్చింది. ఈ చట్టం దేవదాసీలు వివాహం చేసుకోవడానికి వెసులుబాటు కల్పించింది. బాలికలకు దేవుడికి బలవంతంగా అంకితం చేయడాన్ని నిషేదించింది. ముత్తులక్ష్మిరెడ్డి ప్రయత్నాల వల్ల మద్రాసు ప్రెసిడెన్సీలో దేవదాసీ నివారణ బిల్లు ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మద్రాసు దేవదాసీ (దేవదాసి నివారణ) చట్టం వచ్చింది 1947లో. 1988లో భారతదేశమంతటా ఈ విధానాన్ని నిషేదించారు. అయితే ఈనాటికీ భారతదేశంలోని కొన్ని చోట్ల ఇంకా ఈ ఆచారం కొనసాగుతూనే ఉంది.

స్త్రీలను లైంగికంగా దోపిడీకి గురిచేసే మరో ఆచారం వేశ్యావ్యవస్థ. వివాహేతర సంబంధాల వల్ల, అక్రమ లైంగిక సంబంధాల వల్ల వేశ్యావృత్తి పోషించబడుతూ ఉంటుంది. డబ్బుకోసం అక్రమంగా లైంగిక కార్యం నిర్వహించడం వల్ల వేశ్యలను కమర్షియల్ సెక్స్ వర్కర్లు (CSW) అంటారు. వీరు రెండు రకాలు. వృత్తి నిపుణులు, వృత్తి నిపుణులు కానివారు. వృత్తి నిపుణుల్లో వేశ్యా గృహాలు నడిపేవారు, కాల్‌గర్ల్స్ ఉంటారు. రెండో రకం వారిలో ఎత్తుకుపోబడిన బాధితులు, కుటుంబం ఆర్థికంగా చితికిపోయినవారు, కుటుంబాన్ని కోల్పోయిన వారు మొ॥ విధంగా ఉంటారు.

అనైతికంగా ఆడవారి అక్రమ తరలింపు నివారణ చట్టం 1956 ఆడవారిని అక్రమంగా తరలించడం, ఆడవారిని, పిల్లలను వేశ్యావృత్తిలోకి దించడం, దానిని వృత్తిగా చేసుకుని జీవించడం నిషేదించింది. వాణిజ్య ప్రయజనం కోసం లైంగిక దోపిడీ చేయడం ఈ చట్టం ప్రకారం వ్యభిచారం.

### 5.4.5 బాలికలను, స్త్రీలను అక్రమంగా తరలించడం

మైనర్ బాలికలను, స్త్రీలను అక్రమంగా తరలించడం ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న దృగ్విషయం. డబ్బు సంపాదించాలనే దృష్టితో బీద కుటుంబాలు తమ కుమార్తెలను దళారుల ద్వారా సమీప పట్టణాలకు, నగరాలకు పంపుతారు. ఆ దళారులు ఆ పిల్లలను లాభం కోసం మళ్ళీ మళ్ళీ అమ్ముతారు. ఈ బాలికలు సులభంగా లైంగిక దోపిడీకి లోనవుతారు. బెదిరించో, బలవంతంగానో, ఇతర రకాలుగా ప్రతిఘటించో, ఎత్తుకుపోయి, మోసగించి, అధికార దుర్వినియోగం చేసి, బలహీనులపై బలప్రయోగం చేసి నియమించుకొనడం, రవాణా చేయడం, బదిలీ చేయడం, ఆ వ్యక్తులను తమ దగ్గర ఉంచుకోవడం లేదా తమ వద్దకు రప్పించుకొనడం. ఈ నేరానికి స్థూలంగా రెండు కారణాలు. ఒకటి వ్యక్తిగత పరిస్థితులు, రెండోది సామాజిక వ్యవస్థలోని శక్తులు. వ్యక్తిగత పరిస్థితులు అంటే ఆత్మగౌరవం లేని స్త్రీలు, ఆత్మనియంత్రణ లేనివారు, నిరక్షరాస్యత, సామాజిక జాగృతి, సమాచారం, ఆర్థికంగా వెనుకబడినవారు, అశక్తులు. ఈ కారణాలు ఎంత ప్రభలంగా ఉంటే అంతగా ఈ ప్రమాదం పొంచి ఉంటుంది. ఇవేకాక కుటుంబంలోని అస్తవ్యస్త పరిస్థితులు అంటే వివాహం విచ్ఛినం కావడం వంటివి కూడా మహిళల అక్రమ రవాణాకు దారితీస్తాయి. సామాజిక వ్యవస్థలోని కారణాలలో పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ, ఆర్థిక క్షీణత, అభివృద్ధి చెందక పోవడం, ప్రయివేటీకరణ, పట్టణీకరణ, పర్యావరణ కారణాలు లేదా కొన్ని వలస విధానాల వంటి రాజకీయ కారణాలు మొదలగునవి.

ఆర్థిక సంక్షోభం, సాంప్రదాయిక ఉపాధి కోల్పోవడం, లాభదాయక ఉపాధి ఆవశ్యకం కావడం వంటివి ఇటువంటి పరిస్థితిని సృష్టిస్తాయి. ఈ పరిస్థితుల్లో స్త్రీలు సులభంగా అక్రమ రవాణాదారుల చేతికి చిక్కుతారు. బస్టాపులు, భవన నిర్మాణ పని ప్రదేశాలు, పునరావాస ప్రాంతాలు లేక ఇళ్ళలో నుంచి అక్రమ రవాణాదారులు మహిళలను, బాలికలను అపహరించడం, నచ్చచెప్పి తీసుకొనిపోవడం, ఎత్తుకుపోవడం చేస్తుంటారు. కొన్ని సార్లు దేశంలోపల అక్రమ రవాణా జరుగుతుంది. మరి కొన్ని సార్లు పొరుగు దేశాలకు, ఇతర ఖండాలకు కూడా ఆడవారిని అక్రమంగా తరలించడం జరుగుతుంది. అంతర్జాతీయ అక్రమ రవాణా భారతదేశంలో ఢిల్లీ, ముంబయి, ఇతర ప్రధాన రవాణా ప్రాంతాల్లో జరుగుతుంది. బాలికలు గాని, స్త్రీలను గాని అక్రమంగా తరలించి పనివారిగాను, ఎక్కువగా వ్యభిచారానికి, అశ్లీల చిత్ర నిర్మాణానికి, సైబర్ సెక్స్‌కు, సెక్స్ టూరిజానికి ఉపయోగిస్తారు. వ్యక్తుల అక్రమ రవాణా నేరం గురించి భారత శిక్షా స్మృతిలోని 370వ సెక్షన్ చెబుతుంది. బెదిరించి, బలవంతం చేసి, ఇతర విధాలుగా ప్రతిఘటించి వ్యక్తులను ఎత్తుకుపోయి, మోసగించి, అధికార దుర్వినియోగం చేసి, బలప్రయోగం ద్వారా బలహీనులపై ఒత్తిడి తెచ్చి, నియమించుకోవడం, అక్రమంగా తరలించడం, బదిలీ చేయడం, తమ దగ్గర ఉంచుకొనడం లేదా తమ వద్దకు రప్పించుకొనడం చట్టరీత్యా నేరమని ఈ సెక్షన్ చెబుతుంది. ఇటువంటి వారిని ఏడేళ్ళ కఠిన కారాగార శిక్షతో, శిక్షిస్తారు. పదేళ్ళ వరకు పొడిగించి, జరిమానా విధించుతారు. ఒక వ్యక్తి కన్నా ఎక్కువ మందిని అక్రమ రవాణా చేసినా, మైనర్‌ను అక్రమ రవాణా చేసినా యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తారు.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

3. పని ప్రదేశంలో లైంగిక వేధింపు చట్టాన్ని భారతదేశంలో ఎలా చేశారు?

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

4. మహిళలపై జరిగే వివిధ బహిరంగ హింసాత్మక చర్యలను తెలపండి.

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------------

## 5.5 హింసకు వ్యతిరేకం

మహిళలపై జరిగే హింస స్త్రీలని తక్కువ స్థానంలోకి బలవంతంగా నెట్టివేసే కీలకమైన సామాజిక చర్యల్లో ఒకటి. దీన్ని మనం పూర్తిగా అర్థం చేసుకోవాలంటే హింసను వ్యక్తిగత సమస్యగా కాకుండా దీనిని మానవ హక్కులు మరియు అభివృద్ధి నేపథ్యంలో పరిశీలించాలి. హింస వలన సమాజం ఆర్థిక, సాంఘిక, రాజకీయ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. కుటుంబం, గౌరవం పేరున జరిగే జండర్ హింసపై మౌనం వహించడం మానివేయాలి. రకరకాల హింసలకు రకరకాల పరిష్కారాలు అవసరం. గృహహింసకు న్యాయపరమైన ఉపశమనాలు సరిపోవు. ఎందుకంటే గృహహింస చట్టపరమైనది మాత్రమే కాదు, మౌలికంగా ఇది సామాజిక సమస్య. ఇరుగు పొరుగు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హింసను పట్టించుకొనకుండా ఉన్నంతకాలం, జోక్యం చేసుకోకుండా ఉన్నంతకాలం, చట్టం ఎంత నిర్దుష్టంగా ఉన్నా దెబ్బలు తినే స్త్రీలు, పిల్లలకు సహాయం అందదు. మహిళల అవసరాలను గురించి చెప్పే నెట్‌వర్క్‌లను తయారు చేయవలసిన అవసరం ఉంది. ఈ అన్యాయాన్ని ఎదిరించగల, దీనికి వ్యతిరేకంగా మాట్లాడగల వేలాది మంది స్త్రీలకు సాధికారత కల్పించాల్సిన అవసరం ఉంది. ఇతర స్త్రీలకు ఉపకరణాలు, నైపుణ్యాలు నేర్పించగల స్త్రీలను సాధికారులను చేయాలి. ఇటువంటి పరిస్థితిలో స్త్రీలు చురుకైన భాగస్వాములుగా, మార్పు ప్రతినిధులుగా నాయకులుగా ఉండాలి. తమకేమీ పట్టనట్లుగా వింటూ ఉండిపోకూడదు.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

5. మహిళలపై హింస వల్ల కలిగే పరిణామాలేమిటి?

---

---

---

6. స్త్రీలపై హింస, స్త్రీలకు అన్యాయం జరక్కుండా ఎదుర్కొనడానికి ఏం చెయ్యాలి?

---

---

---

## 5.6 సారాంశం

స్త్రీ పురుషుల మధ్య సమానత్వంలేని అధికార సంబంధాలను హింస వ్యక్తం చేస్తుంది. ఇది స్త్రీలు ముందుకు వెళ్ళకుండా, అభివృద్ధి చెందకుండా చూస్తుంది. ఇది లైంగిక దాడి, అత్యాచారం, దాంపత్య హింస, భార్యలను కొట్టడం, హింసించి ఆనందించడం, మానసిక వేధింపు, వరకట్న హత్యలు, మతఘర్షణలు, బలవంతంగా వ్యభిచారం చేయించడం మొ॥ వివిధ రూపాలను హింస సంతరించుకుంటుంది. స్త్రీలు, పిల్లలు ఒంటరితనం, నిస్సహాయత, నిరాశ, భయం, బాధ, షాక్, విచారం, అపరాధ భావం, ఆత్మ గౌరవం కోల్పోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి వాటిని అనుభవిస్తారు. హింసను ప్రయివేటు, బహిరంగ హింసగా వర్గీకరించవచ్చు. ప్రయివేటు హింసలో గృహహింస అత్యంత సాధారణ హింస. గృహ హింసలో భార్యను కొట్టడం, వరకట్న వేధింపు, కుటుంబ సభ్యులు మహిళలపై జరిపే అన్ని రకాల హింసలు ఉంటాయి. 2005లో వచ్చిన గృహ హింస చట్టంలో స్త్రీలను గృహ హింస నుంచి రక్షించే పలు చర్యలున్నాయి. ప్రయివేటు రంగంలో జరిగే హింసలో ఆడశిశువులను చంపడం, గర్భంలోనే లింగ నిర్ధారణ జరిపి గర్భవిచ్ఛిత్తి చేసుకోవడం, వరకట్నం, పరువు హత్యలను గురించి చర్చించాం. బహిరంగ హింసలో లైంగిక వేధింపు, అత్యాచారం సర్వసాధారణమైన హింసలు. అత్యాచార వ్యతిరేక చట్టంలోని అంశాలను సంక్షిప్తంగా చర్చించడం జరిగింది. ఇతర రకాల బహిరంగ హింసలో వ్యభిచారం, స్త్రీలు, పిల్లలను అక్రమంగా తరలించడం గురించి చర్చించాం. చివరిగా, హింసకు వ్యతిరేకంగా పోరాడడానికి ఏం చేయాలో ఈ పాఠంలో చర్చించాం.

## 5.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. జండర్ ఆధారిత హింస అనేది "చారిత్రకంగా స్త్రీ పురుషుల మధ్య గల అధికార సంబంధాలను వ్యక్తీకరిస్తుంది. ఇది స్త్రీలపై పురుషుల ఆధిపత్యానికి, వివక్షాత్మక దృష్టికి కారణమై స్త్రీలు ముందుకు వెళ్ళకుండా నివారిస్తోంది."

2. గృహ హింస అంటే కుటుంబ సభ్యులు స్త్రీలపై జరిపే హింస. గృహ హింస చట్టం 2005 సహాయ చర్యలను ఏర్పాటు చేసింది. రక్షణ ఉత్తర్వు, మెయింటెనెన్స్ ఆర్డర్, నివాస ఉత్తర్వు, ఉమ్మడి ఆస్తి, పిల్లల సంరక్షణ, పరిహారం వంటివి కల్పించింది.

3. భన్వారిదేవి రాజస్థాన్‌లో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతోంది. అగ్రకుల గూర్జర కమ్యూనిటీ వ్యక్తి తన తొమ్మిది నెలల కూతురికి చేస్తున్న వివాహాన్ని ఆమె ఆపింది. ఆమె పైన ఆగ్రహించిన గూర్జర పురుషులు అయిదుగురు ఆమెపై సామూహిక అత్యాచారం జరిపారు. గ్రామంలో అందరూ వ్యతిరేకించినా, ఆమె అత్యాచారం గురించి కోర్టులో కేసు పెట్టింది. న్యాయమూర్తి ఆమె చెప్పిన విషయం నమ్మకుండా, దళిత స్త్రీపై, అగ్రకుల పురుషులు అత్యాచారం చేసి ఉండరని తీర్పు చెప్పారు. కొన్ని మహిళా సంస్థలు, విశాఖ కలిసి ఈ తీర్పుకు వ్యతిరేఖంగా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. 1997 లో భారత సుప్రీంకోర్టు లైంగిక వేధింపు స్త్రీలపై ఒకరకమైన వివక్ష అని, ఇది రాజ్యాంగంలోని సమానత్వ హక్కును అతిక్రమించడమేనని చెప్పింది. ప్రతి సంస్థ యజమాని మహిళా ఉద్యోగుల విషయంలో ఆచరించవలసిన మార్గదర్శక సూత్రాలను కొన్నింటిని కోర్టు నిర్ధేశించింది. 2013లో పని ప్రదేశంలో లైంగిక వేధింపును నియంత్రించే విధంగా ప్రత్యేక చట్టం వచ్చింది. అన్ని సంస్థల్లోను లైంగిక వేధింపుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు స్వీకరించే కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆ చట్టం నిర్ధేశించింది.

4. స్త్రీలపై బహిరంగ హింస కింది రకాలుగా జరుగుతున్నట్లు చూడవచ్చు.

1. యువతులను వేధించడం
2. యాసిడ్ దాడులు
3. పని ప్రదేశంలో లైంగిక వేధింపు
4. అత్యాచారం
5. ఎత్తుకుపోవడం, బలవంతంగా అపహరించడం
6. పరువు హత్యలు
7. స్త్రీలు, పిల్లలను అక్రమంగా తరలించడం
8. దేవదాసీ విధానం, వ్యభిచారం

5. అత్యాచారం వల్ల స్త్రీ శారీరకంగానే కాక, మానసికంగా కూడా బాధింపబడుతుంది. స్త్రీలు, పిల్లలు ఒంటరితనం, నిస్సహాయత, నిరాశ, భయం, బాధ, షాక్, విచారం, అపరాధ భావం, ఆత్మగౌరవం కోల్పోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటివాటిని అనుభవిస్తారు.

6. చట్టపరమైన చర్యలకు తోడుగా, సామాజిక పరివర్తన కూడా స్త్రీలపై జరుగుతున్న వివిధ రకాల హింసలను అరికట్టడానికి అవసరం. సమాజము, స్నేహితులు, కుటుంబం, ఇరుగు పొరుగు ప్రతి ఒక్కరు మౌనాన్ని వీడాలి. అన్యాయాన్ని ప్రతిఘటించాలి. స్త్రీలపై హింసకు మూలకారణాలైన సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తగ్గించే చర్యలు చేపట్టాలి. మహిళా సమస్యల ప్రచారానికి నెటెవర్క్‌లు ఏర్పాటు చెయ్యాలి. మహిళలను సాధికారులను చేస్తూ వారికి జ్ఞానాన్ని, హింసకు వ్యతిరేకంగా పోరాడే ఉపకరణాలను ఇచ్చి వారిని సాధికారులను చేసే చర్యలు చేపట్టాలి.

## 5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది వాటికి30 పంక్తుల్లో సమాధానాలు రాయండి.

1. గృహ హింసకు కారణాలు వివరించండి. గృహ హింస చట్టం 2005లోని అంశాలు వివరించండి.
2. లైంగిక వేధింపు, అత్యాచారం కారణాలను, పరిణామాలను వివరించండి. బాధితులకు భారతదేశంలో ఎటువంటి రక్షణ అందుబాటులో ఉంది.

II. కింది ప్రశ్నలకు 15 పంక్తుల్లో సమాధానాలు రాయండి.

1. పరువు హత్యలు
2. బాలికలు, మహిళలను అక్రమంగా తరలించడం

## 5.9 ముఖ్యపదాల అర్థవివరణ

| | | |
|---|---|---|
| ప్రినేటల్ డయాగ్నస్టిక్ టెస్ట్ (Pre Natal Diagnostic Test) | : | ప్రసవ పూర్వం బిడ్డ లింగ నిర్ధారణకు చేసే పరీక్ష |
| మనుషులను అక్రమంగా తరలించడం (Sexual Trafficking) | : | మహిళలతో బలవంతంగా లైంగిక కార్యకలాపాలు, బానిసత్వం చేయించడానికి వారిని అక్రమంగా తరలించడం |
| వ్యభిచారం | : | వ్యాపారలాభం కోసం వ్యక్తులను లైంగికంగా ఉపయోగించుకొనడం. |

## 5.10 ఆధారిత గ్రంథాలు


ఆగ్నెస్ ఫ్లేవియా, 1980, కుటుంబంలో హింస: వైఫ్ బీటింగ్. ముంబయి: సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ఎస్.ఎన్.డి.టి. యూనివర్శిటీ.

అహూజ, ఆర్. 1987. క్రైమ్ ఎగేనెస్ట్ ఉమెన్, జైపూర్, రావత్ పబ్లికేషన్స్.

కుమారస్వామి రాధిక, 2006, వయోలెన్స్ ఎగెనెస్ట్ ఉమెన్: క్రైమ్స్ ఆఫ్ ఆనర్, ఇన్ వెల్చ్‌మన్ మరియు సారా (ఎడిటర్స్), న్యూఢిల్లీ.

గౌర్, అనూరాధ, 2016. వయోలెన్స్ ఎగేనెస్ట్ ఉమెన్: ఎ నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ పర్స్పెక్టివ్, న్యూఢిల్లీ.

పాండే, రేఖా, 2016. సెక్స్ ట్రాఫికింగ్ ఇన్ సౌత్ ఆసియా విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఇండియా. కల్పజ్ పబ్లికేషన్స్, న్యూఢిల్లీ.

# భాగం - 6 : సమానత్వం - భిన్నత్వం

విషయ క్రమం


6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 సమానత్వం

- 6.2.1 విద్యలో సమానత్వం
- 6.2.2 ఉపాధిలో సమానత్వం
- 6.2.3 ఆస్తిలో సమానత్వం
- 6.2.4 ఆరోగ్యంలో సమానత్వం
- 6.2.5 సమానత్వం ఎదుర్కొంటున్న సవాళ్ళు

6.3 జండర్ సమానత్వాన్ని పెంపొందించడం

6.4 భిన్నత్వం

- 6.4.1 దళిత స్త్రీ
- 6.4.2 ఆదివాసీ స్త్రీ
- 6.4.3 అల్పసంఖ్యాక వర్గాల స్త్రీలు

6.5 ఆదివాసీ, దళిత మైనారిటీ స్త్రీల హక్కుల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలు

6.6 సారాంశం

6.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

6.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

6.9 ముఖ్య పదాల అర్థ వివరణ

6.10 ఆధారిత గ్రంధాలు


## 6.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సమానత్వ భావనను అర్థం చేసుకుంటారు
- విద్య, ఉపాధి, ఆరోగ్య, ఆస్తి తదితర అంశాలలో స్త్రీ పురుష సమానత్వాన్ని గురించి వివరించగలుగుతారు
- స్త్రీ, పురుష సమానత ఎదుర్కొంటున్న సవాళ్ళు, స్త్రీల సమానత్వపు దిశగా అభివృద్ధి చెందవలసిన ప్రయత్నాలను పరీక్షిస్తారు
- భారతీయ వ్యవస్థలో ముఖ్యంగా దళిత ఆదివాసీ, మైనారిటీ స్త్రీల వంటి భిన్న వర్గాలు వ్యవస్థలను అర్థం చేసుకుంటాడు
- దళిత, ఆదివాసీ, మైనారిటీ స్త్రీల హక్కుల రక్షణకు జరుగుతున్న ప్రయత్నాలను విశ్లేషిస్తారు

## 6.1 పరిచయం

ప్రజాస్వామ్య వ్యవస్థలో "సమానత్వం" ముఖ్య భూమిక పోషిస్తుంది. సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం "సమానత్వం" అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకం అవుతుంది. మన సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో వివక్షకు గురవుతున్నారు. కుటుంబంలో, పనిచేసే చోట, మహిళల పట్ల చూపించే వివక్ష తీవ్రతదాల్చి ఆందోళన కలిగించే అంశంగా మారుతుంది. వివిధ దేశాల్లో, వివిధ రంగాల్లో, కొద్దిపాటి తేడాలు ఉన్నప్పటికీ ఈ వివక్ష విశ్వవ్యాప్త అంశంగానే కనిపిస్తుంది. సాంప్రదాయాలు, మతాచారాలు, పద్ధతులు, నమ్మకాలను బలంగా వ్యాపింపచేసే సంకుచిత వాదాలు వివక్షను బలోపేతం చేసి మహిళల పురోభివృద్ధికి అడ్డుకట్ట వేస్తున్నాయి.

భారత రాజ్యాంగం మహిళలకు సమాన హోదా కల్పించడమే కాకుండా మహిళా సాధికారత కోసం పలు చర్యలు చేపట్టే అవకాశాన్ని కూడా కల్పిస్తుంది. పలు రంగాల్లో మహిళల సమగ్రాభివృద్ధి కోసం వివిధ రకాలైన అభివృద్ధి కార్యక్రమాలు, చట్టాలు, పథకాలు రూపొందిస్తున్నారు. మహిళలకు సమాన హక్కులను కల్పించే పలు "అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాల"కు లోబడి ఉంటామని భారతదేశం తన అంగీకారాన్ని కూడా తెలిపింది. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినప్పటికీ, తరతరాలుగా పాతుకుపోయిన ఛాందస భావాలు, నమ్మకాల వల్ల మహిళలు వివక్షకు గురవుతూనే ఉన్నారు.

ఈ భాగంలో మీరు సమానత్వం అంటే ఏమిటి? వివక్షకు కారణమేమిటి? జండర్ సమానత గురించిన అవగాహన ఎలా కల్పించాలి అనే అంశాలను చదువుకుంటారు.

భారతీయ సమాజం భిన్న మతాలకు, భిన్న వర్గాలకు సంబంధించిన విభిన్న సమూహాల సమాహారం. దీని వల్ల వెనుకబడిన కులాలు, వర్గాల ప్రజలు, మతపరంగా అల్ప సంఖ్యాకులుగా ఉన్న సమూహాలు వివక్షను ఎదుర్కొంటాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి రూపొందించిందే మన భారత రాజ్యాంగం. జాతి, కుల, మత వివక్ష లేకుండా ఎన్నికల్లో పాల్గొనే హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు, ఎన్నుకునే హక్కు ప్రజలందరికీ పౌరులందరికీ భారత రాజ్యాంగం కల్పించింది.

సామాజిక, ఆర్థిక రంగాల అభివృద్ధి కోసం భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు (3వ అధ్యాయం), 4వ అధ్యాయంలోని అధికరణ సూత్రాల , రాష్ట్రాలకు చట్టాలను అమలు చేసే అధికారం మొదలైన వెసులుబాట్లను కల్పించే మౌళిక పత్రం.

భారత రాజ్యాంగాన్ని రాసి ఉపయోగంలోకి తీసుకొచ్చిన తొలినాళ్ళలో కుల, లింగ వివక్ష దారుణంగా ఉండేది. వీటిని నిర్మూలించేందుకోసం భారత రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో ఈ అవకాశాన్ని కల్పించారు. భారతదేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, మాట్లాడే స్వేచ్ఛ, నచ్చిన మతాన్ని ఆచరించేదే స్వేచ్ఛ, భావ వ్యక్తికరణ స్వేచ్ఛ, అన్ని వర్గాల్లో సమానత్వం తీసుకురావడం, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని నిలుపుకునే హక్కు, దేశ ఐక్యతను సమగ్రతను కాపాడే బాధ్యతను కలిగించే ఉద్దేశంతో భారతదేశం సామాజిక, మత వివక్ష రహిత ప్రజాస్వామ్య సార్వభౌమాధికారాన్ని కలిగిన దేశంగా నిర్మించేందుకు ప్రతిజ్ఞ చేస్తున్నామని భారత రాజ్యాంగంలోని (Pre-amble) పీఠిక చెప్తుంది.

భారత పౌరులందరికీ సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం అందించడం భారత రాజ్యాంగ ప్రధాన కర్తవ్యం. సమానత్వం సాధించడం అనేది రాజ్యాంగంలో మరొక ఆశయం. మన అంతస్తు, అవకాశాలను అతీతంగా సామాజిక న్యాయం జరగాలన్నదే దీని ఉద్దేశం. ఈ ఆశయసాధనకు స్వేచ్ఛాయుత భావ వ్యక్తీకరణ, నమ్మకాలు, మత విశ్వాసాలు అనేవి చాలా విలువైనవిగా పరిగణిస్తాము.

ఒక వ్యక్తి ఆస్తి వల్లగానీ, సామాజిక స్తోమత వల్లగానీ, ఇతరులపై అధికారం చలాయించినప్పుడు అసమానత ఉదయిస్తుంది. అసమానతలో సాధారణంగా కులం వల్ల, అధికార దర్పం వల్ల ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం వల్ల ఎక్కువగా వివక్ష అనేది కనిపిస్తుంది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుంచి 18 వరకు సమానత్వం గురించిన విషయాలు పైన చెప్పినవే వివరిస్తున్నాయి.

ఆర్టికల్ 14 (embodies): ప్రజలందరూ న్యాయ సూత్రాల ప్రకారం న్యాయము, రక్షణలో సమానత్వం కలిగి ఉండాలి.

ఆర్టికల్ 15 : లింగపరమైన వివక్షను నిషేదిస్తుంది.

ఆర్టికల్ 16 : అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తుంది.

ఆర్టికల్ 18 (Abolishes): మిలిటరీపరంగా లేదా అకడమిక్ పరంగా కాక ఇతరేతర బిరుదులను నిర్మూలిస్తుంది.

ఆర్టికల్ 14 ప్రకారం - భారత, భూభాగపు పరిధిలో ఉన్న ఏ వ్యక్తికైనా న్యాయము, రక్షణ విషయంలో ఆలస్యం పనికి రాదు అని తీర్మానించింది.

## 6.2 సమానత్వం

మానవ హక్కుల విశ్వవ్యాప్త తీర్మానం ఈవిధంగా చెప్తుంది.

మానవులందరూ హక్కుల పరంగా, హోదాల పరంగా స్వేచ్ఛగానే జన్మించారు. అదేవిధంగా వారందరూ సోదరభావంతో మెలగాలి.

సమానత్వం అంటే ఒకే రకమైన అనే అర్థం కాదు. స్త్రీలు, పురుషులు వేర్వేరుగా ఉంటారు. వారి మధ్య ఆరోగ్యకరమైన, సానుకూలమైన సంబంధాలు కలిగినపుడే సమానత్వం సాధ్యమవుతుంది.

సమానత్వం అంటే కుటుంబంలో, సమాజంలో వారికి సమానమైన ప్రాతినిధ్యం కల్పించడం (CEDAW) స్త్రీ వివక్షకు వ్యతిరేకంగా పోరాడే సంస్థ స్త్రీలు తమ హక్కులను తాము పొందే దశలో ఉండాలి అని చెప్పింది. అంతేకాదు సామాజిక నియమాలు, సాంస్కృతిక విలువలు, కుటుంబ అలవాట్లు, పని విభజన (ముఖ్యంగా ఇంటి పని) పరస్పర సంబంధాలు అనే అంశాలను స్త్రీ పురుష సమానత దిశగా మళ్ళీ నిర్వచించవలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

కుటుంబ పరిధిలో కూతుళ్ళు స్వతంత్రంగా తమ అస్తిత్వాన్ని తాము ప్రకటించుకునే విధంగా ఉండాలి. కొడుకులు, తమతో పాటుగా ఉన్న స్త్రీలను తమతో సమానమైన భాగస్వాములుగా గుర్తించాలి, గౌరవించాలి. కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాలు ఆనందకరంగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే, స్త్రీ పురుషులిద్దరూ ఒకరినొకరు సమానంగా భావించినప్పుడే సాధ్యమవుతుందనే విషయాన్ని గ్రహించాలి. స్త్రీ పురుష సమానత్వం సామాజిక అభివృద్ధిలో భాగమే అనే విషయాన్ని గ్రహించాలి.

నోబెల్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ ఈవిధంగా విశ్లేషించారు తన పుస్తకం “In equality re-examined” లో స్వేచ్ఛ, ఆరోగ్యం, విద్య, వనరులపై ఉండే అధికారం మొ॥ వాటిలో వివక్షని అధ్యయనం చేసి స్త్రీలపై ఆ వివక్ష అసమతుల్య అభివృద్ధికి దారి తీస్తుందని చెప్పారు.

### 6.2.1 విద్యలో సమానత్వం

మహిళా సాధికారికతకు విద్య ఒక ప్రధానమైన అంశం. స్త్రీ, పురుషులను వారి ఇష్టమైన జీవితాన్ని గడపడానికి విద్య అవకాశం కల్పిస్తుంది. చదువుకున్న స్త్రీ, జ్ఞానం, నైపుణ్యం, ఆత్మ విశ్వాసం కలిగి ఒక మంచి తల్లిగా తన ధర్మాన్ని నెరవేరుస్తుంది. అదేవిధంగా తాను పనిచేసే చోటకూడా హుందాగా, ఆత్మ విశ్వాసంతో జీవితాన్ని గడుపుతుంది. విద్యలో సమానత్వం లేకపోతే అది సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఒక అవరోధమే అని చెప్పవచ్చు.

ఉచితమైన ప్రాథమిక విద్య ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని విశ్వవ్యాప్త మానవ హక్కుల డిక్లరేషన్ (UDHR) చెప్పింది. ఈ విషయాన్ని (UNESCO) యునెస్కో 1960లో పరిగణనలోకి తీసుకుని ''విద్యా హక్కు'' (RTE) మొదటిసారిగా ప్రవేశపెట్టింది. (ICESCR) లింగపరంగా న్యాయ వ్యవస్థలో నిజానిజాల్లో వివక్ష చూపడాన్ని నిషేధించింది. (CEDAW) 1979 మరియు 1990లలో నిర్వహించిన రెండు సమావేశాల్లో విద్యా హక్కు, జండర్ సమానత హక్కుల గురించి తీర్మానాలు చేసాయి.

భారతదేశంలో ఆడపిల్లల చదువు (1986) జాతీయ విద్యా పథకం, ఆ తర్వాత (2001) సర్వశిక్షా అభియాన్ పథకాలు బాలికా, మహిళా విద్యా సాధికారత కోసం అమలులోకి వచ్చాయి. బాలికల చదువు కోసం జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం అనేది బాలికలకు చదువులో భాగం కల్పించడంతోపాటుగా ఉన్నతమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పడినవే.

మహిళా సమాఖ్య కార్యక్రమం 10 రాష్ట్రాలలో గ్రామీణ మహిళలకు ఉద్దేశించి ఏర్పడిందే. అంతేకాదు వారికి విద్యావకాశాలను కల్పించడానికై ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించారు. ఓపెన్ లెర్నింగ్ వనరులు అందుబాటులో ఉంచడం, గురుకుల పాఠశాలలు ఏర్పరచడం, మహిళలకు తర్ఫీదునిచ్చే సౌకర్యాలు కల్పించడం, ఉపకార వేతనాలు, పుస్తకాలు, యూనిఫామ్స్ అంతేకాదు బడి వారికి దూరంగా ఉన్నట్లైతే వారి ప్రయాణానికి అనువుగా సైకిళ్ళను కూడా అందించే ప్రయత్నం కూడా చేస్తుంది ప్రభుత్వం.

విద్యా హక్కు 2010 ప్రకారం, ఉచిత, నిర్బంధ విద్య బాలికల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ, లింగ వివక్ష రహితంగా ఉండడానికి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా రూపకల్పన చేసారు.

ఇట్లాంటి పథకాలు ఎన్ని ప్రవేశపెట్టినా, ఎన్ని చర్యలు తీసుకున్నా కూడా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, షెడ్యూల్డ్ తెగల్లో, వెనుకబడ్డ తరగతుల్లో, మైనారిటీ స్త్రీలలో అక్షరాస్యతా శాతం చాలా తక్కువగా ఉంది. సాధారణ సాంప్రదాయ విద్యలో బాలికల నమోదు శాతం, బడి మానివేసే పిల్లల శాతం ఆందోళనకర స్థాయిలో ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికే కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని ప్రారంభించి, ఆడపిల్లలు చదువుకోవడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వారికి రక్షణకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ప్రారంభించింది.

ప్రాథమిక, సెకండరీ, కళాశాల, సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులలో కూడా బాలికలు, స్త్రీలు వెనుకబడి పోతున్నారు. ఇక్కడ కూడా లింగవివక్ష చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సమస్య వల్ల ఒకవేళ చదువుకున్నా వారు ఉద్యోగాల్లో ఏమైనా సాధించడాన్ని, ఆర్థిక వనరులు ఉపయోగించుకోకపోవడాన్ని నియంత్రిస్తుంది.

**మీ అవగాహన పరీక్షించుకోండి**

గమనిక: (అ) కింద ఇచ్చిన స్థలంలో మీ జవాబును రాయండి.

(ఆ) మీరు రాసిన జవాబును, చివర ఇచ్చిన జవాబుతో సరిచూసుకోండి.

1. (UDHR) విశ్వవ్యాప్త మానవ హక్కుల సంస్థ సమానత్వం గురించి ఏమని చెప్పింది?

-----------------------------------------------------------------------------------------------------------

-----------------------------------------------------------------------------------------------------------

-----------------------------------------------------------------------------------------------------------

### 6.2.2 ఉపాధిలో సమానత్వం

భారత రాజ్యాంగం ఆర్టికల్ 13, క్లాజ్ (3) లో ఉపాధిలో సమానత్వం గురించి ప్రత్యేకంగా నిర్దేశించింది. ఇలాంటి నిర్ధేశాలు ఎన్ని ఉన్నప్పటికీ మహిళలకు ఉద్యోగావకాశాల్లోనూ, వారు చేసే పనిలోను, జండర్ తేడా చాలా కనిపిస్తుంది. దీనికి కారణం, స్త్రీలకు ఇల్లే రక్షణనిస్తుంది అని సమాజం నమ్మడం. సామాజిక కట్టుబాట్లు అసమానతకు దారితీస్తున్నాయి. అందువల్లనే చాలా మంది స్త్రీలు అసంఘటిత రంగాలలో ఉపాధి భద్రత లేకుండా పనిచేయడానకి సిద్ధపడుతున్నారు. ఇక పట్టణ ప్రాంతాలలోకొస్తే, చదువు, సంపాదనా సామర్థ్యాలు అధికంగా ఉన్న మహిళలు కూడా చాలా మంది పెళ్ళి అయి ప్లిలలు పుట్టగానే ఉద్యోగాలు వదిలిపెడ్తున్నారు. మహిళల ఉద్యోగాలు, భద్రత లోపించడం కూడా ఉద్యోగాలకు అడ్డంకిగా మారుతుంది.

జీతాల్లో అసమానత ఇంకొక వైపు ఉంది. వ్యవసాయ రంగంలో స్త్రీలు పురుషుల కన్నా 50 - 75% తక్కువ వేతనంతో పనిచేస్తారు. సాఫ్ట్‌వేర్ రంగంలో పురుషులకన్నా స్త్రీలు 29% తక్కువ వేతనంతో పనిచేస్తున్నారు. చాలా పెద్ద పోరాటాల తర్వాత ఇప్పుడు ప్రభుత్వ సంస్థలు సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తున్నాయి. అయినా కూడా చాలా తక్కువ శాతం మంది స్త్రీలు మాత్రమే ప్రభుత్వోద్యోగాలలో ఉన్నారు. భూమి లేని కుటుంబాలు, కొంచెం భూమి కూడా లేని కొన్ని తెగల్లో పని అనేది తప్పనిసరి. సంపాదించడం కోసం పని చేయడమే కాక, భూస్వాముల ఇంట్లో వెట్టి చాకిరీ కూడా చేయవలసి వస్తోంది. ఎన్నో దశాబ్దాలుగా నిరసనలు, ఉద్యమాలు జరుగుతుంటే 1976, బాండెడ్ లేబర్ ఆక్ట్ (Bonded Labour Act) ప్రకారం వెట్టి నిషేధించబడింది.

విద్య, నైపుణ్యత, సరైన శిక్షణ లేకపోవడం వల్ల ఆ స్త్రీలో నిర్ణీతమైన పని పద్ధతులు తెలియకపోవడం, భద్రత లోపించడం, తక్కువ జీతంతో పని చేయవలసి వస్తుంది. భారత రాజ్యాంగం విద్యలో రిజర్వేషన్ అవకాశాలు కల్పించిన తరువాత స్త్రీలకు ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున పెరగడమే కాక ప్రభుత్వ రంగ సంస్థల్లో మంచి వేతనాలతో రెగ్యులర్ ఉద్యోగాలు కూడా లభించాయి.

### 6.2.3 ఆస్తిలో సమానత్వం

భారతీయ మహిళలకు ఆస్తిహక్కులు అందరికీ ఒకే రకంగా లేవు. భారతీయ మహిళలకు వారి మతాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి ఆస్తి హక్కుల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. అంతేకాదు యువతులకు, వివాహిత మహిళలకు

కూడా వేరే రకమైన నియమాలు ఉన్నాయి. ఆ స్త్రీ ఏ ప్రాంతానికి సంబంధించింది, ఆదివాసీ మహిళనా అనేదానిపైన కూడా హక్కులు ఆధారపడి ఉంటాయి. బాధాకరమైన విషయం ఏమిటంటే, భారతీయ రాజ్యాంగం సమానత్వం గురించి వక్కాణించినా కూడా మహిళల ఆస్తి హక్కులు మాత్రం ఏకపక్షంగానే ఉండడం, వివక్షకు గురికావడం జరుగుతోంది.

### 6.2.4 ఆరోగ్యంలో సమానత్వం

స్త్రీల ఆరోగ్యం సమాజంలో వారి హోదా, అంతస్తుకు దగ్గరగా ముడిపడి ఉంటుంది. స్త్రీలు విపరీతమైన పోషకాహార లోపంతో బాధపడుతూ ఉంటారు. ప్రత్యేకంగా (గర్భకోశ, జనన సంబంధిత) పునరుత్పత్తికి సంబంధించిన శ్రద్ధ వాటికి సంబంధించిన వస్తు సామాగ్రి కొన్ని ప్రాంతాలకు అందుబాటులో ఉండదు. అట్లాంటి ప్రాంతాల్లో శిశు మరణాలు, ప్రసూతి మరణాలు (Morality rates) ఎక్కువగా సంభవిస్తాయి. భారతదేశంలో ఎక్కువ మంది స్త్రీలు ప్రసూతి సమయంలో శస్త్ర చికిత్సలు అవసరమయ్యే దశలో ఉంటారు. ఆ సమయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పిల్లల నియంత్రణ కోసం జరగవలసిన ఆపరేషన్లు స్త్రీలే చేయించుకోవాలని కుటుంబాల్లో ఒత్తిడి తెస్తారు. ఆర్థిక సర్వే (2014-15) ప్రకారం 2012-13లో తెలిసిన విషయం ఏమిటంటే మొత్తం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో 97.4 శాతం స్త్రీలకు జరిగే ట్యూబెక్టమీ లేదా లాప్రోస్కోపి ఆపరేషన్లే. పురుషుల వేసెక్టమీ ఆపరేషన్లు 2.5% మాత్రమే అని చెప్పింది. దీనికి తోడుగా కొంతమంది స్త్రీలకు గర్భానికి సంబంధించిన సమస్యలు, అధిక రక్తస్రావం, ఫైబ్రాయిడ్స్ గర్భాశయంలో పెరగడం, ఎండోమెట్రిక్ పొర దళసరి కావడం మొదలైన సమస్యలన్నిటికీ మందులు, డాక్టర్ల అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది.

ఒకవైపు శారీరక సమస్యలతో సతమతమవుతుంటే, లైంగిక వాంఛ తీర్చుకోవడానికి పురుషుల ఒత్తిడి ఇంకోవైపు పెరుగుతూ ఉంటుంది. దీనివల్ల ఎప్పుడూ ఇంట్లో హింస తాండవమాడుతుంది. దీనివల్ల స్త్రీలు తమ శారీరక అనారోగ్యం వల్ల ఒక్కొక్కసారి చికాకుకు, కోపానికి, ఆగ్రహానికి లోనవుతారు.

**మీ అవగాహన పరీక్షించుకోండి.**

(a) కింది ఇచ్చిన జాగాలో మీ జవాబును రాయండి.
(b) మీరు రాసిన జవాబును చివర మేమిచ్చిన జవాబుతో సరిచూసుకోండి.

2. భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ఉపాధిలో సమానత్వాన్ని కల్పిస్తుంది? వివరణాత్మకంగా తెలపండి.

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

### 6.2.5 సమానత్వం ఎదుర్కొంటున్న సవాళ్ళు

అంతర్జాతీయ సమూహాలు, పౌర సమాజం, వివిధ సంఘాలు, వివిధ దేశాలలోని రాజ్యాంగాలు, యునైటెడ్ నేషన్స్. వారి వారి పరిధిలో జండర్ సమానతను సాధించడానికి నిర్విరామంగా ప్రయత్నిస్తున్నాయి. జండర్ అసమానత పట్ల ప్రజల ఆలోచనా విధానాలు, సాంస్కృతిక అలవాట్లు, సామాజిక నియమాలు ఇవన్నింటిలో మార్పు వస్తేనే

జండర్ సమానత సాధ్యమవుతుందని ప్రజలను చైతన్యవంతులని చేసే ఈ ప్రయత్నాలు కూడా జరిగాయి. అయినప్పటికీ సమానత్వం సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా సమాజాలు అనేక సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తోంది.

భారత సమాజం కూడా రకరకాలైన సవాళ్ళను ఎదుర్కొంటుంది. మహిళలు వారి హోదాను ఆత్మ గౌరవానికి భంగం కలగని విధంగా ఈ సవాళ్ళను ఎదుర్కోవాలి. అభివృద్ధి క్రమం, శాస్త్ర సాంకేతికాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి మొదలైన అంశాలు జండర్ అసమానతను తగ్గించాల్సింది పోయి పెంచుతున్నాయి. సమకాలీన సమాజం ఎదుర్కుంటున్న సవాళ్ళు కొన్నింటిని గమనించండి.

♦ **కుటుంబ హింస, ఈవ్‌టీజింగ్, లైంగిక అణచివేత**: వరకట్న రూపంలో హింస, పెళ్ళికూతురును కాల్చి చంపడం, బలాత్కారం, లైంగిక అణచివేత, పరువు హత్య వంటి రుగ్మతలు జండర్ సమానత దిశగా ప్రయాణిస్తున్న సమకాలీన సమాజానికి అడ్డంకులుగా మారుతున్నాయి. సోషల్ మీడియా సైబర్ క్రైమ్, తప్పుడు మాటలు, ద్వంద్వార్థాలు, అశ్లీల మాటలతో స్త్రీల గౌరవాన్ని కించపరుస్తున్నది. అంతేకాదు ఆసిడ్ దాడుల వంటి భౌతిక దాడులు కూడా మహిళల మీద జరుగుతున్నాయి.

♦ **వ్యాపార వస్తువుగా** : సినిమాలో, మీడియాలో, ప్రకటనలలో అశ్లీల చిత్రాలు, చూడలేని భయంకరమైన దృశ్యాలు మొదలైనవి జండర్ సమానతకు అడ్డు పడుతున్నాయి. అందాల పోటీలు స్త్రీల సౌందర్యానికి ప్రమాణాలు పెడుతున్నాయి. ఎంతో మంది స్త్రీల హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీలు స్త్రీని వ్యాపారవస్తువుగా చూడడాన్ని ఖండిస్తున్నాయి.

♦ **రాజకీయ రంగంలో ప్రతినిధులు**: శాసన సభల్లోని మహిళా నాయకులు వారి ప్రాతినిధ్యాన్ని ఉపయోగించుకోవడం లేదు. మహిళల శాతం పురుషుల శాతానికి సమానంగా లేకపోవడం, ముఖ్యంగా పార్లమెంటు మొదలుకొని రాష్ట్ర స్థాయి సంస్థల్లో 73, 74 అమెండ్‌మెంట్ (తీర్మానాల) ప్రకారం పంచాయితీరాజ్, పట్టణ స్థానిక సంస్థల్లో స్త్రీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలి. అయితే అక్కడ కూడా ఒక విమర్శ ఉంది. రిజర్వేషన్స్ పెరుగుతున్నాయి. ఏవిధంగా అంటే 'బీవీ బ్రిగేడ్' రాజకీయ నాయకుల భార్యలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారు తెరపైన ఆడే బొమ్మలు మాత్రమే. వారి వెనుక ఆడించేది మగవారే.

**మీ అవగాహన పరీక్షించుకోండి**

గమనిక: (అ) కింద ఇచ్చిన స్థలంలో మీ జవాబును రాయండి.

(ఆ) మీరు రాసిన జవాబును, చివర ఇచ్చిన జవాబుతో సరిచూసుకోండి.

3. 'బేటీ బచావో, బేటీ పడావో' పథకం గురించి వ్రాయండి.

---

---

---

## 6.3 జండర్ సమానత్వాన్ని పెంపొందించడం

తొలుతగా ఓటు హక్కును అందరికీ సమానంగా కలిగిన అతి కొద్ది దేశాల్లో భారతదేశం ఒకటి. మహిళలకు, పురుషులకు ఇద్దరికీ ఒకేసారి ఓటు హక్కు అమలులోకి వచ్చింది. 1935లో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 పౌరులందరికీ సమాన హక్కు కల్పించింది. జండర్ సమానత్వంపై అవగాహన కోసం పౌరహక్కుల సంఘాలు, మహిళల హక్కుల సంస్థలు, వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులు పలు కార్యక్రమాలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించారు.

జండర్ అంశాలపై ఐక్యరాజ్య సమితితో పాటు పలు మహిళా సంఘాలు జాతీయ అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించాయి. మెక్సికో (1975), కోపెన్ హాగన్ (1980), నైరోబీ (1985), బీజింగ్ (1995) లలో జరిగిన నాలుగు విమెన్స్ సమావేశాల్లో లింగ వివక్షపై సమగ్రంగా చర్చించి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

♦ ఆరోగ్య, విద్య, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 187 దేశాల్లో మానవ అభివృద్ధి కార్యక్రమం (UNDP) జండర్ అభివృద్ధి సూచిని కూడా తయారు చేసింది.

♦ UNDP తయారు చేసిన జండర్ అసమానతల సూచి ప్రకారం ఆరోగ్యం, స్వావలంబన, పనిలో భాగస్వాములవడం లాంటి అంశాలు కూడా ప్రభావితం చేస్తాయని తెలుస్తోంది. ఈ అంశంలో 155 దేశాల్లో భారతదేశం 30వ స్థానంలో ఉంది.

♦ యునెస్కో రూపొందించిన జండర్ పారిటీ సూచి మహిళలు, పురుషుల్లో విద్య నిష్పత్తిని, విద్యా అందుబాటును తెలియజేస్తుంది. ప్రపంచ ఆర్థిక సంఘం రూపొందించిన జండర్ గ్యాప్ నివేదికలో భారతదేశం 144 దేశాల్లో 87వ స్థానంలో నిలిచింది. అంటే పురుషులు, మహిళల మధ్య అన్ని రంగాల్లో తేడా ఎక్కువగా ఉన్నట్టు స్పష్టమవుతుంది.

విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో స్త్రీ పురుషులిద్దరికీ సమాన హోదా కల్పించేందుకు చేపట్టవలసిన చర్యలను సూచించాలని దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఒక కమిటీని ఏర్పాటు చేసారు. స్త్రీ పురుషుల మధ్య అంతరాలను తొలగించేందుకు కొన్ని దీర్ఘకాలిక ప్రతిపాదనలు చేసింది. సమానత్వం వైపు అని పేరు గాంచిన ఈనివేదిక 1974లో బయటకు వచ్చిన సమయంలో గృహ హింస, వరకట్న మరణాలు, లైంగిక దాడులు, లాకపుల్లో అత్యాచారాలు, ఆస్తి హక్కు, సమాన వేతనం వంటి అంశాలపై దేశంలో పెద్ద చర్చే జరుగుతుంది. మహిళా సంఘాలు దేశవ్యాప్తంగా ఈ అంశాలపై ఉద్యమాలు చేస్తున్నాయి. 1973లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏర్పడిన ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ వుమెన్ ఈ అంశాలపై పోరాటం చేపట్టిన మొట్టమొదటి సంస్థల్లో ఒకటి. 1978లో హైదరాబాదులోనే ఏర్పడిన మరొక సంస్థ "స్త్రీ శక్తి సంఘటన" ఈ దిశలో పనిచేసింది. స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, 2009లో భారత రాజ్యాంగం 73వ సవరణ చేపట్టారు. రాజకీయాల్లో మహిళల పట్ల వివక్షను తొలగించేందుకు చేపట్టిన పెద్ద చర్య ఇది.

స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో లింగ వివక్షపై జరిగిన కార్యక్రమాలు, చర్చలో ప్రయత్నాలు ఈ అంశంపై విస్తృత స్థాయి చర్చకు అవకాశమిచ్చాయి. అలాగే లింగవివక్ష రూపుమాపేందుకు చేపట్టల్సిన ప్రణాళికాబద్ధమైన చర్యల రూపకల్పనకు వెసులుబాటు కలిగింది. అయితే నిరక్షరాస్యత, పితృస్వామ్య భావజాలం, నిర్లిప్తత, అధికారుల అలసత్వం లాంటి కారణాలు ఇంకా ప్రతిబంధకాలుగానే ఉన్నాయి.

**మీ అవగాహన పరీక్షించుకోండి.**

(a) కింది ఇచ్చిన జాగాలో మీ జవాబును రాయండి.

(b) మీరు రాసిన జవాబును చివర మేమిచ్చిన జవాబుతో సరిచూసుకోండి.

4. భారత రాజ్యాంగం 73వ సవరణలోని అంశాలేమిటి?

--------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------------------------------

## 6.4 భిన్నత్వం

విభిన్న భాషలు, సంస్కృతులు, కులాలు, వర్గాలు, మతాల మిళితమైనదే విభిన్నత. భిన్నత్వంలో ఏకత్వం గురించే ఎక్కువగా వింటాం కానీ, భిన్నత్వంలోని విభిన్నత గురించి ఎక్కువగా మాట్లాడుకోము.

భారతదేశంలో విభిన్న కులాల కలయిక. సామాజిక, ఆర్థిక హక్కులు వ్యక్తులు పుట్టిన కులంపైన ఆధారపడి ఉంటాయి. వివిధ కులాల మధ్య ఆర్థిక సామాజిక అంతరం ఎక్కువగానే ఉంది. ఒకవైపు లింగ వివక్షను ఎదుర్కొంటూనే వివిధ మతాలు, కులాలకు చెందిన మహిళలు అయా వర్గాల కులం, మతం పరంగా వచ్చిన ఇబ్బందులను కూడా ఎదుర్కొంటారు.

### 6.4.1 దళిత స్త్రీ

అంటరానివారు, షెడ్యూల్డ్ కులాలు లేదా దళితులుగా పిలవబడే వారు కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్నారు. ఉన్నత కులాల వారికి సేవ చేయడం కూలీ పని చేయడం మినహా ఆస్తి హక్కు కాని, సామాజికపరంగా వచ్చే హక్కులు కానీ వారికి లేవు. సామాజికంగా శారీరకంగా వారిని హిందూ సమాజం అంటరాని వారి పేరుతో దూరం పెట్టింది. ఈ కారణాల వల్ల వారు పేదరికంలోనే మగ్గిపోయే పరిస్థితి.

చాలా తీవ్రంగా ఉన్న సమస్యను రూపుమాపేందుకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో పేర్కొన్న కొన్ని కులాల వ్యక్తుల పరిరక్షణకు నిబంధనలు రూపొందించారు. అసమానతలను రూపుమాపి వారి ఆర్థిక స్వావలంబన కోసం తదనంతరం పలు చట్టాలను రూపొందించారు.

అస్పృశ్యతా నేర చట్టం (1955 తరువాత ఈ చట్టాన్ని పౌరహక్కుల రక్షణ చట్టం (1976)గా మార్చారు) ఎస్‌సి, ఎస్‌టి ప్రివెన్షన్ ఆఫ్ అట్రిసిటీ చట్టం, 1989 - దళితుల హక్కుల పరిరక్షణకు, వివక్షను తొలగించేందుకు రూపొందించారు.

ఎస్.సి., ఎస్.టి.లలో మహిళల కోసం జాతీయ స్థాయిలో కమిషన్లు ఏర్పాటు చేసారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, ఉద్యోగాల కల్పన కోసం వారి సంక్షేమం కోసం పలు పథకాలు రూపొందించారు.

స్వాతంత్ర్యానంతరం అస్పృశ్యతను నిషేధించినప్పటికీ ఇంకా కొన్ని రూపాల్లో అది కొనసాగుతూనే ఉంది. దళితులు ఇంకా వారి కోసం నిర్దేశించిన వాడల్లోనే నివశిస్తున్నారు. వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు. చాలా వృత్తుల్లో వారి ప్రవేశం ఇంకా నిషేధం. జీతభత్యాల్లోను వివక్షే. దళిత మహిళల పరిస్థితి ఇంకా దారుణం. ఒకటి పుట్టిన కులం ఆధారంగా ఎదుర్కొనే ఇబ్బందులు కాగా, మరొకటి మహిళగా ఎదురయ్యే సమస్యలు. హింస, అనుమానం, మోసానికి గురికావడం, అదుపాజ్ఞల్లో ఉంచుకోవడం లాంటి పరిస్థితుల్ని దళిత మహిళ ఎదుర్కోవలసి వస్తుంది. వీటికి తోడు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం, కుల వివక్ష, లింగ వివక్ష, ఆర్థిక వివక్ష - ఈ మూడింటిని దళిత మహిళ ఎదుర్కోవలసి వస్తుంది.

కుల, వర్గ, జండర్ వ్యవస్థల్లో అట్టడుగున ఉండటం వల్ల దళిత మహిళ తీవ్రమైన వివక్షను ఎదుర్కోవలసి వస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో ఉన్న అసమానత వల్ల జండర్, కుల వివక్ష, హింసను అనుభవించాల్సి వస్తుంది. రాజకీయ గొంతుక లేకపోవడం, సామాజిక, ఆర్థిక వెసులుబాటు దూరమవడంతోపాటు దళిత మరియు మహిళ అవడం వల్ల దారుణమైన పరిస్థితుల నుండి తప్పించుకోలేని స్థితిని ఎదుర్కుంటున్నారు.

"దళిత మహిళలపై దాడులకు పాల్పడుతున్న అగ్ర కులాల వారు, వారి కుల అహంకారాన్ని ప్రదర్శించి తీవ్రమైన అవమానాలకు గురిచేస్తున్నారని" జాతీయ మహిళా కమిషన్ అభిప్రాయపడింది. ఇవే కాకుండా తను కుల నియమాలను ఉల్లంఘించి వేరే కులం వారిని వివాహం చేసుకోవడం, అస్పృశ్యత మొదలైన కారణాలు వారిని హింసకు గురి చేస్తున్నాయి.

దళిత మహిళలపై వివిధ రూపాల్లో హింస జరుగుతుంది. భౌతిక దాడులు, దూషించడం, లైంగిక వేధింపులు, బలాత్కారం, లైంగికంగా లొంగదీసుకోవడం, బలవంతంగా వేవ్యా వృత్తిలోకి దించడం, కిడ్నాప్ చేయడం, భ్రూణహత్యలు, ఆడపిల్లల హత్యలు, పసిపిల్లలపై లైంగిక దాడులతోపాటు అటు పుట్టింటి నుండి ఇటు మెట్టింటి నుండి హింస ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇక కుటుంబం నుండి కూడా దళిత మహిళ ఎదుర్కొంటోంది. పితృస్వామ్య భావజాలం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛ కూడా ఉండదు. గృహ హింస ఎదుర్కోవడం నిత్యజీవితంలో భాగమే. జండర్ వివక్ష, మహిళలు అణగిమణగి ఉండాలనే భావజాలం కారణంగా అటు తల్లిదండ్రుల నుండి ఇటు అత్తమామలు, భర్త నుంచి హింసను ఎదుర్కొంటున్నారు.

(హ్యూమన్ రైట్స్ కౌన్సిల్) మానవ హక్కుల సమితి విడుదల చేసే నివేదిక దళిత మహిళల రక్షణకు వారి అభ్యున్నతికి పలు సూచనలు చేసింది.

♦ దేవదాసి / జోగిని, వరకట్నం, మలమూత్రాలను ఎత్తివేయడం, కుల ఆధార వివక్ష, అస్పృశ్యత లాంటి దురాచారాలను నిషేదిస్తూ చట్టాలను చేసి, వాటిని పకడ్బందీగా అమలు చేయడం. అవి అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఉండేట్టుగా చూడడం.

♦ దళిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాల జాబితాను రూపొందించడం, పోలీసులు, న్యాయ వ్యవస్థ కేసులను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవడం, వారికి అందించిన న్యాయ సహాయం, సమస్యను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలను గమనించడం, వీటితోపాటుగా దళిత మహిళలు ఏ మేరకు భూమిపైన, ఆస్తి హక్కులను కలిగి ఉన్నారనే అంశాలను ఐక్యరాజ్య సమితి అనుబంధ విభాగాలకు నివేదికలు పంపడం.

**మీ అవగాహన పరీక్షించుకోండి.**

(a) కింది ఇచ్చిన జాగాలో మీ జవాబును రాయండి.

(b) మీరు రాసిన జవాబును చివర మేమిచ్చిన జవాబుతో సరిచూసుకోండి.

5. దళిత మహిళలపై జరుగుతున్న మూడు రకాల వివక్షలను పేర్కొనండి.

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

### 6.4.2 ఆదివాసీ స్త్రీ

జండర్ అసమానతలు దేశవ్యాప్తంగా ఉన్నప్పటి మహిళల స్థితిగతులు ప్రాంతాలవారీగా వేర్వేరుగా ఉన్నాయి. ఆరోగ్యం, పౌష్టికాహారం, అక్షరాస్యత, విద్య, జీవన ప్రమాణాల మీద ఆధారపడి ఏ వర్గం స్థాయి అయినా ఆధారపడి ఉంటుంది. అన్ని సామాజిక వర్గాల్లో మాదిరాగానే ఆదివాసీ తెగలోని మహిళల జనాభా కూడా సగ భాగంగానే ఉంటుంది. మిగతా అందరికన్నా ఈ వర్గానికి చెందిన మహిళ ఎక్కువగా శ్రమిస్తుంది. కుటుంబ ఆర్థిక వ్యవస్థ, కుటుంబాన్ని నడపడం వీరి ప్రధాన బాధ్యతలు. ఈ కారణాల వల్ల వీరు ఆరోగ్యంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంటుంది. పలు పరిశోధనల్లో తేలిన విషయాలు చూస్తే, జాతీయ సగటుకన్నా వీరిలో పసిపిల్లల మరణాలు ఎక్కువ. పౌష్టికాహార లోపం, జాతీయ సగటు కన్నా ఎక్కువ ఆయుష్షు ప్రమాణం, సికిల్ సెల్ లాంటి జబ్బులు, విటమిన్ల లోపం, ఎక్కువమంది పిల్లల్ని కనడం లాంటివి ఎక్కువగా (షెడ్యూల్డ్ తెగ) ఆదివాసీ మహిళల్లో కనిపించాయి. ఆదివాసీలలో ఏ లక్షణాలైతే కనిపిస్తాయో, ఆదివాసీ మహిళల్లో కూడా అవే లక్షణాలు కనిపిస్తాయి. నిరక్షరాస్యతకు, ఆరోగ్యానికి నిరంతర సంబంధం ఉంటుందనేది సత్యం. దీనికి ఆదివాసీ మహిళలు కూడా మినహాయింపేమీ కాదు. అలాగే నిరక్షరాస్యతలో కూడా.

అక్షరాస్యత తక్కువగా ఉండటం, స్కూళ్ళలో తక్కువ సంఖ్యలో చేరడం తదితర కారణాల వల్ల విద్యా రంగంలో ఆదివాసీ తెగ మహిళల సంఖ్య కూడా తక్కువే. మిగతా అన్ని వర్గాల వలెనే ఈ మహిళలు వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు.

### 6.4.3 అల్ప సంఖ్యాక వర్గాల స్త్రీలు

భారత ప్రభుత్వం హిందువులు, ముస్లింలకు వేర్వేరు వెసులుబాట్లు కల్పించింది. మతం ఆధారంగా హిందువులు, ముస్లింలకు వారి ఆచారాలకు అనుగుణంగా చట్టాలను రూపొందించింది. 1985లో ప్రాచుర్యం పొందిన షాబానో కేసు ఇందుకు ఉదాహరణ. ముస్లింలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించేందుకు రాజీవ్‌గాంధీ ఒక ప్రయత్నం చేసారు. 40 సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత 73 సంవత్సరాల షాబానోకు ఆమె భర్త విడాకులు ఇచ్చారు. ముస్లిం మతచట్టం ప్రకారం షాబానో భర్త ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అంశాన్ని షాబానో సుప్రీంకోర్టులో దావా వేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం షాబానో భర్త ఆమెకు నెలనెలా భరణం చెల్లించాలని తీర్పునిచ్చింది. ఇది ముస్లింలలో తీవ్ర అలజడిని రేపింది. ఇస్లాంపై దాడిగా భావించిన వారూ ఉన్నారు.

దీంతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం వెనక్కితగ్గింది. ఇస్లాం మత పెద్దల ఒత్తిడికి తలొగ్గి, ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి దూరం అవుతారని భావించి ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) బిల్లును అమలులోకి తెచ్చింది. ఈ బిల్లు ప్రకారం విడాకుల తర్వాత 90 రోజుల భరణం చెల్లిస్తే సరిపోతుంది. ముస్లిం మహిళల హక్కుల కోసం పోరాడే సంస్థలు, హిందూ జాతీయవాదులు రాజీవ్‌గాంధీ నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఇది అవకాశవాద చర్య అని దుయ్యబట్టారు.

స్త్రీవాదాన్ని (ఫెమినిజం) వివిధ అల్ప సంఖ్యాక వర్గాలు పూర్తిగా సమర్థించలేదు. ఫెమినిజం ఎక్కువగా అగ్రవర్గాలకు, హిందూ మతవాదులకు అనుగుణంగా ఉందని అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన మహిళల సమస్యలను పూర్తిగా పరిగణనలోనికి తీసుకోలేదని వారి అభ్యంతరం. ప్రాంతాలు, కులాలు, వర్గాలు, మతాల ప్రాతిపదికన కూడా ఆయా వర్గాలకు చెందిన మహిళల్లో అసమానతలున్నాయి. కులం, వర్గం, మతం తదితర పరిస్థితుల పట్ల కూడా మహిళల స్థాయి ఆర్థిక, విద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలు సాధించిన ప్రగతి మీద ఆధారపడి ఉంటుంది. ఆర్థికంగా సామాజికంగా వెనకబడిన వర్గాలకు చెందిన బాలికలు (SC/ST/OBC) పట్టణాల్లో నివసించే మధ్యతరగతి బాలికలు, మహిళలకన్నా చాలా రంగాల్లో వెనకబడి ఉన్నారు. విద్య, సామాజిక న్యాయం సమానంగా అందేలా ముస్లింలకు, ఇతర అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. మైనారిటీల పరిరక్షణ కోసం భారత రాజ్యాంగం మతపరమైన స్వేచ్ఛను కల్పిస్తోంది. గత ఏడు దశాబ్దాలుగా సంపూర్ణమైన ప్రజాస్వామ్య దేశంగా అభివృద్ధి చెందడానికి, ఎన్నెన్నో కార్యక్రమాలు, సంస్కరణలు చేపడుతూనే ఉన్నాం.

(తరతరాలుగా అణచివేయబడ్డ మహిళలు, ఎస్.సి.లు, ఎస్.టి.లు, అల్పసంఖ్యాక వర్గాల పురోగతికి) అసమానతలు తొలగించేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టారు. విద్య, మహిళా సాధికారత కోసం గత మూడు దశాబ్దాలుగా ప్రత్యేకమైన శ్రద్ధతో పలు కార్యక్రమాలు ప్రారంభించారు. జాతీయ విద్యా విధానం (1986) తర్వాత ప్రణాళిక 1992లో చేసిన మార్పులకు అనుగుణంగా మహిళలు, బాలికల సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి జరుగుతూనే ఉంది. అలాగే మానవ హక్కుల డిక్లరేషన్, CEDAW, బాలల హక్కులు, ఐసీడీపి, మిలినియమ్ అభివృద్ధి లక్ష్యాలు లాంటి అంతర్జాతీయ చట్టాలకు, ఒప్పందాలకు భారతదేశం కట్టుబడి పనిచేస్తోంది. ముస్లిం పర్సనల్ లా బహుభార్యత్వాన్ని ఒప్పుకుంటుంది. కాని ముస్లిం మహిళ ఒకరికన్నా ఎక్కువ మందిని ఒకేసారి పెళ్ళి చేసుకునే వీలులేదని చెపుతుంది.

భారత రాజ్యాంగం నిర్దేశించిన హక్కులను కాపాడుకోవటం కోసం విడాకుల అనంతరం భరణం కోసం ముస్లిం మహిళలు పోరాడుతూనే ఉన్నారు. వివాహపరమైన సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ముస్లిం మహిళలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఈమధ్య ప్రాచుర్యంలోకి వచ్చిన ట్రిపుల్ తలాక్ కూడా అందులో భాగమే.

## 6.5 దళిత, ఆదివాసీ మైనారిటీ మహిళల హక్కుల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలు

ప్రభుత్వ విధానాల్లో పథకాల్లో, కార్యక్రమాల్లో మహిళలపై ప్రత్యేక శ్రద్ధ పెరుగుతూ వస్తుంది. తద్వారా మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారు. పలు కమిటీలు, కమిషన్లు ఏర్పాటు చేయడంలో కాలానుగుణంగా మహిళలకు ఉద్దేశించిన పథకాల్లో, కార్యక్రమాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించడమే కాకుండా ప్రభుత్వం మహిళాభ్యున్నతి కోసం తీసుకోవలసిన చర్యల్ని నిర్దేశించింది. ఆ కార్యక్రమాలు అమలయ్యేందుకు అవసరమైన న్యాయపరమైన చట్టాలను రూపొందించుకునే వెసులుబాటును రాజ్యాంగం కల్పించింది.

UDHR (Universal Declaration of Human Rights of News (1948), CEDAW (1979), UN Declaration of Child (1959), Convention on the Rights of the child (1989) లాంటి అంతర్జాతీయ చట్టాల కొత్త నిబంధనలను అంగీకరిస్తూ భారతదేశం సంతకాలు కూడా చేసింది. వివిధ రకాలైన సామాజిక ఆర్థిక వర్గాల వారి మహిళల జీవన ప్రమాణాల్లో అదే స్థాయి అసమానతలుంటాయి. ముస్లింలు, నియో బౌద్ధులను విద్యపరంగా వెనకబడినవారుగా గుర్తించారు. తద్వారా షెడ్యూల్డ్ కులాలలో సమానంగా నియో బౌద్ధులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యలో వెనకబడిన మైనారిటీలను అభివృద్ధిలోకి తీసుకువచ్చి వారిని మిగతా వర్గాలతో సమానంగా పురోగతి చెందేలా చూడాలని అల్ప సంఖ్యాక వర్గాల హైపవర్ కమిటీ సూచించింది. బడుగు బలహీన వర్గాలు, ఎస్.సి.లు, ఎస్.టి.లు, మైనార్టీల సమస్యల పరిష్కారానికి సాంఘిక విభాగం ఎనలేని కృషి చేస్తోంది. సమగ్ర పసిపిల్లల అభివృద్ధి పథకం (ఐ.సి.డి.ఎస్.) ద్వారా ఆరు సంవత్సరాల లోపు పిల్లల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళా శిశు సంక్షేమం, సామాజిక న్యాయం, సాధికారత, సామాజిక భద్రత, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి, మైనార్టీల అభివృద్ధి శాఖలకు చెందిన పలు రాష్ట్ర, జాతీయ సంక్షేమ పథకాలను ఐ.సి.డి.ఎస్. ద్వారా ఆరు సంవత్సరాల లోపు పిల్లల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు.

**మీ అవగాహన పరీక్షించుకోండి.**

గమనిక (a) కింది ఇచ్చిన జాగాలో మీ జవాబును రాయండి.

(b) మీరు రాసిన జవాబును చివర మేమిచ్చిన జవాబుతో సరిచూసుకోండి.

6. దళితులు, ఆదివాసి, మైనారిటీ మహిళల అభివృద్ధికి భారత రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులను క్లుప్తంగా వివరించండి.

----------------------------------------------------------------------------------------------------

----------------------------------------------------------------------------------------------------

----------------------------------------------------------------------------------------------------

## 6.6 సారాంశం

స్త్రీ పురుషుల మధ్య అసమానతలు, మహిళలపట్ల వివక్ష సామాజిక ఆర్థిక విషయాల్లో మహిళల పట్ల ఉన్న వివక్షగా అర్థం చేసుకోవాలి. కుటుంబ కట్టుబాట్లు, ఆచారాలు, కొన్ని ఆచార వ్యవహారాలు పితృస్వామి వ్యవస్థకు కారణం. అసమానతలు తొలగించేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విభాగంలో తరతరాలుగా లింగ వివక్ష ఎలా కొనసాగుతూ వస్తుందో తెలుసుకున్నాం. అలాగే బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో ఎలా వెనకబడి ఉన్నారో పరిశీలించాం. విద్యారంగంతోపాటు సమాజంలోని మిగతా రంగాల్లో మహిళలు, బాలికలు లైంగిక లింగ వివక్షను దాడిని ఎదుర్కొంటున్నారో తెలుసుకున్నాం.

పౌర సమాజం, ప్రభుత్వాలు, బాధ్యతగల పౌరులు అందరూ కలిసికట్టుగా పనిచేయకపోతే స్త్రీ, పురుష సమానత్వం అనేది భ్రమగానే మిగిలిపోతుంది. అందుకోసం సమాజం పూర్తి మార్పులకు లోనుకావాలి. సాంస్కృతికంగా పరిణతి చెందాలి.

## 6.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1: ప్రజలందరూ స్వేచ్ఛగా, సమానంగా, గౌరవంగా జీవించాలని యు.డి.హెచ్.ఆర్. చెబుతోంది.

2: ఆర్టికల్ 13 క్లాజ్ (3)

3: బాలికల సంరక్షణ, విద్యను పెంపొందించేందుకు 2011లో 'బేటీ బచావో', 'బేటీ బడావ్' కార్యక్రమం ప్రారంభించారు.

4: స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు భారత రాజ్యాంగ 73వ సవరణ జరిగింది.

5: మహిళలుగా పుట్టడం, దళిత మహిళలుగా పుట్టడం, అలాగే కుల వ్యవస్థలో అట్టడుగున మూడు రకాలుగా దళిత మహిళలు తీవ్రమైన వివక్షను ఎదుర్కొంటారు.

6: భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కును కల్పిస్తుంది. దానితోపాటు మహిళల సమగ్ర అభివృద్ధికి, హక్కుల పరిరక్షణకు, అన్ని రంగాల్లో ముందడుగు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను నిర్దేశిస్తుంది. పరిణతి చెందాలి.

## 6.8 మాదిరి పరిక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 వాక్యాల్లో సమాధానం రాయండి.**

1. విద్య, ఉద్యోగ రంగాల్లో లింగ వివక్షను సవివరంగా రాయండి.
2. విభిన్నత అంటే ఏమిటి? భారతదేశంలో దళిత మహిళల పరిస్థితిని విశ్లేషించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 వాక్యాల్లో సమాధానం రాయండి.**

1. 'సమాన హక్కు కోసం' నివేదిక గురించి వివరించండి.
2. శ్రమ కొలిచే విధానంలో మహిళ చేసే శ్రమను గుర్తించకపోవడం వివరించండి.
3. మైనారిటీ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించండి.

## 6.9 ముఖ్య పదాల అర్థ వివరణ

| | | |
|---|---|---|
| ప్రియాంబుల్ | - | పీఠిక |
| ఐ.పి.సి. | - | ఇండియన్ పీనల్ కోడ్ |
| సి.ఎస్.డబ్ల్యు | - | కమిటీ ఆన్ స్టేటస్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా |
| సి.ఇ.డి.ఎ.డబ్ల్యు | - | కన్వెన్షన్ ఆన్ ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫారమ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ ఎగేనెస్ట్ ఉమెన్. |

## 6.10 ఆధారిత గ్రంధాలు


ఆగ్నెస్ ఫ్లేవియా, మైస్టోరీ : అవర్ స్టోరీ ఆఫ్ రీబిల్డింగ్ బ్రోకెన్ లైవ్స్, 1988.

జాన, మేరీ, సెక్స్‌రేషియో : జండర్ బేస్డ్ సెలెక్షన్, 2014.

కుమార్, కృష్ణ : గ్రోయింగ్ ఆఫ్ మేల్, 2009

సెన్ అమర్త్యా: మోర్ దాన్ వన్ మిలియన్ ఉమెన్ ఆర్ మిస్సింగ్, 1990.

# భాగం - 7 : మానవహక్కులు

విషయ క్రమం

7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 మానవ హక్కులు - అర్థ వివరణ, పరిణామ క్రమం

7.3 మహిళల మానవ హక్కులు

7.4 మానవ హక్కులు - భారతరాజ్యాంగం

7.5 జాతీయ మానవ హక్కుల సంఘం

7.6 సారాంశం

7.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

7.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

7.9 ముఖ్య పదాల అర్థ వివరణ

7.10 ఆధారిత గ్రంధాలు

## 7.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక మీరు ఈ కింది అంశాలు చేయగలుగుతారు.

- మానవ హక్కులంటే ఏమిటో క్లుప్తంగా వివరించగలుగుతారు.
- మానవ హక్కులను జండర్ ధృక్పదం నుంచి అర్థం చేసుకోగలుగుతారు
- భారత రాజ్యాంగంలో పేర్కొన్న మానవ హక్కుల నిబంధనను అధ్యయనం చేయగలుగుతారు
- భిన్న వర్గాలు, కులాల విషయంలో జండర్ పరంగా జరిగే అసమానతలు, అంతరాలు గ్రహించగలుగుతారు

## 7.1 పరిచయం

ప్రస్తుతం ఉన్న మానవహక్కు పత్రాలకు పునాదులు వేసినవి మాగ్న కార్టా (1215), బ్రిటీష్ వారి హక్కుల బిల్లు (1689), ఫ్రెంచి వారి మానవ, పౌరుల హక్కుల ప్రకటన (1789), అమెరికా రాజ్యాంగ పౌరుల హక్కులు (1781). అయితే ఈ పత్రాలు వేటిలోను మహిళల హక్కుల ప్రస్తావనే లేదు.

తొలిసారిగా మాగ్న కార్టా (1215), 'మహారాజుతో సహా అందరూ చట్టానికి బద్ధులే' అని ప్రకటించింది. తదనంతర రాజులతో కూడా అమలు చేయబడిన మాగ్న కార్టా, ప్రపంచంలో వ్యక్తి స్వేచ్ఛకు పునాది వేసిన తొలి పత్రం. కీ.శ. 18వ శతాబ్దిలో ఫ్రెంచి విప్లవం అనంతరం, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పెద్ద యెత్తున ఉద్యమం జరిగింది. ''మానవులు, పౌరుల హక్కుల ప్రకటన'' (Declaration of Rights of Man and Citizens) అనే పత్రం

తర్వాతి కాలంలో అనేక దేశాల్లో మానవ హక్కుల ఉద్యమాలకు దారి చూపింది. ఈ ప్రకటన వల్ల మహిళలకు ఎలాంటి లాభం చేకూరనప్పటికీ, చాలా మంది మహిళలు తమ హక్కుల కోసం పోరాడడానికి ఇది ఊతమిచ్చింది. 1948లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన సార్వజనీన మానవహక్కుల ప్రకటనను (UDHR) ఎన్నో ప్రజాస్వామ్య దేశాలు ఆచరణలో పెట్టాయి. ఈనాడు, ప్రజాస్వామ్య దేశాలతో పాటు ప్రజాస్వామ్య పాలన లేని, మత ఆధారంగా పాలింప బడీ దేశలు కూడా మానవ హక్కుల అవసరాన్ని గుర్తిస్తున్నాయి. మానవహక్కుల విషయానికి ఇంత ప్రాచుర్యం రావడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. వాటిని గుర్తించే దేశాలు ఆధునికమైనవీ, అభివృద్ధి చెందినవీ కావడం; అందువల్ల ఏ దేశాల్లోనైతే మానవహక్కుల రక్షణ ఉందో అవి ప్రగతిశీలకమైనవనే అభిప్రాయం ఏర్పడడం; అలాగే ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు వాటిని ప్రచారం చేయడం. మానవహక్కుల్లో ఇమిడి ఉన్న నైతికమైన, విలువలతో కూడిన స్వభావం వల్ల అన్ని రకాల సమాజాలకు అది ఆమోదనీయమవుతుంది. ఇప్పుడు వృద్ధి చెందుతున్న దేశాల్లో, ప్రభుత్వాల రూపకల్పన దశలోనే మానవహక్కుల గుర్తింపును ఒక కీలకమైన అంశంగా చేసుకోవాలని వివిధ దేశాల్లోని ప్రజా ఉద్యమాలు కోరుతున్నాయి.

భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను దేశపౌరులందరి మౌలిక మానవ హక్కులుగా పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మూడవ అధికరణంలో నిర్వచించిన ఈ హక్కులు, జాతి, మతం, జన్మస్థలం, కులం, తెగ, స్త్రీ పురుష భేదం లేకుండా అందరికీ వర్తిస్తాయి. కొన్ని నిర్దిష్టమైన పరిమితులకు లోబడి, ఈ హక్కులు చట్టం పరిధిలో అమలవుతాయి.

## 7.2 మానవ హక్కులు - అర్థవివరణ, పరిణామక్రమం

మానవ హక్కులంటే ఒక వ్యక్తి మనిషిగా పుట్టినందుకు అతనికి లభించే అయాచితమైన ప్రాథమిక హక్కులని సాధారణంగా నిర్వచిస్తారు. మానవ హక్కుల ఆవిర్భావానికి కారణం, ప్రతి వ్యక్తికీ సమానమైన హక్కులు, సమానమైన గౌరవం లభించాలన్న గుర్తింపే. 1948లో ప్రకటించిన సార్వజనీన మానవ హక్కుల ప్రకటన (యు.డి.హెచ్.ఆర్)లో, మానవ హక్కుల పట్ల చూపిన అగౌరవం, చులకన భావాలే ప్రపంచంలో జరిగే అతి దారుణమైన ఆకృత్యాలకు మూలమని, ఇవి ఈ ప్రపంచం అంతరాత్మకే క్షోభ కలిగించాయని వ్యాఖ్యానించారు. దీని ఫలితంగా మానవులుగా జన్మించినందుకు తమ నుంచి విడదీయలేని కొన్ని హక్కులు తమకుంటాయని ప్రజలు గుర్తించారని ఈ ప్రకటన పేర్కొంది. ఈ హక్కుల్లో, జీవించే హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర్యం, భయం నుంచి, అవసరం నుంచి విముక్తి మొదలైనవి ఉన్నాయి. ఈ ప్రకటన ద్వారా ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛను అందరూ గుర్తించాలని పిలుపునిచ్చాయి.

ఈ ప్రకటన ప్రకారం మానవులందరూ పుట్టినప్పుడు స్వేచ్ఛా జీవులే. వారికి గౌరవంలోను, హక్కులలోను, సమానత్వం జన్మత: లభిస్తుంది (అధికరణ 1). కనుక జాతి, లింగం, వర్ణం, భాష, మతం, రాజకీయ అభిప్రాయం, జాతీయ లేదా సామాజిక మూలాలు, ఆస్తి మొదలైన కారణాల వల్ల వివక్ష చూపడం రాజ్యాంగ విరుద్ధం (అధికరణ 2). మూడు, నాలుగు అధికరణలలో, జీవించే హక్కు, స్వేచ్ఛగా, భద్రతతో జీవించే హక్కులతో పాటు వ్యక్తుల పట్ల

క్రూరమైన, అవమానకరమైన ప్రవర్తన, చిత్ర హింసల నిషేధాల గురించి ప్రస్తావన ఉంది. ఆరవ అధికరణ నుంచి సమానత్వం గురించిన చర్చ విస్తృతమై, ప్రతి మనిషికీ చట్టం ముందు సమానావకాశాలు, సమాన న్యాయం లభించాలని ఎటువంటి వివక్ష లేక అందరికీ చట్టం ఒకే విధమైన రక్షణ కల్పించాలని చెప్పబడి ఉంది. ఇంకా సమానత్వమంటే ఏమిటో చెబుతూ, ఒక వ్యక్తి నేరం నిరూపితమయ్యేవరకు ప్రజల ఎదుట న్యాయమైన పద్ధతిలో విచారణ కోరే హక్కు కూడా అతనికి వుంటుందని చెప్పడం జరిగింది.

న్యాయవిచారణ పొందే హక్కు, నేరం రుజువయ్యేవరకు నిరపరాధిగా పరిగణింపబడే హక్కు, నిరంకుశమైన నిర్బంధాల నుంచి స్వేచ్ఛ యు.డి.హెచ్.ఆర్. గుర్తించిన ప్రధానమైన హక్కులు. ఈ ప్రకటన, వ్యక్తులకు అంతరంగిక జీవితం గడిపే హక్కును, సమాజంలో ఒక మౌలిక వ్యవస్థ అయిన కుటుంబ భద్రత కోసం పాటు పడే హక్కును కూడా గుర్తింస్తుంది. పరస్పర అంగీకారంతో వివాహం చేసుకునే హక్కును, నచ్చిన మతాన్ని అవలంబించే హక్కును, దేశ పాలనలో పాల్గొనే హక్కును కూడా ఈ ప్రకటన గుర్తిస్తుంది.

సామాజిక భద్రతా హక్కును, పని చేసే హక్కును, సమాన పనికి వేతనం హక్కును, గౌరవంగా జీవించేంత వేతనం అందుకునే హక్కును, ఉద్యోగ సంఘాలు ఏర్పరచుకునే హక్కును, విశ్రాంతి, విరామం, ఆరోగ్యకరమైన పనివేళల హక్కును డిమాండ్ చేయడాన్ని కూడా ఈ ప్రకటన గుర్తించింది. అదే విధంగా ప్రసూతి హక్కుల పరిరక్షణను పిల్లల హక్కులను కూడా గుర్తిస్తుంది. విద్యా హక్కును కూడా గుర్తిస్తూ, కనీసం ప్రాథమిక స్థాయిలో విద్యను ఉచితంగా అందించాలని అంటుంది. విద్య అనేది మనిషి వ్యక్తిత్వ వికాసానికి అతి ముఖ్యమైనదనీ, అది మానవ హక్కులను, స్వేచ్ఛను గుర్తించే సాధనమనీ ఈ ప్రకటన పేర్కొంది. విద్య విభిన్న దేశాల మధ్య పరస్పర సహనాన్ని, అవగాహనను, స్నేహాన్ని పెంపొందించేదిగా ఉండాలి. ప్రతి వ్యక్తికీ ఉన్న సాంస్కృతిక హక్కులనూ, తనకు నచ్చిన సమూహంలో చేరే హక్కును ఈ ప్రకటన గుర్తిస్తుంది.

మానవ హక్కులకు సంబంధించి అర్థం చేసుకోవలసిన ప్రాథమిక సూత్రం అవి అవిభాజ్యాలు, వ్యక్తుల నుంచి వేరు చేయలేనివి; అన్నిటినీ మించి సార్వజనీనమైనవి. మొట్టమొదటి సారిగా ఎటువంటి వివక్షా లేకుండా ప్రజలందరికి ఒకే రకమైన హక్కులుంటాయని గుర్తించడం జరిగింది. సమానత్వ హక్కు, జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, నేర విచారణలో భద్రతా హక్కు వంటివి అనంతర కాలంలో ఐసిసిపిఆర్ (అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల సంస్థ) లో ఆమోదింపబడ్డాయి. పని చేసే హక్కు, సాంఘిక భద్రత, మాతృత్వ పరిరక్షణ, విద్యా హక్కులను కూడా సామాజిక, ఆర్థిక హక్కులుగా గుర్తించారు. వీటిని అనంతరం ఐ.సి.సి.ఎస్.ఆర్ (అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల సంస్థ)ల జాబితాలో చేర్చారు. అనంతర కాలంలో వీటిని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులుగా పునర్విభజించినప్పటికీ ఇవన్నీ అవిభాజ్య హక్కులని యుడిహెచ్ఆర్ గుర్తించింది.

అవిభాజ్యసూత్రమన్నది కొన్ని కారణాల వల్ల ప్రత్యేకంగా ప్రస్తావిచవలసి ఉంది. ఎందుకంటే సిఈఆర్డి (అన్ని రకాల జాతివివక్షల నిర్మూలనపై అంతర్జాతీయ సమ్మేళనం), మహిళలపై అన్ని రకాల వివక్ష నిర్మూలన సమ్మేళనం (సిఈడిఏడబ్ల్యు) వంటివి వేర్వేరు జాతుల కోసం, విడిగా మహిళల కోసం హక్కుల గురించి మాట్లాడాయి. వీటి మధ్య వైరుధ్యం రాకుండా ఉండేందుకు ఈ అవిభాజ్య సూత్రం అవసరమవుతుంది.

సార్వజనీన హక్కుల ప్రకటన (యుడిహెచ్ఆర్) తర్వాత మరెన్నో సమ్మేళనాలు, తీర్మానాలు జరిగాయి. అవి బాలల హక్కుల సమ్మేళనం (CRC), వికలాంగుల హక్కుల సమ్మేళనం, ఐక్యరాజ్యసమితి స్వస్థానీయుల హక్కుల ప్రకటన, అలాగే CERD, CEDAW వంటి వాటి వల్ల వేర్వేరు తరగతుల వారికి వేర్వేరు హక్కుల తీర్మానాలు అవసరమన్న భావన కలుగుతుంది. అయితే ఈ తరగతులకు చెందిన వారి హక్కుల పట్ల మరింత అర్థవంతమైన చర్యలు జరగాలంటే ఇటువంటి ప్రత్యేక సమ్మేళనాలు, తీర్మానాలు అవసరమే.

యుడిహెచ్ఆర్ లో అంతర్గత భాగంగా ఉన్న సమానత్వ హక్కు, వివక్ష వ్యతిరేక హక్కులను CERD, CEDAW మరింత ముందుకు తీసుకువెళ్ళాయి. ఇతర అంశాలను కూడ చర్చించినప్పుడే ఈ సమానతలను కూడా సాధించడం వీలవుతుందని ఈ తీర్మానాలు గుర్తించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జాతివివక్షను సిఈఆర్డి పట్టించుకుంటుంది. జాతిపరంగా వివక్షను ఎదుర్కొంటున్న వారికి సమాన హక్కులు సాధించాలంటే ఆయా దేశాల్లో ఏయే జాతివివక్షాపూరితమైన సిద్ధాంతాలు విధానాలు అమలులో ఉన్నాయో గుర్తించి నిర్మూలించవలసిన అవసరాన్ని ఈ తీర్మానం ప్రస్తావించింది. మూడవ అధికరణం ప్రత్యేకించి, ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో అమల్లో ఉన్న జాతివివక్షా, విభేదాలను ఖండిస్తుంది.

అదే విధంగా CEDAW జండర్ ఆధారిత హింస గురించి మాట్లాడుతుంది. అంటే ఎప్పుడు వివాహం చేసుకోవాలో, ఎప్పుడు పిల్లల్ని కనాలో నిర్ణయించుకునే పునరుత్పత్తి హక్కులు స్త్రీలకుండాలని, స్త్రీలకు విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలు, నిర్ణయాత్మక రంగాల్లో భాగస్వామ్యం ఉండాలని ఈ ఒప్పందం పేర్కొంది. స్త్రీలకు సమానత్వ అవకాశాలను హరిస్తున్న ఆరోగ్య వసతుల నిరాకరణ, ఆర్థిక, ఉపాధి అవకాశాలను, కొరతలను ఈ తీర్మానం ప్రధానంగా ప్రస్తావించింది.

సిఈఆర్డి, సిఈడిఎడబ్ల్యు తీర్మానాలు జాతి, జండర్ పునాదులపై మనుషులు ఎదుర్కోవలసి వస్తున్న అనేక రకాల వివక్షలను ఎత్తి చూపాయి. వీరు సమానత్వాన్ని సాధించాలంటే ఎటువంటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వివక్షలను అధిగమించాలో ఇది ప్రస్తావించింది. ఉదాహరణకు జెండర్ వివక్ష అటు సామాజిక రంగాల్లోను, వ్యక్తిగత జీవితాల్లోను కూడా అమలవుతూ, ఆరోగ్యం, విద్య, పని, రాజకీయ భాగస్వామ్యం వంటి విషయాల్లో ఎంత తీవ్రంగా ఉన్నదో ఈ తీర్మానాలు ప్రస్తావించాయి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

1. మానవ హక్కులంటే ఏమిటి? ఇవి పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఉంటాయా?

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

2. సార్వజనీన మానవ హక్కులంటే ఏమిటి? అవి స్త్రీ పురుషులిద్దరికీ వర్తిస్తాయా?

------------------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------------------

## 7.3 మహిళల మానవ హక్కులు

మానవ హక్కుల సార్వజనీన స్వభావం ఈ హక్కులు స్త్రీ పురుషులిద్దరికీ వర్తిస్తాయన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు సార్వజనీన మానవ హక్కుల ప్రకటన (యుడిహెచ్ఆర్) లో పేర్కొన్న బాలలు, బాలికల విద్యా హక్కు వేర్వేరు సంస్కృతులనూ, జండర్‌కు సంబంధించిన అంశాలను గమనంలోకి తీసుకోకుండా ఒకే రకమైన పాఠశాలలను, పాఠ్యాంశాలను రూపొందిస్తుంది. ఆ రకంగా చూసినపుడు స్త్రీ పురుషులకు సమానంగా వర్తించే విద్య స్త్రీల హక్కుల సాధనకు ప్రతిబంధకం అవుతుంది. ఎందుకంటే అందులో సంస్కృతి పేరిట స్త్రీల పట్ల సమాజంలో అమలు చేసే అసమానతలు, స్త్రీలు నిర్వహించవలసిన పాత్రల గురించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు కనుక. ఈ సామాజిక ప్రవర్తనా రీతులను పట్టించుకోకపోతే కొన్ని దేశాల్లో అమలవుతున్న ఆడపిల్లలు మగపిల్లలతో కలిసి చదువుకోకూడదన్న నిషేదం వంటి అసమానతలను పరిష్కరించడం సాధ్యం కాదు.

సంస్థాగత సమస్యలను తీసుకుంటే పాఠశాలల్లో ఆడపిల్లల కోసం మరుగుదొడ్లు లేకపోవడం, రవాణా సౌకర్యం లేకపోవడం వంటివి వారి విద్యా హక్కుకు అవరోధాలుగా ఉంటాయి. ఆడపిల్లల విద్యాహక్కును సరిగ్గా అర్థం చేసుకోకపోతే బాల్య వివాహాల సమస్యను, ఆడపిల్లలపై లైంగిక హింసను సరైన దృక్పథంతో అర్థం చేసుకోలేము. మహిళల కోసం మానవ హక్కులు అన్నవి, మానవ హక్కులను అంది పుచ్చుకోవడంలో ఆడపిల్లలు, మహిళలు ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అడ్డుగోడలను చర్చిస్తాయి.

మహిళలపై వివక్షల నిర్మూలన తీర్మానం (సిఈడిఎడబ్ల్యు), మహిళలు తమ హక్కుల పరంగా అనుభవించే వివక్షను నిర్వచిస్తుంది. ఇందులోని 1వ అధికరణంలో 'మహిళలపై వివక్ష' అనే పదబంధాన్ని నిర్వచిస్తూ 'లింగం' ఆధారంగా వారికి హక్కులను నిరాకరించే ఏ చర్య అయినా వివక్షే అన్నారు. అంటే ఏ విషయంలోనైనా వారిని వేరుగా చూడడం; వారిని నిరాకరించడం, వారిపై ఆంక్షలు విధించడం వల్ల వారికి గుర్తింపు నిరాకరింపబడవచ్చు; లేదా వారి గుర్తింపుకు హాని కలగవచ్చు. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పౌర తదితర రంగాల్లో వారి మౌలిక స్వేచ్ఛను, మానవ హక్కులను, పురుషులతో సమానమైన హక్కులను నిరాకరించడమే వివక్ష.

స్త్రీ, పురుషుల మధ్య ఆహారం, ఆరోగ్యం, పని, విద్య, నిర్ణయాత్మక స్థాయిల్లో భాగస్వామ్యం మొదలైన రంగాల్లో ఉన్న జెండర్ సంబంధమైన వ్యత్యాసాన్ని ఈ వివరణ స్పష్టం చేస్తుంది. ఈ వ్యత్యాసం వల్ల సార్వజనీన మానవ హక్కులు ప్రధానంగా జెండర్ దృక్పథంతో లేవన్న విషయం స్పష్టమవుతోందని కొందరు మహిళలు ఎత్తి

చూపారు. సార్వత్రిక మానవ హక్కులు పురుషుల అనుభవ కోణం నుంచే ఏర్పడ్డాయని, అందుకే వారి స్వేచ్ఛకు, సమానత్వానికి కుటుంబం నుంచి గాని, సమాజం నుంచి గాని ఎటువంటి ప్రమాదాలు ఈ హక్కుల రూపకర్తలకు కనిపించలేదని వీరంటారు.

సార్వత్రిక మానవ హక్కులు రాజ్యానికి వ్యతిరేకంగా పని చేస్తాయి; ప్రభుత్వ జోక్యం నుంచి కుటుంబాన్ని కాపాడతాయి. కుటుంబం గాని, సమాజం గాని స్త్రీల విద్య, ఉపాధి, రాజ్యాధికారంలో స్త్రీలకు ఇవ్వవలసిన స్థానాన్ని గురించి నిర్ణయాలు తీసుకోవడంలో అవసరమైన అధికారాన్ని ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకోదు. మహిళలు కొన్ని రకాల ఉన్నత పదవులు పొందకుండా అడ్డుపడేవి, వారిని మాతృత్వం కారణంగా కొన్ని సార్లు ఉద్యోగాల నుంచి తీసివేసేవి, వారిని ఆస్తులు పొందకుండా చేసేవి అయిన చట్టాలను నిర్మూలించడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఈ విధంగా రాజ్యం, కుటుంబం అనే రెండు వ్యవస్థలు, వ్యక్తిగతం, సామాజికం అనే పరస్పర వైరుధ్యం కలిగిన వ్యవస్థలుగా మారాయి.

ఈ నేపథ్యంలో మహిళాహక్కుల ఉద్యమం వ్యక్తిగతమంతా రాజకీయమే అన్న ఆలోచనను వ్యాప్తిలోకి తెచ్చింది. మహిళలకు కుటుంబంలో ఎటువంటి స్వేచ్ఛ, సమానత్వం లేనప్పుడు వారికి రాజకీయ పౌరసత్వం ఇచ్చినందువల్ల ప్రయోజనం లేదు. దీన్ని 'బానిసత్వం' తో పోల్చవచ్చు. బానిస వ్యవస్థలో బానిసలను వ్యక్తుల ప్రైవేటు ఆస్తిగా పరిగణిస్తారు. ఎంత ప్రైవేటు విషయమైనా మనిషి గౌరవాన్ని నిలపడానికి ఈ బానిసత్వాన్ని నిర్మూలించవలసిందే. దీన్ని మరింత విపులంగా చెప్పాలంటే బాల్య వివాహమన్నది వ్యక్తిగత విషయమే అయినప్పటికీ రాజ్యం కల్పించుకుని దాన్ని నిషేదించవలసి వచ్చింది.

ఇప్పటికే నిర్ధారించిన మానవహక్కులకు సంబంధించి స్త్రీవాదులు లేవనెత్తిన విమర్శలు ఈ మానవహక్కుల విస్తృతికి దోహదం చేసాయి. జండర్ ఆధారిత హింస అన్నది చట్టం ప్రకారం అందించవలసిన సమాన న్యాయానికి విరుద్ధం కావడమే కాక, మానవ గౌరవానికి హానికరమైన అంశంగా గుర్తించి, అవి జరగకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని వీరు సూచించారు. ఇందులో ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థలూ పాల్గొనాలి. మహిళల హక్కులకు ప్రధాన స్రవంతిలో చోటు కల్పించాలి. ప్రతి విషయాన్ని మహిళల దృష్టి కోణం నుంచి పరిశీలించడం వల్ల భిన్నంగా ఆలోచించడం, అవసరమైన చోట మార్పులు సూచించడం జరుగుతుంది.

దీనికి ఒక ఆసక్తికరమైన ఉదాహరణ విద్వేష పూరిత ప్రసంగాలు. ప్రసంగం కొందరికి అభ్యంతరకరం కలిగించే ప్రసంగం కూడా కావచ్చు. వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడడమంటే అది అందరికీ వర్తిస్తుంది కనుక, అభ్యంతరకరమైన మాటలు పలికిన వారికి, వారి వల్ల బాధితులైన వారికి కూడా చట్టం పరిరక్షణ ఉండవచ్చు. అయితే మహిళలు, లైంగిక అల్ప సంఖ్యాకులు, మతపరమైన అల్ప సంఖ్యాకుల అనుభవం ప్రకారం తమపై విద్వేషపూరితమైన ప్రసంగం వెలువడినప్పుడు ఖండించడం కాదు కావలసినది. అటువంటి మాటలు మాట్లాడే హక్కు ఎవరికీ ఉండకూడదని వారి వాదన. అంటే హింసను, జాతి విద్వేషాలను, పరస్పరం ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే హక్కు కూడా ఎవ్వరికీ ఉండకూడదని వీరి వాదన. వీటిలో జండర్ దృష్టికోణం నుంచి సూచించే మార్పులు హక్కులలో మార్పుకు దారితీస్తాయి.

మరో ఉదాహరణగా గృహ హింసను చెప్పుకోవచ్చు. గృహం వెలుపల జరిగే హింసను ప్రభుత్వం నేరంగా పరిగణించి శిక్షనిస్తుంది గాని, ఇంట్లో జరిగే హింసను సహజంగా పరిగణించి అసలు నేరంగానే గుర్తించదు. మహిళలు మానవ హక్కుల కోసం చేసిన విస్తృత ప్రచారం వల్లే దాన్ని కూడా హింసగా, నేరంగా మహిళల హక్కుల ఉల్లంఘనగా పరిగణించడం ప్రారంభమైంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

3. జండర్ దృష్టికోణం, మానవ హక్కులకు కొత్త దృష్టి కోణాన్ని ఎలా అందించిందో చర్చించండి.

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

4. సిఈడిఏడబ్ల్యు వివక్షను ఎలా నిర్వచించింది?

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------

## 7.4 మానవహక్కులు, భారత రాజ్యాంగం

### 7.4.1 సమానత్వం - వివక్షా రాహిత్యం

ఈ భాగం భారత రాజ్యాంగంలో జండర్ (స్త్రీ పురుష) సమానత్వం గురించి చర్చిస్తుంది. దేశంలో అమలు జరిపే చట్టాలను రూపొందించే అధికారాన్ని ప్రభుత్వాలకిచ్చే మౌలికమైన పత్రం రాజ్యాంగం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించిన ఈ రాజ్యాంగంలోని ఉపోద్ఘాతంలో పౌరులందరికీ సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం వాగ్దానం చేయబడింది. భారత రాజ్యాంగమే అత్యున్నత చట్టం. ఇందులో ప్రజలకు ప్రాథమిక హక్కులను వాగ్దానం చేసే మూడవ విభాగాన్ని ఉల్లంఘించే ఏ చట్టాన్నయినా భారత సుప్రీంకోర్టు కొట్టివేస్తుంది.

భారత రాజ్యాంగంలోని మూడో అధ్యాయం, దేశంలో నివసించే పౌరులందరి ప్రాథమిక హక్కులను గురించి చెప్తుంది. ఈ హక్కులన్ని యుడిహెచ్ఆర్ కింద జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, సమానత్వ హక్కు, వివక్షారాహిత్య హక్కులుగా ఆమోదించినవే. కొన్ని సార్లు రాజ్యాంగం సమానత్వ సాధనకు ప్రత్యేక నిబంధనలు చేస్తూ, ఈ ప్రకటనలన్నిటి కంటే ప్రగతిశీలకంగా ఉంటుంది.

రాజ్యాంగ శాసనం జండర్ సమానత్వం గురించి రెండు స్థాయిల్లో చర్చిస్తుంది. ఒక స్థాయిలో అన్ని రకాల వివక్షలను నిరాకరిస్తూ అందరికీ సమాన ప్రాథమిక హక్కులను అంగీకరిస్తుంది. రెండో దశలో మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం సాధించడానికి ప్రత్యేక సదుపాయాలు కలిగిస్తుంది.

రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వ సూత్రాలను విస్తృతపరచడంలో సుప్రీంకోర్టు అనేక తీర్పుల ద్వారా కీలక పాత్ర నిర్వహించింది. వీటిలో కొన్ని ముఖ్యమైనవి మహిళలకు ఉపాధి రంగంలో ఎదురవుతున్న వివక్షకు సంబంధించినవి.

1. వీటిలో తొలి దశలో చేపట్టిన సంచలనాత్మకమై, మార్గదర్శకమైన కేసు సి.బి. ముత్తమ్మది. ఆమె భారత విదేశాంగ సేవల శాఖలో పనిచేసేది. 1971 భారత విదేశీ సేవల నిబంధనల ప్రకారం మహిళా అధికారి వివాహానికి ముందు అధికారుల లిఖితపూర్వక అనుమతి తీసుకోవాలి. ఎందుకంటే వివాహితులైన మహిళలు ఈ ఉద్యోగాలకు అనర్హులు. సుప్రీంకోర్టు ఈ కేసును పరిశీలించి, ఇది ఆర్టికల్ 14 స్పూర్తికి విరుద్ధంగా ఉందన్న అభిప్రాయంతో ఆమెపై కేసును కొట్టేసింది. ఈ రకమైన నిబంధన పురుష ఉద్యోగులకు లేనందున, మహిళలకు మాత్రమే ఉండడం వివక్షాపూరితమని సుప్రీంకోర్టు భావించింది.

2. ఎయిరిండియా సంస్థ తమ వద్ద పని చేసే ఎయిర్ హోస్టెస్ తొలిసారి గర్భం దాల్చినపుడు ఆమెను ఉద్యోగంలో నుండి తీసివేసింది. సుప్రీంకోర్టు ఈ చర్యను విద్వేషపూరితమైనదిగా, క్రూరమైనదిగా, ఖండించవలసిందిగా, ఆర్టికల్ 14 స్పూర్తికి విరుద్ధమైనదిగా భావించింది. ఈ నిబంధన భారత స్త్రీల స్త్రీత్వానికే అవమానకరమని కోర్టు వ్యాఖ్యానించింది. (ఎయిరిండియా వర్సెస్ నర్గీస్ మీర్జా కేసు)

3. భారత రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం బిడ్డకు సహజమైన పోషకుడు తండ్రి మాత్రమే. తండ్రి పోషకుడుగా ఉండడానికి అనర్హుడని నిరూపించగలిగితేనే తల్లి బిడ్డకు గార్డియన్ కాగలదు. సుప్రీంకోర్టు దీనికి వ్యతిరేకంగా సిడిడిఏడబ్ల్యు ఒప్పందాన్ని, బీజింగ్ తీర్మానాన్ని ఉటంకిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పులో కోర్టు, మహిళలను వివక్షకు గురిచేసే గృహసంబంధమైన కేసుల విషయంలో ఈ అంతర్జాతీయ తీర్మానాలు, ఒప్పందాలను, స్థానిక న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. హిందూ వివాహ చట్టం ఆర్టికల్ 14 కు వ్యతిరేకంగా ఉందని కోర్టు చెప్పినప్పటికీ, చట్టాన్ని మహిళలకు అనుకూలంగా సవరించుకునే వీలుంటుందని, కనుక రిజర్వు బ్యాంకు నిబంధన చెల్లదనీ, దాన్ని మార్చుకోవాలని కోర్టు తీర్పు చెప్పింది.

4. సుప్రీంకోర్టు ఎదుట మూడుసార్లు తలాఖ్ చెప్పడం ద్వారా విడాకులు పొందే అవకాశాన్ని 14, 15 అధికరణలకు విరుద్ధమైనదిగా ప్రకటించాలన్న విన్నపం ప్రస్తావించబడింది.

5. దివంగత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి కోడలు శ్రీమతి మేనకాగాంధి ఒక అంతర్జాతీయ సమావేశంలో ప్రసంగించవలసి ఉండగా ఆమెకు విదేశీ ప్రయాణానికి అనుమతి లభించలేదు. ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు వివరణ ఇచ్చే అవకాశం కూడా కలగలేదు. ఆమె, తనకు వేరే దేశాల్లో ప్రసంగించే హక్కుని నిరాకరించడం అంటే మాట్లాడే హక్కును, స్వేచ్ఛగా ప్రయాణించే హక్కును నిరాకరించడమేనని, అది రాజ్యాంగ విరుద్ధమని కోర్టులో సవాలు చేసింది. ఇందుకు సమాధానంగా కోర్టు స్వేచ్ఛా సమానత్వాలతో పాటు మరో కొత్త సమానత్వ సూత్రాన్ని ప్రకటించింది. దీని ప్రకారం స్వేచ్ఛతో కూడిన సమానత్వాన్ని గుర్తించాలని పేర్కొంది. కనుక పాస్‌పోర్టు కార్యాలయం ఆమె చెప్పే వివరణను విన్న తర్వాతే ఈ విషయంపై ఏదైన నిర్ణయం తీసుకోవలసి వుంటుందని న్యాయస్థానం ఆదేశించింది.

6. భారతదేశంలో షెడ్యూల్డ్ ప్రాంతాలని పేర్కొనే కొన్ని చోట్ల ఇప్పటికీ ఆయా జాతుల సంప్రదాయ శాసనాలే వర్తిస్తాయి. ఒక ప్రభుత్వోద్యోగి భార్య అతని మరణానంతరం, అతని గృహం తనకు చెందాలని కోరింది. వారి సంస్కృతీపరమైన శాసనం ప్రకారం భార్యకు భర్త ఇంటిని వారసత్వంగా స్వీకరించే హక్కు లేదు. అయితే ఈ శాసనం వివక్షాపూరితమైనదని ఆమె సవాలు చేసింది. న్యాయస్థానం కూడా, షెడ్యూల్డ్ జాతుల వారసత్వం హక్కులో మహిళలకు జరుగుతున్న అన్యాయం 21వ అధికరణను ఉల్లఘించడమేనని తీర్పు చెప్పింది (మధుకిష్వర్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం)

7. రాజస్థాన్ రాష్ట్రంలో బాల్య వివాహాలను అరికట్టే ప్రభుత్వ కార్యక్రమంలో కార్యకర్తగా ఉన్న భన్వారీ దేవిపై స్థానికులు కొందరు దారుణంగా అత్యాచారం జరిపారు. ఆమె బాలికల తరుపున చేస్తున్న పని నచ్చకనే ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మహిళలకు సమాన హక్కుల విషయంలో సిఈడిఏడబ్ల్యు ద్వారా మహిళలపై జరుగుతున్న హింసకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను సూచించింది. కోర్టు 14, 15, 19, 21 అధికరణలను సృజనాత్మకంగా ఉపయోగించుకుంటూ, పని చేసే చోట వేధింపులన్నది మహిళల జీవించే హక్కును, గౌరవంగా బతికే హక్కును ఉల్లంఘిస్తున్నదని పేర్కొంది. దీని ఫలితంగా అనంతరం '2013 పనిచేసే చోట వేధింపుల నిరోధక చట్టం' వచ్చింది.

భారత రాజ్యాంగంలోని 14వ అధికరణం కాక, 15(1) అధికరణలో కూడా లింగం ఆధారంగా వివక్ష చూపించడాన్ని ఉల్లంఘనగా పేర్కొన్నారు. దీని ప్రకారం

"ఏ పౌరుడి పట్లా కూడా మతం, జాతి, కులం, లింగం, పుట్టిన ప్రాంతం మొదలైన వాటి ఆధారంగా ప్రభుత్వం వివక్ష చూపకూడదు" అని పేర్కొనబడింది.

అదే విధంగా 15వ అధికరణ, 3వ అంశం కింద "మహిళలకు, పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పించడాన్ని ఎవరూ ప్రశ్నించకూడదని" కూడా చెప్పింది. దీన్ని బట్టి కేవలం మహిళల పట్ల వివక్షను నిరోధించడం వల్లే ప్రయోజనం ఉండదనీ, వారికి అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని ఈ అధికరణ చెబుతోంది.

స్థానిక పాలనా యంత్రాంగంలో స్త్రీలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వడం కోసం ఏర్పడ్డ అధికరణలు 243 డి, 243 టి. ఇవి రెండూ రాజ్యాంగంలో 9వ అధ్యాయంలో, 9ఎ అధ్యాయంలో ఉన్నాయి. ప్రభుత్వ పాలనను వికేంద్రీకరించడానికి సవరణ రూపంలో ఏర్పరచిన మూడు అంచెల ప్రభుత్వ యంత్రాంగంలో భాగంగా ఈ ప్రాతినిధ్యాన్ని ప్రవేశపెట్టారు. ఫలితంగా పంచాయితీలు, పురపాలక సంఘాలు వాటి ఎన్నికలు రాజ్యాంగ పరిధిలోకి వచ్చాయి. ఈ సంస్థలకు ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ అధికరణలు 243 డి, టి ల కింది మహిళలకు ప్రాతినిధ్యాన్ని రాజ్యాంగం పేర్కొంది. ఈ సంస్థలకు జరిగే ఎన్నికలోని మొత్తం స్థానాల్లో మూడోవంతు స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరగాలని, అవి మహిళలకే కేటాయింపబడాలని రాజ్యాంగం నిర్దేశించింది.

### 7.4.2 జీవితం, స్వేచ్ఛ

రాజ్యాంగంలోని 21 వ అధికరణ చట్టం పరిధికి లోబడి, ప్రతి వ్యక్తికి జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛకు హక్కును ఆమోదిస్తుంది. ఇది తొలుత భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో చేర్చినది. తర్వాత వచ్చిన యుడిహెచ్ఆర్, ఐసిసిపిఆర్ లలో జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు అంటే గౌరవంతో కూడిన జీవితం, సేచ్ఛ అనే అర్థం వచ్చింది. ఎప్పుడైతే గౌరవంతో కూడిన అనే అర్థం వచ్చి చేరిందో అప్పుడు ప్రతి వ్యక్తికి అంతరంగిక జీవితానికి, కనీస అవసరాలకు, సమానత్వానికి, వివక్షారహిత జీవితానికి అనే అర్థాలు కూడా దీనిలో చేరాయి.

## 7.5 జాతీయ మానవ హక్కుల సంఘం

1978లో మానవ హక్కుల సంఘం రూపొందించిన ముసాయిదా మార్గదర్శక సూత్రాలను అనుసరించి, జాతీయ మానవ హక్కుల సంఘాలకు ఒక రూపం ఏర్పడింది. 1991లో మొట్టమొదటి అంతర్జాతీయ జాతీయ హక్కుల సంస్థల కార్యశాల పారిస్‌లో జరిగింది. ఇందులో ప్రతిపాదించిన సూత్రాలు, సిద్ధాంతాలే మానవ హక్కుల సంస్థలకు ఒక చట్టబద్ధతనూ, విశ్వసనీయతనూ ఇచ్చాయి. అందువల్లే 1990 ల తర్వాత జాతీయ మానవ హక్కుల సంఘాల సంఖ్య పెరిగింది. ప్రపంచ దేశాలు మానవ హక్కులను పరిరక్షించడం, ప్రచారం చేయడం చేపట్టాలని నిర్ణయింపబడింది. ఐక్యరాజ్య సమితి, తన పరిధిలోని యుఎన్‌డిపి (ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం) వంటి వాటి ద్వారా దీనికి మద్దతు ఇచ్చింది. భారతదేశంలో 1999లో ఏర్పడిన జాతీయ మానవ హక్కుల కమీషన్ పారిస్ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తూ ఉత్తమ శ్రేణి సంస్థగా పేరు తెచ్చుకుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక: (ఎ) మీ సమాధానాలు కింద ఇచ్చిన స్థలంలో రాయండి.

(బి) మీ సమాధానాన్ని యూనిట్ చివర ఇచ్చిన సమాధానంతో సరిచూసుకోండి.

5. భారత రాజ్యాంగంలో మానవ హక్కులను గుర్తించే అంశాలేవి?

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

6. కొన్ని కేసులను ఉల్లేఖించడం ద్వారా, సుప్రీంకోర్టు ఉపాధి రంగంలో సమానత్వ భావనను ఎలా వివరించిందో తెలపండి.

-----------------------------------------------------------------------------------------------------------

-----------------------------------------------------------------------------------------------------------

-----------------------------------------------------------------------------------------------------------

## 7.6 సారాంశం

అంతర్జాతీయ మానవ హక్కుల అంశం రెండో ప్రపంచ యుద్ధం తర్వాతే తెరపైకి వచ్చింది. సాధారణంగా మానవహక్కుల్లో పేర్కొనే జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, సమానత్వపు హక్కు వంటివి ఆధునిక ప్రజాస్వామిక దేశాలన్నిటిలోను ఉన్నవే. అయితే అవి ప్రపంచ స్థాయిలో ఎటువంటి జాతి, మతం, ప్రాంతం తదితర వివక్ష లేకుండా అందరికీ వర్తిస్తాయని ప్రకటించడం మాత్రం అపూర్వం. అయితే ఈ అంతర్జాతీయ తీర్మానాల్లోని భాషను బట్టి చూస్తే అందరికీ వర్తిస్తాయని ఉన్నప్పటికీ, మహిళలకు ఈ హక్కులను అనుభవించాలంటే మాత్రం అదనంగా మరికొన్ని చర్యలు, అవగాహనలు అవసరమయ్యాయి. ఈ అధ్యాయం మహిళల హక్కులను అంతర్జాతీయ సందర్భంలోను, ప్రత్యేకించి భారత దేశంలో వాటి అమలు ఎలా జరుగుతుందన్న విషయాన్ని చర్చిస్తుంది. ఇందులో ముందుగా మానవ హక్కుల పరిచయం, మహిళల హక్కులనే ఆలోచన, ఈ హక్కుల అమలుకు దోహదం చేసే అంతర్జాతీయ వాహికలు, భారతదేశంలో వీటి ప్రతిపత్తి మొదలైనవి చర్చించడం జరిగింది.

## 7.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. మానవులందరికీ సమానమైన హక్కులు, గౌరవం పొందే అర్హత ఉందని గుర్తించడమే మానవ హక్కులంటే. 1948 లో చేపట్టిన సార్వజనీన మానవహక్కుల ప్రకటన (యుడిహెచ్ఆర్) మానవ హక్కుల పట్ల అగౌరవం, నిర్లక్ష్యం అన్నవి విశ్వవ్యాప్తంగా అమానుష చర్యలకు దారితీసాయని, దీనితో మేల్కొన్న ప్రపంచ ప్రజలు, తమ నుంచి ఎవరూ తీసుకోలేని కొన్ని హక్కులు తమకున్నాయని గుర్తించారని ప్రకటించింది. ఈ హక్కులలో జీవించే హక్కు, స్వేచ్ఛగా ఉండే హక్కు, వాక్స్వాతంత్రం, భయం నుంచి, పేదరికం నుంచి విముక్తి ఉన్నాయి.

యుడిహెచ్ఆర్ ప్రకారం మనషులందరూ స్వేచ్ఛా జీవులుగా జన్మించారు. వారికి సమాన గౌరవం, హక్కులు లభించాలి (1వ అధికరణం). ఈ హక్కుల విషయంలో జాతి, లింగం, వర్ణం, భాష, మతం, రాజకీయ తదితర అభిరుచులు, దేశం, సామాజిక మూలాలు, ఆర్థిక హోదా మొదలైన ఏ వివక్షలు ఉండకూడదు.

స్త్రీ పురుషులకు మానవహక్కులు ఒక్కటే అయినప్పటికీ, మహిళల హక్కులను గుర్తించడమంటే, మానవహక్కులకు కొత్త అర్థానివ్వడమే. అంతేకాక, ఇప్పుడున్న జెండర్ అసమానతలు పోవాలంటే ప్రభుత్వాలు అదనపు చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

2. మానవహక్కులన్నవి విశ్వజనీనం కనుక, స్త్రీ పురుషులిద్దరికీ వర్తిస్తాయని అర్థం చేసుకోవాలి.  అయితే ఇప్పుడు అస్తిత్వంలో ఉన్న సామాజిక అసమానతలను, స్త్రీలకు సంస్కృతిలో విధించిన పాత్రలను పరిగణనలోకి తీసుకోకపోతే ఇవి స్త్రీపురుషుల అసమానతలను మరింత బలపరుస్తాయి.  సమాజంలో స్థిరీకరించిన మానవ హక్కులను స్త్రీవాదులు విశ్లేషించినపుడు, ఈ హక్కులను ఎలా అర్థం చేసుకోవాలన్న విషయంలో కొంత స్పష్టత వచ్చింది.  స్త్రీల పట్ల జరుగుతున్న హింసను బట్టి చూస్తే వారికి చట్టం ఎదుట సమానమైన రక్షణ లేదన్న మాటే.  అలాగే వారికి గౌరవప్రదంగా జీవించే హక్కుని నిరాకరిస్తున్నారన్న మాటే.  అందువల్ల ఇటువంటి హింసను నియంత్రించాలంటే ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవలసి ఉంటుంది.  మహిళల అవసరాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలంటే వ్యవస్థను, పాతుకుపోయిన అభిప్రాయాలను కూడా మార్చాల్సిందే.  ఏ విషయాన్నయినా స్త్రీల దృష్టికోణం నుంచి చూసినపుడు కొత్త అంశాలు బయటపడతాయి.  కొత్త మార్పులు సూచింపబడతాయి.  వీటికి కొత్త రకమైన నైపుణ్యాలు కూడా అవసరమవుతాయి. ఈ రకంగా మహిళల హక్కులు, మానవ హక్కులతో సమాన స్థాయిని పొంది, మహిళల పట్ల ఉన్న అన్ని రకాల వివక్షలు పోయినపుడే సమానత్వం సాధ్యమవుతుందన్న విషయం స్పష్టమైంది.  దీన్ని ప్రచారం చేసే బాధ్యతను 'మహిళలపై అన్ని రకాల వివక్షల నిర్మూలనా సమ్మేళనం (సిఈడిఓడబ్ల్యు) చేపట్టింది.

3. బాల్యవివాహాలు, బాలికలపై లైంగిక అత్యాచారాలు వంటివి నేరుగా విద్యా హక్కు పరిధిలోకి రావు.  అయితే బాలికలు ఏ కారణాల వల్ల చదువుకోలేకపోతున్నారని, విద్యా హక్కును వినియోగించుకోలేకపోతున్నారని విశ్లేషించినపుడు పై కారణాలు కనిపిస్తాయి.  ఈ విధంగా స్త్రీల విద్యకు అవరోధాలుగా ఉన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విధానాలను మహిళల మానవహక్కులు ఎత్తి చూపుతాయి.  మానవ హక్కులను మహిళల దృష్టి కోణం నుంచి చూసినపుడు, ఆహారం, ఆరోగ్యం, పని, విద్య, నిర్ణయాత్మక భాగస్వామ్యం వంటి హక్కుల విషయంలో స్త్రీ పురుషుల మధ్య అంత వ్యత్యాసం ఎందుకుందో అర్థమవుతుంది.

4. మహిళలపై అన్ని రకాల వివక్షల నిర్మూలనా సమ్మేళనం (సిఈడిఓడబ్ల్యు), వివక్షను మహిళలు అనుభవించే హక్కుల దృష్టికోణం నుంచి నిర్వచించింది.  సిఈడిఓడబ్ల్యు లోని ఒకటవ అధికరణలో 'మహిళల పట్ల వివక్ష' అంటే లింగం ఆధారంగా వారికి హక్కులను నిరాకరించే ఏ చర్య అయినా వివక్షే.  అంటే ఏ విషయంలోనైనా వారిని వేరుగా చూడడం, వారిని నిరాకరించడం, వారిపై ఆంక్షలు విధించడం వల్ల వారికి గుర్తింపు నిరాకరింపబడవచ్చు; లేదా వారి గుర్తింపుకు హాని కలగవచ్చు.  రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పౌర తదితర రంగాల్లో వారి మౌలిక స్వేచ్ఛను, మానవ హక్కులను, పురుషులతో సమానమైన హక్కులను నిరాకరించడమే వివక్ష'.

5. భారత రాజ్యాంగంలోని మూడో అధ్యాయంలోని ప్రాథమిక హక్కులలో యుడిహెచ్ఆర్ లో పేర్కొన్న హక్కులన్నింటికీ ఆచరణ ఉంది.  సమానత్వపు హక్కు, వివక్ష వ్యతిరేక హక్కు, మాట్లాడే స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, మత స్వేచ్ఛ ఇందులో ఉన్నాయి.  ఇతర హక్కులైన గౌరవంగా జీవించే హక్కు, న్యాయ విచారణ పొందే హక్కు, నిరపరాధిగా పరిగణింపబడే హక్కు, అంతరంగిక జీవితం గడిపే హక్కు వంటివి సుప్రీంకోర్టు అనంతర కాలంలో చేర్చింది.  మూడవ అధ్యాయంలోనే నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తుల హక్కులు, అస్పృశ్యతను, వెట్టి చాకిరీని వ్యతిరేకించే హక్కు, ప్రమాదకర పరిస్థితుల్లో బాలలు పని చేయడాన్ని ప్రశ్నించే హక్కు, విద్యా హక్కు కూడా ఉన్నాయి.

6. 1) సి.బి. ముత్తమ్మ కేసు, 1971

2) ఎయిర్ ఇండియా వర్సెస్ నర్గీస్ మీర్జా కేసు

3) శ్రీమతి మేనకాగాంధీ కేసు

4) మధుకిష్వర్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం

5) భన్వారీదేవి కేసు ద్వారా వెలువడిన పనిచేసే చోట లైంగిక వేధింపుల నివారణ చట్టం

## 7.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

(I) **ఈ కింది వాటికి ఒక్కొక్కదానికి 30 పంక్తులలో సమాధానం ఇవ్వండి.**

1. మహిళా హక్కుల ప్రాముఖ్యాన్ని చర్చిస్తూ, సిఈడిఏడబ్ల్యులో పేర్కొన్న ప్రత్యేక విషయాలను తెలపండి.
2. భారతదేశంలో మహిళల మానవ హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం కల్పించే భద్రతను వివరించండి.

(II) **కింది ప్రశ్నలకు 15 లైన్లలో సమాధానం ఇవ్వండి.**

1. యుడిహెచ్ఆర్, సిఈడిఏడబ్ల్యు (UDHR & CEDAW)
2. మహిళల హక్కుల ఉల్లంఘనలో రకాలు
3. మహిళల మానవ హక్కుల సంరక్షణలో సుప్రీంకోర్టు నిర్వహించిన పాత్రను వివరించండి.

## 7.9 ముఖ్య పదాల అర్థ వివరణ

| | | |
|---|---|---|
| యు.డి.హెచ్.ఆర్. | - | యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ |
| సి.ఇ.ఆర్.డి | - | కన్వెన్షన్ ఆఫ్ ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫారమ్స్ ఆఫ్ రేషియల్ డిస్క్రిమినేషన్ |
| సి.ఇ.డి.ఎ.డబ్ల్యూ | - | కన్వెన్షన్ ఆన్ ఆల్ ఫారమ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ ఎగినెస్ట్ ఉమెన్ |

## 7.10 ఆధారిత గ్రంథాలు

సి.బి. ముత్తమ్మ వర్సెస్ భారత ప్రభుత్వం - అనుజ్ గార్గ్, ఓఆర్ఎస్ వర్సెస్ హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (2008) 3 ఎస్.సి.సి

నరసు అప్ప మాలి వర్సెస్ బొంబాయి రాష్ట్రం

సి.బి. ముత్తమ్మ వర్సెస్ భారతప్రభుత్వం, ఏఐఆర్, 1979, ఎస్.సి

మేనకాగాంధి వర్సెస్ భారత ప్రభుత్వం, ఏఐఆర్ 1978

విశాఖ వర్సెస్ రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం, ఏఐఆర్ 1997

డేనియల్ లతీఫ్ వర్సెస్ భారత ప్రభుత్వం, 2001

గీతా హరిహరన్ వర్సెస్ రిజర్వ్ బ్యాంక్

మధు కిష్వర్ వర్సెస్ బీహార్ రాష్ట్ర ప్రభుత్వం, 1996.

# యూనిట్ - 8 : సమకాలీన సమస్యలు

విషయ క్రమం


8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 ఎల్.జి.బి.టి. (LGBT) ఉద్యమాలు

8.3 ప్రపంచీకరణ, స్త్రీలను వ్యాపార వస్తువులుగా చేయడం

8.4 అక్రమంగా స్త్రీలను తరలించడం, సెక్స్ వర్క్

8.5 వైజ్ఞానిక శాస్త్రం, సాంకేతికత

8.5.1 స్త్రీల శరీరాలను ప్రయోగ ప్రదేశాలుగా భావించడం

8.5.2 పునరుత్పాదక హక్కులు

8.5.3 జండర్ ఆధారిక హింస, సైబర్ / వర్చ్యువల్ వరల్డ్

8.6 సారాంశం

8.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

8.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.9 ముఖ్యపదాల అర్థ వివరణ

8.10 ఆధారిత గ్రంధాలు


## 8.0 లక్ష్యాలు

ఈ యూనిట్ చదివిన తర్వాత కింది విషయాలు అర్థం చేసుకుంటారు

- జండర్ గుర్తింపులు కేవలం ద్వివిధాలు కాదు బహు విధాలు
- జండర్ల నిర్మాణంలో సమకాలీనంగా ఎదురవుతున్న సమస్యలు
- జండర్ నిర్మాణాలకు, సమస్యలకు దోహదం చేసే ఏజెన్సీలు

## 8.1 పరిచయం

గత అధ్యాయాలలో జండర్ సమాజం ద్వారా నిర్మితమైనదని, వివిధ అంశాలు ఈ నిర్మాణానికి దోహదం చేశాయని చదువుకొన్నాం. జండర్ ఏ నేపథ్యంలో నిర్మించబడుతోంది, నియంత్రించబడుతోంది తెలుసుకోవడం ముఖ్యం. జండర్ నిర్మాణం మాత్రమే కాక మారుతున్న కాలంతో పాటు జండర్‌ని సమాజం ఎలా ఆమోదిస్తుంది, స్థిరీకరిస్తోంది లేదా వ్యతిరేకిస్తోంది అని పరిశీలన కూడా అవసరం. జండర్ వర్తమానంలో ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఈ యూనిట్‌లో చర్చిద్దాం.

జండర్‌ని సామాజిక వ్యవస్థ స్త్రీ, పురుషులు అనే రెండు విధాలుగా మాత్రమే గుర్తించింది. భిన్న జండర్ల సంబంధాలను, వారి మధ్య లైంగికతను మాత్రమే సమాజం ఆమోదయోగ్యమని భావించింది. మరి ఏ ఇతర జండర్, వారి సంబంధాలని సమాజం అంగీకరించలేదు. అలా జరిగితే అది అసాధారణంగాను, విపరీతంగాను భావించడం జరుగుతుంది. సమాజం స్థిరీకరించిన జండర్ మూసపాత్రలు ఇతర జండర్‌లని అంగీకరించడానికి అడ్డుపడుతున్నాయి.

స్త్రీవాద ఉద్యమాలు, స్త్రీల అస్తిత్వ కోసం పోరాడే ఉద్యమాలే కాక ఇటీవల ట్రాన్స్‌జండర్ ఉద్యమాలు ముందుకు రావడం మనం చూస్తున్నాం. ఇవి స్వలింగ సంపర్కానికి చెందిన హక్కుల కోసం చేసే ఉద్యమాలు. ఇలా జండర్ సెన్సిటైజేషన్ ద్విలింగ (స్త్రీ, పురుషుల) సంబంధించినదే కాదు. బహుళ జండర్ సంబంధాలను వివరించేది కూడా.

ఏ ప్రజాస్వామిక రాజ్యమైనా స్త్రీలు, ట్రాన్స్ జెండర్, మార్జినలైజ్డ్, మైనారిటీ కమ్యూనిటీల వారికి సాధికారత చేకూర్చడం, వారి సంక్షేమమే ముఖ్య లక్ష్యాలుగా పని చేస్తుంది. ఉదాహరణకు బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఒక స్త్రీ జీవితం బెదిరింపులకు ఎలా లోనవుతుందో గమనించుదాం. పిండదశలో ఆడపిల్ల అని తెలియగానే ఆడపిల్ల అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారుతుంది. గర్భ విచ్ఛిత్తి జరగవచ్చు, లేకపోతే కన్నవారే పసితనంలో ఆమెను చంపెయ్యవచ్చు. బాలికగా ఉన్నప్పుడే ఆమె హింసకు, లైంగిక హింసకు గురి కావచ్చు. తర్వాత కాలంలో గృహ హింసకు, పని ప్రదేశంలో లైంగిక వేధింపుకు గురికావచ్చు. అదేవిధంగా అవకాశాలు లేని వర్గాల ప్రజలు కూడా జీవితంలోని వివిధ దశలలో భిన్నభిన్న బెదిరింపులకు లోనుకావచ్చు. ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయమేమిటంటే, పైన చెప్పిన అత్యాచారాలు స్త్రీ అయినా ట్రాన్స్‌జెండర్ అయినా, అవకాశాలు లేని వర్గ సభ్యులైనా జరగడానికి ఆస్కారం ఉంది. అప్పుడు ఇటువంటి గుర్తింపులు వారిని బలహీనులుగా చేస్తాయి. ఇటువంటి సందర్భంలో సాధికారత పెద్ద సమస్యగాను, అవాస్తవంగాను అనిపించవచ్చు.

స్త్రీ జీవితంలో వృద్ధాప్యం కీలకదశలలో ఒకటి. తమ వారికోసం జీవితాంతం కష్టపడిన స్త్రీలు తమ క్షేమాన్ని నిర్లక్ష్యం చేసి వయసు మీరకుండానే శారీరక, మానసిక సమస్యలకులోనై వృద్ధాప్యంలో సమస్యలను ఎదుర్కుంటారు. హార్మోను ప్రభావాలేకాక, సమాజ ప్రభావాలు కూడా తోడై వృద్ధులైన స్త్రీలను బలహీనులను చేసి, ఇంకా కుటుంబం కోసం నిరంతరం శ్రమించేలా చేస్తూ, వారి హక్కులను అనుభవించనీయకుండా చేస్తాయి.

## 8.2 ఎల్.జి.బి.టి. ఉద్యమాలు

సెక్స్ అనేది శరీర సంబందించినది, జండర్ సమాజ నిర్మితం. అయితే సుజన్ కెస్లరాండ్ అండ్ ఫాస్టో - స్టెర్లింగ్ అనే సామాజిక శాస్త్రవేత్తలు జండర్ మాత్రమే కాదు సెక్స్ కూడా నిర్మితమైందే అంటున్నారు. పుట్టినపుడు వర్గీకరించిన శారీరక గుర్తింపులను రెండుగా వర్గీకరించరాదు అని వీరు అంటారు. బహుళ జండర్లు ఉన్నట్లే బహు సెక్స్ గుర్తింపులు కూడా ఉంటాయి. ట్రాన్స్ జండర్ గుర్తింపులు వలెనే ట్రాన్స్ సెక్స్యువల్, ఇంటర్ సెక్స్యువల్ గుర్తింపులు ఉన్నాయి. ఇంటర్ సెక్స్యువాలిటీ (Inter sexuality) అంటే స్త్రీ, పురుష జననాంగాలు రెండూ ఉండే స్థితి లేదా, ఒకటి ఆధిపత్య స్థితిలో ఉండి, రెండోది నిద్రాణంగా ఉండడం వంటివి. ఇటువంటి పరిస్థితులను అస్పష్ట గుర్తింపులుగా భావిస్తారు. అంతేకాక అటువంటి పిల్లలను మగ పిల్లలుగా ప్రకటించి, ఆ పసిపిల్లలకు శస్త్ర చికిత్స కూడా చేస్తారు. ఈ సాధారణీకరణ ప్రక్రియ జండర్ గుర్తింపు ప్రామాణీకరణకు దారితీస్తుంది. ఆడ, మగ శరీరాలను, జీవితాలను రూపకల్పన చేయడమే కాక, పితృ స్వామ్య సమాజం ప్రజలను మూసలలో పోస్తుంది. మరే ఇతర గుర్తింపులనైనా విడిగా పెట్టి, అసహ్యించుకొని, హేళన చేసి, నిషేధిస్తుంది. అదేవిధంగా ఎవరైతే భిన్నలింగ సంపర్కానికి అంగీకరించకుండా స్వలింగ సంపర్కం చేస్తారో వారిని సమాజ భ్రంశకులుగా భావిస్తారు.

అణచివేత, బహిష్కరణ, దోపిడిల వల్ల పుట్టిన ఇతర ఉద్యమాల వలెనే ట్రాన్స్ జెండర్ ఉద్యమాలు కూడా కమ్యూనిటీలు, సమాజాల నుంచి వచ్చిన తిరస్కరణ నుంచే ఉద్భవించాయి. సమకాలీన ఉద్యమాలలో ఎల్.జి.బి.టి.

లేదా జి.ఎల్.బి.టి. (స్త్రీ స్వలింగ సంపర్కులు, పురుష స్వలింగ సంపర్కులు, ఉభయ లింగ సంపర్కులు, ట్రాన్స్ జెండర్) (Lesbian, gay, bisexual, trans gender) ఉద్యమం తమ గుర్తింపులను ప్రకటించి తమ స్థానాన్ని దృఢంగా చెప్పుకునేలా చేసింది. భారతదేశంలో కూడా ఎల్.జి.బి.టి. ఉద్యమాలు తమ మానవ హక్కుల కోసం పోరాడటం చూస్తున్నాం. 'ఐయామ్ విద్య : ఎ ట్రాన్స్ జండర్ జర్నీ' రచయిత: లివింగ్ స్మైల్ విద్య (న్యూఢిల్లీ, రూప పబ్లికేషన్స్, ఇండియా, 2013) ని చదవండి. లేదా 'ద ట్రూత్ ఎబౌట్ మి : ఎ హిజా లైఫ్ స్టోరీ' రచయిత: ఎ. రేవతి (పెంగ్విన్ బుక్స్ ఇండియా, 2010) ను గాని చదివితే ట్రాన్స్ జండర్ వ్యక్తులు పడే మానసిక సంఘర్షణ, వేదన బాధ అర్థమవుతుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక : (ఎ) మీ సమాధానానికి చోటు వదలడం జరిగింది.

(బి) మీ సమాధానాన్ని పాఠం చివర ఇచ్చిన సమాధానంతో పోల్చి చూసుకోండి.

1. ఎల్.జి.బి.టి. ఉద్యమాల గురించి మీకేమి తెలుసు?

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

## 8.3 ప్రపంచీకరణ, స్త్రీలను వ్యాపార వస్తువులుగా చేయడం

పితృస్వామ్య సంప్రదాయం స్త్రీలను ఎల్లప్పుడూ అప్రధాన పౌరులుగా చూస్తే, ప్రపంచం మొత్తాన్ని కలిపివేసిన ప్రపంచీకరణ కూడా పురుష కేంద్రితంగానే ఉంది. స్వేచ్ఛావాదం పేరున స్త్రీలు, వారి శ్రమ, వారి గుర్తింపులు అన్నిటినీ వాణిజ్య శక్తులు వ్యాపార వస్తువులుగా మార్చివేశాయి. యూరప్‌లో 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం వల్ల కుటీర పరిశ్రమలు అదృశ్యమైపోయాయి. పట్టణీకరణ, శ్రమదోపిడీ మొ॥నవి జరిగాయి. అదేవిధంగా ప్రపంచీకరణ వల్ల ఎన్నో నూతనావిష్కరణలు, అవకాశాలు వచ్చాయి. కాని ఈ నూతనావిష్కరణలు, అవకాశాలు ఏదో ఒకరకంగా పురుషాధిక్య సంస్కృతిని ప్రేరేపిస్తున్నాయి.

దేశాల మధ్య అడ్డు గోడలు అదృశ్యమయ్యాయి. చివరికి పని అవకాశాలకు ఆకాశం కూడా హద్దు కాదు. కొత్త వృత్తులు సృష్టింపబడుతున్నాయి. కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. ఈ అవకాశాలు, మార్గాలు జండర్ సమానత్వాన్ని పాటిస్తున్నాయా? అవి జండర్ స్టీరియో టైప్స్ కావని, స్త్రీలను దోపిడీకి గురి చేయడం లేదని చెప్పగలమా? కుప్పిలి పద్మరాసిన "సాలభంజిక"ను చదవండి. స్వయం నిర్భరత, వ్యాపారీకరణల మధ్య వృత్తి పేరు మీద మహిళలు పడే సంక్షోభాన్ని ఇది చెబుతుంది. అదేవిధంగా, మనకు ఇప్పుడు అందుబాటులో ఉన్న ఆదర్శ మహిళా మోడళ్ళను గురించి చెబుతుంది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరిట ఇచ్చిన సైజుల్లో కుదించుకుని పోయి, మనసులకు, శరీరాలకు హాని చేసుకోవలసిన పరిస్థితి దీనివల్ల ఏర్పడుతుంది.

మహిళల గుర్తింపులను ప్రసార సాధనాలు, వ్యాపార సంస్థలు ఆదర్శ జండర్ పాత్రల నమూనాలుగా, వాడకందార్లుగా, వినియోగదార్లుగా నిర్మిస్తాయి. ఆడవారిని, వారి బొమ్మలను, గుర్తింపులను వాణిజ్య ప్రయోజనాలకోసం వాడుతూ, వాటిని కూడా మగ దృక్పథంతో తయారు చేయడం మహిళలను వ్యాపార వస్తువులుగా భావించినట్లు చెప్పవచ్చు. అంటే, వ్యాపారవేత్తలకు స్త్రీలు వ్యాపార వస్తువులుగా, మగవారి కోరికకు వినియోగ వస్తువులుగా, వారి శ్రమ, లైంగికతలు వ్యాపార మార్పిడి వస్తువులుగా కనిపిస్తాయి.

ముంబయిలోని బార్ డాన్సర్ల గురించిన చర్చలను గురించి తెలుసుకోండి. మహిళా సంఘాలు బార్‌లో నృత్యం కొనసాగించాలని కొందరు, వద్దని కొందరు ఎలా వాదించుకుంటున్నారో తెలుసుకొనడానికి ప్రయత్నించండి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక : (ఎ) మీ సమాధానానికి చోటు వదలడం జరిగింది.

(బి) మీ సమాధానాన్ని పాఠం చివర ఇచ్చిన సమాధానంతో పోల్చి చూసుకోండి.

2. సమకాలీన ప్రపంచ సందర్భంలో స్త్రీలను వ్యాపార వస్తువుగా చూడడం వల్ల జరిగేది ఏమిటి?

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

---------------------------------------------------------------------------------------------------------------

## 8.4 అక్రమంగా స్త్రీలను తరలించడం, సెక్స్‌వర్క్

వ్యాపార వస్తువుగా చూడడం, ఆ వస్తువును తయారు చెయ్యడానికి దగ్గర సంబంధం ఉంటుంది. ఎన్నోయుగాలుగా స్త్రీలను తనకిష్టం ఉన్న పని చేయడానికి, తన అభిప్రాయం చెప్పడానికి స్వాతంత్ర్యం లేనివారిగా, స్వతంత్రమైన ఆలోచన లేనివారుగా చూడడం జరిగింది. పురుషుల నిర్ణయాలను ఇంటిలోనైనా, పని ప్రదేశంలోనైనా ప్రశ్నించకుండా అనుసరించే వారుగా స్త్రీలు ఉండాలని భావించడం జరిగేది. పెరుగుతున్న వాణిజ్య సంస్కృతులలో స్త్రీల పరిస్థితి మరింత బలహీనంగా తయారవుతుంది. ఎన్నోయుగాలుగా పనిచేయించడానికి, వ్యభిచారానికి స్త్రీలను అక్రమంగా తరలించడం అమలులో ఉంది. ప్రపంచంలోని వివిధ ప్రదేశాలకు సులువుగా వెళ్ళగలిగే సౌకర్యాలు రావడంలో, స్త్రీలను అక్రమంగా తరలించడం కూడా బాగా పెరిగిపోయింది. ముఖ్యంగా ఆర్థికంగా అవకాశాలు లేని వర్గాల స్త్రీల విషయంలో ఇది మరీ ఎక్కువైంది. డబ్బు, అధికారం, హోదా, సాంప్రదాయాలు స్త్రీల అక్రమ రవాణా విషయంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. ప్రపంచీకరణ జరుగుతున్న సందర్భంలో పని పేరు మీద, మెరుగైన వేతనాలు, మంచి అవకాశాలు పేరుతో స్త్రీలను అక్రమంగా తరలించే సంఘటనలు ఎక్కువ అవుతున్నాయి.

ఇలా అక్రమంగా తరలించే స్త్రీలలో చాలా మందిని వ్యభిచారంలోకి నెట్టేస్తారని తెలిసిన విషయమే. ఇప్పుడు ప్రపంచీకరణ వలన విశ్వవ్యాప్తంగా మహిళలను లైంగిక వస్తువులుగా చూసే విధానం బాగా పెరిగింది. వ్యభిచారం కూడా పనేనని, దానిని నైతిక విషయాలతో ముడిపెట్టి తీర్పు చెప్పరాదని మనం గుర్తించాం. కాని పితృ స్వామిక సమాజంలో వ్యభిచార వ్యవస్థలోనే అంతర్గతంగా లైంగిక రాజకీయాలున్నాయని మనం అర్థం చేసుకోవాలి. భారతదేశంలో

సెక్స్ వర్క్ సంప్రదాయాన్ని గురించి మనం గతంలోకి వెళ్ళి అర్థం చేసుకోవాలి. ప్రాచీన కాలంలో వేశ్య కమ్యూనిటీలను సృష్టించారు. వారు ధనవంతుల లైంగిక అవసరాలను తీర్చేవిధంగా చేశారు. 19వ శతాబ్దంలో వేశ్యా వృత్తి నిరోధ ఉద్యమం ఫలితంగా దేవదాసి వ్యవస్థ రద్దు అయింది. వేశ్యలు లేదా ఆలయ నాట్యకత్తెల జీవిక కోసం పడుపుకత్తెలుగా మారారు. వ్యభిచారాన్ని ఇప్పుడు సెక్స్ వర్క్ అంటున్నాం. దీనిని పని అంటే అనవచ్చు. అయితే పనికున్న ఎన్నో ఇతర రూపాలవలెనే సెక్స్‌వర్క్ కూడా అధికార క్రమం ఉన్న సమాజం స్త్రీని వస్తువుగా చూడడం వల్లే సంభవించింది. దేవదాసి సంప్రదాయాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. కాని దళిత దేవదాసీలు, జోగినులు లేదా మాతమ్మలను సమాజంలోని ఆధిపత్యం చెలాయించే వర్గాలు ఇంకా తయారు చేస్తూనే ఉన్నాయి.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక : (ఎ) మీ సమాధానానికి చోటు వదలడం జరిగింది.

(బి) మీ సమాధానాన్ని పాఠం చివర ఇచ్చిన సమాధానంతో పోల్చి చూసుకోండి.

3. వస్తువుగా చేయడం (objectification) అంటే ఏమిటి? స్త్రీలను అక్రమంగా తరలించడానికి, దీనికి సంబంధమేమిటి?

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

4. స్త్రీలను దేవాలయాలకు అంకితం చేసే ఆచారాన్ని గురించి సంగ్రహంగా రాయండి.

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

--------------------------------------------------------------------------------

## 8.5 వైజ్ఞానిక శాస్త్రం, సాంకేతికత

20వ శతాబ్దంలో నూతన పరికల్పనలు, పరివర్తనాలు ఎన్నో చూశాం. జీవితం వేగంగా మారిపోయింది. ఈ అభివృద్ధులకు ఎన్నో కృతజ్ఞతలు చెప్పాలి. ప్రత్యేకించి, స్త్రీల పని తన దిశలను విశేషంగా మార్చుకుంది. పని గంటలు తగ్గాయి, పనిలో సులువు పెరిగింది. మిక్సర్లు, గ్రైండర్లు, కుక్కర్లు, నల్లాల్లో నీరు, రావాణా సౌకర్యాల వల్ల శ్రమ తగ్గింది. అయితే ఎంత మంది స్త్రీలకు ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి? ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్న స్త్రీలకైనా, ఇంకా ఇంటి పని భారం స్త్రీలదే అనుకొనే పురుషకేంద్రిత ప్రపంచంలో వీటి వల్ల మరింతభారం పెరిగిందా?

ఈ నూతన వస్తువులు కొన్ని ప్రపంచ దిశను మార్చి ఉండవచ్చు కాని ఈ పరివర్తనలు అవకాశాలు లేని వర్గాల వారికి చేరలేదు. అంతేకాకుండా, వారి భావజాలం కూడా పితృస్వామిక ఆలోచనలు, మొగ్గుదల నుంచి స్వేచ్ఛను పొందలేదు. అభివృద్ధి అని మనం భావిస్తున్నది జండర్లను వస్తువులుగా, వ్యాపారావకాశాలుగా చూడటానికి ఏవిధంగా దోహదం చేసిందో గమనిద్దాం.

### 8.5.1 స్త్రీల శరీరాలను ప్రయోగ ప్రదేశాలుగా భావించడం

వైజ్ఞానిక పరిశోధనలకు ప్రయోగశాలల్లో గినియా పందులను తమ నూతన ప్రయోగాల కోసం వినియోగిస్తున్నారు. గినియా పంది అని చెప్పడంతోనే ఆ జంతువుకి నిర్ణయం తీసుకునే శక్తి లేక లొంగిపోయిందనే భావం మనకు తోస్తుంది. ప్రయోగశాలలు, ప్రభుత్వాలు, వ్యక్తులు సాంస్కృతికంగాను, శాస్త్రీయంగాను స్త్రీల శరీరాలపై ప్రయోగాలు చేస్తున్నాయి. ఒక వైపున జీరో సైజు ఆకృతి కోసం ఎందరో స్త్రీలకు ఆకలి మందగించిపోయి నరాల వ్యాధి బారిన పడేలా చేస్తున్నారు. మరోవైపున ఆకలి తీరని బులీమియా వ్యాధి బారిన మరికొందరు పడుతున్నారు. వారిపైన ఎలాంటి ప్రయోగాలు చేస్తున్నారో చెప్పకుండానే ఇదంతా చేస్తున్నారు. పితృస్వామిక ఏజెన్సీలు వ్యాపింపచేసిన సౌందర్య కల్పనలు స్త్రీలు నిరంతరం తమను ఇతరులు కాంక్షించేలా, ఆమోదించేలా చేసుకొనడానికి వీలుగా తమని తాము పర్యవేక్షించుకుంటూ జీవిస్తున్నారు. మరికొన్నిసార్లు తమ శరీరాలపై ఎటువంటి ప్రయోగాలు చేస్తున్నారో కూడా ఆయా మహిళలకు తెలియదు. ఉదాహరణకు కొన్ని గురుకుల పాఠశాలలో మార్జినలైజ్డ్ కమ్యూనిటీలు (అవకాశాలు ఆర్థిక వనరులు లేని కమ్యూనిటీలు) కు చెందిన బాలికలపై గర్భాశయ కేన్సర్‌కు సంబంధించిన టీకాను ప్రయోగించి చూడటం జరిగింది. దాని వల్ల రాబోయే పరిణామాల గురించి వారికి చెప్పారో లేదో తెలియదు. వారిలో కొందరికి తీవ్రమైన దుష్పరిణామాలు కలగగా, కొందరు దుష్పరిణామాల వల్ల చనిపోయారు. మొదటి సందర్భంలో సఫలత అనే పేరు మీద స్త్రీలు వ్యాపార వస్తువుగా చూడబడ్డారు. ఇంకా దీనివలన తెలిసేదేమంటే వారిని కనీసం విలువైన ప్రాణం కలిగిన మనుషులుగా కూడా చూడలేదు.

### 8.5.2 పునరుత్పాదక హక్కులు

భిన్నలింగాలు (స్త్రీ, పురుషుల) మధ్య లైంగిక సంపర్కం వల్ల సంతానం కలుగుతుంది కనుక దానికి ప్రాధాన్యమివ్వడం జరిగింది. భారతదేశంలాంటి దేశంలో భిన్నలింగాల వారి మధ్య జరిగే వివాహం సాధారణంగా ఒక కులం వారితోనే జరుగుతుంది. మహిళ ఇంటిని తయారు చేయగలదు కాని, ఆమె దానికి సొంతదారు కాదు, బిడ్డలను కంటుంది కాని, వారిపై హక్కులేమీ ఉండవు, ఎందుకంటే పితృస్వామ్య సమాజంలో అన్ని హక్కులు పురుషులకే ఉంటాయి. ఎప్పుడు, ఎంత మంది పిల్లల్ని కనాలో కూడ భర్త కాని, అత్తమామలు కాని నిర్ణయిస్తారు. పునరుత్పాదక సామార్థ్య హక్కులు లేకుండా, నిర్ణయం తీసుకొనే అధికారం లేకుండా ఉండడంతో కుటుంబంలో కూడా స్త్రీకి హోదా ఉండదు. (ఆడ పిల్లల) భ్రూణ హత్య, ఆడ శిశువుల హత్య, బాలికలతో పనిపాటలు చేయించడం, గృహ హింస మొదలైనవి అన్నీ ఈ హోదా దిగజారడం వలన కలిగే పరిణామాలు.

అణచివేతకు గురైనవారు ఎదురు తిరుగుతారు. అణచివేతకు వ్యతిరేకంగాను, పునరుత్పాదక హక్కుల విషయంలోను స్త్రీలు పోరాడుతున్నారు. (ఆడ పిల్లల) భ్రూణ హత్య, ఆడ శిశువుల హత్యకు వ్యతిరేకంగా చట్టాలు కూడా చేయడం జరిగింది. కాని అవి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఎందుకంటే పురుషాధిక్య సంస్కృతి జండర్ సమానత్వం గురించి ఆలోచించలేదు. అబార్షన్ (గర్భ విచ్ఛిత్తి) హక్కు కోసం ప్రధానమైన ఉద్యమాలెన్నో జరిగాయి. పిల్లల్ని కనాలా, వద్దా? కంటే ఎందరిని కనాలి? ఎప్పుడు కనాలి? అనే నిర్ణయాలు తీసుకొనగలిగే హక్కుల కోసం

మహిళలు పోరాడుతున్నారు. ఒకవేళ బిడ్డలు వద్దనుకుంటే, గర్భవిచ్ఛిత్తి చేసుకునే హక్కు కోసం కూడా వారు పోరాడారు. పునరుత్పాదక సమస్య విషయంలో సైన్సు, టెక్నాలజీ విశేషంగా మార్పు తీసుకువచ్చాయి. వీటిలో కొన్ని మహిళలకు సాయం చేసినా, కొన్ని ప్రధానమైన సమస్యలకు కారణమై ఉండవచ్చు. ఉదాహరణకు గర్భవతులకు లింగ నిర్ధారణ పరీక్ష చేయడాన్ని ప్రభుత్వం నిషేదించింది. బిడ్డ గర్భంలో ఉండగా బిడ్డ ఆడో, మగో చెబితే అది శిక్షార్హమైన నేరం. అయితే బిడ్డ ఎదుగుదలను అంచనా వేసే ఆధునిక పరీక్షలు కూడా ఉన్నాయి. అటువంటి పరీక్షలను పిండం సెక్స్ ఏమిటో తెలుసుకొనడానికి వాడుకుంటున్నారు.

బిడ్డలు వద్దనుకునే స్త్రీలు ఉంటారు. కొందరు స్త్రీలకు శారీరక కారణాల వల్ల సంతానం కలగరు. స్వలింగ సంపర్కం చేసేవారు గాని, వివాహాలు చేసుకున్న వారు గాని కొందరుంటారు. ఇటువంటి కేసులన్నిటిలో బిడ్డల్ని కనడం, పెంచడం, వారి ఇష్టం. ఇటువంటి పరిస్థితిలో మహిళల గర్భాలను అరువు తీసుకొని (Sarrogacy) బిడ్డని కనడం కూడా వీలు ఉంది. అరువు గర్భానికి ఇద్దరు ఆడ వాళ్ళ నిర్ణయం అవసరం. అరువు తీసుకొనే మహిళ, అరువు ఇచ్చే మహిళ చాలా తరచుగా వారి పురుషులు లేదా కుటుంబ నిర్ణయంపై ఆధారపడి ఒప్పుకుంటారని మనకు తెలుసు. పునరుత్పాదక హక్కుల దృష్ట్యా అరువు గర్భం వలన కలిగే మంచి చెడులను గురించి తెలుసుకొనడం ముఖ్యం. అరువు గర్భానికి సంబంధించిన వాదోపవాదాలను తెలుసుకోవడానికి ప్రయత్నించండి.

దీనికి సంబంధించిన మరో అంశం అండాన్ని నిల్వ ఉంచడం (ఎగ్ ఫ్రీజింగ్). దీనిలో మహిళ అండాలను (oocytes) తీసి, ఫ్రీజ్ చేసి, నిల్వ చేసి, పునరుత్పాదక వయసులో ఉన్న స్త్రీ, పునరుత్పాదక సామర్ధ్యాన్ని రక్షించడం జరుగుతుంది. యువతులుగా ఉన్నప్పుడు తమ అండాలను ఫ్రీజ్ చేసుకొని, బిడ్డలు కనగలిగిన స్థితిలో ఉన్నపుడు గర్భం దాల్చడానికి మహిళలకు ఈ పద్ధతి తోడ్పడుతుంది. దీని వల్ల స్త్రీలు తమ వృత్తిలో శ్రద్ధ చూపుతూ ముందుకు పోవడానికి, జీవితంలో స్థిరపడిన తర్వాత పిల్లల్ని కని, పెంచడానికి వీలవుతుంది. ఇది ఒకరకంగా బాగానే కనిపించినా, సైన్సు, టెక్నాలజీ ప్రయోజనాలు పొందడానికి ఏ స్థాయి మహిళలకు సాధ్యమవుతుంది అనేది ప్రశ్న. అంతేకాక పిల్లల్ని పెంచడం స్త్రీ ఒక్కదాని బాధ్యతే అని ఇది పునరుద్ఘాటిస్తుంది.

### 8.5.3 జండర్ ఆధారిత హింస, సైబర్/వర్చ్యువల్ వరల్డ్

జండర్ ఆధారిత హింస, లైంగిక వేధింపు, లైంగిక దాడి, గృహ హింస మొ॥న వాటి గురించి ఇంతకు ముందు పాఠాలలో తెలుసుకున్నారు. వర్తమాన కాలంలో, సాంకేతికత పెరగడంతో మరింతగా జండర్ హింస జరిగే అవకాశాలు పెరిగాయి. జండర్ ఆధారిత హింస అంటే గృహ హింస ఒక్కటే కాదు. లైంగిక దాడి అంటే మానభంగం ఒక్కటే కాదు. వాటికి ఎన్నో కోణాలు, రూపాలు ఉన్నాయి. లైంగిక హింసను ప్రేరేపించే ఒక ప్లాట్‌ఫారం సైబర్/వర్చ్యువల్ వల్డ్. ఈ పాఠంలో ఇంతకు ముందు చెప్పుకొన్నట్లుగానే సాంకేతిక అభివృద్ధి వల్ల భౌగోళిక దూరాలు తగ్గిపోయాయి. ప్రజలు, దేశాల మధ్య అనుసంధానత బాగా పెరిగింది. అదే టెక్నాలజీతో బహిరంగ ప్రదేశాల్లో, ప్రయివేటు ప్రదేశాల్లో స్త్రీలను చిత్రీకరిస్తున్నారు. నేరగాళ్ళు, ఆకతాయిలు, మానసిక వికృతి ఉన్నవారు అమ్మాయిలను మోసగించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ, వేధిస్తున్నారు. ఏ జండర్ పైన అయినా సైబర్ నేరాలు జరగవచ్చు. కాని సైబర్ ప్రపంచంలో ఎక్కువగా స్త్రీని వ్యాపార వస్తువుగా చేయడం జరుగుతుంది.

స్త్రీల అక్రమ రవాణా, సెక్స్‌వర్క్ గురించి ఈ పాఠంలోనే తెలుసుకున్నాం. స్త్రీలు ఎలా ఉండాలో, ఎలా కనిపించాలో చెప్పే మగచూపు స్త్రీలను అశ్లీలంగా చూపేందుకు అలవాటుపడింది. అశ్లీల చిత్రాలకు సైబర్ ప్రపంచం ప్రధాన ప్లాట్‌ఫాం అయింది. అశ్లీల చిత్రాలు కేవలం కోరికకు సంబంధించినవే కావు. ఇది కోరికగా, సంతోషంగా కనిపించే హింస. బలహీనులైన స్త్రీలు, అవకాశాలకు దూరంగా ఉన్న స్త్రీల పైన జరిగే లైంగిక హింస ఇది. అశ్లీల చిత్రాలు స్త్రీల పౌర హక్కులకు సంబంధించినవి అని ఆండ్రియా డ్వార్కిన్ అనే అమెరికా స్త్రీ వాది అంటారు. అశ్లీల చిత్రాల్లో చూపించే హింస, దానిలో పాల్గొనే వారు ఆనందిస్తున్నట్లుగా చూపించడం వంటివి బలహీన వర్గాలపై లైంగిక అత్యాచారాలకు దారి చూపుతాయి. ఆలయ దేవదాసీలు, బార్‌లో డాన్సు చేసేవారు, సెక్స్‌వర్కర్లు, మగ చూపుకు ఆనందం కలిగిస్తూ ప్రదర్శనలిస్తున్న వారి మధ్య గల సంబంధాన్ని మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అశ్లీల చిత్రాల్లో కనిపించే ప్రదర్శన కూడా ఆధిపత్యం వహించే మగ చూపుకు అలాగే ఉంటుంది.

**మీ అవగాహనను పరీక్షించుకోండి**

గమనిక : (ఎ) మీ సమాధానానికి చోటు వదలడం జరిగింది.

(బి) మీ సమాధానాన్ని పాఠం చివర ఇచ్చిన సమాధానంతో పోల్చి చూసుకోండి.

5. అరువు గర్భం (Surrogacy) గురించి రాయండి.

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

6. అండాలు నిల్వ (ఎగ్ ఫ్రీజింగ్) చేయడం అంటే ఏమిటి?

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

------------------------------------------------------------------------------------------------------------

## 8.6 సారాంశం

వర్తమాన ప్రపంచంలో జండర్ సంబంధిత సమస్యలను గురించి ఈ పాఠంలో చర్చించాం. జండర్ కేవలం ద్వివిధాత్మకమైనది కాదని, జండర్ వైవిధ్య భావనను ఇది వివరించింది. జండర్ క్షేత్రంలో ట్రాన్స్‌జెండర్ ఉద్యమాల గురించి, ఆరంభ చర్చలు తెలుసుకొనడానికి తోడ్పడుతుంది. ఎల్.జి.బి.టి. ఉద్యమాలు, ఇతర గుర్తింపు ఉద్యమాల వలెనే భిన్న లింగ సంపర్క వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. సమాజం నిర్దేశించిన పాత్రలలో ఇమడని, సమాజానికి ఎదురు తిరిగి తమ జండర్లను, లైంగికతలను ఎంపిక చేసుకున్న వారిని హేళన చేస్తూ, బహిష్కరించడానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

ప్రపంచీకరణ ప్రపంచాన్ని చిన్న గ్రామంగా మార్చివేసింది. అనుసంధానత పెరగడంతో స్త్రీలను వ్యాపార వస్తువులుగా చూడడం ఎక్కువైంది. భారతదేశంలో ఎన్నోయుగాలుగా, అక్రమంగా స్త్రీలను తరలించడం, వ్యభిచారం ఉంటూనే ఉంది. కాని ప్రపంచీకరణ వల్ల స్త్రీల అక్రమ రవాణా, స్త్రీల శ్రమ దోపిడి చేయడం, లైంగిక శ్రమ మరింతగా పెరిగాయి. ఈ పాఠంలో 20వ శతాబ్దంలో ప్రపంచ విధిని, గమ్యాన్ని సైన్సు, టెక్నాలజీ ఎలా మార్చాయో వివరంగా చర్చించడం జరిగింది. ఇవి నూతన కల్పనలు, పరివర్తనలు తెచ్చినా, అరువు గర్భం, అండాల నిల్వ, లింగ నిర్ధారణ పరీక్ష మొ॥ జండర్ సంబంధిత చర్చలకు అంతగా దోహదం చేయడం లేదు.

ఈ పాఠంలో సైబర్ / వర్చ్యువల్ ప్రపంచంలో పెరిగిపోతున్న జండర్ హింసను గురించి కూడా తెలుసుకున్నాం. సైబర్ ప్రపంచంలో బ్లాక్ మెయిల్‌కు, హేళనకు, దోపిడీకి గురవుతున్న వారిలో ఎక్కువ మంది స్త్రీలే. సాంప్రదాయకంగా జరిగే అక్రమ తరలింపు, సెక్స్ వర్క్, స్త్రీలను వ్యాపార వస్తువులుగా చూడడంతోపాటుగా అశ్లీల చిత్రాలు కూడా సోషల్ మరియు డిజిటల్ మీడియా ద్వారా విపరీతంగా వ్యాప్తిలోకి వచ్చాయి. జండర్ ఒక్కటే వ్యక్తులకు గుర్తింపును ఇవ్వదు. అదొక్కటే వారి గుర్తింపు కాదు. వారి కులం, మతం, ప్రాంతం మొ॥వి జండర్ గుర్తింపుకి కారణాలవుతాయి.

అందువల్ల స్త్రీలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఏకరీతిలో ఉన్న సమూహం సభ్యులు కారు. నిమ్న కులాలకు, తరగతులకు చెందిన అవకాశాలు లేని స్త్రీ శరీరాలను, గర్భాలను ఎక్కువగా వ్యాపార వస్తువులుగా చూసే అవకాశం ఉంది. గర్భాన్ని అద్దెకు ఇచ్చిన తల్లులు, బార్‌డాన్సర్లు, జోగినులు మొదలైన వారు ఆధిపత్యం గల సామాజిక, ఆర్థిక వ్యవస్థలో వ్యాపార వస్తువులు అవుతున్నారు.

## 8.7 మీ అవగాహన పరీక్షించుకోండి - మాదిరి జవాబులు

1. పుట్టుకతో వచ్చిన ఆడ, మగ అనే శారీరక గుర్తింపులకు మాత్రమే గుర్తింపులు పరిమితం కాదు. అయితే సమాజం వీటిని రెండో, మరెన్నో గుర్తింపులుగా స్థిరపరచుతుంది. అవి కొన్నిసార్లు హేళనకు, నిషేధాలకు గురవుతాయి. అదేవిధంగా భిన్న లింగ సంపర్కం జరపనివారు తమ లింగానికి సంబంధించిన వారినే భాగస్వాములుగా చేసుకున్న వారిని సమాజం విపరీత ప్రవర్తన కలవారిగా చూస్తుంది. అణచివేతను, దోపిడీని ఎదుర్కొనే ఇతర గుర్తింపు ఉద్యమాలవలెనే కమ్యూనిటీల్లోను, సమాజాల్లోను తిరస్కరణకు గురైన ట్రాన్స్

జెండర్లు కూడా ఉద్యమాలు నెరపారు. వర్తమానంలో వచ్చిన ప్రముఖ ఉద్యమాల్లో ఎల్.జి.బి.టి. లేదా జి.ఎల్.బి.టి. ఒకటి. (లెస్బియన్, గే, బై- సెక్స్యువల్, ట్రాన్స్ జెండర్) ఈ ఉద్యమం వారి గుర్తింపులను ప్రకటించి, వారి స్థితిని స్థిరపరచింది.

2. స్త్రీలను, వారి చిత్రాలను, గుర్తింపులను వాణిజ్య ప్రయోజనాలకు వాడడం, వాటిని మగ దృక్పథంతో నిర్మించడం వంటివి స్త్రీని వ్యాపార వస్తువుగా చేయడంగా భావిస్తారు. అంటే వాణిజ్య శక్తులు స్త్రీలను వినియోగ వస్తువులుగా, తమ కోర్కెలు, అవసరాలు తీర్చే వస్తువులుగా భావిస్తాయి. వారి పరిశ్రమను, లైంగికతను వ్యాపార వినిమయ వస్తువులుగా చేస్తాయి. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న అంతర్జాతీయ బ్రాండు ఆదర్శ మహిళ నమూనా వైపు మనల్ని నడిపిస్తోంది. తప్పనిసరిగా ఇచ్చిన సైజుల్లోకి శరీరాన్ని, మనసుని కుదించుకోవలసిన అగత్యం ఏర్పరుస్తోంది.

3. ఎన్నో యుగాలుగా స్త్రీలను వస్తువులుగా చూస్తున్నారు. వారికి ఎంపిక చేసుకునే అధికారం, అభిప్రాయం చెప్పే అవకాశం, స్వాతంత్ర్యం లేవు. స్వతంత్ర్యంగా ఆలోచించనివ్వలేదు. ఇంట్లో, పని ప్రదేశంలో మగవారి నిర్ణయాలను వారు పాటించాలి. పెరుగుతున్న వాణిజ్య సంస్కృతుల్లో వస్తువుల హోదాలో ఉన్న స్త్రీల పరిస్థితి మరింత బలహీనమవుతోంది. పనికోసం, సెక్స్ వర్క్ కోసం స్త్రీలను అక్రమంగా తరలించడం అనాదిగా జరుగుతూనే ఉంది. ప్రపంచంలోని వివిధ ప్రదేశాలకు సులభంగా వెళ్ళగలగడం వల్ల స్త్రీలు, ముఖ్యంగా అవకాశాలు లేని స్త్రీలు అక్రమ రవాణా విపరీతంగా పెరిగింది. పని, మెరుగైన జీతాలు, మంచి అవకాశాల పేరు మీద స్త్రీలను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు.

4. ప్రాచీన భారతదేశంలో వేశ్యల కమ్యూనిటీలను సృష్టించి సమాజంలో ధనవంతుల లైంగికావసరాలు తీర్చడం జరిగింది. 19వ శతాబ్దంలో వేశ్యావృత్తి వ్యతిరేక ఉద్యమంతో నాట్యకత్తెల నిషేధం జరిగింది. దేవదాసీలు మనుగడ కోసం వ్యభిచారాన్ని వృత్తిగా చేసుకున్నారు. ప్రభుత్వం దేవదాసీ సంప్రదాయాన్ని రద్దు చేసింది. కాని సమాజంలోని ఆధిపత్య వర్గాలు దళితులను జోగినులుగా, మాతమ్మలుగా చేస్తూనే ఉన్నారు.

5. అనేక కారణాల వల్ల సంతానం పొందలేని స్త్రీలు ఉన్నారు. అటువంటి పరిస్థితులలో అద్దె గర్భాలతో బిడ్డలను కంటున్నారు. అద్దె గర్భం విషయంలో గర్భాన్ని అద్దెకు తీసుకునే, గర్భాన్ని అద్దెకు ఇచ్చే స్త్రీలు ఇద్దరి నిర్ణయం అవసరం అవుతుంది. అయితే చాలాసార్లు ఈ నిర్ణయాన్ని కుటుంబంగాని, భర్తగాని తీసుకొనడం జరగుతుంది.

6. అండాల నిల్వ (ఎగ్ ఫ్రీజింగ్) లేదా ఓసైట్ క్రయో ప్రిజర్వేషన్ అనేది స్త్రీ అండాలను తీసి గడ్డకట్టించి, నిల్వ చేయడం. పునరుత్పాదక వయసు స్త్రీలో పునరుత్పాదక సామర్థ్యాన్ని రక్షించడానికి ఈ పద్ధతి పనికి వస్తుంది. ఈ పద్ధతి ద్వారా స్త్రీలు యువతులుగా ఉన్నపుడు తమ అండాలను భద్రపరచుకుని బిడ్డలను కనాలని భావించినపుడు కనవచ్చు. స్త్రీ తన వృత్తిలో రాణించడానికి, బాగా స్థిరపడిన తర్వాత బిడ్డలను కనడానికి అవకాశం ఉంటుంది. ఒకరకంగా ఇది సానుకూల మార్పు అయినా, ఏ తరగతి స్త్రీలకు సైన్సు, టెక్నాలజీ ప్రయోజనాలు అందుతాయనేది ప్రశ్నార్థకమవుతుంది. బిడ్డల్ని కనడం, పెంచడం కేవలం స్త్రీ బాధ్యతే అని ఇది పునరుద్ఘాటిస్తుంది.

## 8.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. **కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. జెండర్ గుర్తింపుల విషయంలో తలెత్తుతున్న ప్రధానమైన వర్తమాన సమస్యలను గురించి రాయండి.
2. జెండర్ వైవిధ్యం (స్పెక్ట్రమ్) గురించి వ్యాసం రాయండి.

II. **కింది వాటికి 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. భిన్న లింగ సంపర్కం (Hetero sexual normativity) స్త్రీల పునరుత్పాదక హక్కులపై ఎటువంటి ప్రభావం చూపిస్తుంది?
2. సైబర్ / వర్చ్యువల్ వర్ల్డ్‌లో జెండర్ హింస ఎలా పెరుగుతోంది?
3. స్త్రీల పనిపై ప్రపంచీకరణ ప్రభావం

## 8.9 ముఖ్య పదాల అర్థ వివరణ

| | | |
|---|---|---|
| ఏజెన్సీ | - | ప్రత్యేక ఫలితం సాధించడానికి పనిచేసే సంస్థ లేదా వ్యక్తి. |
| బైనరీ | - | రెండు, ద్వివిధ |
| కారిటినమ్ | - | స్పెక్ట్రం, శ్రేణి, వైవిధ్యం |
| పాలసీ | - | అవాస్తవం, అపోహ |
| ఫాలోసెంట్రిక్ | - | పురుషాధిపత్యాన్ని సూచించే |

## 8.10 ఆధారిత గ్రంథాలు


డ్వోర్కిన్, ఆండ్రియా, పోర్నోగ్రఫీ ఇన్ ఎ సివిల్ రైట్స్ ఇస్యూ ఫర్ ఉమెన్

ఫాస్టో, స్టెర్లింగ్ అన్: ది ఫైవ్ సెక్సస్ : వై మెన్ అండ్ ఫిమేల్ ఆర్ నాట్ ఇనఫ్. ది సైన్సు (మార్చి / ఏప్రిల్ 1993) : 20-24

కెస్లర్, సజేన్: ది మెడికల్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ జండర్ : కేస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇన్టర్‌సెక్స్ ఇన్‌ఫాంట్స్, సైజ్సు: ది జర్నల్ ఆఫ్ ఉమెన్ ఇన్ కల్చర్ అండ్ సొసైటీ: Vol.16, no.1 (1990)

రేవతి, ఎ. ట్రూత్ ఎబౌట్ మి: ఎ హిజ్రా లైఫ్ స్టోరీ, న్యూఢిల్లీ, 2010.

విద్యా, లివింగ్ స్మైల్, ఐ ఆమ్ విద్య: ఎ ట్రాన్స్‌జండర్ లైఫ్ స్టోరీ, న్యూఢిల్లీ, 2013

పద్మ, కుప్పిలి, సాలభంజిక, అనువాదం: అల్లాడి ఉమ అండ్ ఎమ్. శ్రీధర్, ముక్త పబ్లికేషన్స్, 2015.

**MODEL QUESTION PAPER**

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

**B.A., B.Sc., B.Com. Examination**

**Semester - I**

**Subject: Ability Enhancement Compulsory Course**

**Paper: Gender Sensitization**

**Total Time: 1 Hour** **Max. Marks : 40**

**Min. Pass Marks : 16**

## PART - A

**[2 X 6 = 12 Marks]**

గమనిక : **Max. Marks : 12**

1. కింది వాటిలో ఏవేని రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
2. ప్రతి ప్రశ్నకు 6 మార్కులు కలవు.

1. జండర్ మూసపాత్రలు
2. స్త్రీలు ఎదుర్కొనే మూడు రకాల ఆధిపత్య ధోరణులు
3. పరువు హత్యలు
4. టువార్డ్స్ ఈక్వాలిటీ (సమానత్వం వైపు) రిపోర్టు

## PART - B

**[2 X 10 = 20 Marks]**

గమనిక: **Max. Marks : 20**

1. కింది వాటిలో ఏవేని రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
2. ప్రతి ప్రశ్నకు 10 మార్కులు కలవు.

5. (A) జండర్, పనిలోని రాజకీయాలను విశ్లేషిస్తూ వ్యాసం రాయండి.

లేదా

(B) జండర్‌కు, అధికారానికి ఉన్న సంబంధాన్ని చర్చించండి.

6. (A) గృహహింసకు దారితీసే కారణాలను వివరిస్తూ గృహ హింస చట్టంలో పొందుపరచిన అంశాలను చర్చించండి.

లేదా

(B) సమకాలీన సమాజంలో జండర్ అస్తిత్వాలు ఎదుర్కొనే సవాళ్ళపై వ్యాసం రాయండి.

## PART - C

## [8 X 1 = 8 Marks]

గమనిక: **Max. Marks : 8**

1. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
2. ప్రతి ప్రశ్నకు 1 మార్కు.

7. "ది సెకెండ్ సెక్స్" గ్రంథ రచయిత ఎవరు? ( )

(ఎ) ప్రొ॥ రమా మెల్కోటీ (బి) సిమన్ డి. బువర్

(సి) ప్రొ॥ వసంత కన్నాభిరాన్ (డి) మేరీ వాల్‌స్టోన్ క్రాఫ్ట్

8. జండర్ దేనికి సంబంధించిన పదం? ( )

(ఎ) శారీరక (బి) మానసిక

(సి) భౌతిక (డి) సమాజ నిర్మితం

9. సమాజంలో ఆడ, మగ పిల్లల్ని సాంస్కృతిక విలువల ఆధారంగా పెంచే విధానాన్ని ఏమని అంటారు?

(ఎ) సామాజీకరణ (బి) పితృస్వామ్యం ( )

(సి) జండర్ స్పృహ (డి) జండర్ పారిటీ

10. పనిచేసే చోట లైంగిక వేధింపుల చట్టం ఏ సంవత్సరంలో అమలులోనికి వచ్చింది ( )

(ఎ) 2003 (బి) 2010

(సి) 2013 (డి) 2016

11. గృహ హింస చట్టం అమలులోనికి వచ్చిన సంవత్సరం ..............................

12. జండర్ పారిటీ ఇండెక్స్ తయారుచేసిన వారు ............................................

13. (UDHR) సార్వజనీన మానవ హక్కుల ప్రకటన ........................... సంవత్సరంలో ఆమోదింపబడింది.

14. CEDAW పూర్తి నామం .........................................................